అక్టోబర్ 16-31, 2022

సంపుటి 03, సంచిక 1

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



## ద్వితీయ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక



తెలంగాణ నాటి ప్రముఖ నవలా రచయిత్రి

## మాదిరెడ్డి సులోచన

(జయంతి : అక్టోబర్ 26 1935)

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

## విషయ సూచిక


ఆధునిక అస్తిత్వవాదాల అనుశీలన
**హసేన** వ్యాసం **"దళిత మైనార్టీ, స్త్రీవాద సాహిత్యం తులనాత్మక పరిశీలన"** 45

ప్రణయం పరిపాకం
చెందిన **మాణిక్యం** కవిత
70 **"ఆకాశం వేదికగా కలుద్దాం"**





31
పరిశోధకుడి ప్రణయ గాథ...
**సూర్యాధనంజయ్** కథ **"పర్దేశి"**





23
సాంఘిక నాటక పరిణామం
వివరించిన **విజయ్ కుమార్** వ్యాసం
**"తెలంగాణ సాంఘిక నాటక వికాసం"**





43
విధి నిర్వహణలో ఆమె సౌందర్యం చూసిన
ఒక వైద్యుని కథ **ఆడెపు లక్ష్మీపతి....**
**"ప్రమాణ భంగం"**





17
ధన దురహంకారం దాని
పర్యవసానం చెప్పిన **శ్రీఉహ**
కథ... **"ఐ మ్యాటర్"**





39
రచనా వికాసాన్ని వివరించిన
**నిత్యానందరావు** చిరు వ్యాసం
**"రవ్వలు రాల్చిన రామశేషయ్య"**





05
కట్నం దురాచారం వల్ల కళ్ళు
మూసుకుపోయిన భర్తకు బుద్ధి చెప్పిన
భార్య కథ... **ప్రభురెడ్డి** రచన **"కనువిప్పు"**

సమయం విలువ తెలుపుతున్న
**శ్రీపాద** కవిత **"సమయం"** ...పేజీ 22

అన్నవరం కోసం **ఎన్. గోపి** కవిత...
**"అలంకారం"** ...పేజీ 04

తాత్త్విక అన్వేషణలో **ఏనుగు నరసింహారెడ్డి** కవిత.. **"ఈత"**
...పేజీ 58

నిఘంటు పరిణామాన్ని
వివరించిన **నలిమెల** వ్యాసం
**"భాషా నిఘంటువులు"** ...పేజీ 63

భారతదేశ విభజన గురించి పశ్చాత్తాప
పడే ఒక ఆత్మకథ **రామా చంద్రమౌళి**..**"ఆత్మ అగ్ని అది నిన్ను దహిస్తుంది"**....పేజీ 51

నిజాం వెంకటేశం జ్ఞాపకాలని పంచుతున్న
**నర్సన్** వ్యాసం **"నడిచే పుస్తకం... నిజాం వెంకటేశం"** .....పేజీ 57

**"నదికి - నాయకుడికి"** అభేదం చెప్పిన
**ఘనపురం దేవేందర్** కవిత...పేజీ 50

2022కి నోబుల్ ప్రైజ్ సాధించిన
**"ఎర్నాక్స్"** పరిచయం ....పేజీ 67

నవలా సృష్టిలో చారిత్రక దృక్పథం
చూపెడుతున్న **సంగిశెట్టి** వ్యాసం
**"బీసీల బతుకులను బొమ్మగట్టిన నవలలు"** ...పేజీ 13

సంప్రదాయాన్ని సామాజిక స్పృహతో
చిత్రించే **"అనుమాండ్ల భూమయ్యతో ఈ పక్షం ముచ్చట"**...పేజీ 59

**ఇంకా...**
మరెన్నో కవితలు, సాహితీ శిఖరం,
సమాజం, పుస్తక పరిచయం, దృశ్య
సాహిత్యం, స్వీకారం.. మొదలైనవి...

# తంగేడు సంచికకు స్పందన...

తంగేడు పక్షపత్రిక సర్వాంగ సుందరంగా పాఠకుల మనో హారిణి అయి విడుదల అవుతున్నది. ప్రతి పుటలోను అందమే. అన్ని పుటలు సచిత్రాలే. అన్ని బహుళ వర్ణమయాలే. ఇవి కంటికి ఇంపు అయితే శీర్షికలు మనసుకి ఇంపు అవుతున్నాయి. కవిత, కథ వ్యాసం, ఇంటర్వ్యూ పుస్తక పరిచయం, చారిత్రక విశ్లేషణలు సంపాదకీయాలు, అన్ని దేనికది నిండుదనంతో ఉంటు న్నాయి. త్వరలో అచ్చు రావాలని కోరుకుంటున్నాను. రెండేళ్లు నిండిన సందర్భంగా నా అభినందనలు

**మీ... సంగనభట్ల నరసయ్య, ఒక చదువరి, 94400 73124**

తంగేడుకు ద్వితీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు. పాఠకుల సాహిత్య దాహార్తిని తీర్చడానికి ప్రతిసంచిక ఎంతో వినూత్నంగా వెలువడుతున్నది. బతుకమ్మ పండుగను అందివచ్చిన తంగేడు పూవులాగా, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత అటు రచయితలకు ఇటు పాఠకులకు అందివచ్చిన సాహితీకుసుమం తంగేడు.

**- డా॥ వెల్దండి శ్రీధర్, కవి, కథకుడు, 98669 77741**

తెలంగాణ సాహిత్యానికి, అస్తిత్వానికి అద్దం పడుతూ ద్వితీయ వార్షికోత్సవానికై పరుగులు తీస్తున్న 'తంగేడు' సాహిత్య పత్రికకు హృదయపూర్వక అభినందనలు.

తెలంగాణ మట్టిబిడ్డ కవిత, ప్రధాన సంపాదకత్వంలో మరుగున పడిన తెలంగాణ సాహిత్య సంపదను, చరిత్రను వెలికితీస్తున్న ప్రయత్నం భావితరాలకు ఎంతో ఉపయోగకరం. కథ, కవిత్వం, విమర్శ, చరిత్ర, సంస్కృతి ఇట్లా భిన్న ప్రక్రియలకు పట్టం కడుతున్నందుకు సహ సంపాదకులు కాంచనపల్లి గోవర్ధన్‌రాజు కృషి మెచ్చదగినది.

**- కోట్ల వెంకటేశ్వరరెడ్డి, కాళోజీ పురస్కార గ్రహీత, 9440233261**

వర్ధమాన తెలుగు సాహిత్య సమాజానికి తంగేడు పక్షపత్రిక చాలా ఉపయోగకరంగా ఉన్నది. లబ్ధ ప్రతిష్ఠులైన సాహితీవేత్తల నుండి వర్ధమాన నవ యువ రచయితల వరకు వ్యాసాలు, ప్రత్యేక శీర్షికలు, కథలు, కవితల వంటి వివిధ ప్రక్రియల రూపంలో వస్తున్నవి. అన్నీ కూడా విషయ ప్రధానంగా ఉంటూ పరిశోధకులతో పాటు సాహితీ ప్రియులకు, సాహితీ విశ్లేషకులకు ఉపయుక్తంగా ఉన్నాయి.

**- డా॥ మండల స్వామి, కవి, 9177607603**

తెలంగాణా సంస్కృతి యాస భాషలను ప్రతిబింబించే తంగేడు పత్రికకు రెండేళ్ళు నిండడం ముదావహం. ఈ సందర్భంగా ప్రధాన సంపాదకులైన గౌరవనీయులు కవితకి సహసంపాదకులు కాంచనపల్లి గోవర్ధన్ రాజుకి హార్దిక అభినందనలు. తంగేడు పత్రిక తెలంగాణ పల్లెజీవితాలను ఒడిసి పట్టి పాఠకుల ముందు కుప్పపోస్తున్నది. తెలంగాణా పండుగల వైశిష్ట్యాన్ని నెత్తికెత్తుకొన్నది. బహుముఖ విజ్ఞాన ఖనియై తలెత్తి నిల్చున్నది. పాఠకులు సంపాదకులకు సహకరిస్తే ముద్రణ రూపంలో వస్తుందనీ, రావాలని ఆశిస్తున్నాను.

**- దేవకీ దేవి, 9949636515**

తెలంగాణ ప్రజల అస్తిత్వ పతాక అయి తంగేడు పత్రిక రెండు సంవత్సరాలుగా నిరాటంకంగా కొనసాగటం ఆనంద దాయకం. పత్రిక సాఫీగా రావడం వెనుక ఎంతో మమేకత ఉంది. ఈ పత్రిక అంతర్జాతీయ పత్రికల ప్రమాణంతో వెలువడుతుందని చెప్పడానికి పేజీల క్వాలిటీ, ముఖచిత్రాలు, బొమ్మలు, పరిశోధనాత్మక వ్యాసాలు, సాహిత్య సాంస్కృతిక అంశాలు, ప్రముఖుల పరిచయాలు వంటివి చాలా దాఖలాలు ఉన్నాయి. నిర్వాహకుల శ్రమ గౌరవప్రదమైనది. కొత్తవారిని ప్రోత్సహిస్తూ, నవతరం నిర్మాణానికి సైతం సమిధ ఒక్కటిగా భిన్న ప్రక్రియలలో మేటిగా నిలుస్తున్నది. అభినందనలు.

**- బెల్లంకొండ సంపత్‌కుమార్, ప్రముఖ కవి, 99085 19151**

కవులకు, రచయితలకు ప్రోత్సాహాన్ని అందించి, సమాజోప యోగ్యమైన సాహిత్య వికాసానికి 'తంగేడు' చేస్తున్న ఉద్యమం ప్రశంసార్హం. సాహిత్య రంగంలో ఉన్నతస్థానాన్ని అధిరోహించిన వారికే కాకుండా కొత్తగా కలంపట్టిన యువకవులకు, రచయితలకు 'తంగేడు' చక్కని అవకాశాన్ని కలిగిస్తోంది. తంగేడు రెండేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకొన్న సందర్భంగా నా అభినందనలు.

**- ఆయాచితం నటేశ్వరశర్మ, ప్రముఖ కవి, 94404 68557**

సాహిత్య పత్రికను వెలువరించడం సాహసం కావాలి. ఆ సాహసం గత రెండేళ్లుగా 'తంగేడు' మాస పత్రిక చేస్తోంది. కథలు, కవితలే కాదు సాహిత్య రంగ పునాదులను పాఠకులను పరిచయం చేస్తూ ఎంతో మంది రచయితలకు ఓ సాహిత్య గొడుగుగా... అక్కున చేర్చుకుని ప్రోత్సహిస్తూ విజయవంతంగా ముందుకు సాగడంలో కృషి చేస్తున్న 'తంగేడు' పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి నా అభినందనలు..

**- బైస దేవదాసు, సంపాదకులు - నేటినిజం దినపత్రిక**
**సెల్: 9000065433**

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-31 అక్టోబర్, 2022

సంపుటి 03 సంచిక 01



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# సమస్త సృజనలోకానికి నమస్సులు...

మా తంగేడు పత్రికా యాత్రకు ఇప్పటికి రెండేళ్ళు నిండినవి. ఇప్పుడు ద్వితీయ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక మీ చేతుల్లో ఉంది. తంగేడు తొలిదశనుండి క్రమంగా వికసించింది. పరిణత సాధించింది. తెలంగాణ జీవధాతువుకు ఒకానొక ప్రతీకగా నిలిచింది. నాటి కథ, నాటి కవిత రూపంలో నాటి సాహిత్యాన్ని ఆవాహన చేసుకొంది. నేటి వర్ధమానుల, ప్రసిద్ధుల కథలు, కవితలు ప్రచురిస్తూ సమాంతర సాహిత్యానికి వేదికగా నిలిచింది. పద్యం, కథ, కవిత, వ్యాసం లాంటి అన్ని ప్రక్రియలకు స్థానం కల్పించింది. నాటినుండి నేటివరకు ప్రస్థానించిన సాహిత్యాన్ని బేరీజు వేయడానికి ఒక తరాజులాంటి పాత్ర నిర్వహించింది. ప్రముఖులతో ముఖాముఖి నిర్వహించి యువతకు స్ఫూర్తి నిచ్చింది. అనువాదాలను ఆదరించింది. ఆయా ప్రక్రియల వెనుక ఉన్న సమాజం, ఉద్విగ్నభరితమైన పోరాటాలు, ప్రభుత్వాలు, జయాపజయాలు ఇట్లా ఎన్నో అంశాలని సాహిత్యం ఎట్లా ప్రతిఫలించిందో తెలియజెప్పింది. సాహిత్యం ఒక దిక్సూచిగా వుంటుందనే అంశాన్ని ప్రామాణికం చేయడానికి తంగేడు తన వంతు కృషి చేసింది.

ఒక్క ప్రక్రియలనే కాక తెలుగునాట వికసించిన అన్ని అస్తిత్వవాదాలను ఆదరించింది. ప్రచురిత వస్తువుకు తన ప్రభావం చూపకుండా వస్తువును వస్తువుగానే నిలిపి చాలాసార్లు అంతిమ నిర్ణయం పాఠకులకే వదిలిపెట్టింది.

తంగేడు నిర్వహణలో సృజనకారులు స్పందిస్తున్న తీరు అపూర్వం. విలువైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. తంగేడులో చాలామంది తమ ప్రతిఫలనం వెతుకుతున్నారు. మనల్ని మనం విస్మృతపరచుకోవల్సిన అగత్యం గుర్తుచేస్తున్నారు. ఆత్మావలోకనానికి సంబంధించిన అవసరం గురించి హెచ్చరిస్తున్నారు.

తంగేడు మీ విలువైన సూచనలను స్వీకరిస్తుంది. సృజన కోవిదుల అభిప్రాయాలు ఆశీస్సులుగా భావిస్తున్నది. అందరి సూచనల మేరకు పత్రికలో చిరుమార్పులు చేయనున్నది. పత్రిక అందరికీ మరింత ఆమోదయోగ్యంగా తీర్చిదిద్దడానికి సిద్ధమౌతుంది.

నేటి తెలంగాణ కొత్తపుంతలు తొక్కుతోంది. తన చరిత్ర తాను రాసుకొని తన అస్తిత్వాన్ని తాను ప్రకటించుకొంటున్న సంప్రదాయ అస్తిత్వాల దగ్గరనుండి ఇప్పుడు వెల్లివిరుస్తున్న సబాల్టన్ చైతన్యాన్ని ఆవాహన చేసుకొంటున్నది. తన భాషను, తద్వారా వ్యక్తమైన అపూర్వ సాహిత్యశక్తిని పునర్మూల్యాంకనం చేసుకొని తనను తాను పునరంకితం చేస్తున్నది. ఈ దశలో ఈ నేపథ్యానికి వేదికగా తమ వంతు సేవ చేయడానికి తెలంగాణ జాగృతి సాహిత్య సాంస్కృతిక ప్రయాణంలో వికసించింది తంగేడు.

తెలంగాణ ఒక చారిత్రక వాస్తవం. మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్రాబాద్, ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, లక్సెట్టిపేట, ప్రాణహిత నదీతీర ప్రాంతాల్లో ప్రాచీన మధ్య శిలాయుగ మానవుని రూపాలున్నట్లు చారిత్రకులు నిర్దేశిస్తున్నారు. అలాగే నవీన శిలాయుగ అవశేషాలు కరీంనగర్‌లోనూ, వరంగల్లు, ఆదిలాబాద్ జిల్లాలలో లభ్యమవుతున్నాయి. బృహత్ శిలాయుగ అవశేషాలు కరీంనగర్, ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్‌లలో దొరికాయి. చారిత్రక వికాసయుగం ఆధారాలతో సహా నిరూపితమైంది. క్రియాంతాల్లోనే కాక ఉచ్చారణ మొదలైన అంశాల్లో వికసించిన కవిత్వానుకూల భాష తెలంగాణది. బతుకమ్మ, బొడ్డెమ్మ, హోళీ, కట్టు, బొట్టు మొదలైన ప్రత్యేక సంప్రదాయాలు తెలంగాణకు ఉన్నాయి. సొంత అస్తిత్వం కలిగిన రాష్ట్రం సాధించుకోగానే సరిపోదు. ఈ సంస్కృతిని, అస్తిత్వాన్ని కాపాడుకోవలసిన బాధ్యత కూడా మన మీద ఉంది.

ఈ ప్రయత్నమే అనేక సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు పురికొల్పింది. పత్రికాస్థాపనకు ఊతమిచ్చింది. మనం మన అస్తిత్వాన్ని ప్రకటించుకుంటున్నాం అంటే ప్రాంతీయ దురహంకారానికో, మరో ప్రాంతీయ సంకుచితత్వానికో పరిమితమౌతున్నామని కాదు. మనది ప్రాంతీయత ప్రాతిపాదికగా నిలబడిన జాతీయతత్వం. జాతీయతను ఆవాహన చేసుకున్న సమాజవాదం. వెరసి విశ్వశ్రేయమే మన లక్ష్యం.

ఈ లక్ష్య నిర్వహణలో మాకు సహకరిస్తున్న సృజనకారులకు, పాఠకులందరికీ కృతజ్ఞతలు. పత్రికను తీర్చిదిద్దుతున్న సంపాదకవర్గానికి అభినందనలు.

*జై తెలంగాణ - జై జాగృతి.*

కవిత కల్వకుంట్ల

# అన్నవరం దేవేందర్ కోసం....

డా॥ ఎన్. గోపి





హైదరాబాద్ వచ్చినప్పుడు
అతడు నగరం నిండా
కరీంనగర్‌ను పరుస్తాడు.
గాలి తోసుకొచ్చినట్టు
మా రెండు తలుపు రెక్కల్లో
పట్టనంత ప్రేమను పట్టుకొస్తాడు.

అతనితో వాకింగ్
ట్రెక్కింగ్‌లా విజ్ఞానదాహంగా ఉంటుంది
అతనితో ఉన్నప్పుడు
నిశ్శబ్దం కూడా మాట్లాడుతుంది.
అతని పలుకుల్లో తెలంగాణా భాష
తన పలుకుబడులకు
మెరుగులు దిద్దుకుంటుంది.

మనం కరీంనగర్‌కు వెళ్తే
అది దేవేందర్ ఊరులాగే ఉంటుంది
అతనితో సోపతి
హోమియోపతిలాజి
మూలాలకు వెళ్లి పనిచేస్తుంది.

అతనితో కలిసి
వందలాది మైళ్ళు ప్రయాణిస్తే
బస్తాల కొద్ది ముచ్చట్లు మిగుల్తాయి.
ప్రాక్టికల్‌గా మాట్లాడే
రొమాంటిస్ట్ అతడు.

కోరికలు పెద్దగా లేవుగాని
తారకలు అతని టార్గెట్
అమాయకంగా 'అట్ల కాదంటరా' అంటాడు
సున్నితంగానే 'ముచ్చటే లేదు' అని
విభేదిస్తాడు.

కవిత్వం తప్ప స్వార్థం లేదు
అతని అక్షరాలన్నీ ఆణిముత్యాలే
అణగారిన వారికోసం అల్లిన
జీవన సత్యాలే.
బండ మనస్సులను శపిస్తాడు
సబ్బండ వర్ణాలను ప్రేమిస్తాడు.

ఇవాళ ఎందుకో పొద్దున్నే
అన్నవరమే గుర్తుకొస్తున్నాడు
నాకన్నా
ఒకటిన్నర దశాబ్దం చిన్నవాడు
అయినా అతనితో సోపతి
ఒక సామాజిక పురోగతి.
అట్ల అనిపించడు గానీ
అప్పుడే అరవయ్యేండ్లు నిండినై
అతని బట్టతల
అనుభవాల దర్పణంలా మెరుస్తుంది చూడండి.

అతడు నా తమ్ముడు
ఎదలోని ఎద
నెనరు పరిమళాల పొద
అతనికి నా దీవెనలు
మమతల నవనవోన్మేష భావనలు.

**(ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ తనకు అరవయ్యేళ్లు నిండినప్పుడు తన 12 కవిత్వ పుస్తకాలను రెండు సంపుటాలుగా ఆవిష్కరించుకుంటున్న వేళ)**

# కనువిప్పు

నాటి నుంచే వికసించిన స్త్రీ వ్యక్తిత్వాన్ని తెలిపే కథ...

టేక్మాల్ ప్రభురెడ్డి

**రచయిత గురించి...**

*టేక్మాల్ ప్రభురెడ్డి చిన్నశంకరం పేట మండలం దర్పల్లి గ్రామంలో 1947లో జన్మించారు. వీరు 1967 నుంచి 1974 వరకు కథలు, నవలలు, వ్యాసాలు రాశారు. వీరి రచనల్లో ప్రముఖమైనవి 'ఆమె నవ్వింది', 'పిశాచాలు' నవలలు; తెలంగాణ మాండలికంలో రాసిన 'నాలో ప్రత్యేకత ఏముంది', 'గుడిసె కథలు' ప్రముఖమైనవి. 1973, 1974 రెండు సంవత్సరాలు 'సన్నజాజి' సచిత్ర మాసపత్రికను వెలువరించి సంపాదకునిగా వ్యవహరించారు.*

తెల్లవారుజామున మూడు గంటలవుతోంది. పెళ్ళిపందిరి విద్యుద్దీపాలతో కన్నులు మిరుమిట్లు గొల్పుతుంది. పందిట్లో పచ్చని తోరణాలు, రంగు రంగుల కాగితం పూలు, సన్నగా అలా గాలిలో తేలివస్తున్నట్లున్న సన్నాయిపాట. పడుచుల పట్టు చీరల గలగలలు నైలాన్ టెరిలిన్ చీరెల తళతళలు, మృదుమధుర మండపాలు, పడతుల పరువపు శరీరాల పచ్చని కాంతులు, ఆ పరువపు శరీరాలు తూట్లు పొడిచేట్టున్న పడుచువారి కోరచూపులు, మనసైన అవివాహిత యువతీ యువకుల దొంగచూపులు, నడివయసు దంపతుల మనసుల్లో పెళ్ళినాటి మధురస్మృతులు, పిల్లల కేరింతలు, పరిచయస్థుల కబుర్లు, బావమరదళ్ళ పరాచికాలు, సరసాల గలగల నవ్వులు, పెళ్ళిపందిరి సందడిగా, సంబరంగా, రద్దీగా, కోలాహలంగా వుంది.

వధువు తల్లిదండ్రులు వరుని కాళ్ళు కడిగి కన్యాదానం చేశారు. పెళ్ళి మంటపంలో వధువు ఉమ వరుడు సురేందర్‌రెడ్డి పెళ్ళిపీటల మీద ఆసీనులైయ్యారు.

కాసేపైనాక పురోహితుడు, వియ్యంకు లిరువురివైపు చూస్తూ "మీ పెట్టుపోతలు చూసుకోండి" అన్నాడు.

వరుని తండ్రి నారాయణరెడ్డి తాము వధువుకిస్తామన్న నగలన్నీ పెట్టెలోంచి తీసి ఇచ్చాడు. ముత్తైదువులు ఆ నగలన్నీ ఉమకి అలంకరించసాగారు.

వధువు తండ్రి కృష్ణారెడ్డి తాను వరునికి ఇస్తానన్న కట్నం డబ్బు పదిహేను వేలు తేవడానికి మేడమీది తన గదిలోకి వెళ్ళాడు. జేబులో తాళంచెవుల గుత్తి లేదు. మరోసారి జేబులన్నీ తడిమి చూసుకున్నాడు. కనిపించలేదు. టేబుల్ దగ్గరకు వెళ్ళి చూశాడు. గుత్తి దానిపైనే వుంది. గబగబా టేబుల్ డ్రాయర్ సొరుగుకున్న తాళం తీసి సొరుగు బైటకు లాగాడు. అంతే! ఆయన గుండె ఆగినంత పనైంది. వళ్ళంతా చెమట పట్టేసి, వణుకసాగింది. సొరుగులో ఆయన రాత్రి వుంచిన ఐదువేల రూపాయలు లేవు. సొరుగు ఖాళీగా వుంది. తడబడుతున్న అడుగులతో బీరువా దగ్గరికి వెళ్ళి దాన్ని తెరిచాడు. అతను అందులో ఉంచిన పదివేల రూపాయలు అలాగే ఉన్నాయి. లెక్కపెట్టి చూసాడు. సరిగ్గానే ఉన్నాయి. 'హమ్మయ్య' అనుకుని నిట్టూర్చాడు. గుడ్డిలో మెల్ల 'ఇంకా నయం' అనుకున్నాడు. అయినా అతని వంటి వణుకు తగ్గలేదు.

మరి డ్రాయర్ సొరుగులోని ఐదువేలు? ఎవరో దొంగిలించి ఉంటారు. ఇప్పుడు తను ఎవరిని అడగగలడు? అయితే మరి ఇప్పుడు?... అతని గుండె దడదడ కొట్టుకోసాగింది. కాళ్ళకింది భూమి కదిలిపోతున్నట్టనిపించసాగింది. వంట్లో నీరసం, నిస్సత్తువగా కళ్ళు తిరిగాయి. వళ్ళు తూలింది. మంచం మీద కూలబడ్డాడు.

కృష్ణారెడ్డి ఆరోజు రాత్రి ఎనిమిది గంటలవేళ అప్పుగా తెచ్చిన డబ్బు ఐదువేలు డ్రాయర్‌లో దాచి తాళం వేశాడు. కాని పని తొందరలో తాళంచెవి గుత్తిని అక్కడే వదిలి వెళ్ళాడు. అది గమనించిన ఎవరో ఆ డబ్బు దొంగిలించారు. వారం రోజుల క్రితమే తన జీవితభీమా డబ్బు పదివేలు తెచ్చి బీరువాలో దాచాడు. అది అలాగే వుంది.

డ్రాయర్ సొరుగులోనిదే పోయింది.

"మరి ఇప్పటిమాట?"... తను దాని గురించి ఆలోచించలేకపోతున్నాడు.

పావుగంట గడిచింది.

కృష్ణారెడ్డి రావడం ఆలస్యం అయ్యేసరికి ఆయన మిత్రుడు రాజు మేడమీదకి వచ్చాడు. మిత్రుని వాలకం చూసి గాబరాపడి "ఏం జరిగిందిరా" అన్నాడు.

"కొంప మునిగిందిరా రాజు" అన్నాడు కృష్ణారెడ్డి గద్గద స్వరంతో.

"అసలేం జరిగింది".

కృష్ణారెడ్డి అంతా చెప్పాడు. అది విని రాజు కూడా మ్రాన్పడిపోయాడు. ఇరువురి మధ్య రెండు నిమిషాలపాటు నిశ్శబ్దం రాజ్యమేలింది.

"పద" అన్నాడు రాజు తేరుకుని.

"వాళ్ళకేం సమాధానం చెబు..." మాటలు మధ్యలోనే ఆగిపోయాయి. కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"ఎందుకురా ఈ ఏడ్పు? ముందు జరగవలసింది చూద్దాం పద".

"రూపాయి కాదు, రెండు కాదు. ఐదువేలు... అదీ ఇల్లు తాకట్టుపెట్టి తెచ్చినదని నీకు తెలుసు కదా!"

"తెలుసు! కాని ఇప్పుడు ఏం చెయ్యగలుగుతాం చెప్పు?"

"మరి మగపెళ్ళివారికి ఏమని చెబుదాం?"

"వాస్తవం వాళ్ళ ముందుంచి నచ్చచెబుతాం రా!"

కృష్ణారెడ్డి పదివేలు తీసుకుని పందిట్లోకి వచ్చాడు. ఆ డబ్బును పళ్ళెంలో వుంచాడు. ఆ డబ్బును లెక్కబెట్టి "ఇవ్వు మిగతాది" అన్నట్టు వియ్యంకుని వైపు చూశాడు.

రాజు, నారాయణరెడ్డిని బయటకు రమ్మని పిలిచాడు. జరిగిన సంగతి అంతా వివరించి మిగతా డబ్బు పెళ్ళి తరువాత సర్దుతాము అన్నారు. భర్త వెంటే వచ్చిన సుందరమ్మ ఎగిరిపడింది.

"డబ్బు ముట్టేవరకు పెళ్ళి జరగడానికి వీల్లేదంది".

కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి దంపతుల చేతులు పట్టుకుని "బావగారు ఇదీ అనుకోకుండా జరిగింది!" తరువాత తప్పకుండా మీ సొమ్ము మీకు ముట్టచెబుతాను" అన్నాడు దీనంగా జాలిగా వారి ముఖాల్లోకి చూస్తూ.

నారాయణరెడ్డి మౌనం వహించాడు. సుందరమ్మ కఠినంగా అంది.

"నాకు అదంతా తెలియదు. మీరేమైనా కండి. మాకు ఇస్తామన్న డబ్బుకు ఒక్క పైసా తక్కువ ఉన్న ఈ పెళ్ళి జరగదు".

"చెల్లెమ్మా! నా మాట నమ్ము. మీరన్నట్టుగానే ఒక్కపైసా తక్కువ కాకుండా తరువాత ముట్టచెప్పుకుంటాను. కాని ఉన్నఫలానా ఎక్కడినుండి తేను?"

"ఇలాంటి మాటలు ఎన్నోసార్లు ఎన్నోచోట్ల విన్నాము".

"నేనందరిలా కాదు".

"ఏం సత్యహరిశ్చంద్రుడివా?"

అరచేతితో బలంగా మొహం మీద దబ్బున చరిచినట్లైంది. అయినా తను రోషపడలేదు. అవసరం తనది. ఎంత రోషం ఉన్నవాడైనా తను ఆడపిల్ల తండ్రి. మగపెళ్ళివారికి లోకువ. పెళ్ళిలో ఏలోటు జరగకుండా ఉండాలని తను ఎంతో ప్రయత్నించాడు. కాని తుదకు ఇలా జరిగింది. అది తన దురదృష్టం.

అప్పుడే పందిట్లో గుసగుసలు బయలుదేరాయి.

"సత్యహరిశ్చంద్రుడ్ని అని చెప్పలేనుగాని ఇచ్చిన మాట



నిలబెట్టుకుంటాను. మీ డబ్బు పువ్వుల్లో పెట్టి ముట్టచెబుతాను."

"అదంతా కుదరదు డబ్బు మొత్తం ఇస్తారా? లేక మమ్మల్ని వెళ్ళిపొమ్మం టారా? ఈ కట్టుకథలు ఎవరికి తెలియనివని!"

కృష్ణారెడ్డి ఎంతగానో బ్రతిమాలాడు. నచ్చచెప్పడానికి రాజు ఎంతో ప్రయత్నం చేశాడు. కాని సుందరమ్మ ససేమీరా వీల్లేదంది. డబ్బు పూర్తిగా ముడితేనే గాని పెళ్ళి జరగనివ్వనంది. నారాయణరెడ్డి శిలలా నిలబడిపోయాడు ఎటు పాలుపోక. ఆయన పెళ్ళాం చేతిలో కీలుబొమ్మ.

సుందరమ్మ కృష్ణారెడ్డి ఎంతగా బ్రతిమాలుతున్నా వినిపించుకోకుండా పందిట్లోకి వచ్చి "సురేందర్ లే! వెళ్ళిపోదాం" అంది.

సురేందర్‌రెడ్డి తల్లివైపు బిత్తరపోయి చూశాడు.

"అలా చూస్తావేరా? వాళ్ళు కట్నం ఇవ్వలేరట. వెళ్దాం పద".

సురేందర్‌రెడ్డి లేచి నిలబడ్డాడు.

కృష్ణారెడ్డి వియ్యపురాలిని బ్రతిమాలుతూనే ఉన్నాడు. కాని సుందరమ్మ ససేమిరా అంటోంది. అయినా నారాయణరెడ్డి కాళ్ళు పట్టుకుని "బావగారు! మీరైనా చెప్పండి" అన్నాడు దీనంగా, బేలగా.

సుందరమ్మ భర్తవైపు కోపంగా చూస్తూ, "బెల్లం కొట్టినరాయిలా నిలబడి అలా చూస్తారేం? పెళ్ళి మనవాళ్ళందర్నీ సిద్ధంకమ్మనండి వెళ్ళడానికి" అంటూ గదమాయించింది.

నారాయణరెడ్డి తన కాళ్ళను పట్టు కున్న కృష్ణారెడ్డి చేతులను విదిలించుకుని వెళ్ళిపోయాడు విడిదిలోకి.

కృష్ణారెడ్డి సురేందర్‌రెడ్డిని, సుందరమ్మని పిచ్చిగా అటుఇటూ తిరుగుతూ బ్రతిమాలుకోసాగాడు. కాని సుందరమ్మ తను నిలబడిన మెట్టు దిగి రాలేదు.

కృష్ణారెడ్డి పెళ్ళికుమారుడి చేతులు పట్టుకుని "బాబు నీవైనా కనికరించు మీకిస్తామన్న డబ్బు పువ్వుల్లో పెట్టి ముట్ట చెబుతాను" అన్నాడు.

"అదేం కుదరదండీ. ముందు డబ్బులివ్వండి. తరువాతే పెళ్ళి" అన్నాడు సురేందర్‌రెడ్డి తల్లిమాటను బలపరుస్తున్నట్టు.

ఉన్నదనుకున్న చివరి ఆశ, అడియాశ కాగా, నీరుగారిపోయాడు కృష్ణారెడ్డి. ఉమ అంతా విని తలపైకెత్తింది. ఆమె క్రోధారుణ నేత్రాలు చింతనిప్పుల్ని వర్షిస్తున్నాయి. అతన్ని చూడగానే ఆమెలో అసహ్యం, కసి, ద్వేషం ఒక్కుమ్మడిగా ముంచుకువచ్చాయి. కాని తను అబల, అశక్తురాలు, అసమర్థురాలు. అతన్ని ఏమి చేయలేనన్న నగ్నసత్యం స్ఫురణకు వచ్చి, కళ్ళముందు కదలాడగానే ఆమెకు నీరసం నిస్సత్తువ ఆవహించింది. వాటిలోనుంచి దుఃఖం వచ్చింది. మగపెళ్ళి తరుపు స్త్రీలు వచ్చి ఆమెకు అలంకరించిన నగలన్నీ ఊడదీశారు. వారు చేసిన ఈ పనితో ఉమ దుఃఖం కట్టలు తెంచుకుంది. పీటమీంచి లేచి తన గదిలోకి పరుగెత్తింది.

గోడగడియారం నాలుగు గంటలు కొట్టింది.

కట్నం గొడవ రాకపోతే ఈవేళకి పెళ్ళి జరిగిపోయేది. పందిరి కళకళలాడు తుండేది. కాని ప్రస్తుతం అదే పెళ్ళి మంటపం శ్మశానంలా వేడి నిట్టూర్పులతో నిండిపోయింది.

మగపెళ్ళివారు వెళ్ళిపోవడానికి తమ మూటముల్లే సర్దుకోసాగారు.

గదిలోకి వెళ్ళిన ఉమ మంచంలో బోర్లాపడి తలగడలో తన ముఖాన్ని దాచుకుని ఏడ్వసాగింది. ఆమె స్నేహితురాళ్ళు రాణి, శశి, వత్సల, శాంతి, కాంతి, నర్మద, సుధ, గీత, శోభ కలం స్నేహితురాలు రమ ఆమె వెంటే గదిలోకి వచ్చి మంచం చుట్టూ నిలబడ్డారు. అయోమయంగా ఏమీ చేయడానికి తోచక మాట్లాడడానికి పాలుపోక.

పదినిమిషాలు గడిచాయి.

రమ మంచంలో ఉమ పక్కన కూర్చుండి నిమరసాగింది ప్రేమగా. ఉమ దుఃఖం మరింత ఇనుమడించింది. స్నేహితురాలి ఒడిలో తలపెట్టుకుని

**దుఃఖంలో ఉన్న ఉమ మస్తిష్కంలో లక్షల ఆలోచనలు ముసురుకుంటున్నాయి. తను... తను.. తన పెళ్ళి ఏ అవరోధం లేకుండా జరిగితే తను ఈపాటికి కొత్త కోడలు, కాని ఇప్పుడు ఉత్త ఉమ మాత్రమే! ఛీ... ఛీ... ఛీ...! మనుషులు డబ్బు కోసం ఎంత కక్కుర్తి పడతారో?! ఆ సుందరమ్మ... ఆమె మాట, పెళ్ళికొడుకు... అతని మాట... పైగా బియ్యే కూడా చదువుకున్నాడు!**

చేతులతో ఆమెను చుట్టేసి బేలగా రోదించసాగింది. పక్కన నిలబడిన స్నేహితురాళ్ళేమి చేయలేకపోతున్నారు. చెప్పలేకపోతున్నారు. స్నేహితురాలి పెళ్ళి ఆగిపోయినందుకు వారి మనసులు విలవిలలాడుతున్నాయి. వారి హృదయా లు మూగగా రోదిస్తున్నాయి. తనను చుట్టేసుకుని ఏడుస్తున్న ఉమ శరీరాన్ని ప్రేమగా సానుభూతిగా నిమురుతూ ఉండిపోయింది రమ.

దుఃఖంలో ఉన్న ఉమ మస్తిష్కంలో లక్షల ఆలోచనలు ముసురుకుంటు న్నాయి. తను... తను.. తన పెళ్ళి ఏ అవరోధం లేకుండా జరిగితే తను ఈపాటికి కొత్త కోడలు, కాని ఇప్పుడు ఉత్త ఉమ మాత్రమే! ఛీ... ఛీ... ఛీ...! మనుషులు డబ్బు కోసం ఎంత కక్కుర్తి పడతారో?! ఆ సుందరమ్మ... ఆమె మాట, పెళ్ళికొడుకు... అతని మాట... పైగా బియ్యే కూడా చదువుకున్నాడు! సంస్కారంలేని చదువులెందుకు? మంచి మర్యాద, మన్నన మానవత్వం లేని బ్రతుకులెందుకు?... నాన్న మాత్రం కట్నం డబ్బు ఇవ్వనన్నాడా? అన్ని ప్రయత్నాలు చేశాడు. కాని విధి వక్రించింది. పెళ్ళి పనుల్ల అలసిన నాన్న తాళం చెవుల గుత్తి మరిచాడు. డబ్బు దొంగలించబడింది పాపం! నాన్న ఎంత కుమిలిపోతున్నాడో! తనను బి.ఏ.

చదివించడానికి ఎన్ని బాధలు పడ్డాడనీ... తన పెళ్ళి ఆగిపోయినందువల్ల నాన్నకి ఎంత తలవంపులు?... నాన్న... పిచ్చినాన్న... తనకోసం ఎంత శ్రమకోర్చి ఆ పదివేల రూపాయలకు భీమా చేశాడని? రెక్కలు ముక్కలు అయ్యే గుమాస్తాగిరి పొద్దంతా చేసి, భీమా పాలసీ డబ్బుకోసం రాత్రివేళ కొట్లలో పద్దులు రాసేవాడు. కలిగిన ఇంటికి తననివ్వాలని ఇంటిని కూడా తాకట్టు పెట్టి డబ్బు తెచ్చాడు. ఆ డబ్బును ఎవరు కాజేశారో? ఇప్పుడు తాను రెంట చెడిన రేవడి. ఆ డబ్బే ఉండి ఉంటే తన పెళ్ళి జరిగిపోయేది. ఇప్పుడు తన పెళ్ళి జరగడానికి ఐదు వేలు కావాలి. ఐదువేలు... ఐదు వేలు... ఇప్పుడు ఈ పెళ్ళి ఆగిపోయినందువల్ల మగపెళ్ళి వారికి నష్టం లేదు. అంతా తమకే! మగపెళ్ళివారు లాభపడతారు. కట్నం డబ్బు ఇవ్వలేదని ఘనంగా చెప్పుకుంటారు. వారికి మరో సంబంధం కుదురుతుంది. ఘనంగా పెళ్ళి జరుగుతుంది. ఈ సమాజం ఆడపెళ్ళివారిని హీనంగా చూస్తుంది. ఎగతాళి చేస్తుంది. మగపెళ్ళి వారిని గౌరవిస్తుంది. కర్పూర నీరాజనం పడుతుంది.

కాని, ఇలాంటివారిని వదిలిపెట్ట కూడదు. వెంటపడి వేధించాలి. సాధించాలి. సాధించాలంటే తను వారియింటి కోడలు కావాలి. కోడలు కావాలంటే ఇప్పుడు ఉన్న ఫలానా ఐదువేలు... ఐదువేలు... ఐదువేలు...

ఐదువేలు... ఉన్న ఫలానా ఐదు వేలు కావాలి అనుకునేసరికి, అంత ఆవేదనలోను... తనలో చావని ఆశకి నవ్వు వచ్చింది. ఆమె కళ్ళు మిలమిల మెరిశాయి. ఆమె ముఖంలోకి చూస్తున్న రమ ఆమె ముఖ కవళికల్ని గమనించి విస్మయపడి "ఏమిటి ఉమ ఎందుకా నవ్వు?"

"ఇప్పుడు ఐదువేలు వుంటే, నా పెళ్ళి జరుగును కదా అని".

"ఐదువేలు నేనిస్తాను. అబ్బాయిని పెళ్ళాడుతావా?" అంది రమ.

ఉమ రమ కన్నుల్లోకి అనుమానంగా, ఆశ్చర్యంగా చూసింది.

"నిజం ఉమా! ఐదువేలే కాదు. ఏభై వేలంటే నేను ఇవ్వగలను. కాని నువ్వు ఆ అబ్బాయిని పెళ్ళాడతావా అని?"

"ఎందుకు పెళ్ళాడను! ముందు ఒప్పుకున్నది పెళ్ళాడటానికేగా?"

"అప్పుడు వేరు. ఇంత జరిగి అబ్బాయి ఆయన తల్లి డబ్బుకోసం ఇంత మూర్ఖంగా, పశువులా ప్రవర్తిస్తారని తెలిశాక కూడా ఇష్టపడుతున్నావా?"

"ఇప్పుడు మరీ ఇష్టపడుతున్నాను. తప్పక ఇలాంటి వారింటికే కోడలు కావాలనిపిస్తుంది"

"అయితే లే! డబ్బు గురించి నేను వారితో మాట్లాడుతాను" రమలేచి నిలబడింది.

"రమా!" అంది ఉమ ఏదో చెప్పాలని ఆవేదనానందాలతో.

చుట్టూ నిలబడి మిత్రురాళ్ళు గుడ్లప్పగించారు.

"నేను చెప్పిన మాట నిజం ఉమా! ఎలాగైనా నీ పెళ్ళి జరగడమే నాక్కావల్సింది. ఈ డబ్బు నేను నీకు స్నేహపూర్వకంగా ఇస్తున్నాను. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం స్నేహధర్మం... ఈ మాట నేను పెళ్ళి పందిట్లోనే చెప్పేదాన్ని. ఆ తల్లి కొడుకులు

**పెళ్ళి జరిగిన ఉదయం అంతా మగపెళ్ళి వారింటికి తరలివచ్చారు. ఒకరోజు ఉన్నారు. మరుసటిరోజు మరలా తిరిగి ఆడపెళ్ళి వారింటికి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఉమ మళ్ళీ పుట్టింటికి రానన్నది తండ్రితో. అత్తవారింట్లోనే ఉండిపోతా నంది. చేసేదేమిలేక బంధువులతో సహా వెళ్ళిపోయాడు తండ్రి. రమ ఉమ బలవంతంమీద ఆరోజు ఉండి మరుసటి రోజు వెళ్ళిపోయింది. నాలుగు రోజులైనాక ఓ మంచి ముహూర్తం చూసి శోభనం ఏర్పాటుచేశారు.**

పరిస్థితులను అర్థం చేసుకోకుండా చిందులాడుతుంటే నాకు భలే చిరాకు అనిపించింది. అసహ్యం వేసింది కూడా. ఈ పెళ్ళి తప్పిపోవడమే మంచిదను కున్నాను. కాని నీవు ఆయన్నే పెళ్ళాడుతానంటున్నావు".

"రమా! నాకోసం... ఐదువేలు..." ఆమె నోటినుండి మాటలు బయటపడటం లేదు.

"పిచ్చి ఉమా! నీలాంటి సౌజన్యమూర్తి, ప్రేమమయి అయిన స్నేహితురాలికి ఆపదలో ఉపయోగపడకపోతే నావద్ద ఉన్న ఆస్తికి అర్థం లేదు. అదే దండుగ. ఉమా! నీ మనసులోకి ఏ శంకా రానివ్వకు. నాన్నగారు ఇస్తానన్న వరకట్నం పదిహేను వేలు నేను నీకు పెళ్ళి కానుకగా ఇస్తాను. మరేం మాట్లాడకు. ఇది ఏదో ఘనకార్యం అనుకోవద్దు. ఇది మన స్నేహంలో చంద్రునికో నూలుపోగు. దీనికి అంతకన్నా మరే ప్రత్యేకత లేదు" అని నోళ్ళు వెళ్ళబెట్టి తమకేసి చూస్తున్న స్నేహితు రాళ్ళ గుంపువైపు చూస్తూ "మగపెళ్ళివారి వద్దకు వెడదామా?" అంది రమ.

వారు తలలూపారు.

"ఉమా! నా సూటుకేసు ఎక్కడుంది? అంది రమ. ఉమ తన మంచం కిందికి చూసింది. రమ కిందికి వంగి సూటుకేసు బయటికి లాగి తాళం తీసి అందులోంచి చెక్కుబుక్కు పెన్ను బయటకి తీసి మళ్ళీ దాన్ని మంచం కిందికి తోసింది.

అందరూ కలిసి మగపెళ్ళివారి విడిదివైపు వెళ్ళారు. వెళ్తున్న రమని చూస్తున్న ఉమ కంటికొలుకుల్లోంచి రెండేరెండు నీటిబొట్లు రాలిపడ్డాయి. అవి ఆనందబాష్పాలు కాబోలు. 'రమ నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను. ఎంత ప్రయత్నమైనా చేసి నా భర్తను, అత్తయ్యను మారుస్తాను. నీ డబ్బు నీకు తిరిగి ఇచ్చే ప్రయత్నం చేస్తాను' అనుకుంది మనసులో. ఆమెలో రమతోటి పరిచయపు పుటలు కదిలాయి.

తను పి.యు.సి. చదువుతుండగా అంటే మూడేళ్ళ క్రితం ఒకనాడు వారపత్రిక చూస్తుండగా 'కలం

స్నేహితులు కావాలా?' అన్న ప్రకటన కనిపించింది. ఆ అడ్రసుకు ఓ కార్డు రాసింది తను. నాలుగు రోజులనాటికి దాని ప్రాస్పెక్టస్ అందాయి. మరుసటిరోజు తను అందులో ఉన్నవిధంగా ఐదు రూపాయలు మనియార్డర్ చేసింది. పక్షంరోజుల తర్వాత తన పేరు, చిరునామా, అభిరుచులు, నమోదు చేయబడి తన పేరే కాకుండా కొన్ని వేలమంది భారతదేశీయులే కాకుండా, ప్రపంచదేశాలలోని వారి పేర్లు చిరునా మాలు, అభిరుచులు గల ఓ పెద్ద పుస్తకం తనకు రిజిస్టర్ పోస్టులో వచ్చింది. తను అవన్నీ పరిశీలించి, కొందరికి ఉత్తరాలు రాసింది. నలుగురి నుండి వారంరోజుల్లో జవాబులు వచ్చాయి. అందులో రమ ఒకర్తే. రమ తప్ప మిగిలిన ముగ్గురి నుండి ఆరు నెలల్లోనే జాబులు ఆగిపోయాయి. మిగిలింది రమ. కాని తాము ఈ మూడేళ్ళ నుండి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకున్నారే తప్ప, ముఖపరిచయం కలగలేదు. ఎన్నోసార్లు అందుకు ప్రయత్నించారు. కాని ఒక్కసారి కుదరలేదు. ఉత్తరాల్లోనే ఎన్నో కబుర్లు, వింతలు, విశేషాలు, గమ్మత్తులు, సరసాలు, సరాగాలు. చివరికి పెళ్ళి నిశ్చయం అయినాక, తను ఎంతో నిష్టూరంగా ఉత్తరం రాసింది. వారం రోజులైనా ముందుగా రావాలని. రమ మూడురోజుల క్రితమే వచ్చింది. ఇరువురు బిగ్గరగా కౌగిలించుకుని గాఢపరిష్వంగంలో ఎంతో ఆనందాన్ని అనుభూతిని అనుభవించారు.

మగపెళ్ళివారి విడిదికి రమ బృందం వెళ్లేసరికి వారు తమ సామానులని వ్యాన్‌లో సర్దుకుని వెళ్ళిపోవడానికి ఉద్యుక్తులవుతున్నారు.

రమ నారాయణరెడ్డి సుందరమ్మ దగ్గరికి వెళ్ళి "కట్నం డబ్బులు తెచ్చాం. మీ అబ్బాయిని పెళ్ళిపందిట్లోకి పంపండి" అంది. వాళ్ళు విస్మయంగా కళ్ళు రెపరెపలాడిస్తూ రమవైపు చూశారు.

"నిజమండీ! చెక్కు ఎవరి పేర రాసిమ్మంటారు?" అంది రమ. చెక్కుబుక్కు తెరచిపట్టుకుని.

వారే సమాధానం చెప్పలేదు. "మీరు ఇంటి యజమానులు కాబట్టి మీ పేరు రాస్తున్నాను" అని నారాయణరెడ్డి పేర పదిహేను వేలకు చెక్కురాసి అతని చేతికిచ్చింది రమ. సుందరమ్మ తన కుమారుని పిలిచి అసలైనదో, లేదో, ఎంత డబ్బుకు రాయబడిందో చూడమంది అతన్ని. దాన్ని చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"ఏరా? అది అబద్ధమేనా?" అంది సుందరమ్మ.

> **తను** పి.యు.సి. చదువుతుండగా అంటే మూడేళ్ళ క్రితం ఒకనాడు వారపత్రిక చూస్తుండగా 'కలం స్నేహితులు కావాలా?' అన్న ప్రకటన కనిపించింది. ఆ అడ్రసుకు ఓ కార్డు రాసింది తను. నాలుగు రోజులనాటికి దాని ప్రాస్పెక్టస్ అందాయి. మరుసటిరోజు తను అందులో ఉన్నవిధంగా ఐదు రూపాయలు మనియార్డర్ చేసింది.

"కాదమ్మా!..." అని రమవైపు తిరిగి "మీరు... మీరు..." అన్నాడు.

"అవును. నేను శ్రీకాంత్ గారి కూతురిని కోట్ల ఆస్తికి వారసురాలిని అయినా పేద ఉమకి ఎదలో ఎదని, ప్రాణంలో ప్రాణాన్ని, హృదయంలో హృదయాన్ని. ఆమె మంచికోసం ఈ డబ్బే కాదు, నా ప్రాణమైనా ఇస్తాను".

శ్రీకాంత్ హైదరాబాద్‌లో పేరు ప్రఖ్యాతులున్న వ్యాపారి. అతనికి కొన్ని ఫ్యాక్టరీలలో షేర్లు కూడా ఉన్నాయి. ఆ సంగతి సురేందర్‌రెడ్డి విద్యార్థి దశలో ఎరుగును. తనకు తెలిసింది, తల్లిదండ్రులకు చెప్పాడు.

"ఇంకా అనుమానమా?"అంది రమ వారి ముగ్గురి వైపు చూస్తూ.

వారు తమ ప్రయాణాన్ని ఆపు చేయమని బంధువులకు చెప్పి సురేందర్ రెడ్డిని పెళ్ళిపందిట్లోకి పంపారు.

రమ వారివైపు ఓ అసహ్యపు చూపు చూసింది. అక్కడినుండి ఉమ గదివైపు వెళ్ళింది. మళ్ళీ పందిట్లో పెళ్ళికళ వచ్చింది. కోలాహలం మొదలయ్యింది. నాలుగు గంటలకు జరగవలసిన పెళ్ళి ఎనిమిది గంటలకు జరిగింది.

కలతలనీ కలయికలనీ నిర్ణయించేది కాలమేనేమో!

* * *

పెళ్ళి జరిగిన ఉదయం అంతా మగపెళ్ళివారింటికి తరలివచ్చారు. ఒకరోజు ఉన్నారు. మరుసటిరోజు మరలా తిరిగి ఆడపెళ్ళివారింటికి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఉమ మళ్ళీ పుట్టింటికి రానన్నది తండ్రితో. అత్తవారింట్లోనే ఉండిపోతానంది. చేసేదేమిలేక బంధు వులతో సహా వెళ్ళిపోయాడు తండ్రి. రమ ఉమ బలవంతంమీద ఆరోజు ఉండి మరుసటి రోజు వెళ్ళిపోయింది. నాలుగు రోజులైనాక ఓ మంచి ముహూర్తం చూసి శోభనం ఏర్పాటుచేశారు. శోభనం నాటి రాత్రి, ఉమని అలంకరించి గదిలోకి నెట్టి తలుపులు మూస్తూ వెళ్ళిపోయారు ముత్తైదువలు. ఉమ సిగ్గుపడుతూనే భర్తకు పళ్ళు, పాలు, మిఠాయి అందించింది. అతని బలవంతంపైన తాను తిన్నది. చివరకు అతను ఆమెను మంచంమీదకు లాగాడు. ఆమె విదిలించుకుంది కోపంగా. అతను బిత్తరపోయాడు ఆమె ప్రవర్తనకు.

"ఏమిటిది?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏదీ"

"ఈ విదిలింపు"

"ఇలాంటి పిచ్చిపనులు నాకు ఇష్టం లేదు".

"ఎందుకు?"

"అది అంతే!"

"అయితే మరి పెళ్ళి ఎందుకు చేసుకున్నావ్?"

"ఇందుకు అని మీరు చేసుకోలేదు. నేననుకోలేదు".

"మీ ప్రవర్తన నాకు అలా

నాటి కథ

అనిపించలేదు".

అతను మరి మాట్లాడలేదు. ఆమె మంచంలో ఓ మూలన ఒదిగి పడుకుంది.

ఓ గంట గడిచాక అతను ఆమె మీద చేయివేశాడు. ఆమె విదిలించుకుని లేచి, ఓ తలగడ దుప్పటి తీసుకుని కింద పరచుకుని పడుకుంది.

మూడు రోజులు ఇలాగే నిస్సారంగా గడిచిపోయాయి. కాని, సురేందర్‌రెడ్డి ఈ రహస్యాన్ని బయటపడనీయలేదు. భార్య తత్త్వమేమిటో అతనికి అర్థం కాలేదు.

పొద్దంతా సరదాగా తిరుగుతుంది. కబుర్లు చెబుతుంది. పరాచికాలు ఆడుతుంది. నవ్విస్తుంది. కవ్విస్తుంది కాని, రాత్రి అదీ మంచం దగ్గరికి రాగానే బిగుసుకుపోతుంది. తన బియ్యే విజ్ఞానాన్ని వినియోగించి ఎంత యోచించినా అతనికేమి తోచలేదు.

ఉమ అత్తవారింట్లో ఉన్న ఈ వారంరోజుల్లో, తన గది వదిలి బయటికి వచ్చిన సమయం చాలా తక్కువ.

మరోవారం రోజులు గడిచాయి. తన భర్తకి అత్తమామలకి వారు చేసిన తప్పు వారికి తెలిసివచ్చి కనువిప్పు కలిగేలా ఎలాచేయాలా అని తీవ్రంగా ఆలోచిస్తూనే వుంది ఉమ. ఆమె అత్తవారింట్లో ఉన్న ఈ పదిరోజుల్లో ఇటుపుల్ల తీసి అటు పెట్టలేదు. తనకవసరమైన కొన్ని పనులు న్నప్పుడు మాత్రమే గది దాటి బయటకువచ్చింది. మిగతా సమయాల్లో పుస్తకాలు, పత్రికలు చదువుతూ కూర్చున్నది. కొత్తకోడలు కదా! అని వేళకు కాఫీ, ఫలహారం, భోజనం అన్ని సుందరమ్మే గదిలోకి తీసికెళ్ళింది.

ఒకనాడు సుందరమ్మ అంది. "ఉమ! మనం కడుపులో చల్ల కదలకుండా ఇలా కూర్చుండి తినడానికి మహారాణులమా? కష్టం చేసుకోవాలి. కడుపునిండా తినాలి".

"నాకు ఆ అవసరం లేదు" కటువుగా అంది ఉమ.

కోడలి సమాధానం విని అదిరిపడి చూసింది సుందరమ్మ ఆమెవైపు.

"నేను ఏ పని చెయ్యను. మహారాణిలా కాలుమీద కాలువేసుకుని కూర్చుని

**మరోవారం రోజులు గడిచాయి. తన భర్తకి అత్తమామలకి వారు చేసిన తప్పు వారికి తెలిసివచ్చి కనువిప్పు కలిగేలా ఎలాచేయాలా అని తీవ్రంగా ఆలోచిస్తూనే వుంది ఉమ. ఆమె అత్తవారింట్లో ఉన్న ఈ పదిరోజుల్లో ఇటుపుల్ల తీసి అటు పెట్టలేదు. తనకవసరమైన కొన్ని పనులు న్నప్పుడు మాత్రమే గది దాటి బయటకువచ్చింది. మిగతా సమయాల్లో పుస్తకాలు, పత్రికలు చదువుతూ కూర్చున్నది.**

తింటాను. ఎవరి హద్దులో వారుండటం మంచిది. హద్దుమీరి అధికారం చెలాయించ ప్రయత్నిస్తే మర్యాద దక్కదు" ఖండితంగా అంది ఆమె అత్తవైపు ధీమాగా చూస్తూ.

సుందరమ్మ కిక్కురుమనకుండా వెళ్ళిపోయింది. సాయంత్రం కొడుకు రావడంతోనే ఉన్నవి, లేనివి కల్పించి కోడలిమీద ఫిర్యాదు చేసింది సుందరమ్మ.

సురేందర్ తల్లిమాటలు విని మండిపడుతూ గదిలోకి వచ్చి "ఉమ! నీవు అమ్మతో అన్నమాటలు నిజమేనా?" అన్నాడు కోపంగా.

"నిజమే! ఇలాంటి ఉపద్రవం వచ్చిపడు తుందని ముందే ఊహించిన ఉమ తొణకకుండా సమాధానము చెప్పింది.

తన ప్రశ్నకు మౌనం వహిస్తుందని ఊహించిన సురేందర్‌రెడ్డి దెబ్బతిన్నట్టుగా చూశాడు భార్యవైపు. అతని క్రోధం ఇనుమడించింది.

"చదువుకున్నదానివని, నీ అంతగా నీవు తెలుసుకుంటావని ఉపేక్షించిన కొద్ది మితిమీరుతున్నావు".

"అని మీరనుకుంటున్నారు" బెదిరిపోలేదామె.

"మాటకు మాట... యూ ఫూల్ షటప్" బిగ్గరగా అరిచాడు తను.

"నాకూ ఇంగ్లీషు వచ్చు" అంది తాపీగా.

ఆమె మాటకి అతను అదిరిపడ్డాడు. "అంటే తను నన్ను తిట్టగలననా?"

"యూ... రోగ్" పళ్ళు నూరాడు.

"మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి" ఆమె మాటలు మృదువుగా ఉన్నాయి.

"యూ... రాస్కెల్" కొట్టడానికి చేయి ఎత్తాడు అతను.

ఆమె అతని ఎత్తిన చేయిని కిందికి దించకుండా పట్టుకుని ఆపి "నాకూ ఇంగ్లీషు వచ్చు. నీకన్నా స్పీడ్‌గా మాట్లాడగలను కూడా. మీరు బియ్యే థర్డ్ క్లాస్, నేను బి.ఏ. ఫస్ట్ క్లాస్. మీలాగే నాకు కాళ్ళు, చేతులు ఉన్నాయి అవసరానికి ఉపయోగపడేందుకు! కాని నేను కూడా మీలా తొందరపడి నోరు చేతులు పారేసుకోదల్చుకోలేదు. ఆడదాని సహనాన్ని అసమర్థతగా అర్థం చేసుకుం టాడు మొగవాడు" అందామె. ఆమె మాటల్లో శాంతం మృదుత్వం సహనం తొణికిసలాడుతున్నాయి.

ఆమె మాటలు అతనికి ములుకుల్లా తగిలాయి. శూలాల్లా గుచ్చుకున్నాయి. అతని మనసులో బాకుల్లా నాటుకు న్నాయి. అతని హృదయం గిలగిలలాడింది. అయినా అతనిలోని పురుషత్వపు పౌరుషం ఊరుకోలేదు.

"నీవు బి.ఏ. చదివినా, నాకు భార్యవే కాని భర్తవు కాలేవుగా?"

"నేను అదే అంటున్నా. నేను మీ భార్యనే కాని బానిసను కాను".

"భార్య బానిసతో సమానమే! పొగరు మాటలు మాని చెప్పినట్టు విని ఓ మూల పడి వుండు".

"నేను అలా ఉండను. అది నావల్ల కాదు".

"ఏం? వంట చేయడం కూడా చేతకాదా?"

"వంట నేనే ఎందుకు చెయ్యాలి? మీరు చేయకూడదా? లేకపోతే కలిసి ఉద్యోగం చేద్దాం, కలిసే వంట చేద్దాం. భార్యాభర్తలు ఒకరిలో ఒకరు

చెరిసగముగా?'' వ్యంగ్యంగా అందామె.

"నీ బి.ఏ. చదువు బియ్యం కడగడానికే పనికి వస్తుంది'' అతనిలోని ఆగ్రహం వాస్తవాన్ని గమనించనీయడంలేదు.

"ఆ మాటే నేనంటే...?'' శాంత గంభీరంగా అందామె.

"నాలుక చీరేస్తాను'' ఇక గదిలో నిలబడి వాగ్వివాదం పెంచడం తన పరువు తాను తీసుకోవడమేనని తలచి గిరుక్కున వెనుదిరిగి, చరచరా గదిలోంచి వెళ్ళిపోయాడు. అతనిలోని ఆగ్రహానికి పురుషాహంకారం తోడై కారుచిచ్చు రగల్చసాగింది. అణకువగా ఉన్నప్పుడే ఆడదాని మీద అధికారం చెలాయించి అదుపులో పెడతాడు మగవాడు. అదే ఆడది బరితెగించి ఆడసింహంలా గర్జిస్తే ఆమడదూరం పరుగెత్తుతాడు.

వెళ్ళిపోతున్న భర్తను చూస్తున్న ఉమ 'పాపం!...' అనుకుంది.

★ ★ ★

మరో వారం రోజులు గడిచాయి.

ఈ వారం రోజుల్లో కూడా ఉమ కించిత్తు పనిచేయలేదు. సుందరమ్మ కోపంతో కోడలికి కాఫీ ఫలహారాలు భోజనం అందించడం మానేసింది. ఉమ వేళకి వంటగదిలో చేరి అత్తయ్య వండిన వంటకాలని తనే వడ్డించుకుని తినడం మొదలుపెట్టింది.

ఆడది అదుపు తప్పితే ఆమెను అణచిపెట్టడం ఆమెను సృష్టించిన బ్రహ్మతరం కూడా కాదేమో!

ఒకనాడు... ఉదయం పూట సురేందర్‌రెడ్డి కాఫీ తాగుతున్నాడు. అప్పుడే లేచి కళ్ళు నలుముకుంటూ కూర్చున్న ఉమ "నేను దొడ్డికి వెళ్ళాలి'' అంది భర్తవైపు ఓరగా చూస్తూ.

అతను భార్యవైపు అయోమయంగా చూశాడు.

"అలా చూస్తారేం?... కాస్త లోటా (చెంబు)తో నీళ్ళు తెచ్చిపెట్టండీ''.

అతను ఆమెవైపు కరకర నమిలి మింగుదునా అన్నట్టు చూస్తూ పళ్ళు పటపట కొరుకుతూ "యూ... మ్యానర్‌లెస్ క్రీచర్, నిన్ను నిలువునా చీల్చేస్తాను'', తనశరీరంలోని శక్తినంతా ఒకచోట చేర్చి గది దద్దరిల్లేలా అరిచి తనచేతిలో ఉన్న కప్పును ఓ మూలకు విసిరికొట్టి పులిలా పొంగుతూ ఆమెమీదకి రాసాగాడు.

ఆమె చలించలేదు. అదిరిపడలేదు. కూర్చున్న చోటనుంచి కదలలేదు. పైగా ప్రసన్నవదనంతో చిన్నగా నవ్వుతూ "అలా కోపగించుకుంటారేం?... పదిహేను వేల రూపాయలకు చెక్కునిచ్చి మిమ్మల్ని కొన్నాను. మీరు నేను చెప్పిన మాట వినకపోవడం ధర్మమా? అహా... ధర్మమేనా అని? మీరు చదువుకున్నవారు ఇది మర్యాదేమో ఆలోచించండి'' అంది.

ఆమె నవ్వుతూ అన్న మాటలు అతని మొఖం మీద చెప్పు పుచ్చుకుని విరామం లేకుండా కొట్టినట్టు తగిలాయి. మండుతున్న పుండు మీద కారం చల్లినట్టుందా నవ్వు, మాట. "అమ్మా!'' అంటూ మేడ ప్రతిధ్వనించేలా అరిచాడు అతను. ఉమ పకపక నవ్వసాగింది. అతని గుండెల్లో మంటలై భగభగ మండసాగాయి ఆ నవ్వులు.

సుందరమ్మ "ఏమిట్రా'' అంటూ వచ్చిందక్కడికి గబగబా.

"మొన్న చెక్కు విడిపించి తెచ్చిన పదిహేను వేలు కావాలి''.

"ఇప్పుడవి ఎందుకురా?''

"కాల్చి బూడిద చేసి కడుక్కు తాగడానికే తే ముందు'' కోపంగా చూశాడు తల్లివైపు.

"ఎందుకో చెపితే కాని ఇవ్వను'' మొరాయించింది ఆమె.

"మర్యాదగా నీవెందుకు ఇస్తావు? నేను తెచ్చుకుంటాను'' అంటూ చరచరా బీరువా ఉన్న గదిలోకి వెళ్ళి దాని తాళం పగులగొట్టి పదిహేనువేలు లెక్కపెట్టి తెచ్చి అవి ఉమ ముందు పెట్టి "ఉమా! ఇక నీ మాటలతో నన్ను క్షణక్షణం చిత్రహింసకు గురిచేయకు. ఇదిగో నీ డబ్బు నిన్ను ఎవరు ఏమీ అనరు. నీకిష్టమైతే ఉండు. లేకపోతే వెళ్ళిపో. విడాకులకు ఏర్పాట్లు చేస్తాను. అంతే కాని ఈటెవంటి మాటలతో నా హృదయాన్ని తూట్లు పొడవకు. బాకుల వంటి చేతలతో నన్ను చిత్రవధ చేయకు'' అన్నాడు తల విదిలిస్తు ఆమె మాటల పదునును భరించలేనట్టు.

"పదునైన ఈటెలవంటి మాటలవల్ల మనుషులు చిత్రహింస అనుభవిస్తారని మొనదేలిన బాకులవంటి చేతలవల్ల హృదయాలు తూట్లు పడతాయని మనుషులు చిత్రవధకు గురి అవుతారని, ఆ చిత్రవధ ఎంత క్రూరంగా, ఎంత బాధావహంగా ఉంటుందో మీరు స్వయంగా అనుభవించి తెలుసుకున్నారు. ఆ నరకయాతన ఎలాంటిదో మీకు తెలిసి వచ్చింది. నా ఈ వింత ప్రవర్తనంతా మీకు కనువిప్పు కలగాలనే. ఒక్క మీకే కాదు కత్తులు కటారులు లేకుండానే ఆడపిల్లల్ని, ఆడపిల్లల తల్లిదండ్రుల్ని చిత్రవధ చేసే మీవంటి వాళ్ళకి కనువిప్పు కలిగితేనే కన్యల కష్టాలకు విముక్తి. కన్న తల్లిదండ్రులకి కంటినిండా నిద్ర. ఆనాడు మీరు పెళ్ళిమండపంలో ఈ విజ్ఞత ప్రదర్శించి వుంటే ఈనాడు ఇంత బాధపడవలసివచ్చేది కాదు. ఇక నేను మీకు భార్యగా మీరు నాకు మంచి భర్తగా కలిసిమెలిసి జీవిద్దాం, ఏమంటారు?'' అన్నది తన సుదీర్ఘ లెక్చర్ ఆపి.

సురేందర్‌రెడ్డి పశ్చాత్తాప పడుతున్నట్టు ముఖం కొట్టొచ్చినట్టు కనబడ్డది.

సుందరమ్మ ఉలుకుపలుకు లేకుండా శిలాప్రతిమలా నిలబడిపోయింది.

***ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 20 ఏప్రిల్, 1969***

***మెతుకు కథలు కథాసంపుటి, 2016 (సంపాదకులు : వేముగంటి మురళీ కృష్ణ & డా॥ బెల్లంకొండ సంపత్‌కుమార్)***

**"పదునైన ఈటెలవంటి మాటలవల్ల మనుషులు చిత్రహింస అనుభవిస్తారని మొనదేలిన బాకులవంటి చేతలవల్ల హృదయాలు తూట్లు పడతాయని మనుషులు చిత్రవధకు గురి అవుతారని, ఆ చిత్రవధ ఎంత క్రూరంగా, ఎంత బాధావహంగా ఉంటుందో మీరు స్వయంగా అనుభవించి తెలుసుకున్నారు.**

# బసవేశ్వరుని వాదన

**పాల్కురికి సోమనాథుడు**



పాల్కురికి సోమనాథుడు (1160-1240), శివకవి యుగానికి చెందిన తెలుగు కవి. ఈ యుగానికి చెందిన "శివకవి త్రయం" అనబడే ముగ్గురు ముఖ్యకవులలో ఇతనొకడు. పాల్కురికి సోమనాథుడు తెలుగు, కన్నడ, సంస్కృత భాషలలో పండితుడు. వీరశైవం వ్యాప్తికి కృషి చేశాడు. వీరశైవ సంప్రదాయంలో సోమనాథుడు శివుని ప్రమథ గణాలలో "భృంగి" అవతారం. అప్పటి ఇతర శివకవులు తమ రచనలలో బ్రాహ్మణులను గౌరవంగా ప్రస్తావించేవారు కాని పాల్కురికి సోమనాథుడు వారి ఆచార వ్యవహారాలను నిశితంగా నిరసించాడు. సోమనాథుడు వరంగల్లు సమీపంలోని పాల్కురికి గ్రామంలో శ్రియాదేవి, విష్ణురామిదేవుడు అనే వీరశైవ దంపతులకు జన్మించాడు. ఇది ఆయన పండితారాధ్య చరిత్రలోని ఉద్విగ్నభరితఘట్టం మీ కోసం...

వడుగని యిదియేమి గడియించెదీవు
జడుడవెట్లయితి వీశ్వరుని గొల్చియును
పరమాత్మ గురునిగాఁ బడసి దుర్నరుల
గురులని కొలుచుట నరకంబుగాదె
గత పూర్వజన్మ సంస్కారుడై తలప
వితత ద్విజత్వంబు పతితంబుగాదె
నిర్మల గురుకృపాన్వీత జన్మనకు
కర్మజన్మంబు దుష్కర్మంబుగాదె

శూలిభక్తుల కెత్తు కేలది త్రాటి
మాలలకెత్తుట మఱి తప్పుగాదె
కర్మపాశంబు లొక్కటఁ దెగ నీల్లి
కర్మంబు త్రాళ్ళు దాకట్టు కోదగునె

జాతి గోత్రాతీతు సద్గురు జాతు
జాతిగోత్ర క్రియాశ్రయు జేసెదెట్టు
ల కులస్థుడై యున్న యభవుని భక్తు
నికి నేకులంబని నిర్ణయించెదవు
కావునెన్నియు మార్గ కర్మానవడుగు
గావింపగా రాదు కథలేమి జెప్ప

కులసతియట్లు నిశ్చల యుక్తిభక్తి
వెలయాలి యట్టు లవ్విప్రమార్గంబు
కర్మమార్గంబుగాక బ్రాహ్మ్యంబు
నిర్మల శివభక్తి నిష్ఠితంబగునె?
ఇట్టి బ్రాహ్మణ మార్గమిది తథ్యముగను
బట్టి యాడెదవే పనియు లేదింక
కాకులు బెంచిన కోకిలపిల్ల
కాకులు బోలునె కావు కావనుచు
మీ యంత నుండుడు మీరును, నేను
నాయంత నుండెద వేయును నేల?

సమాజం

# బీసీల బతుకులను బొమ్మగట్టిన నవలలు

**బీసీ కులాలస్థితి చిత్రించిన నవలలపై రేఖామాత్ర స్పర్శ...**



సంగిశెట్టి శ్రీనివాస్
98492 20321

బహుజనులు అనే పదం చాలా సార్లు మిస్‌యూజ్, కొన్ని సార్లు అబ్యూజ్‌కు గూడా గురయింది. బుద్ధుడు 'బహుజన హితాయ బహుజన సుఖాయ' అన్నాడు. కొత్తలో కేవలం 'బీసీ'లను మాత్రమే బహుజనులుగా గుర్తిస్తూ కంచె ఐలయ్యలాంటి బహుజన మేధావులు 1990వ దశకంలో 'దళిత, బహుజన' అనే పదాలను వేర్వేరుగా ఖాయం చేసింట్రు. అంతకుముందు 'దళిత్ పాంథర్స్ ఉద్యమం' (1970వ దశకం) సందర్భంలో 'దళిత' అనే పదాన్ని రాజ్యాంగం ప్రకారం విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందే దాదాపు అన్ని సమూహాలకు అన్వయించారు. అంటే అందులో దళితులతో పాటు బీసీలు, ముస్లింలు, బుద్ధిస్టులు కూడా ఉన్నారనేది గమనంలో ఉంచుకోవాలి. ఇప్పుడవన్నీ మారిపో యాయి. అందుకే ఇవ్వాళ విద్యా, ఉద్యో గాల్లో రిజర్వేషన్లను పాక్షికంగానే అయినా వాటిని అనుభవిస్తున్న సమూహాలందరిని కలిపి 'దళిత, బహుజనులు'గా పిలువొచ్చు. రాజకీయ రిజర్వేషన్లు (అసెంబ్లీ, లోక్‌సభ) కాకుండా కేవలం విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందుతున్నవారిని బహుజనులుగా చెప్పవచ్చు. బహుజనుల పేరిట వీరిని సాహిత్యంలో రికార్డు చేసినప్పటికీ బయట మాత్రం బీసీలుగానే గుర్తిస్తారు. ఈ బహుజనుల్లో మెజారిటీ ప్రజలు 'చేతి వృత్తుల' మీదనే బతుకుతారు. ఈ చేతి వృత్తుల్లో కొన్ని 'హస్తకళలు' కూడా ఉంటాయి. 'హస్తకళలు' అన్నీ చేతివృత్తులే అయినప్పటికీ, 'చేతివృత్తులు' అన్నీ హస్తకళలు కావు అనేది గుర్తుంచు కోవాలి. అయితే ఈ 'కళలు', 'వృత్తులు', 'సేవలు' చేసేది ఎక్కువగా బహుజనులే. చేతివృత్తుల్లో ఉత్పత్తి కులాలు, సేవా కులాలు, వ్యవసాయ అనుబంధ ఉపాధి కులాలూ ఉన్నాయి. వీళ్లందరూ రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీ జాబితాలో ఉన్నారు. ఇక్కడ విశ్లేషిస్తున్న నవలలు కండ్లకు కనబడని జీవితాలను, అందులోని గడ్డకట్టుకున్న విషాదాలను చిత్రికగడుతాయి. ప్రతిభ, శ్రమ, కలగలిసిన బతుకులను, అవి విస్మరణకు, నిరాదరణకు, హేళనకు గురవుతున్న తీరును, ఆకలి చావులు, ఆత్మహత్యలుగా మారుతున్న దయనీయ స్థితినీ చిత్రికగట్టాయి. సమస్య రికార్డయిందంటే పరిష్కారం కూడా అక్కడే వెతుక్కోవా లనేది (ఉన్నదనేది) సుస్పష్టం. సమస్యలకు జవాబులు వెతికే పని సాహిత్యం చేస్తూ వచ్చింది. బీసీ సాహిత్యానికి అదే మూలం. ఈ పనిని 1950లకి ముందు నుంచీ, ఆ తర్వాత కూడా కవులు, రచయితలు చేస్తూనే ఉన్నారు. అయితే అది సాహిత్య చరిత్రలో సవ్యంగా రికార్డు కాలేదు.

బహుజన రచయితలు సంఘటితమై తమ బతుకుదెరువు గురించి మాట్లాడి నట్లయితే ఆధిపత్యకులాల వారి అజమాయిషీకి తెరపడుతుందని తెలుసు. ఈ ఆధిపత్యవర్గాలు ప్రచారంలో పెట్టిన పేదరికం సాహిత్య వస్తువయింది. కానీ 'వర్గం' తప్ప 'కులం' ప్రాధాన్యత సంతరించుకోలేదు. దీనికి కమ్యూనిస్టులు మూలం. దానికి కాంగ్రెస్ కూడా జతకలిసింది. 1952 నుంచి 83 వరకు మూడు దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ బీసీలకు చేయగలిగి ఉండీ చేయాల్సినంత మేలు చేయలేదు. వివిధ బీసీ కమిషన్లు వేసినా వాటి రికమెండేషన్లు సవ్యంగా అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ప్రధానంగా బీసీ ఓట్లతో తెలుగుదేశం పార్టీ 1983లో అధికారంలోకి వచ్చింది.

తమ గెలుపులో కీలక భూమిక పోషించిన బీసీలకు మేలు చేయాలని ఎన్టీరామారావు భావించాడు. అందులో భాగంగా పటేలు, పట్వారీ వ్యవస్థను రద్దుచేసి బహుజన సమాజానికి మేలు చేసిండు. అట్లాగే 1986లో బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల శాతం పెంచుతూ ఎన్టీరామారావు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీనికి పత్రికలు, ఆధిపత్య కులాలవాండ్లు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం జేసింట్రు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా

సమాజం

బహుజన్ సమాజ్ పార్టీ 'మేమెంతో మాకంత వాటా' అని నినదిస్తూ రాజకీయ రంగంపైకి వచ్చింది. కోర్టు ప్రతికూల తీర్పుతో పెంచిన రిజర్వేషన్లు బీసీలకు అమలు కాలేదు. ఇక్కడ ఎన్టీ రామారావు చిత్తశుద్ధిని కూడా శంకించా ల్సిందే. అప్పటి ప్రభుత్వం అప్పీలుకు కూడా వెళ్లలేదు. ఈ చర్యలతో తమకు అన్యాయం జరిగిందని బీసీలు భావిస్తూ వచ్చారు. ఇది ఇలా కొనసాగుతూ ఉండగానే కేంద్ర ప్రభుత్వం మండల్ కమిషన్ రికమెండేషన్స్ అమలు చేస్తామని ప్రకటించింది. అనంతరం పి.వి.నరసింహారావు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రపంచీకరణ వృత్తులను దెబ్బతీసి బీసీల ఉపాధిని దెబ్బతీసింది. ప్రత్యామ్నాయం వెతుక్కునే లోపలే జరగకూడని నష్టం జరిగింది. ఈ దశలోనే జ్యోతిభా పూలే శతవర్ధంతి (1990), ఆ తర్వాత అంబేడ్కర్ శతజయంతి (1991) ఉత్సవాలు, సభలు, సమావేశాలు దేశ వ్యాప్తంగా నిర్వహించారు. వీరి రచనలను ప్రభుత్వమే పూనుకొని ప్రచురించింది. ఇది బహుజనుల్లో కొత్త చైతన్యాన్ని, ఉత్సాహాన్ని నింపింది. వారి స్ఫూర్తితో పోరాటాలు ఊపందుకున్నాయి. మండల్ కమిషన్ అమలు ఉద్యమం బహుజనులను సంఘటితం చేసింది. ఈ సమైక్యత సాహిత్య సృజనకు, పరిశోధనకు దారులు వేశాయి. సామాజిక చైతన్యానికి సాహిత్యానికి గల అవినాభావ సంబంధాన్ని చరిత్రలో రికార్డు చేయాల్సిన అవసరమున్నది. అందులో భాగంగానే

**ఆనాడు సమాజంలో ప్రబలి ఉన్న వేశ్యాలోలత్వాన్ని- దాని నివారణకు దక్కన్ మానవ సేవా సమితి ద్వారా, కళావంతుల సభల ద్వారా విశేషంగా ప్రచారం చేసినవారు సిద్దాబత్తుని శ్యామరావు. ఆయన పూనిక మేరకే ఈ నవల (నవలిక) వెలువడింది. ఆంధ్ర జనకేంద్ర సంఘ కార్యకలాపాల్లో కూడా విస్తృతంగా పాల్గొన్న శ్యామరావు కళావంతుల సంస్కరణకు చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఆయన కృషికి, పట్టుదలకు, ఉద్యమ ప్రచారానికి ఊతంగా నిలిచే విధంగా ఈ పుస్తకం వెలువడింది.**

తెలుగు నవలా సాహిత్యంలో బీసీలు తమ జీవితాలను చిత్రించిన దాని గురించి క్లుప్తంగా ఇందులో చర్చించడమయింది.

1927లో పూర్తిగా ఆధునిక పద్ధతుల్లో హైదరాబాద్‌లోని 'కళావంతుల' (భోగం వారి) జీవితాల్ని చిత్రీకరిస్తూ ఆనాటికే సికింద్రాబాద్‌లో పేరొందిన గొప్ప సంఘ సంస్కర్త టేకుమళ్ల నరసింహం రాసిన 'రాధమ్మ' అనే నవల ప్రచురితమయింది. బహుశా పూర్తిస్థాయిలో బీసీ జీవితాలను చిత్రిస్తూ, ఒక బీసీ రాసిన మొదటి నవల ఇదే కావొచ్చు. ఈ నవలను సిద్ధాబత్తుని శ్యామరావు (సికింద్రాబాద్) దక్కన్ మానవ సేవా సమితి తరపున వెలువరించారు. ఈ పుస్తకాన్ని గోలకొండ పత్రికలో సురవరం ప్రతాపరెడ్డి సమీక్షించారు. (సంపుటి2, సంచిక 20, (1928)). వేశ్యావృత్తికి వ్యతిరేకంగా లేవదీసిన ఉద్యమ ప్రచారం కోసం ఈ నవల రాయబడింది. "... ఒక కాలము మీరిన బోగముది పిల్లలు లేనిదై యుంటిచే నొక బీదరాలిని దన ధనముచే నొప్పించి యీమె యొకే కూతురు దనకు సాకు కొనుటకు అనగా దన వృత్తినవిచ్చి న్నముగా జరుపుట కుంచుకొనెను. ఈ పిల్లపేరు రాధమ్మ. తన రూపము తన శత్రువయ్యెను. వేశ్య యింట నుండవలసి వచ్చినను రాధమ్మ చదివినదియు, గుణవతియునై యుండెను. తల్లి యీమెను పడపు వృత్తికెంత ప్రోద్భలము చేసినను వినదయ్యెను. ఒకనాడు అరవదేశము నుండి జీవనార్థమై సికింద్రాబాదుకు వచ్చిన యొక అయ్యరు ఈమెను మోసగించి తానామెను యావజ్జీవనము భార్యగా జూచుకొందునని చెప్పి యట్లామెతో కొంతకాలము గడపి పిదప స్వదేశము నుండి తన నిజ భార్యను బిలిచికొని పూనాకు బోయి యచ్చట నివసించెను. రాధమ్మ యీ యరవ బ్రాహ్మణునిచే మోసగింపబడినదై దిక్కు లేనిదయ్యెను. తల్లి మరల యీమెకు వేశ్యానీతులు పాఠము పెట్టదొడగెను. రాధమ్మకు జీవనం భారమయ్యెను. ఒకనాడు రాత్రి యందు బావిలో పడి మరణించెను". ఇది స్థూలంగా కథాంశము. అంటే ఆనాడు సమాజంలో ప్రబలి ఉన్న వేశ్యాలోలత్వాన్ని- దాని నివారణకు దక్కన్ మానవ సేవా సమితి ద్వారా, కళావంతుల సభల ద్వారా విశేషంగా ప్రచారం చేసినవారు సిద్దాబత్తుని శ్యామరావు. ఆయన పూనిక మేరకే ఈ నవల (నవలిక) వెలువడింది. ఆంధ్ర జనకేంద్ర సంఘ కార్యకలాపాల్లో కూడా విస్తృతంగా పాల్గొన్న శ్యామరావు కళావంతుల సంస్కరణకు చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఆయన కృషికి, పట్టుదలకు, ఉద్యమ ప్రచారానికి ఊతంగా నిలిచే విధంగా ఈ పుస్తకం వెలువడింది. ఈ నవల ఆనాటి సమాజం



కాలువ మల్లయ్య



అంతటి నరసింహం

మీద ప్రగాఢమైన ప్రభావం వేసిందని ఆ తర్వాత జరిగిన కళావంతుల సభల వివరాల ద్వారా తెలుస్తుంది. ఇది పునాది. ఆ తర్వాతి కాలంలో ఆంధ్రా ప్రాంతం నుంచి రాసినవారు కులాన్ని పెద్దగా పట్టించుకోకుండా మధ్యతరగతి జీవితాలను నవలల్లోకి తీసుకొచ్చారు. ఇట్లా తీసుకొచ్చినవారిలో అందే నారాయణ స్వామి, శీలా వీర్రాజులు ఉన్నారు. వీరికి భిన్నంగా తెలంగాణ నుంచి బీసీ జీవితాలను చిత్రిస్తూ నవలలు రాసిండ్రు. సిరిసిల్లకు చెందిన జి.రాములు 'పెరటి చెట్టు' పేరిట రాసిన నవలిక గౌడ కులస్థుల జీవితాలను చిత్రించింది.

నిజామాబాదు జిల్లాకు చెందిన లోకమలహరి 1947-55 మధ్యకాలంలో 'జగ్గని యిద్దె', 'సంగం' అనే రెండు నవలలు రాసిండు. 1955లో అచ్చయిన 'సంగం' నవలలో భీవండి, సూరత్, బొంబాయిలకు వలసపోతున్న పద్మశాలీల జీవితాల్ని చిత్రీకరించాడు. బతుకు దెరువు కోసం భీవండికి పోయిన పద్మశాలీలు ఎదుర్కొన్న కష్టనష్టాలు, వారి అభివృద్ధికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహకారసంఘాల్లో అవినీతిపరులు ఎలాంటి అన్యాయాలకు ఒడిగడుతున్నరనే విషయాన్ని విపులంగా ఈ నవల్లో వివరించిండు. బి.ఎస్.రాములు నవల 'బతుకుపోరు', 'చూపు' నవలలు రెండూ పద్మశాలీల వృత్తి జీవితాలను చిత్రిక గట్టాయి. అట్లాగే 1983 ఆ ప్రాంతంలో 'పద్మజ్యోతి' పత్రికలో 'జరీ అంచు' పేరిట వనం నరసింహారావు చేనేత జీవితాలను చిత్రికగట్టే నవలను సీరియల్‌గా ప్రకటించాడు.

చతుర నవలల పోటీ కోసం రాసిన నవల 'గువ్వలచెన్నా'. ఈ నవలను కాలువ మల్లయ్య విద్య ద్వారా పద్మశాలీయుల జీవితాల్లో వెలుగులు వచ్చిన తీరుని, కుల సమాజంలోని అసమానతలను చిత్రించాడు. తన కొడుకుని కంప్యూటర్ ఇంజనీర్ చదివించిన శంకరయ్య గురించీ, ప్రేమ వివాహం చేసుకొని అమెరికాలో స్థిరపడ్డ తనయుడు రమేశ్ గురించి ఇందులో రాసిండు. బి.ఎస్.రాములు 'బతుకు పోరు' నవలలో బీడీలు చేసుకొని బతికే పద్మశాలీ స్త్రీల జీవితాల దైన్యతను, పోరాటాన్ని చెప్పిండు. అజామ్ జాహీ మిల్లుల్లో కూలీలుగా కుదురుకున్న పద్మశాలీ బతుకులను రామాచంద్రమౌళి తన స్వీయానుభవాలను రంగరించి 'కాల నాళిక' పేరిట బృహత్ నవల రాసిండు. మంథా భానుమతి రాసిన 'అగ్గిపెట్టెలో చీర' కూడా చేనేత బతుకును చిత్రిక గట్టింది. దేవులపల్లి కృష్ణమూర్తి 'ఊరువాడ బతుకు' కూడా ఈ కోవలోనిదే. ఈయన మరో నవల 'బయటి గుడిసె' పేరిట అత్యంత వెనుకబడ్డ దొమ్మరుల గురించి రాసిండు. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన నవల 'జిగిరి' పలు దేశీయ భాషల్లోకి తర్జుమా అయింది. ఇందులో ఎలుగుబంటోళ్ల జీవితాలు చిత్రితమ య్యాయి. కులాంతర ప్రేమ - వివాహం గురించీ చెప్పిండు. ఈయనదే మరో నవల 'సంచారి' కూడా అత్యంత వెనుకబడ్డ వారి జీవితాలను ప్రతిఫలించింది.

సూర్యాపేటకు చెందిన కె.వెంకటేశ్వర్లు 'కల్లు మండువ' పేరిట గీతవృత్తికారుల వెతలను అక్షరీకరించాడు. తొలితరం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బొమ్మగాని ధర్మభిక్షం పాత్రను కథానాయకుడిగా మలిచి గౌడకులస్థుల్లోని చైతన్యానికి ఈ నవల పాదులు వేసింది. అట్లాగే సుదీర్ఘ కాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్యులుగా పనిచేసిన నమమాస స్వామి 'మోహిని' పేరిట గౌడ వృత్తిదారుల వెతలను నవలగా రాసిండు. దళిత రచయితలు,


దేవులపల్లి కృష్ణమూర్తి


పోరంకి దక్షిణామూర్తి

కళాకారులు మేధావుల వేదిక నిర్మాణం లోనూ, నిర్వహణలోనూ భాగస్వాములైన ఆచార్య నమమాస స్వామి మోహిని పేరిట నవలను వెలువరించాడు. ఇందులో గీతకార్మికురాలి జీవితాన్ని, పోరాటాన్ని చిత్రించాడు. గీతకార్మికుల ఉపాధి, వర్ణాంతర వివాహాలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని ఈ నవలను నమమాస స్వామి రాసిండు. శ్రీనివాస గౌడ్ 'బతుకు తాడు', 'దుల్దుమ్మ', 'కల్తీ బతుకులు' పేరిట గౌడ్‌ల జీవితాలను విస్తృత కాన్వాస్ పై చిత్రించిండు. అట్లాగే బహుజన యోధుడు సర్వాయి పాపన్న జీవితాన్ని ఎస్.ఎం.ప్రాణ్‌రావు 'ప్రజాజ్యోతి పాపన్న' (2015) పేరిట రాసిండు.

రజకుల జీవితాలను పి.నాసరయ్య ఉతికేసిన బతుకులు పేరిట రాసిండు. ఇందులో ఇస్త్రీ చేసుకొని బతికే చాకలి పేరయ్య వెతలను, దొంగతనం మోపబడి ఎదుర్కొన్న అవమానాలను అక్షరబద్ధం చేసిండు. అట్లాగే జి.ఎస్.చలం 'రేపు' పేరిట నవలను రాసిండు. ఇందులో రజకుల పాట్లు, పోలిశెట్టి కుటుంబం ఎదుర్కొన్న అగచాట్లను చెప్పిండు. రాయలసీమకు చెందిన అంతటి నరసింహం చాలా నవలలు రాసిండు. ఇందులో మెజారిటీగా బహుజనుల బతుకులను అక్షరబద్ధం చేసిండు. ఈయన రాసిన 'ఆదర్శం', 'లేడీ లెక్చరర్ స్వగతం', 'శంపాలత', 'మండే చంద్రుడు' నవలలన్నింటిలోనూ కులవివక్ష గురించి,

సమాజం

బహుజన బతుకుల గురించి చర్చించిండు.

కాలువ మల్లయ్య గొల్లల జీవితానికి సంబంధించి అంబేద్కరిస్టు భావజాలంతో 'సాంబయ్య చదువు' (1995), మున్నూరుకాపుల వ్యవసాయ జీవితాన్ని చిత్రిస్తూ భూమిపుత్రుడు (1991), బతుకు పుస్తకం నవలలను రాసిండు. ఈయనే రాసిన 'చీకట్లో చిరుదీపం' నాలుగుతరాల గొల్లల వెతలను చిత్రించింది. శిరంశెట్టి కాంతారావు 'పరంపర' పేరిట విశ్వబ్రాహ్మణుల జీవితాలను నవలలుగా మలిచిండు. ఎం.వి.తిరుపతయ్య రాసిన 'జీవన సమరం'లో కూడా బహుజన బతుకులు చిత్రితమయ్యాయి.

కొండూరు వీరరాఘవాచార్యులు శిల్పం, చిత్రం, విశ్వబ్రాహ్మణుల కళా నైపుణ్యాలను చిత్రిస్తూ మోహనాంగి, లేపాక్షి, కళారాధన నవలలను రాసిండు. శ్రీకృష్ణదేవరాయలు - తిరుమలాంబల పుత్రిక మోహనాంగి. ఈమె సాహిత్యంతో పాటు చిత్రకళలో కూడా నిపుణురాలు ఆమె జీవితాన్ని చిత్రకళకు ప్రాధాన్యతనిస్తూ రాసిండ్రు. అట్లాగే జక్కన కళా నైపుణ్యాన్ని కళారాధన నవలలో రికార్డు చేసిండు. అనంతపురం లేపాక్షి సౌందర్యాన్ని అదే పేరుతో నవలగా మలిచిండు. ఇందులో శిల్పుల జీవితాలను చిత్రించాడు.

అనంతపురంకు చెందిన కేంద్ర సాహిత్య అకాడెమీ గ్రహీత, నవలాకారులు బండి నారాయణస్వామి తన నవలల్లో బహుజన జీవితాలను ప్రధానంగా చిత్రించాడు. ఇందులో అవార్డు గెలుచుకున్న 'శప్తభూమి'లో కురుబల సాహసోపేతమైన పోరాటాలను, గెలుపును చిత్రించిండు. ఈయన మిగతా నవలలు గద్దలాడతండాయి, రెండు కలల దేశమ్, మీ రాజ్యం మీరేలండిలో కూడా బహుజన జీవితం చిత్రితమయింది. మీ రాజ్యం మీరేలండి' నవలలో శూద్ర కులాలకు చెందిన బోయ, వడ్డెర, కురుమ, చాకలి పాత్రలు జీవిస్తాయి. వీరితో పాటు ఆధిపత్య కులాలకు చెందిన పోరంకి దక్షిణామూర్తి 'ముత్యాల పందిరి', ముదిగంటి సుజాతారెడ్డి 'సంకెళ్ళు తెగాయి' పేరిట వరుసగా పద్మశాలి, మంగలి కులంవారి జీవితాలను చిత్రించారు. ఇవి కేవలం ఒక రేఖామాత్ర పరిచయం మాత్రమే! గతంలో తెలంగాణ నుంచి అట్టెం దత్తయ్య, వెల్దండి శ్రీధర్, పగడాల నాగేందర్, శ్రీరామోజు రఘు లాంటి అకడెమీషియన్స్ బహుజన సాహిత్యం గురించి కొంత రాసిండ్రు. బీసీ నవలా సాహిత్యంపై లోతైన పరిశోధన, విమర్శ రావాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయాలు ఇందుకు చొరవ చూపించాలి.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# ఐ మ్యాటర్

అధో జగత్తు దైన్యం చిత్రించిన కథ...



శ్రీఉహ
99630 84338

కొత్త చోటు. కొత్తగా వేసిన గుడిసె. అన్నీ సర్దుకుని బయటకొచ్చింది అంజమ్మ. పిల్లల్ని ఎవరి దగ్గర వదలాలని చూస్తుండగా సుశీలక్క వచ్చింది.

"సుతారీకి పోలే?" అడిగింది కొప్పు చుట్టుకుంటూ.

"ఇయ్యాల మేస్త్రి తోల్కపోలే. ఏడికి పోతున్నవ్?"

"అమ్మగారింటికి పనికి పోతున్న"

"యాడైతదే గంత దూరం పోవాల్నంటె నీకు? మాతో సుతారీ పనికి రా. ఇయ్యాల్టికి పిల్లల్ని నేను సూత్తలే" అంది పాపని ఎత్తుకుంటూ.

ఇద్దరివి పక్కపక్క గుడిసెలు. ఎప్పుడైనా అక్క ఇలా పిల్లల్ని చూస్కుంటూ సాయం చేస్తుంటుంది.

"అమ్మగారు మంచిది లే అక్క. ఆడ్నే చేస్కుంట. అదే పని ఈడ చేస్తే అన్ని పైసల్ రావే. ఇలాఖా బట్టి రేట్. పిల్లల్ని ఇస్కూల్లో ఎయ్యాల్నంటే పైసల్ కావాల" ఏడుస్తున్న కొడుకు నుండి చెయ్యి బలవంతంగా విడిపించుకుని చెప్పులేస్కుంది.

"ఏందో ఏమో ఈ పరేషానీ మనకి" పిల్లల్ని తీస్కుని లోనికి పోయింది సుశీల.

బస్టాప్‌కి పరుగులు పెట్టింది అంజమ్మ. చెమటలు కక్కుతోంది. జాకెట్ లో నుండి సగం పైన తడిసిన చిన్న మక్మల్ పర్సు తీసింది. షాపు వాడు బంగారం ప్యాక్ చేసిచ్చే పర్సులు. అల్మారాలు శుభ్రం చేస్తున్నప్పుడు అమ్మగారు వాటిని పడేస్తుంటే అడిగి ఒకటి తెచ్చుకుంది. బస్‌పాస్ చేయించి ఆ కార్డుతో పాటు బస్ నెంబర్ చిన్న చీటి మీద రాసిచ్చింది అమ్మగారు. నెంబర్ మరోసారి చూస్కుంది. పది నిమిషాల తర్వాత బస్సొచ్చింది.

"చెక్ పోస్ట్ పోద్దా అన్నా?" కండక్టర్‌ని అడిగింది.

"ఆ ఆ.... ఎక్కెక్కు" అన్నాడు పెన్ను చెవి వెనక్కి నెడుతూ.

"ఇయ్యాలన్నా సీట్ దొరకబడితే మంచిగుండు. ఇంటికి పోయే టైంకి కాళ్ళు గుంజుతై" అనుకుంది.

రెండు స్టాపుల తర్వాత పల్లీల బుట్ట ఎత్తుకుని ఒకామె లేచింది. కండక్టర్ కి "పాస్" అని చెప్పి వెంటనే వెళ్లి ఆ సీట్లో కూర్చుంది. కిటికీలో నుండి బయటకి చూసింది.

రెడ్ లైట్ పడింది. రోడ్డు అంతా బళ్ళు. కిక్కిరిసిన బస్సులు. మొహాల్లో అసహనం, చూపుల్లో చిరాకులు.

ఎవరో ఇల్లు మారుతున్నారు. 'గణేష్ ట్రావెల్స్' వ్యాన్ పైన సామాను పడేసు న్నాయి. పైన ఒకడు కూర్చుని సెల్ చూస్కుంటున్నాడు.

గణేష్ నగర్

యాభై గుడిసెలు ఉండేవి. ఊర్లల్లో ఏదో ఒక రకంగా నష్టపోయి, బతుకు తెరువు కోసం వచ్చి గవర్నమెంట్ ఖాళీ స్థలంలో బస్తీ లీడర్ ని పట్టుకుని వేస్కున్న గుడిసెలు. మగాళ్లు సుతారీ పనికి వెళ్తే ఆడవాళ్లు చుట్టుపక్కన కాలనీల్లో పనులకి వెళ్లేవారు. అమ్మగారిల్లు గణేష్ కాలనీకి ఆనుకుని ఉంటుంది. ఎప్పుడు అవసరమున్నా పెరటిగోడ దగ్గరికి వచ్చి 'అంజమ్మా' అని పిలిస్తే నిమిషంలో ఇంట్లో ఉండేది.

"మంచిగుంది నీ పని. యాష్ట లేకుండా దగ్గరలో ఉన్న ఇల్లు చూసుకున్నావ్" అన్నారు బస్తీ వాళ్ళు.

అంజమ్మని తన రెండేళ్ల మనవరాలి కోసం, అలాగే ఆమె చేతికింద ఉండి పై పై పనులు చేయడం కోసం పెట్టుకుంది అమ్మగారు.

ఆమె భర్త శీను. తింగరాడు. ఇద్దరు పిల్లలు పుట్టాక వదిలేసి పోయాడు. నెత్తిన పిల్లల బాధ్యత, గుండె నిండా ఆశలతో సిటీకొచ్చింది. బస్తీలో అందరికీ దిక్కు సైదులు బావ. అతన్ని పట్టుకుని గుడిసే స్కుంది. సిటీలో పైసల్ సంపాదిస్తుందని, ఉండటానికి ఇల్లుందని తెల్సుకుని వెతుక్కుంటూ వెనక్కొచ్చాడు శీను. నమ్మింది. రానిచ్చింది. సుతారీకి పోవడం, రాత్రికి తాగొచ్చి ఆమెని కొట్టడం, అమ్మగారి దగ్గర పంచాయితీలు పెట్టుకోవడం, ఏం జరగనట్టు పొద్దున్నే

క
థ

ఎవరి పనులకి వాళ్ళు వెళ్లిపోవడం షరా మామూలైపోయింది.

అలాంటి ఓ పొద్దున గుడిసె బయట చాయ్ కాస్తోంది అంజమ్మ. ఒంట్లో నీరసంగా ఉంది. ఒక పొంగుకి దించేద్దాం అనుకుంది. శీనుకి రెండు మూడు పొంగులకి మరిగి రంగు చిక్కగా మారిన చాయ్ అంటే ఇష్టం. మరో పొంగు రానిచ్చింది. ఇంతలో భూమి కపించినట్లు గడ్ గడ్ గడ్ శబ్దం. గుడిసెల్లో నుండి బయటకి రావడం మొదలెట్టారు అందరూ. ఎప్పుడొచ్చాయో తెలీదు. బుల్ డోజర్లు. వాటి వెనకే పోలీసులు. దొరికిన చెంబు తెపాల విసిరి అవతల పడేసారు. లాఠీలతో ఏది కనిపిస్తే అది నాశనం చేసారు. మట్టికుండలు పగిలిపోయాయి. తీగలకున్న బట్టలు కిందపడి మట్టిలో దొర్లాడి గుర్తుపట్టలేకుండా అయి పోయాయి. ఏం జరుగుతుందా అని లేచి నుంచుంది అంజమ్మ. వెనక నుండి ఒక లాఠీ చాయ్ గిన్నె మీద పడింది. చాయ్ కట్టెల పొయ్యి మీద ఒలికి నిప్పారిపోయింది.

"ఊ ఊ పదండి పదండి. గంటలో ఈ జాగ ఖాళీ చెయ్యాలె. చలో చలో జల్దీ." అంటున్నాడు ఒక ఖాకీ.

"ఎందుకు ఖాళీ చెయ్యాలె?" అని ఎవరో అడిగారు.

"ఇది గవర్నమెంట్ జాగ. ఈడ పార్క్ వస్తది. ఎవరూ ఉండకూడదు. పదండి పదండి."

"గంటలో ఎట్ల ఖాళీ చేస్తం? యాడకి పోతాం? ముందైనా చెప్పకపోతిరి? గిట్ల రుబాబ్ జేస్తే ఎట్ల సారూ?" ఒకడు గొంతెత్తాడు.

వాడి గూబ పగిలింది.

"మీ బస్తీ లీడర్ కు ముందే నోటీసులు పోయినయ్"

"సైదులు మాకేం చెప్పలే."

"ఏడ రా ఆడు? పొయ్యి పిలవండి."

"ఆడు ఎప్పుడో జంప్ సార్. ఈళ్ళ కాడ గుడిసెకు గింతని పైసల్ నూకి గాయబ్." అన్నాడు కాన్స్టేబుల్.

వాళ్ళ తరపున మాట్లాడేవాడు లేడు. అప్పుడే రయ్యి రయ్యి మంటూ ముందుకు వచ్చింది మూల గుడిసెలో ముసల్ది. "ఈ రుబాబు గిప్పుడు ఆపకుంటే నేను కిరసనాయలు పోస్కొని సత్తా" కొంగుచాటు నుండి డబ్బా తీసి నెత్తిన పోస్కుంది. ఖాకీలు ఆమె దగ్గరకి పరిగెత్తే లోపు నిప్పు అంటించుకుంది. బిగుసుకున్న దవడలు, ముడిపడివున్న నుదుళ్లతో ఉద్రిక్తంగా మారింది గణేష్ నగర్. కొందరు ఆమె మీద దొరికిన బట్ట, నీళ్లు చల్లారు. కొందరు ఖాకీలతో గొడవకి దిగారు. తలలు పగిలి, నెత్తురు చిందింది. ఎవరు ఫోన్ చేసారో తెలీదు, వెంటనే అంబులెన్సు వచ్చి ముసల్దాన్ని తీసుకు వెళ్ళింది. అప్పటికే ఆమె చాలా వరకు కాలిపోయింది. తర్వాత పావు గంటకి మరికొందరు ఖాకీలు వ్యాన్‌లో నుండి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. బుల్ డోజర్లు గుడిసెలని నేలమట్టం చేసి వెళ్లిపోయాయి. గంటలో తట్టబుట్టతో రోడ్డున పడ్డారంతా. చేసేది ఏమీ లేక కొత్త చోటు వెతకటం కోసం వాళ్లలో కొందరు వెళ్లారు. పెద్దమనుషులు కొందరు ముసల్దాని కోసం హాస్పిటల్‌కి వెళ్లారు. మిగిలిన వాళ్ళు రోడ్డు మీద కూర్చు న్నారు. నెత్తి మీద యాసంగి ఎండ ప్రతాపం చూపిస్తోంది. కింద డాంబర్



కథ

కాల్చేస్తుంది. దాహం, ఆకలి. పిల్లల ఏడుపులు. సామాన్ చాలా వరకు పోయింది, పాడైపోయింది.

పొగ గొట్టం ఊది ఊది ఆయాస మొచ్చి చిట్టీ వేసి సుశీల కొనుక్కున్న స్టవ్ రెండు ముక్కలైంది. చేపల అమ్మే మైసయ్య మోపెడ్, తక్కెడ, తూకంరాళ్లు కనపడలేదు. ఇక వ్యాపారం ఎలా చేస్తాడు? పూలు అమ్మే బాలమ్మ బుట్ట, గుడి దగ్గర ఇవ్వాల్సిన రెండు కేజీల గులాబీలు మట్టిపాలు అయిపోయాయి.

"ఫాల్తు గాళ్ళు. ఆగం ఆగం చేసింద్రు. ఇంకా నయం పిల్లల్ని ఏం చేయలె, ఎల్లమ్మ కాపాడింది" అన్నాడు ఒకతను.

అంజమ్మ చుట్టూ చూసింది. శీను లేడు. మొదటి లాఠీ పడినప్పుడే నేల మీద దొరికిన చొక్కా తీస్కుని గోడ దూకేసాడు. అవసరానికి వచ్చినవాడు కాస్త కష్టం వస్తే నిలబడతాడా?

"ఈని దినం జెయ్య. మల్ల పారి పోయిండు" అమ్మగారింటికి పరుగులు తీసింది.

"మీరే ఏదైనా చెయ్యాలమ్మా" అంది దీనంగా.

"ఏం చేస్తామే? అది గవర్నమెంట్ వాళ్లదంట. కొత్తచోటు కోసం వెళ్ళారుగా మీ వాళ్ళు. రానివ్వు. ఏదో ఒకటి దొరుకుతుందిలే. పిల్లల్ని కార్ షెడ్డులో కూర్చోపెట్టు. వెళ్ళేటప్పుడు నీ ఫోన్ నెంబర్ ఇచ్చి వెళ్ళు" లోనికి వెళ్ళిపోయింది అమ్మగారు.

మధ్యానానికి ముసల్ది పోయిందని వార్త వచ్చింది. వాళ్ళల్లో పెద్ద దిక్కు పోయిందని ఆ రోడ్ల మీదే గొల్లుమన్నారు. కాలనీవాళ్ళు కొంతమంది బాల్కనీల్లో నుండి తొంగి చూసి లోనికి వెళ్లిపోయారు. సూర్యుడు వెళ్ళకముందే ముసల్దాన్ని సాగనంపారు. కొత్త చోటు కోసం వెళ్లిన నలుగురు సాయంత్రానికి వెనక్కొచ్చి ఎల్లమ్మబండ దగ్గర ఇళ్ళు ఇస్తామని గవర్నమెంట్ ముందే చెప్పిందని, ఆ విషయం వీళ్ళకి సైదులు చెప్పకుండా అందరి దగ్గర డబ్బులు లాగాడని వార్త మోసుకొచ్చారు. ఇళ్ళు రావడానికి కాస్త టైం పడుతుందని చెప్పారు. సైదులుగాడి మీద కసితో ఉన్నా, మరోవైపు గవర్నమెంట్ ఇళ్ళు ఇస్తుందంటే మళ్ళీ బతుకులో ఆశ కనపడింది.

తోపుడుబళ్ల మీద సామాను, పిల్లల్ని ఎక్కించి ఎల్లమ్మబండ వరకు నెట్టుకు పొయ్యారు. ఆ రాత్రికి దొరికింది తిని ఫుట్‌పాత్ మీద పడుకున్నారు. మర్నాడు అక్కడ ఖాళీస్థలం చూసి గుడిసెలు వేసుకున్నారు. గవర్నమెంట్ ఇళ్ళు ఇచ్చే వరకు ఇక ఇక్కడే అన్నాడు కొత్త లీడర్.

'చెక్ పోస్ట్ చెక్ పోస్ట్' కండక్టర్ కేకలతో ఆలోచనల్లో నుండి బయటపడి బస్సు దిగింది అంజమ్మ. అక్కడ నుండి పది నిమిషాల నడక.

**ఖాకీలు ఆమె దగ్గరకి పరిగెత్తే లోపు నిప్పు అంటించుకుంది. బిగుసుకున్న దవడలు, ముడిపడివున్న నుదుళ్లతో ఉద్రిక్తంగా మారింది గణేష్ నగర్. కొందరు ఆమె మీద దొరికిన బట్ట, నీళ్లు చల్లారు. కొందరు ఖాకీలతో గొడవకి దిగారు. తలలు పగిలి,నెత్తురు చిందింది. ఎవరు ఫోన్ చేసారో తెలీదు, వెంటనే అంబులెన్సు వచ్చి ముసల్దాన్ని తీసుకు వెళ్ళింది. అప్పటికే ఆమె చాలా వరకు కాలిపోయింది.**

అమ్మగారింటికి చేరుకుంది.

"హమ్మయ్య. వచ్చావా? ఇంకా రాలేదేంటా అనుకున్నా. దా దా. టైంకి వచ్చావ్. కప్పు తెచ్చుకో చాయ్ ఇస్తా."

టీవీ ముందు కూర్చుంటూ, "ఎలా ఉంది కొత్తచోటు?"

"ఏమో అమ్మా. మస్త్ దూరం పడ్డది నాకు. పిల్లలు ఏడుస్తాను."

"ఎట్లా మరి? శీను చూస్తే పారిపోయాడు. నువ్వే కష్టపడి పిల్లల్ని చూస్కోవాలి. ఆడవాళ్ళం. మనకి తప్పవు ఈ బాధ్యతలు." అంది చాయ్ గుటక వేస్తూ.

అలా ఆర్నెల్లు పని చేసింది అంజమ్మ. రోజూ ఇంటికెళ్లే సరికి ఎనిమిది దాటేది. పిల్లలు ఆమె కోసం ఎదురు చూస్తా తినకుండా కూర్చునేవారు. శీను చూస్తే అడ్రస్ లేడు. పనికైతే వెళ్తుంది కానీ ఆమె మనసంతా పిల్లల మీద, ఆగిపోయిన వాళ్ళ చదువుల మీద, ఎప్పుడు ఉంటదో ఊడతదో తెలీని ఇంటి మీదుంది. అంత దూరం పోయి చేసింది చాలు, ఇక జీతం తక్కువైనా పర్లేదు, అమ్మగారింట్లో పని మానేసి దగ్గర్లో ఏదైనా చూస్కుంటే, పిల్లల్ని కనిపెట్టుకుని ఉండచ్చని నిర్ణయించుకుని అక్క సుశీల కి చెప్పింది.

"ఎంతొస్తే అంతే సాల్లే తీయ్. గంత దూరం బొయ్యి ఒళ్ళు పగలగొట్టుకునేది ఎందుకు?"

మర్నాడు బస్తీ లీడర్ వచ్చాడు.

"ఎల్లమ్మబండ కాడ మనకి డబల్ బెడ్రూమ్లు ఇస్తరట. మన పేర్లు జల్దీ జల్దీ ఆ లిస్ట్ లో రావాల్నంటే ఒక్కో ఇంటికి పదివేల వరకు అయితది. లేకుంటే ఇగ ఆ లిస్ట్‌లో ఎప్పుడొస్తే గప్పుడు, వస్తదో రాదో ఎవరికి ఎరుక? మల్ల అయిదు తారీకు వస్త. పైసల్ రెడీ చేసుకోండ్రి" చెప్పి వెళ్ళిపోయాడు.

"పదివేలా? అన్ని పైసల్ యాడ తేవాలే? ఈ నెల జీతం వచ్చినాక పిల్లల్ని ఇస్కూల్ కి పంపాలనుకుంటినే. గిప్పుడు ఎట్లనే?" అక్క దగ్గర మొత్తుకుంది అంజమ్మ.

"చేసేది ఏముంటది? మన బతుకులు గింతే. అమ్మగారి కాడే పని చేస్కో. అక్కడ పైసల్ ఎక్కువ వస్తాయ్. ఫీజుకి, ఇంటికి కట్టనీకి అడ్వాన్స్ అడుగు. నెల నెలా గింత పట్టుకోమని చెప్పు. అప్పు తీరినాక ఆడ బంద్ జేసి దగ్గర్లో పని దేవులాడుకో" సలహా ఇచ్చింది.

అమ్మగారిని అడ్వాన్స్ అడిగితే "చూద్దాం లేవే" అని మాట దాటేసింది తప్ప ఇవ్వలేదు.

"ఇయ్యాల ఎట్లైనా సరే అమ్మని అడిగి అడ్వాన్సు తెచ్చుకోవాలె. పిల్లల ఫీజు కట్టాలె. అయిదుకి మల్ల లీడర్ వచ్చే టైంకి చేతిలో పైసలుండాలె" అనుకుంటూ బస్సు దిగింది అంజమ్మ.

క
థ

తను పనికి వెళ్లేసరికి కాలనీ అంతా హడావిడిగా ఉంది. ఏంటా అని దగ్గరకి వెళ్లి చూసింది. సారోళ్లు వెనక ఖాళీ అయిన స్థలంలో ఉన్నారు. పక్కనే తెల్ల బట్టలు వేస్కుని కాగితాలతో ఆఫీసర్లు. వాళ్ళ వెనక రెండు బుల్ డోజర్లు. వాటిని చూడగానే అంజమ్మ గుండె వేగంగా కొట్టుకుంది. అమ్మగారు ఇంటికి పరిగెత్తింది.

"గుడిసెలు ఉన్నప్పుడు సరిగ్గా సర్వే చేయలేకపోయాం సార్. పార్క్ డెవలప్మెంట్ కోసం ఇప్పుడు మళ్ళీ కొలతలు వేసాం. గవర్నమెంట్ ల్యాండ్కి ఆనుకుని ఉన్న ఇళ్లన్నీ వంద అడుగుల వరకు లోనికి వచ్చేసాయి. ముందు ఇక్కడ ఇల్లు ఎవరు కట్టారో మాకు తెలీదు. వాళ్ళే వంద అడుగులు గవర్నమెంట్ ల్యాండ్లోకి ఎక్కువ వెళ్లారు. వాళ్ళని బట్టి అదే సరిహద్దు అనుకుని మిగతా ఇళ్ళు కట్టినట్టున్నారు" అన్నాడు సర్వేయర్ టేప్ చుడుతూ.

"ఇప్పుడేమంటారు?" అడిగాడు అంజమ్మ వాళ్ళ సారు.

"ఇల్లీగల్ సార్."

"ఏమైనా చేయొచ్చేమో ఆలోచించండి."

"లాభం లేదు సార్. వెంటనే పార్క్ పని మొదలెట్టాలని పై నుండి మాకు ఆర్డర్స్. నేల చదును చేయాలి. మేము వేసిన మార్కింగ్స్ బట్టి అడ్డొచ్చిన చెట్లు, గుట్ట, మీ కాంపౌండ్ వాల్స్ కూడా" ఆగిపోయి సార్ వంక, బుల్ డోజర్ల వంక మార్చి మార్చి చూసాడు.

"రండి. మా ఇంటికి వెళ్లి మాట్లాడుకుందాం. ముందు మేమే కట్టుకున్నాం లేండి" అన్నాడు సారు కాస్త మెల్లగా.

"హి హి హి, అయితే మీకు తెలీంది ఏముంది సార్? ఏదో ఒకటి మీరే సర్దండి. ఇప్పుడు కాంపౌండ్ వాల్ పడగొట్టి మళ్ళీ మళ్ళీ ఏం కడతారు?" అన్నాడు వెకిలిగా తొ్రిపన్నులో నుండి నాలుక బయటకి తోస్తూ.

కాగితాలు మరోసారి చూసి, "ఉండండి. ఇప్పుడే వస్తాను" లోపలకి వెళ్ళాడు సారు.

"అంజమ్మా, ఛాయ్" అంది అమ్మగారు.

"అట్నే అమ్మా" వంటింట్లోకి పరిగెత్తింది.

సారు లోపల చాలాసేపు ఫోన్లు మాట్లాడి బయటకొచ్చి పేపర్ చుట్టిన కట్ట ఒకటి సర్వేయర్ చేతిలో పెట్టాడు.

కాగితం తెరిచి చూసి, "హిహిహి. సంతోషం సార్."

"ముందుముందు ఇంకేం ప్రాబ్లెమ్ రాదుగా?"

"రాదు సార్. మీ జోలికి రాకుండా నేను చేస్తాగా" అన్నాడు కట్ట బ్యాగ్లో కుక్కుతూ.

"మంచిది. ఉండండి చాయ్ తాగి వెళ్ళచ్చు."

"ఓ చాయ్ కేం? ఎన్నిసార్లైనా ఓకే. ఇంతకీ ఆ గుడిసెలు సడన్గా ఎందుకు లేపేసినట్టు సార్?" కూపీ లాగాడు.

"ఆ గుడిసెల్లో వాళ్లతో చిన్న చిరాకు లేండి."

"ఏం చేసారు సార్ వాళ్ళు?" ముందుకు వొంగి అడిగాడు సర్వేయర్.

విషయం చెప్పే ముందు, "ఇంతకీ మీ పూర్తి పేరు చెప్పలేదు? అదే మీ ఇంటి పేరు" అన్నాడు సారు.

ఆయన చెప్పాడు. ఫలానా ఊరు అని చెప్పాడు.

మనవాడే అని సారుకి అర్థమైంది. చెప్పచ్చు అనుకున్నాడు.

"మా ఇంట్లో పని చేసే ఆమె భర్త. ఆడు పాత కుర్చీలు రెండు ఎక్కడి నుండో పట్టుకొచ్చి, గుడిసె ముందేసి, కాలు మీద కాలేసుకుని సెల్ ఫోన్ లో మాట్లాడటం మా బెడ్రూమ్ బాల్కనీలో నుండి రెండు మూడు సార్లు చూసాను. నేను గమనిస్తున్నాను అని తెలిసి కూడా తగ్గలేదు వాడు. నాకు చిరాకు వచ్చింది. పైగా పొద్దున లేసి బాల్కనీలోకి వెళ్తే ఆ గుడిసెలు, మాసిన గుడ్డలు, పాడు పంచాయితీలు తప్ప ఏమీ కనపడవు. ఒకటే గోల, న్యూసెన్స్. రాత్రికి రాత్రి ఫోన్లు చేసి వాళ్ళని పొద్దున్నే అక్కడ నుండి కదిలించాను."

"మా ఇంట్లో పని చేసే ఆమె భర్త. ఆడు పాత కుర్చీలు రెండు ఎక్కడి నుండో పట్టుకొచ్చి, గుడిసె ముందేసి, కాలు మీద కాలేసుకుని సెల్ ఫోన్ లో మాట్లాడటం మా బెడ్రూమ్ బాల్కనీలో నుండి రెండు మూడు సార్లు చూసాను. నేను గమనిస్తున్నాను అని తెలిసి కూడా తగ్గలేదు వాడు. నాకు చిరాకు వచ్చింది. పైగా పొద్దున లేసి బాల్కనీ లోకి వెళ్తే ఆ గుడిసెలు, మాసిన గుడ్డల, పాడు పంచాయితీలు తప్ప ఏమీ కనపడవు.

"మంచిపని చేసారు సార్. అయినా అంత పొగరేంటి సార్ వాడికి? తగ్గుంటే ఈపాటికి అక్కడే ఉండేవాళ్ళు. అసలు ఇప్పట్లో అక్కడ పార్క్ ప్రస్తావన లేదు. మీకు కోపం వచ్చిందంటే రాదా మరి? మన ముందు కుర్చీలో కాలేస్కుని ఫోన్ మాట్లాడటం పొగరు కాకపోతే ఏంటి సార్ వాళ్ళది?"

"తగ్గట్లేదండీ. చిన్నప్పుడు మనం ఊరుల్లో చూసినట్టు లేరు వీళ్ళు. మారిపోయారు."

ఇంతలో అమ్మగారు , "అంజమ్మా, చాయ్ అయ్యిందా?"

కిచెన్ డోర్ దగ్గర ఆ మాటలు వింటున్న అంజమ్మ కళ్ళు తుడుచుకుని చాయ్ ట్రే టేబుల్ మీద పెట్టి వచ్చేసింది. ఆమె కడుపు రగిలిపోయింది. ఆ ఎరుపు ఆమె కళ్ళల్లోకి చేరింది. బక్కెట్లోకి నీళ్ల విప్పింది. నీటి చప్పుడులో ఆమె ఏడుపు కలిసిపోయింది. నానబెట్టిన బట్టలని కోపం కొద్దీ ఆమె ఒంట్లో శక్తి ఆవిరైయ్యేవరకు బండకేసి బాదింది.

కాసేపటికి సర్వేయర్ సెలవు తీసుకున్నాడు. వెనక స్థలంలో ఉన్న అసిస్టెంట్తో మాట్లాడి పదినిమిషాల తర్వాత బుల్ డోజర్లు అక్కడ నుండి పంపించేసాడు.

అతను వెళ్ళాక, "ఎంతిచ్చారు ఆయనకి?" అడిగింది అమ్మగారు సార్‌ని.

"ఒకటి. ఈ విషయం బయట చెప్పకు. ముఖ్యంగా అంజమ్మకి తెలిస్తే గొడవ అవ్వచ్చు."

"అయ్యో. నేనెందుకు చెప్తా? పోతే పోయింది డబ్బు, కాంపౌండ్ వాల్ పడగొట్టక్కర్లేదు. అది చాలు. వెనక పార్కు వస్తే ఇంటికి మంచి ఎలివేషన్ వస్తుంది. ప్రశాంతంగా ఉంటుంది. కాకపోతే గుడిసెలు ఖాళీ చేయించిన కొత్తలో ఇంత నమ్మకస్తురాలు పైగా పాప కూడా అలవాటుపడ్డ మనిషి వెళ్లిపోతు ందేమో అని టెన్షన్ పడ్డాను. మన సుఖం కన్నా ఎక్కువేంటని బస్సు పాస్ చేయించి మధ్యాహ్నం అన్నం పెడుతుంటే ఆమే మానకుండా వస్తోంది. అంతే."

"అలాగే ఉండు. ఎక్కువ తక్కువ పోవద్దు. నీ పని నువ్వు చేయించుకో."

వంటింటి బయట కూర్చుంది అంజమ్మ. బాధ ఇప్పుడు అసహ్యంగా మారింది. అమ్మగారు మంచిది. బస్ పాస్ తీసిచ్చింది. అమ్మగారు మంచిది. రోజు అన్నం పెడ్తది. అమ్మగారు మంచిది. శీను తాగొచ్చి కొడితే వాడిని తిట్టి తనని కాపాడింది. అవసరం కోసం వచ్చి, కష్టం రాగానే గోడదూకి పారిపోయాడు. ఆడి బుద్ధి అంతేనని సరిపెట్టుకుంది. కాని అమ్మగారిని నమ్మింది. ఆవిడ కూడా అవసరం కొద్దీ నటించింది. సార్ తండ్రి లాంటోడని నమ్మింది. ఆమె బతుకుని రోడ్డు మీద పడేసాడు.

కాంపౌండ్ వాల్ వంక చూస్తూ ఆలోచనలో పడింది. "యాసంగి ఎండలో పిల్లల్ని, ముసలోల్లని రోడ్డున పడేసిన రోజు అమ్మగారు, సారోళ్లు బయటకి రాలే. ఎంత దూరం పోతున్నరు, తిరిగి పనికి వస్తరా లేదా అని అడిగారు తప్ప నాలుగు దినాలు కార్ షెడ్డులో అయినా ఉండనీకపోతిరే? చివరికి ముసల్ది సత్తే బాల్కనీ నుండి చూసి వెళ్లిపోయిండ్రు. వంద అడుగులు కోసం పైసల్ ఇచ్చిన సారోళ్ళు సాటి మనుషి ఒకడు కుర్చీ మీద కూర్చుంటే తట్టుకోలేక పోయిండ్రు. మా బతుకుల్ని అరటి తొక్క లా రోడ్డున పడేసి, ఒక గోడ కోసం ఏసీ గదిలో చాయ్ తాగుతూ ముచ్చట్లు పెట్టుకున్రు. ఇలాఖా బట్టి జీతం, పైసల్ బట్టి ఇజ్జత్. నియ్యత్ లేని బతుకులు" కళ్ళు తుడుచుకుంది.

ఆ సాయంత్రం, "అమ్మా, జీతం పైసల్ ఇస్తారా?"

"ఆ వస్తున్నా. ఇదిగో. లెక్క చూస్కో. మధ్యలో రెండు రోజులు రాలేదు, అది కట్ చేశాను. లెక్క పెట్టుకో" ఎప్పుడూ లెక్క తప్పనట్టు.

లెక్క చూడకుండానే వాటిని చుట్టి జాకెట్లో పెట్టుకుంది.

ఒంట్లో చేతనైతల్లేదమ్మా. రేపు పనికి రాను" అంజమ్మ నీరసంగా.

"అయ్యో. ఎలాగే రాకపోతే? నాకు రేపు బయట పనులున్నాయి. పాప దగ్గర ఎవరుంటారు?"

"మస్తు సుస్తీగా ఉందమ్మా. రాలేను."

"పోనీ కింద బస్తీలో డాక్టర్ దగ్గరకి వెళ్లి మందులు తెచ్చుకో. వంద ఇవ్వనా?" ఆశ చూపెడుతూ.

"లేదమ్మా. నాతోని కావట్లే. ఓపిక లేదు" ఆమె వలలో పడకుండా జాగ్రత్త పడింది.

"అయితే నీకు తగ్గే వరకు నీ బిడ్డని పంపు పనికి. ఎలాగో ఇంట్లోనే ఉంటోంది

"అయ్యో. నేనెందుకు చెప్తా? పోతే పోయింది డబ్బు, కాంపౌండ్ వాల్ పడగొట్టక్కర్లేదు. అది చాలు. వెనక పార్కు వస్తే ఇంటికి మంచి ఎలివేషన్ వస్తుంది. ప్రశాంతంగా ఉ ంటుంది. కాకపోతే గుడిసెలు ఖాళీ చేయించిన కొత్తలో ఇంత నమ్మకస్తురాలు పైగా పాప కూడా అలవాటు పడ్డ మనిషి వెళ్లిపోతు ందేమో అని టెన్షన్ పడ్డాను. మన సుఖం కన్నా ఎక్కువేంటని బస్సు పాస్ చేయించి మధ్యాహ్నం అన్నం పెడుతుంటే ఆమే మానకుండా వస్తోంది.

గా?" నన్నెవరు కాదనేది అనే ధీమా.

"లేదమ్మా. ఫీజు కట్టి రేపు ఇస్కూల్ తోల్తా" మొండిగా తెగేసింది.

"నాలుగు రోజులు లేటుగా జాయిన్ చేస్తే ఏం కాదులే" తేలికగా అనేసింది.

"మరి పాప ఎలానే?" ఈసారి విసుక్కుంది.

"మీ పాప డైపర్ మార్చనీకి లేట్ అయినా పర్లే అమ్మా. నా బిడ్డ సదువు లేట్ కావద్దు" రెట్టింపు చిరాకుతో అంది.

అమ్మగారు ఖంగుతింది ఆ మాటలకి. ఆమె మొహం చూడటానికి కూడా అసహ్యం పుట్టింది అంజమ్మకి.

"నా బతుకు ఆగం చేసిన్రు. ఈ ఇంటి నీడ నా బిడ్డ మీద పడనీకి లేదు" మనసులో తిట్టుకుంటూ చెప్పులేసుకుని బయటకి నడిచింది. బస్సు ఎక్కే ముందు ఫోన్లో ప్రీపెయిడ్ సిం కార్డు తీసి ముక్కలు చేసి గిరాటు కొట్టింది.

తర్వాత బస్తీ లీడర్ వచ్చాడు. ఇల్లు మంజూరు కావడానికి ఆర్నెల్ల టైం ఉంది కాబట్టి కష్టపడి నెల నెలా కడతానని అతనికి కాస్త డబ్బు చేతిలో పెట్టి ఒప్పించింది.

పిల్లలకి ఫీజు కట్టి స్కూల్ లో వేసొచ్చింది. విడిచి వస్తుంటే పిల్లలు మళ్ళీ ఏడ్చారు. ఈసారి ప్రేమగా నచ్చ చెప్పింది.

"మంచిగ సదువుకోండ్రి. ఇస్కూల్ అయ్యే టైంకి ఇంట్లనే ఉంటలే" ఇద్దరికీ చెరి అయిదు రూపాయిలు ఇచ్చి ఏమైనా కొనుక్కోమంది.

ఇంటికొచ్చి బాక్స్ కట్టుకుని, "ఓ అక్కా. సుతారీ టైం అయితాంది, పా" కేక పెట్టింది.

"ఏందే? పనికి పోలే?"

"లే ఆడ బంద్ చేసిన. సుతారీ చేస్కుంట. ఇక నా కష్టమంతా పిల్లల సదువులకే."

అక్క సంతోషంగా, "ఏందే? అమ్మగారి పనికి పోవద్దని మస్త్ గట్టిగున్నవ్ ఈ తాప?"

"మల్ల? నా పిల్లల్ని ఎవరూ కుర్చీ నుండి లేపద్దు. మంచిగ సదివించి గట్టిగ కూసోపెడ్త."

కవిత



# సమయం



స్వాతి శ్రీపాద, 82972 48988

కళ్లకు గంతలు కట్టుకున్న గానుగెద్దులా సమయం
అదే వలయ భ్రమణం అదే అలవాటుపడిన ఊహా సంక్రమణం
చర్విత చర్వణంగా ఋతువులను వెనక తిప్పుకుంటూ
ఉండుండి ఒక్కోసారి బెదిరి దాక్కున్న వసంతాలనో
తొందరపడి ముందే దిగివచ్చిన శిశిరాలనో కళ్ళెర్రజేసి బెదిరిస్తూ
దట్టంగా పెరిగిన నల్లమేఘాల మధ్య మెరుపు
తీగై కళ్ళు చెదిరే వెలుగులనూ
గుండె అదిరే ఉరుములనూ కనిపించని
మాయా మంత్ర దండంలా
పిడికిట బిగించి నియంతలా సమస్త విశ్వాన్నీ
పాదాల కింద అణిచిపెట్టిన అహం సమయం.

ఎప్పటికప్పుడు వేళ్ళు అరిగిపోయేలా దిద్దుకున్న ఓనమాలను మరచి
మసకబారిన దీపంబుడ్డి లాంటి చేతనత్వాన్ని తెల్లని ముగ్గుపొడిలా
వేళ్ళ మధ్య జారిపోయే విచక్షణతో మెరుగుపెడుతూ
పొగమంచు వెండిదీపంలో వెలిగే చిట్టి చేమంతి ఉదయాలతో
క్రీనీడ వెనకాల దాచుకున్న రహస్యపుటలను తిరగేస్తూ
రెక్కలు మొలవకుండానే దిగంబరంగా సంచరిస్తున్న
వికృతరూపాల ఆచూకీ తెలియక ఉక్కిరిబిక్కిరవుతూ
బిక్కమొహం వేస్తుంది.

మావిచిగుళ్ల కోసం ఆగలేక వేపపూత మేసి స్వరం సవరించుకు
కోయిల పాటై కోటిరాగాలు వినిపించాలని చేదు గళం విప్పి
వానకారు సంగీతాలకు వరద ముంపు తాళం వేస్తున్నట్టు
అలలు అలలుగా పరచుకున్న అత్యాశల సైకత తీరాల పైన
సాయంత్రం సాగిలపడి విశ్రమించినట్టు
వెన్నెల రూపమై తెల్లబోయిన సమయం.

రూపురేఖలూ మాటామంతీ లేని శిథిల శిల్పం కదా
ఎప్పటికప్పుడు ఎదురుచూస్తున్న జనానికి
లాలిపాట పాడుతున్నట్టే ఉంటుంది.
పొరలు కమ్మిన సమయం కళ్లకు
నువ్వా నేననే తేడా తెలియదు
వినయంగా వంగి కాళ్ళు లాగేసే
యమపాశం సమయం తస్మాత్ జాగర్త మరి.

వ్యాసం

# తెలంగాణ సాంఘిక నాటక వికాసం

**నాటి నేటి నాటకాల పరిశీలన...**



**డా॥ జె.విజయకుమార్**
98480 78109

తెలుగు సాహిత్యంలో, తెలుగువారి కళారంగంలో అంతర్భాగమైన తెలుగు నాటకరంగంలో ఒకనాడు 'తెలంగాణ' అన్నది వినకూడని పదం. ఉన్నదంతా తెలుగు సాహిత్యం, తెలుగు నాటకమే కదా! తెలంగాణ సాహిత్యం, నాటకం ఎక్కడుంది? అనేది హిమాలయమంత పెద్దప్రశ్నగా కనబడేది మనకు. ఆరు దశాబ్దాల తరువాత మళ్ళీ మనం మనదైన ఉనికిలోకి వచ్చి పరిశోధించుకుంటే సాహిత్య కళారంగాలతోబాటు తెలంగాణ నాటకానికి కూడా భారతీయ నాటకరంగ చరిత్రలో సమున్నత భాగస్వామ్యం ఉన్నట్లు తేటతెల్లమవుతుంది. 'కన్యాశుల్కం', 'వరవిక్రయం', 'చింతామణి'లే నాటకాలనీ, పరిషత్తులే నాటకరంగమని భ్రమపడిపోయిన మనం ఇప్పుడు సొంత నాటకరంగ చరిత్రను తవ్విపోసుకుంటున్నాము. తెలంగాణ నాటకరంగాన్ని నిర్వచించాల్సి వస్తే భారతీయ నాటక రంగానికి సమాంతరంగా కనిపిస్తుంది. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠి, కన్నడ, పార్సీ మరియు ఆంగ్లం వంటి బహు భాషా నాటకాలు ఈ నేలపై ప్రదర్శితమై నాటక ఉనికిని నిలుపుకుంది.

అయితే తెలంగాణ ఆవిర్భావంతో తెలంగాణ కళా వికాసానికి తలుపులు తెరుచుకున్నాయి. నాటకరంగపు గత కాలాన్ని గుర్తు చేసుకుంటూ భవిష్యత్ కాలాన్ని నిర్మించుకునే వర్తమానంలో తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ నాటక సంస్థలు కొత్త సాలుకు శ్రీకారం చుట్టాయి. ఇప్పుడు తెలంగాణ నాటకం కొత్త సొబగులద్దుకుని నవ్యత్వంతో తెలంగాణ రంగస్థలిపై ఆవిష్కరించబడుతున్నాయి.

ఒక్కసారి వెనక్కి వేళ్తే - 1843 ప్రాంతంలో చార్మినార్‌కు సమీపంలో గుల్జార్‌హౌస్ మైదానంలో "నౌటంకీ" నాటక బృందాలు విడిదిచేసి హిందీ నాటకాలను ప్రదర్శించాయి. ఈ కాలంలోనే జొరాష్ట్రియన్‌లకు పారసీ నాటకాలు, కన్నడిగులకు ధార్వాడ నాటకాలు, మహారాష్ట్రీయులకు మరాఠీ నాటకాలు, హైదరాబాదీల కోసం ఉర్దూ నాటకాలు, యురోపియన్‌ల కోసం ఆంగ్ల నాటకాలు ప్రదర్శితమయ్యాయి. 19వ శతాబ్దంలో గుల్జార్ హౌస్, రాయల్ థియేటర్, కృష్ణ ఒపెరా థియేటర్‌లు నాటక ప్రదర్శనలకోసం వేదికలయ్యాయి.

తెలుగు నాటకానికి వస్తే తెలుగు తొలి నాటకకర్తల్లో ఒకరిగా "హిందూ నాటక సమాజం" పేరుతో తొలి నాటక కంపెనీని స్థాపించిన కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి 'తెలంగాణ' వ్యక్తిగా ఆయన ప్రాతినిధ్యం వెలకట్టలేనిది. 1852లో ఖమ్మం జిల్లా విప్పలమడకలో జన్మించిన ఆయన 1880లో తొలిసారి నాటకాన్ని వ్రాసి ప్రదర్శించారు. కందుకూరి వీరేశలింగం, వావిలాల వాసుదేవ శాస్త్రిలకు సమకాలికుడుగా ఉన్న కొండుభొట్ల 31 పౌరాణిక నాటకాలు రచించి తెలుగు నాటకరంగానికి దీపధారిగా నిలిచారు. గురజాడ వ్రాసిన "కన్యాశుల్కం" 1897లో ప్రదర్శితమైంది. సరిగ్గా ఒక సంవత్సరం తర్వాత తెలంగాణలో వరంగల్లుకు చెందిన తూము రామదాసుకవి 'కాళిదాసు' నాటకాన్ని వ్రాస్తే 'సురభి' నాటక సమాజంవారు వరంగల్లులో ప్రదర్శించారు. చిలకమర్తి, తిరుపతి వేంకటకవులు, బలిజేపల్లి లక్ష్మీకాంతం వంటి కవులు పద్యనాటకాలతో విహారం చేస్తున్న సమయంలో తెలంగాణకు చెందిన 'చందాల కేశవదాసు' 1911లో "కనకతార", "బలిబంధనం" వంటి నాటకాలు రచించి బలమైన గొంతుకను వినిపించారు. 1920లో స్వాతంత్ర్యోద్యమం సాగుతున్న సమయంలో తిలక్ ప్రభావంతో ఇక్కడ నాటకరచన సాగింది. 1896 భద్రాచలం దుమ్ముగూడెంలో జన్మించిన సోమరాజు రామానుజారావు నాటకకర్తగా "తిలక్ రాయబారం" (స్వరాజ్యరథం) పేరుతో తొలి స్వాతంత్ర్యోద్యమ నాటకాన్ని రచించారు. అంతేకాదు 35కి పైగా పౌరాణిక నాటకాలు వ్రాసారు. వీటితోపాటు

"రంగూన్ రౌడి" సాంఘిక నాటకం తెలుగు నాటనే కాకుండా బర్మాలో ప్రదర్శితమై సంచలనం సృష్టించింది.

స్వాతంత్ర్యోద్యమంతోపాటు సంఘ సంస్కరణోద్యమాలు ఈ నేలను ప్రభావితం చేసాయి. కాళ్ళకూరి నారాయణరావు 1921లో "వరవిక్రయం" నాటకం రచించిన కాలంలోనే షబ్నవీసు వేంకట నర్సింహారావుచే "బాలికావిలాపం" నాటిక తెలంగాణ నాటకరంగంలో వెలుగుచూసింది. ఈ నాటిక నాటి సామాజిక స్థితులను ప్రతిబింబిస్తుంది. బాల్యవివాహం, కన్యాశుల్కం వంటి స్త్రీ దైన్యస్థితిని ఇతివృత్తంగా చేసుకుని వ్రాసారు. ఈ రచయిత నల్లగొండ కేంద్రంగా "నీలగిరి" పత్రికను స్థాపించి సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ చరిత్రలను వెలుగులోకి తెచ్చారు.

1914 నాటికే ఆర్య సమాజం, బ్రహ్మ సమాజం హైదరాబాద్‌ను ప్రభావితం చేసాయి. ఆ స్ఫూర్తితోనే అంటరానితనం నిర్మూలన, అట్టడుగువర్గాల ఉన్నతి కోసం సారథ్యం వహించిన భాగ్యరెడ్డివర్మ ప్రజా కళలతో సాంస్కృతికోద్యమాన్ని నిర్మించారు. 1920 దశకంలో సాంఘిక దురాచారాలను నిర్మూలించేందుకు నాటకాన్ని బలమైన మాధ్యమంగా ఉపయోగించారు. సాంఘిక నాటక

> **పాశ్చాత్య నాగరికత మోజులోపడిన భర్తకు భారతీయ సంస్కృతి యొక్క గొప్పదనాన్ని చెప్పి కళ్ళు తెరిపించే సారాంశంతో వ్రాసిన "నవ నాగరిక భార్య" నాటకం వారి రచనలో ప్రత్యేకమైంది. గ్రామీణ రాజకీయ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా "దుష్ట పంచాయతి" నాటకాన్ని రచించారు. స్వార్థపరులు నిరక్షరాస్యులపై ఎలా పెత్తనం చెలాయిస్తారో చెపుతూనే దేశ ప్రగతిలో పల్లెల ప్రాముఖ్యతను గుర్తించాలని వివరిస్తుంది.**



**కేవిల్ నరసింహారావు**

ప్రదర్శనలకోసం హైదరాబాద్‌లోని కృష్ణా థియేటర్, ప్రేమ్ థియేటర్లు వేదికలై "అసుర యుద్ధం" వంటి నాటకాలు ప్రదర్శితమయ్యాయి. అయితే నాటకకర్తల వివరాలు వెలుగుచూడలేదు.

1920 నుండి వెలుగుచూసిన సాంఘిక నాటక రచనలు తెలంగాణ నాటక రంగానికి బలమైన పునాదులు వేసాయి. వరంగల్ ఇనుగుర్తికి చెందిన ఒద్దిరాజు సీతారామచంద్రరావు (1887), ఒద్దిరాజు రాఘవరంగారావు(1894) సాహితీ రంగంలో విశేష సేవలందించి తెలంగాణ వైతాళికులుగా ఖ్యాతిపొందారు. ఈ సోదరద్వయం ఒద్దిరాజు సోదరులుగా గుర్తింపు పొందారు. వీరి బహుముఖీనమైన సాహిత్య సృజనతో ఎన్నో నాటకాలు వ్రాసారు. 1912లో పౌరాణిక నాటక రచనతో ప్రారంభమైనవి నాటక రచనా ప్రస్థానం. 1920 ప్రాంతంలో సాంఘిక నాటకాలకు శ్రీకారం చుట్టారు. వీరు సమకాలీన సమస్యలను వస్తువుగా చేసుకుని సాంఘిక నాటకాలుగా రచించారు. వీరు వ్రాసిన "మేనరికం" నాటకం వరకట్న సమస్యను ప్రతిబింబిస్తుంది. ఇందులో సామాజిక వరకట్న జాడ్యాన్ని రూపుమాపి, వివాహవ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని సూచిస్తూ, మేనరికం సంబంధాలు డబ్బు ఆశతో కాకుండా ప్రేమానుబంధాలకు ప్రతీకగా నిలవాలని ఇందులో ప్రబోధిస్తారు. గయ్యాళి అత్త ప్రవర్తనను ఇతివృత్తంగా చేసుకుని "మేనత్త" నాటికను రచిస్తే, స్త్రీ జాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా "మగ సంసారం" నాటకాన్ని వ్రాసారు. భార్యా భర్తలు సంసారమనే బండికి రెండు చక్రాలవంటివారని, పురుషుల్లో స్త్రీలపట్ల ఉన్న చులకన భావన తొలగాలనే ఇతివృత్తంతో సాగుతుంది ఈ నాటకం. పాశ్చాత్య నాగరికత మోజులో పడిన భర్తకు భారతీయ సంస్కృతి యొక్క గొప్పద నాన్ని చెప్పి కళ్ళు తెరిపించే సారాంశంతో వ్రాసిన "నవ నాగరిక భార్య" నాటకం వారి రచనలో ప్రత్యేకమైంది. గ్రామీణ రాజకీయ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా "దుష్ట పంచాయతి" నాటకాన్ని రచించారు. స్వార్థపరులు నిరక్షరాస్యులపై ఎలా పెత్తనం చెలాయిస్తారో చెపుతూనే దేశప్రగతిలో పల్లెల ప్రాముఖ్యతను గుర్తించాలని వివరిస్తుంది. 'ఎఋవు సొమ్ము పరువుకు చేటు' అనే సామెతకు సాక్షీభూతంగా "ఎఋవు సొమ్ము" అనే నాటకాన్ని వ్రాసారు. ఇందులో చదువుకు మించిన సంపద లేదని, అందుకు కష్టపడితే గొప్పగా రాణిస్తారని ఉదాత్తమైన ఇతివృత్తంతో రచించారు. మద్యపానం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ చెడు అలవాట్లు కలిగిన స్నేహితులపట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిణతితో చేసిన స్నేహం కలతలు రాకుండా చూస్తుందనే సందేశంతో "మైత్రీ పరిణతి" అనే నాటకాన్ని వ్రాసారు. వీరు వ్రాసిన "జమిందారు తౌరు" నాటకం జమిందారీ కుటుంబాలు వంశ ప్రతిష్ఠ అంటూ డాంబికాలకుపోయి వారు పడే బాధలను ప్రతిబింబిస్తుంది. నాటి సమకాలీన కథావస్తువును ఇతివృత్తంగా చేసుకుని ఒద్దిరాజు సోదరులు ఈ నాటకాన్ని రచించారు. వీరి నాటక రచనలు తెలుగు వాడుక భాషలో సాగినప్పటికీ తెలంగాణ యాసకు పెద్ద పీఠం వేసారు.

మరోవైపు 1930వ దశకంలో "అభ్యుదయ రచయితల సంఘం" ఏర్పడింది. వ్యక్తి ప్రాధాన్యతకు తావులేని సామాజిక సమస్యలను కవులు తలకెత్తు

కుని రచనలు చేస్తున్న అభ్యుదయవాదుల 'హవా' (గాలి) సాగుతున్న కాలమది. 1898లో హైదరాబాద్‌లో జన్మించిన హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ హైదరాబాదీ సాహితీ, సాంస్కృతిక వాతావరణంలో కవిగా, నటుడుగా, నాటకకర్తగా బహుముఖీనమై కనిపిస్తాడు. సోదరి సరోజినీనాయుడు ప్రేరణతో నాటక రంగానికి ఆకర్షితులయ్యారు. విద్యార్థి దశలోనే నటుడిగా నాటకాలను ప్రదర్శించారు. వామపక్షభావాలను అభిమానించే హరీన్ అభ్యుదయ రచనలవైపు దృష్టి సారించారు. సమాజంలో జరిగే సంఘటనలకు స్పందించే తత్వం కలిగిన ఆయన కవిత్వంతోపాటు నాటకసృజనకు శ్రీకారం చుట్టారు. ఆంగ్ల సాహిత్యంలో ప్రతిభ కలిగిన హరీన్ నాటకాలను ఆంగ్లంలో వ్రాసి ఆతర్వాత తెలుగులో అనువాదం చేయించారు. ఆయన నాటక రచనలు భారతీయ నాటకరంగంలో ప్రముఖంగా పేర్కొనబడి హైదరాబాద్ నాటక ప్రస్థానాన్ని పరిచయం చేస్తాయి. హరీన్ వ్రాసిన 'కిటికి' (ది విండో) నాటిక శ్రామికవర్గపు పోరాటాన్ని ప్రతిబింబిస్తే, "చిలుక" (ది పేరట్) నాటిక అణచివేతకు గురవుతున్న స్త్రీ తన కట్టుబాట్లను తెంచుకుని పంజరంలో నుండి స్వేచ్ఛా ప్రపంచంలోకి వెళ్ళమని ప్రబోధిస్తుంది. "కాపలాదారుని లాంతరు" (ది సెంట్రీస్ లాంతర్)లో ప్రయోజకత్వం లేని కవికంటే వంటింటి కత్తిగానో లేదా శ్రామికుడుగానో పుట్టి వేలాదిమంది శ్రామికులతో కలిసి సామ్రాజ్యాలను వణికించే శక్తిగా మారాలంటాడు. సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండాలనే సిద్ధాంతాన్ని "శవ పేటిక" (ది కాఫిన్) నాటికలో స్పష్టం చేస్తాడు. హరీన్ రచనలోని "సంధ్యా దీపం" (ది ఈవెనింగ్ ల్యాంప్) నాటిక 'ఎక్స్‌ప్రెషనిజం' అనే రచనా శిల్పంతో వ్రాసాడు. ఇందులో మనిషి చీకటి - వెలుగుల దాగుడుమూతలు వీడి వాస్తవిక లోకంలోకి రావాలని పిలుపునిస్తాడు. హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ వ్రాసిన నాటికలు వాస్తవికతకు ప్రతిరూపంగా ఆయనలోని సామాజిక స్పృహను, పరిశీలనా శక్తిని తెలియజేస్తాయి. ఆయన బహుముఖీనమైన ప్రతిభ రవీంద్రుడి ప్రశంసలందుకుంది.

శేషాద్రి రమణ కవులుగా ప్రసిద్ధి పొందిన ధూపాటి శేషాచార్యులు (1890-1940), ధూపాటి వేంకట రమణాచార్యులు(1893-1963) శాసనాలను, కావ్యాలను పరిష్కరించి విస్మృత సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చి తెలంగాణ సాహిత్య రంగాన్ని పరిపుష్టం చేసిన అగ్రగణ్యులు. అంతేకాదు పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలను రచించి తెలంగాణ నాటక రంగానికి తొలిపాదులు వేసారు. స్వాతంత్ర్యోద్యమం సాగుతున్న సమయంలో జాతీయవాదం, సంఘ సంస్కరణ, అభ్యుదయవాదాన్ని 1930-40 దశకంలో బలంగా వినిపిస్తూ ఎందరో కవులు సాంఘిక నాటకాలను రచించారు. రమణ కవుల్లో ఒకరైన ధూపాటి వేంకటరమణాచార్యులు ఆ బాధ్యతను తీసుకుని రచనలు చేసారు. ఆయన తాను వ్రాసిన నాటకాలను వరంగల్ కేంద్రంగా "అమెచ్యుర్" నాటక సమాజాన్ని స్థాపించి ప్రదర్శించారు. ఆయన 1935లో వరకట్న దురాచారాన్ని ఎండగడుతూ "విచిత్ర వివాహం" నాటకాన్ని వ్రాసారు. యువతీ యువకుల ఇష్టాలను గౌరవించి పెళ్ళిళ్ళు చేయాలని,



పొట్లపల్లి రామారావు

వారిని జాతికి ఉపయోగపడే శక్తి సంపన్నులుగా మార్చాలని ఉద్బోధిస్తారు. "చంద్రరేఖ" నాటకాన్ని బాల వితంతువుల సమస్యను ఇతివృత్తంగా చేసుకుని వ్రాసారు. బాల్యవివాహాలు, అంటరానితనం జాతికి శాపంగా మారాయని, వీటినుండి సమాజాన్ని విముక్తి చేయాలని రచయిత కోరతాడు. 5 అంకాలుగా వ్రాసిన ఈ నాటకాన్ని 1935లో హనుమకొండ కళాశాల విద్యార్థులచే పలుసార్లు ప్రదర్శించారు. 1937లో రచించిన "సుశీల" నాటకం ఆనాటి సమాజంలోని వాస్తవిక సంఘటనలను, సంఘర్షణలను ఇతివృత్తంగా తీసుకుని వ్రాసారు. "కన్యాశుల్కం" (ఓలి), "వరశుల్కం" రెండూ ఆనాటి సాంఘిక దురాచారాలే. ఈ రెండు అంశాలతో "సుశీల" నాటకాన్ని వ్రాసి ఆరోజుల్లోనే మహిళా సాధికారత చదువుతోనే సాధ్యమవుతుందని సమాజానికి సందేశమిచ్చాడు. ఈ నాటకాన్ని కళాశాల విద్యార్థులచే ప్రదర్శింపచేసారు.

వరంగల్ ఖిలాషాపురంలో జన్మించిన 'చొల్లేటి నృసింహాశర్మ' ఆయుర్వేద వైద్యుడిగా తెలంగాణలో ప్రఖ్యాతి వహించారు. 1936 కాలంలో ఆయన వ్రాసిన "భిషగ్విజయం" నాటకం ప్రతీకాత్మక ప్రక్రియలో రచించబడింది. తొలిరోజుల్లో 3 అంకాలతో వ్రాయబడిన "భిషగ్విజయం"ను 1951 నాటికి 5 అంకాల నాటకంగా రచించారు. నాటక ఇతి వృత్తాన్ని పరిశీలిస్తే ఆరోగ్య ప్రదాత ధన్వంతరి, మానవ శరీర అంగాలు నాయక పాత్రలుగా, మృత్యుదేవత, ఇతర రోగాలు ప్రతి నాయక పాత్రలుగా సృష్టించి రచయిత నాటకాన్ని వ్రాసారు. మానవుడిపై విజృంభించే రోగాలను తొలగించడానికి ధన్వంతరుణ్ణి ప్రసన్నం చేసుకోవడం, జ్ఞానేశ్వరుని సహాయంతో ఔషధరూపాలను అస్త్రాలుగా ఉపయోగించి రోగసైన్యాన్ని తుదముట్టించడం ఈ నాటకంలో ప్రధాన అంశం. 1937లో రచించిన ఈ నాటకాన్ని ఖిలాషాపురం, వరంగల్, యాదగిరిగుట్ట,

వ్యాసం

లింగాల ఘనపురంలో ప్రదర్శించబడింది. అదేవిధంగా చార్మినార్ సమీపంలోని మహారాజ కిషన్ ప్రసాద్ దేవిడీలో నిర్వహించిన హైదరాబాద్ స్టేట్ ఆయుర్వేద కాన్ఫరెన్స్‌లో "భిషగ్విజయం" నాటకం ప్రదర్శితమైంది. 1951లో జనగామ వైద్యమండలి ఈ నాటకాన్ని ప్రచురించారు.

తెలంగాణ నాటక రచయితల్లో మరుగుపడిన మాణిక్యాల్లో గవ్వా మురహరి రెడ్డి ఒకరు. నల్లగొండ జిల్లా పిల్లలమర్రిలో జన్మించిన ఆయన 1930-40 మధ్యకాలంలో చారిత్రక నాటకాలతోపాటు "కళ్యాణి", "అల్లుళ్ళ సంత" వంటి సాంఘిక నాటకాలను రచించారు. సనాతన సాంప్రదాయాలకు, ఆధునిక భావాలకు మధ్య జరిగే సంఘర్షణ "కళ్యాణి" నాటకానికి ఇతివృత్తంగా చేసుకుని అస్పృశ్యతను వ్యతిరేకిస్తూ కులాంతర వివాహాలను ప్రోత్సహించేలా రచించారు. తెలంగాణ ప్రజాసాహిత్యానికి పాదులువేసి ప్రాణం పోసినవారిలో వట్టికోట ఆళ్వారుస్వామి ఒకరు. 1935లో నల్లగొండ జిల్లా మాదారంలో జన్మించిన ఆయన నవలతోపాటు "కనువిప్పు", "చౌకబేరం", "సావాసం", "నాడు-నేడు" వంటి 10కి పైగా నాటకాలను రచించారు. 1950వ దశకంలో ఆళ్వారుస్వామి నాటి సమాజంలోని సమస్యలే తాను వ్రాసిన నాటికలకు ఇతివృత్తాలయ్యాయి. నిరక్షరాస్యత వల్ల జీవితాల్లో జరిగే నష్టాలను వివరిస్తూ స్త్రీవిద్య ప్రాధాన్యత, పెద్దల కుంచిత మనస్తత్వాలను ఎండగడుతూ యువకులు సమాజ ప్రేరకులుగా మారాలని "కనువిప్పు" నాటకంలో రచయిత వివరిస్తాడు. "చౌకబేరం", "నాడు-నేడు" నాటికలు ఆనాటి రాజకీయ, సామాజిక స్థితిగతులకు దర్పణంగా సాగుతాయి. రజాకార్లు, దొరలు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాములు, సాయుధ పోరాటం వంటి వాస్తవ రూపాలను మనముందు దృశ్య రూపకంగా ఆవిష్కరించడంలో ఆళ్వారుస్వామి సఫలీకృతులయ్యారు.

దాశరథి కృష్ణమాచార్య తన కలంతో అక్షరాలకు నిప్పురవ్వలద్ది నిజాంపై సింహగర్జన చేసిన మహాకవి. ఆయన కవిగా, కథకుడిగానే కాకుండా నాటకకర్తగా రచనలు చేసారు. 1950 దశకంలో తొలుత బుద్ధుని మార్గాన్ని అన్వేషించే నాటికలు వ్రాసిన ఆయన స్వాతంత్ర్యోద్యమ ఇతివృత్తంతో "త్యాగజ్వాల" నాటికను రచించారు. అతివాదం, మితవాదాలకు దర్పణంగా సాగే ఈ నాటికను గాంధీజీ మార్గంలోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ముగిస్తాడు.

1900 సంవత్సరంలో మహబూబ్ నగర్, ఇప్పటూరులో జన్మించిన మఠం రాచయ్య నటుడిగా, ప్రయోక్తగా రాణించారు. 1931లో గుంటూరులో

> **దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వమే తెలంగాణలో జాతీయతా భావాలను ప్రేరణ కలిగించేలా నాటకాలను వ్రాసారు. ఆ పరంపరలో ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెంకు చెందిన "కవిరాజమూర్తి" కవిగా, నవలా రచయితగా అక్షరకవాతు చేసినవాడు. ఆయన 1946లో వ్రాసిన "మార్పు" నాటకం తెలంగాణ నాటకరంగంలో విస్తృతమై కనిపించే గొప్ప రచన.**

జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఆ సమావేశాల్లో పాల్గొన్న రాచయ్య గాంధీజీని ప్రత్యక్షంగా కలిసి వారి ఉపన్యాసాలతో స్ఫూర్తిని పొందారు. ఆ ప్రభావంతో 1948లో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో "మహాత్మాగాంధీ" నాటకాన్ని వ్రాశారు. మహబూబ్‌నగర్ ప్రాంతంలో అనేకమార్లు ప్రదర్శనలిచ్చి ప్రశంసలందుకున్నారు.

1921లో వరంగల్‌లో జన్మించిన పాములపర్తి సదాశివరావు తత్త్వవేత్తగా, సాహిత్య కళా విమర్శకుడిగా గుర్తింపు పొందారు. ఆయన 1945లో వరంగల్‌లో "కాకతీయ కళాసమితి"ని ప్రారంభించి సాంస్కృతికోద్యమానికి నాయకత్వం వహించారు. సామాజిక చైతన్యానికి నాటక కళను ఒక బలమైన మాధ్యమంగా ఎంచుకుని నవ్య వీక్షణతో నాటకాలను వ్రాసారు. నాటకకర్తగా "కర్తవ్యం", "ఆత్మగౌరవం", "గోవా పోరాటం" వంటి నాటకాలు రచించారు. ఆయన నాటక కళను వినోదంతో పాటు వికాసం, భావనా, హేతువాద పార్శ్వముల అవసరాన్ని గుర్తించి నాటకరంగంలో నాటకకర్తగానే కాకుండా నటుడిగా, ప్రయోక్తగా నాటకాలను ప్రదర్శించారు.

కె.యల్.నర్సింహారావు 1923లో నల్లగొండ జిల్లా రేపాలలో జన్మించారు. 1944లో మిత్రులతో కలిసి రేపాలలో "గ్రామ వెలుగు నాట్యమండలి"ని స్థాపించి సాంఘిక నాటక ప్రదర్శనలకు తెరలేపారు. నాటకకర్తగా 50కి పైగా నాటకాలు వ్రాసి ప్రదర్శింపజేసారు. తొలుత కమ్యూనిస్టు భావజాలంతో "విప్లవశంఖం" నాటకాన్ని వ్రాసిన ఆయన ఆ పంథాను వీడి, సాయుధ పోరాటానికి వ్యతిరేకంగా "గెలుపు నీదే" నాటకాన్ని వ్రాసారు. 1948లో హైదరాబాద్ ప్రతాప్ గిర్జీ కోఠిలో జాతీయ కాంగ్రేస్ మహాసభలో ప్రదర్శించారు. రజాకార్ల నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి అప్పుడప్పుడే కోలుకుంటున్న గ్రామాల్లో అనుబంధాలతో ప్రగతి వైపు ముందుకు సాగాలని 1956లో "అడుగుజాడలు" నాటకాన్ని వ్రాసారు. భారతదేశంపై చైనా దాడిని నిరసిస్తూ కె.యల్.నర్సింహారావు "అగ్నిపరీక్ష" నాటకాన్ని వ్రాసి 1963లో రవీంద్రభారతి వేదికపై ప్రదర్శించారు. 1956లో ఆయన వ్రాసిన "క్రీనీడలు" నాటకం పరిషత్తు నాటకాల్లో విశేష ఆదరణ పొందింది. ఈ నాటకానికి ప్రముఖ సాహితీవేత్త గోపీచంద్ సమీక్ష వ్రాసారు. 1948లో "ఆదర్శ లోకాలు", 1958లో "స్వార్థం", 1957లో "కొత్తగుడి", 1961లో "తోడు నీడ", 1964లో "కొడిగట్టిన దీపాలు", "చీమలు పెట్టిన పుట్టలు"... వంటి ఎన్నో నాటకాలు వ్రాసి

ప్రముఖ నాటకకర్తగా ఖ్యాతిపొందారు. ఆయన వ్రాసిన ప్రతి నాటకం రేపాలలోని "గ్రామ వెలుగు నాట్యమండలి"లో ప్రదర్శితమయ్యాయి. పరిషత్తు పోటీలలో బహుమతులు వరించాయి.

తెలంగాణ అగ్రశ్రేణి సాహితీమూర్తుల్లో పొట్లపల్లి రామారావు ఒకరు. 1917లో వరంగల్ జిల్లాలో జన్మించిన ఆయన వట్టికోట ఆళ్వారుస్వామి, కాళోజీ సోదరులకు సహచరుడు. సామాజిక స్పృహతో తాత్విక దృష్టితో రచనలు చేసిన ఆయన 1940వ దశకంలో తెలంగాణ మాండలికంలో నాటకాలు వ్రాసారు. దొరలు పరాన్నజీవులై జనంపై పడి దర్జాగా బ్రతుకులీడ్చిన వైనాన్ని ఇతివృత్తంగా 1945లో "సర్ బరాహి" నాటికగా వ్రాస్తే, కమ్యూనిజం భావజాలంతో పోలీసులపై చేసిన తిరుగుబాటు చేసిన ఓ సామాన్యుడి పోరాటస్ఫూర్తిని 1948లో "పగ" నాటికగా రచించారు. 1949లో వ్రాసిన "న్యాయం" నాటిక తెలంగాణ విమోచనకు పూర్వం సబ్బండ వర్గాల వాస్తవ జీవితాలను ఆవిష్కరించింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అస్సాంలో జరిగిన వాస్తవ సంఘటనను స్ఫూర్తిగా తీసుకుని 1948లో "పాద ధూళి" నాటికను వ్రాసారు.

దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వమే తెలంగాణలో జాతీయతా భావాలను ప్రేరణ కలిగించేలా నాటకాలను వ్రాసారు. ఆ పరంపరలో ఖమ్మం జిల్లా మామిళ్ళ గూడెంకు చెందిన "కవిరాజమూర్తి" కవిగా, నవలా రచయితగా అక్షర కవాతు చేసినవాడు. ఆయన 1946లో వ్రాసిన "మార్పు" నాటకం తెలంగాణ నాటకరంగంలో విస్మృతమై కనిపించే గొప్ప రచన. దేశంలో స్వాతంత్ర్య పోరాటం బలంగా సాగుతున్న సమయంలో యువత మౌనం వీడి జాతీయోద్యమంలో భాగస్వామ్యం అవ్వాలని, ఈ పథంలోకి సామాన్యులను ఆహ్వానించాలనే భావనతో ప్రేరణాత్మకంగా వ్రాసారు. 1948 నవంబర్ 1న హైదరాబాద్‌లో తొలిసారి ప్రదర్శించారు.

గద్వాల ప్రాంతానికి చెందిన 'చిల్లర భావనారాయణ' కవిగా, సాహితీవేత్తగా, నాటకకర్తగా సుప్రసిద్ధులు. 1946 నాటికే రజాకార్ల మూవ్‌మెంట్, మిలటరీ ప్రభుత్వంలో ప్రత్యక్షంగా చూసిన అనుభవాలతో "దేశద్రోహం" పేరుతో తొలి నాటకం రచించారు. ఆయన నాటక ప్రదర్శనలకోసం హైదరాబాద్ కేంద్రంగా 1948లో "నవ్య కళాసమితి"ని ప్రారంభించారు. "ఆంధ్ర నాటక కళా పరిషత్తు" పోటీల్లో ఆయన వ్రాసిన "ఉమర్ ఖయ్యాం" నాటకం ఉత్తమ నాటక రచనగా బహుమతి పొందింది. "యోగి వేమన" నాటకంగా వ్రాస్తే తెలుగునాట మరియు మద్రాసులో వందకు పైగా ప్రదర్శనలతో ప్రశంసలందుకుంది. భావనారాయణ రచయితగా "అగ్ని గుండెలు", "మట్టే బంగారం", "జీవన శిఖరం", "పదవులు-పెదవులు", "ఉప్పెన", "కొత్త మనిషి" వంటి నాటకాలు వ్రాసారు. తర్వాత కాలంలో సినిమా రంగంలో అనేక చిత్రాలకు కథను అందించడంతోపాటు, మాటలు, పాటలు వ్రాసారు.

1912లో మెదక్ జిల్లాలో జన్మించిన వెల్దుర్తి మాణిక్యరావు తెలంగాణలో కథకుడిగా, రచయితగా, గ్రంథాలయో ద్యమ సారథిగా ఖ్యాతి గాంచారు. ఆయన "దయ్యాల పండుగ" పేరుతో నాటకం వ్రాసారు. తాగుడుకు మనిషి బానిస కావడం వల్ల జీవితం ఎలా పతనమ వుతుందో తెలంగాణ మాండలికంలో రచించారు. అంతేకాదు తెలంగాణ నేపథ్యంలో వ్రాసిన "మల్లి", "చేనుకాడ", "మంచం మీద" నాటికలు రేడియోలో ప్రసారమయ్యాయి.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ నిజాం ప్రాంతం అస్వతం త్రంగా సాగుతున్న రోజులవి. ఇక్కడ దొరల, భూస్వాముల దాష్టీకాలు, రజాకార్ల దోపిడీలు ప్రజలను తిరుగుబాటువైపు మళ్ళించాయి. సాయుధ పోరాటం సాగుతున్న దశ అది. సరిగ్గా అదే సమయంలో " 'కళ' కళకోసం కాదు అది ప్రజల కోసం" అనే నినాదంతో 1943లో "ప్రజా నాట్యమండలి" (ఇప్టా) ఆవిర్భ వించింది. ఈ సంస్థ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో జానపద కళలను, నాటకాలను ఆయుధంగా మలచుకుని ప్రజా చైతన్యానికి కృషి చేసింది. 1942లో షేక్ బందగీని, దొడ్డి కొమురయ్యను హత్య చేయించిన విసునూరి రామచంద్రారెడ్డి లాంటి భూస్వాముల దౌర్జన్యాలను ఇతివృత్తంగా చేసుకుని 1947లో సుంకర వాసిరెడ్డి "మాభూమి" నాటకంగా వ్రాసారు. ఈ నాటకం తెలంగాణ ప్రాంతంలో శక్తిమంతంగా ప్రదర్శితమై ప్రజలను ఉత్తేజితులను చేసింది. ఈ నాటకానికి పూర్వమే "ముందడుగు" నాటకం వ్రాసి ప్రదర్శించారు. ఈ రెండు నాటకాలను నాటి ప్రభుత్వం నిషేధించింది. "భూమికోసం", "పోరుగడ్డ", "ఆసామి", "గెరిల్లా", "వీర తెలంగాణ"....వంటి నాటకాలను తెలంగాణలో ప్రదర్శించి "ప్రజా నాట్య మండలి" సంచలనాలకు కేంద్రబిందు వయ్యింది. వీరు ప్రదర్శించే నాటకాలకు ప్రజల్లో విశేష ఆదరణ ఉండేది.

హైదరాబాద్ విమోచనోద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన 'హీరాలాల్ మోరియా' తొలితరం కథకుల్లో ఒకరు. ఆయన ఇతర సాహితీ రచనలతోపాటు రెండు సాంఘిక నాటకాలను కూడా వ్రాసారు. 1950-1960 దశకంలో ఇవి వెలుగుచూసాయి. ఆయన వరకట్న దురాచారాన్ని నిరసిస్తూ "నల్లబంగారం" నాటకాన్ని వ్రాసారు. బాహ్యసౌందర్యం కంటే ఆత్మసౌందర్యం గొప్పదని వివరిస్తూ సమాజంలో విశాల దృక్పథంతో ముందుకు సాగాలని వివరిస్తూ భార్యా భర్తలు భిన్నమైన అభిప్రాయాలతో సాగించే సంసారం కుటుంబంలో వచ్చే కలతలను "సమాంతర రేఖలు" నాటకంగా వ్రాసారు.

1947లో బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి "ప్రతీకారం" నాటికను రచించి ప్రదర్శించారు. హుజూర్‌నగర్‌కు చెందిన రామకవచం రంగస్థలంపై నాటకాలను

ప్రదర్శిస్తూనే నాటక రచన చేసారు. చైనా, భారత్‌పై దురాక్రమణ చేసిన సమయంలో “కాడిగట్టు” నాటకాన్ని వ్రాసారు. గ్రామాల్లో గట్టు తగాదాలను ఆధారంగా చేసుకుని చైనా దాడికి ముడిపెడుతూ ఈ నాటకాన్ని రచించారు. పల్లా దుర్గయ్య 1955లో “మాయారోగం” నాటికను వ్రాసారు. కట్నం డబ్బుకోసం ఆశపడే తండ్రి, ప్రేమ వివాహం చేసుకోవాలనే కొడుకు మధ్య ఆసక్తికరంగా సాగే నాటిక ఇది. వందేళ్ళు జీవించేకంటే దేశ స్వాతంత్ర్యం కోసం వీరుడుగా చావడం మేలని, ఆ స్ఫూర్తితో స్వాతంత్రోద్యమంలో పాల్గొనాలని ఉద్బోధించే “రాజ్యశ్రీ” నాటకాన్ని వానమామలై వరదాచార్యులు 1964లో తెలంగాణ మాండలికంలో వ్రాసారు. 1916లో నల్లగొండలో జన్మించిన ధరణికోట శ్రీనివాసులు “తారుమారు” నాటికను మరియు వరంగల్‌కు చెందిన బి.యల్. నర్సింహారావు “కులం” నాటికను తెలంగాణ మాండలికంలో వ్రాసారు.

తెలంగాణలో శాసనాల శాస్త్రిగా పేరొందిన బి.ఎన్. శాస్త్రి 1932లో నల్లగొండ జిల్లాలో జన్మించారు. ఆయన చరిత్ర శాసనాల పరిశోధకుడిగానే కాకుండా చారిత్రక గ్రంథాలు, నవలలను, నాటికలను వ్రాశారు. బి.ఎన్.శాస్త్రి 1950 ప్రాంతంలో “గ్రామ జీవనం”, “కిరాయిదారు”, “సహకారం”, “నిర్బంధ విద్య” వంటి నాటికలను రచించారు. వీరి నాటక రచనలు సృజనాత్మకతకు అద్దం పడతాయి. రచయిత సంఘంలో ఉన్న భిన్న మనస్తత్వాలను ఎత్తిచూపుతూనే సామాజిక స్పృహతో పరిష్కారాలను చూపుతారు.

తెలుగు నాటకరంగంలో పరిషత్తు నాటకరంగం 1960 ప్రాంతంలో పురుడుపోసుకుంది. ఆ ప్రభావంతో తొలిరోజుల్లోనే తెలంగాణలోని నాటక రచయితలు సాంఘిక నాటకాలు వ్రాయడం మొదలుపెట్టారు. ఆ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శ్రీరంగం శ్రీధరాచార్య 1960 ప్రాంతంలో “ప్రతిధ్వనులు”, “ప్రతిబింబాలు” నాటికలను రచించారు. ఈ రెండు నాటికలు నాటక పరిషత్తుల్లో ఉత్తమ రచనలుగా బహుమతులందుకున్నాయి. 1950లో హైదరాబాద్‌లో జన్మించిన శశిమోహన్ కొత్తదనంతో నాటక రచనలు చేసి తెలంగాణ ముద్రను చాటాడు. 1972లో మొదటగా వ్రాసిన “మంచితనం మరోసారి చచ్చింది”, “మరో శవం పుట్టింది” నాటకాలు తెలుగు నాటకరంగంలో ఆయనకు గుర్తింపును తెచ్చిపెట్టాయి. ఈ పరంపరలో “పోస్ట్‌మార్టమ్”, “ఫర్ సేల్”, “కోహినూర్”, “మాకు శాంతి కావాలి”, “ఆలీబాబా అద్భుత దీపం” వంటి నాటికలు, “రాధా మాధవీయం”(స్త్రీ నాటిక), “కాగితం పులి” నాటకం రచయితగా ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. వీరి రచనలు ఆధునిక తెలుగు నాటక చరిత్రలో రేఖామాత్రంగానైనా పేర్కొనలేదు.

1966లో ప్రారంభమైన “ఆర్ట్ లవర్స్” ఓ సాంస్కృతిక సంస్థగా జానపదకళల్ని, నాటకాలను ప్రజల్లో విప్లవచైతన్యానికి ఉపయోగించారు. క్రమంగా ఆ సంస్థ 1971లో “జననాట్యమండలి”గా రూపు దిద్దుకుని విప్లవభావాలవైపు మళ్ళింది. ఆ ప్రయాణం దశాబ్దాలపాటు సాగి కేవలం తెలంగాణలోనే కాదు యావత్ భారత జాతిని ప్రగతిశీల భావజాలాన్ని ప్రేరేపించేలా చేసింది. తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రసిద్ధ సినీ దర్శకుడు బి. నర్సింగరావు అధ్యక్షుడుగా ఉన్న ‘జన నాట్యమండలి’లో గద్దర్, భూపాల్, చెరబండరాజు వంటి ఎందరో కవులు, కళాకారులు నాటకాన్ని ప్రజా చైతన్యానికి ఉపయోగించారు. జానపద రూపకాలతోపాటు నాటకాన్ని ఆయుధంగా మలుచుకున్నారు. ఇందులోని కళాకారులు స్వయంగా రచయితలు, నటులు కూడా. రెడ్డి చినవెంకటరెడ్డి రచించిన “పొత్తుల వ్యవసాయం”, “బీదల పాట్లు” నాటకాలు వేలాదిగా ప్రదర్శించారు. వీటితోపాటు “తెలంగాణ భాగవతం”, “నరుడో-భాస్కరుడో”, “కొత్త మనిషి”, “రైతు కూలీ విజయం”... వంటి నాటకాలు తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలలో ప్రజల్ని విశేషంగా ప్రభావితం చేశాయి. జన నాట్యమండలిలో ప్రధాన పాత్రను పోషించిన చెరబండరాజు పూర్వపు హైదరాబాద్ జిల్లాకు చెందిన అంకుశాపూర్‌లో బద్దం భాస్కర్ రెడ్డిగా జన్మించి 1960 దశకంలో దిగంబర కవులలో ఒకడిగా తెరమీదకు వచ్చాడు. “కొండలు పగలేసినం, బండలను పిండి చేసినం - మా నెత్తురు కంకరగా ప్రాజెక్టులు కట్టినం” వంటి పాటలతో విప్లవ బావుటాను ఎగరేసిన చెరబండరాజు పదివరకు నాటకాలను, నాటికలను రచిస్తే కొన్నింటిని ‘జననాట్యమండలి’ ప్రదర్శించింది. 1970-80 దశకంలో వీరు వ్రాసిన నాటకాలు విప్లవోద్యమాలను తట్టి లేపుతాయి. “గ్రామాలు మేల్కొంటున్నాయి”, “గంజి నీళ్ళు” నాటకాలుగా వ్రాస్తే “పల్లె పిలుస్తుంది”, “వెన్నెల్లో మంటలు”, “సంఘర్షణ”, “టెంపరరీ లేబర్” వంటి నాటికలు రచించారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడుగా, తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల శాఖ అధిపతిగా సేవలందించిన డా॥ పి.వి. రమణ నాటకకర్తగా 1958-65 కాలంలో పలు నాటకాలు వ్రాసారు. జీవితంలో ఓడిపోయి, అస్వస్థులైన ఐదుగురు పేషంట్లు పాత్రలుగా చేసుకుని ఓడిపోయిన వారి జీవితాలను బాగుచేయాలనే డాక్టర్, వారికి అండగా నిలిచే సిస్టర్ పాత్రల మధ్య ఆసక్తికరంగా సాగే కథతో “వెంటాడే నీడలు” నాటకాన్ని ప్రయోగాత్మకంగా వ్రాసారు. అలాగే “ఆకురాలిన వసంతం”, “మాంగళ్యానికి మరో ముడి”, “చలిచీమలు”, “మృత్యు నీడ”, “మహస్సు”, “ధర్మదేవత”, “పగ”... వంటి నాటకాలు రమణకు పేరు తెచ్చిపెట్టాయి.

తెలంగాణ ఉద్యమంలో నీటి లెక్కలను విడమర్చి చెప్పిన జల నిపుణుడు ఆర్. విద్యాసాగర్ రావు నటుడిగా, నాటక రచయితగా,

ప్రయోక్తగా చెరగని ముద్ర వేశారు. 1960-75 ప్రాంతంలో రెండు నాటకాలు, పది నాటికలు రచించారు. స్వరూపం పురుషుడు, స్వభావం స్త్రీ పాత్రను సృష్టించి "గుడ్ బై" నాటకాన్ని వ్రాస్తే, వికటించిన వ్యక్తిత్వాలకు పరివర్తన వైపు దారిని చూపే సందేశంతో "క్షంతవ్యులు" నాటకం వ్రాశారు. "దేవుడయ్య" నాటికలో దేవుడుగా కీర్తించబడే వ్యక్తి అసలు రూపాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తారు. "గంధర్వులే తీరుస్తారు" నాటికలో పెద్దతరం-చిన్నతరం మధ్య ఉండే అంతరాన్ని ఆవిష్కరిస్తారు. ప్రముఖ హిందీ నాటక రచయిత శంకర్‌శేష్ "కిస్సా కుర్సీకా" స్కిట్‌ను ఆధారంగా చేసుకుని "ఓ ఆఫీసు కథ" నాటికగా వ్రాసారు. తెలంగాణ జానపదాల్లో ఉండే పగటి వేషగాడి జీవన చిత్రాన్ని "కొత్తదారి" నాటికలో ఆవిష్కరిస్తారు. వీటితోపాటు "వార్షికోత్సవం", "ఆవ్‌కీ అదాలత్" నాటికలను రచించారు. 2017లో ఆర్. విద్యాసాగర్‌రావు నాటక రచనలను "తెలంగాణ థియేటర్ రీసెర్చ్ సెంటర్" పుస్తకంగా ప్రచురించి వారి నాటకాలను రవీంద్ర భారతి వేదికపై ప్రదర్శించింది.

వరంగల్‌కు చెందిన డా॥ వనం మధుసూదన్ 1972లో "అమ్మయ్యో గాంధీ బ్రతికాడు", "రుణం తీరి పోయింది", అంటరానివాళ్ళు", "జీర్ణ జీవితాలు"... వంటి నాటకాలను సామాజిక స్పృహతో రచించారు. వల్లంపట్ల నాగేశ్వర్ రావు హేతువాద దృక్పథంతో "రాతి బొమ్మ", "ముదిరిన రోగం" నాటికలు వ్రాస్తే అభ్యుదయ భావ జాలంతో "ఎలచ్చన్లొచ్చినయ్", "ఎట్లత్తరో సూత్త" వంటి నాటికలను రచించారు. డా॥ వీరాచారి వ్రాసిన "సమాంతర రేఖలు", "వర్ణమాల", "ఆషాఢమాసం", "ఓట్లు-నోట్లు" నాటికలు, అంకం లింగమూర్తి వ్రాసిన "శాపగ్రస్తులు", "గబ్బిలాలు", "విముక్తి" వంటి నాటికలు తెలంగాణ నాటకరంగ చరిత్రలో ప్రత్యేకంగా పేర్కొనదగినవి.

నల్లగొండకు చెందిన ముదుంబై వెంకట నర్సింహాచార్యులు చైనా యుద్ధం నేపథ్యంలో 1961లో "ద్రోహం" నాటికను వ్రాసారు. వారి కుమారుడు ముదుంబై పురుషోత్తమాచార్య ప్రఖ్యాత తొలి నాటకకర్త 'చందాల కేశవదాసు'పై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టాను పొందారు. ఆయన "ప్రభాతభేరి", "ఎవరికోసం", "ఇదే బాట", "సమాజ నేత్రాలు" వంటి నాటికలు రచించారు. కరీంనగర్‌కు చెందిన రావుల పుల్లాచారి కథా రచయితగా, నాటక రచయితగా గుర్తింపు పొందారు. ఆయన వ్రాసిన "రచ్చబండ", "మనసు చెక్కిన శిల్పం", "గంగిగోవు పాలు"... వంటి 10 నాటికలు రచిస్తే, వీరు వ్రాసిన కొన్ని నాటికలు పరిషత్తు నాటకాల్లో బహుమతులందుకున్నాయి.

తెలంగాణ నాటకరంగంలో ప్రయోగాత్మక నాటకాలకు తెరతీసిన వారిలో తొలితరంలో పసుపులేటి పూర్ణచందర్ రావు, దెంచనాల శ్రీనివాస్ ప్రముఖంగా కనిపిస్తారు. ఖమ్మంకు చెందిన పసుపులేటి పూర్ణచందర్ రావు 'విముక్తి' నాటకరంగ సృష్టికర్త 'అగస్తొబోల్' ప్రభావంతో తెలంగాణలో ప్రత్యామ్నాయ నాటకరంగం వైపు దృష్టి సారించాడు. 'టూ ఆఫ్ 69 రెగ్యులేషన్' వల్ల భూములను పోగొట్టుకుని బాధలు పడుతున్న గిరిజనుల వాస్తవ సంఘటనలతో మొదట "మన్నెం" నాటకాన్ని వ్రాశారు. 1991లో బాధితులైన గిరిజనులచే ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కాలేజ్ ముందు ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ప్రజల సమస్యలను ఇతివృత్తంగా చేసుకుని "పిపీలికం", "మనువు-మనిషి" వంటి నాటకాలను వ్రాసి సామాజిక స్పృహ కలిగిన రచయితగా బలమైన ముద్రను చాటారు.

ఈ పరంపరలోనే ఆధునిక కవిగా గుర్తింపు తెచ్చుకున్న దెంచనాల శ్రీనివాస్ 'హబీబ్ తన్వీర్' ప్రభావంతో 1990వ దశకంలో ఆధునిక నాటకం వైపు ఆకర్షితులయ్యారు. "జనపదం" రిపర్టరీని స్థాపించి నాటకాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శిస్తూనే ఆయన కొన్ని నాటకాలను రచించారు. మొదటగా "మావా నాటే మావా రాజ్" (మా ఊర్లో మా రాజ్యం) నాటకాన్ని వ్రాసి ప్రదర్శించారు. ప్రఖ్యాత కథా రచయిత కేశవరెడ్డి వ్రాసిన "మూగవాని పిల్లనగ్రోవి" నవలను నాటకీకరించి ప్రయోగాత్మకంగా రంగస్థలంపై ఆవిష్కరించారు. దళిత పురాణం ఆధారంగా "ఆదిశక్తి" నాటకాన్ని, గోండు వీరుడిపై "కుమ్రం భీమ్ కల" నాటకాన్ని రచించారు. వీటితోపాటు ఇతర భాషల్లోని నాటకాలను తెలుగులోకి అనువాదం చేసి ప్రదర్శించిన దెంచనాల శ్రీనివాస్ తెలంగాణలో ఆధునిక నాటకరంగ ఉనికి కోసం తపిస్తున్న వారిలో ఒకరుగా పేర్కొనవచ్చు.

తెలంగాణ ఆట, పాట 'తెలంగాణ సాధన'లో ప్రముఖపాత్రను పోషిస్తే, నాటకం తనవంతు బాధ్యతగా ఉద్యమంలో భాగంగా నిలిచింది. తెలంగాణ కోసం త్యాగం చేసిన అమర వీరులను జ్ఞాపకం చేసుకుంటూ సీమాంధ్రుల కుట్రలను ఎండగడుతూ తెగించి కొట్లాడితే తెలంగాణ సాధిస్తాం అనే సందేశంతో డా॥ కోట్ల హనుమంత రావు "జంగ్ సైరన్" వీధినాటికను వ్రాసి ఇందిరాపార్క్ దగ్గర ప్రదర్శించారు. వీరు తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని మరింత రగిలించే విధంగా "పండగొచ్చింది", "పిచ్చి కుక్క" వంటి నాటికలు వ్రాసి ప్రదర్శించారు. ఇదే క్రమంలో డా॥ కుమారస్వామి 2011లో సీమాంధ్ర టీవీ ఛానల్స్ తెలంగాణ ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించడానికి చేసిన కుట్రలను వివరిస్తూ "ఇంకెన్నాళ్ళు" నాటికను వ్రాసారు. తెలంగాణ ఇతివృత్తంతో "వీర తెలంగాణ" నాటికను వ్రాసి ప్రదర్శించారు.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత చరిత్ర చెప్పని నాటక గణితాన్ని గత కాలపు వల్మీకం నుండి ఒక్కొక్కటి లెక్కలేసుకుంటూ మనచరిత్రను లిఖించుకుంటున్న సమయమిది. తెలంగాణ ప్రభుత్వం నాటకరంగానికి టార్చ్‌బేరర్‌గా నిలిచి నవ్య నాటకాలను ప్రోత్సహిస్తున్నది.

కవిత

# బతుకమ్మ - గజల్



**కల్లెం నవీన్‌రెడ్డి, 9963691692**

పూవులనే దేవతలుగా పూజించే పండగనే బతుకమ్మ!
సంస్కృతిని, సాంప్రదాయాలను తెలిపే పండగనే బతుకమ్మ!!

తంగేడు, గునుగు పూవులతో బతుకమ్మను పేర్చి!
తీరొక్క పాటలతో ఆకట్టుకునే పండగనే బతుకమ్మ!!

ఆడకూతుళ్ళ గజ్జెల సప్పుల్లలో, గాజుల సప్పుల్లలో!
ప్రతి హృదయం నిండా కొలిచే పండగనే బతుకమ్మ!!

చప్పట్ల నినాదాలతో సమైక్యత నాదాన్ని వినిపిస్తూ!
మేమంతా ఒక్కటనే సందేశమిచ్చే పండగనే బతుకమ్మ!!

ఎక్కడున్నా ఈ గడ్డ ఆచారాలను మరవదు "నవీన్"!
ప్రపంచవ్యాప్తంగా ఆదరిస్తున్న పండగనే బతుకమ్మ!!



# పర్దేశి

దండాలు పరదేశి ప్రణయం...



సూర్యా ధనంజయ్
9849104187

**చు**ట్టూ రాళ్లను పేర్చుకొన్న కొండలు. ఒకదానితో ఒకటి ముడివేసుకున్నట్టుగా ఉన్న గుట్టలు. వాటిని అనుసంధానం చేస్తున్న తుంగభద్ర. ఇవన్నీ అందని ఆకాశంతో అల్లుకుపోయినట్లున్నాయి. ఈ ప్రకృతి సోయగాల నడుమ శిల్పవేదికలపై శరీరంలోని సగం కూలిపోయి నిలబడ్డ అందమైన ఆలయాలున్నాయి. వాటిపై తీరొక్క పువ్వులు పూసినట్లున్న శిల్పాలు అలనాటి చరిత్రకు నిలువెత్తు ఆనవాళ్లై కనిపిస్తున్నాయి. అక్కడక్కడా చెట్ల నీడల్లో చరిత్రను సాబాదు, మార్బుల్ ప్లేట్లమీద చదువుతూ పరీక్షగా శిల్పాల గుండెచప్పుడును వింటున్న శోధక జనాలు, పర్యాటకులు దర్శనమిస్తున్నారు. అదీ ఇంకేదో కాదు గుండె గుప్పిట్లో అందమైన శిల్ప సౌందర్యాన్ని నింపుకున్న హంపి నగరం. రత్నాలను రాసులుగా పోసి అమ్మిన బజార్ల మండపాలు అలనాటి కృష్ణరాయల చరిత్రకు మౌన సాక్ష్యాలుగా కనబడుతున్నాయి. మిట్ట మధ్యాహ్నం ఎండ మండిపోతున్నది. విరూపాక్షుని గుడికి కోసు దూరంలో ఉన్న రఘునాథస్వామి ఆలయ పరిసరాల్లో ఎత్తైన బండలు తప్ప చుక్కనీరు లేదు. చెట్లు వయసైపోయిన ఆకుల్ని రాల్చుకొని మోడువారి నిలబడ్డాయి. ఆకాశం కూడా ఎండ ధాటికి తట్టుకోలేకపోతున్నదన్నట్టు కనిపిస్తుంది.

తలపై నుండి కారే చెమట ప్రవాహాన్ని చేతితో తుడుస్తూ, కర్చీఫ్‌తో ముఖంపై మాటిమాటికి పూతను వేస్తూ కొండ ఎక్కుతున్నాడు రాబర్ట్ మిక్. ఒంటి నుండి కారే చెమటతో అప్పటికే అతని బట్టలు తడిసిపోయాయి.

వేడిగాలుల తాకిడికి ఆయాసం వచ్చిందేమో! అక్కడే ఉన్న ఒక తుమ్మ చెట్టు కింద  ఉన్న సమాంతరమైన బండమీద కూలబడ్డాడు. కళ్ళు తిరుగుతున్నాయి. దాహం కడుపును దేవేస్తుంది. తనవద్ద ఉన్న వాటర్ బాటిల్ వైపు ఆశగా చూశాడు. అందులో నీళ్లు అప్పటికే అయిపోయాయి. దాన్ని కోపంతో దూరంగా విసిరివేసి "షిట్, డ్యామిట్" అంటూ ఒక తీవ్రమైన నిట్టూర్పును విడిచాడు. లేచి నడుద్దామంటే కాళ్ళు సహకరించడం లేదు. ఆ బండరాయి పాన్పు మీదనే  వాలిపోయాడు. నిస్సత్తువ కారణంగా అతని కళ్ళు మూతలు పడ్డాయి. పర్యాటకులు కూడా ఎవరూ ఆ మార్గంలో రావడంలేదు. ఎటు చూసినా అంతా నిశ్శబ్దం. ఒక్క కీచురాళ్ళ కిర్రు శబ్దం తప్ప.

ఆ సమయంలో "బొమ్మలూ! అందమైన మట్టిబొమ్మలూ! దేవుని బొమ్మలు, పిల్లల ఆట బొమ్మలు... ఓ సారు... బొమ్మలు కావాల్నా" అంటూ కన్నడంలో ఆశగా పిలిచే జమ్మిబాయి పిలుపు రాబర్ట్ చెవుల్ని భేదిస్తున్నది. అంతరాల్లో దాగున్న చేతనాన్ని మేల్కొలిపి అతన్ని ఈ లోకంలోకి తీసుకొస్తున్నది. అతను అప్పుడే స్పృహలోకి వస్తుండడం చూసింది. అతను ఎండకు తట్టుకోలేక పడిపోయాడని ఆమెకర్థమైంది.  ఆమె తట్టి లేపుతుంటే మెల్లగా కన్నులు తెరుస్తూ అతికష్టం మీద "వాటర్, వాటర్" పెదాలు మాట తప్పుతుంటే పలికాడు. వెంటనే అతన్ని లేపి కూర్చోబెట్టి తాను తెచ్చుకున్న నీటి బుంగని అతని పెదాలకు అందించింది. నీటి చలువ తాకిన భూమిలో చలనం పుట్టినట్టు రాబర్ట్ దేహంలోనూ చలనం వచ్చింది. గుటా గుటా మంటూ నీళ్లు తాగాడు. పాపం అన్నం కూడా తిన్నాడో లేదో అనుకున్న జమ్మి వెంటనే బుట్టలో అడుగున గుడ్డలో చుట్టబడిన జ్వారేర్ బాటి (జొన్నరొట్టె)ను తీసి తినమని ఇచ్చింది. ఆకలిమీద ఉన్న రాబర్ట్ ఆవురావురు మంటూ ఆ రొట్టెను తిని, కమ్మటినీళ్ళు తాగాడు. అతని ప్రాణం లేచివచ్చింది. నరాల్లో మళ్ళీ రక్తం పరుగులు తీయడం మొదలైంది.

"థాంక్స్. థాంక్స్ అ లాట్. హూ ఆర్ యూ? ఐ డోంట్ నో. బట్ యూ ఆర్ ద గాడ్ సెంట్ గాడెస్. అన్నాడు. బంజారా, కన్నడం, కొంత తెలుగు తప్ప ఏ భాషా తెలియని జమ్మి ముఖంమీద వేలేసుకొని "ఏంటి, ఏంటి ఏమంటున్నావు" అంటూ

కథ

బంజారా భాషలో అంది. తన భాషను అర్థం చేసుకోలేని ఆమె పరిస్థితి అతనికి అర్థమైంది. వెంటనే పర్స్‌లోంచి ఐదు వందల నోటు ఒకటి బయటికి తీసి ఇవ్వబోయాడు.

"వద్దు వద్దు నాకు డబ్బులొద్దు. నువ్వే ఉంచుకో. పర్దేశి లెక్క కనబడుతున్నావు. మందిరంలోకి రా. అక్కడ చల్లని నీడ ఉంది" అంటూ బుట్ట ఎత్తుకోబోయింది. ఆమె అనే మాటలు అతనికి అర్థం కాలేదు. ఆమె మాటల్లోని భావం మాత్రం అర్థమైంది. ఆమెను అలా చూస్తుండి పోయాడు. ఆమె రఘునాథుని ఆలయం వైపు కదిలిపోతుంటే ఆమె కాలి గజ్జెల చప్పుడు అతని గుండె చప్పుడును తాకింది. ఆమె రూపం, ఆమె వస్త్రాల సొగసు, తియ్యని మాట, ఆప్యాయత గల వ్యక్తిత్వం అతనిలో ఇల్లు కట్టుకుపోయాయి.

రోజు విరూపాక్షస్వామి ఆలయం వద్ద బొమ్మలమ్మి తన ఇష్టదైవమైన రఘునాథ స్వామికి ఐదు రూపాయలు దక్షిణ సమర్పించుకోవడం జమ్మికి అలవాటు. జమ్మికి తండ్రి లేడు. చిన్నతనంలోనే కాలం చేశాడు. తల్లి చిన్నాబాయి, తమ్ముడు సాదేవ్ నాయక్ ఇదే జమ్మి ప్రపంచం. తమ్ముడు చిన్నవాడు, తల్లి జబ్బుపట్టి ఇంటిపట్టునే ఉంటున్నది. దీనితో జమ్మికి కష్టాలు మొదలయ్యాయి. రోజు స్థానిక చెరువులోంచి మట్టిని తెచ్చి, నీళ్లుపోసి కాళ్లతో బాగా తొక్కి ఆ చిక్కటి మట్టితో బొమ్మలు చేసి దేవాలయం వద్ద అమ్మడం ఆమెకు రోజువారి పని. బొమ్మలమ్మగా వచ్చిన ఆదాయమే ఆ కుటుంబానికి ఆసరా. ఆమె చేతుల్లో ఎన్నో దేవతా ప్రతిమలు ప్రాణం పోసుకున్నాయి. స్వయాన రఘునాథుని భక్తురాలు. అందుకేనేమో ఎంతో ప్రేమతో బొమ్మలు చేస్తుంది. అందుకే ఆమె బొమ్మల్లో ఆమెకున్నంత అందం ఇమిడివుంటుంది.

రాబర్ట్ హంపి శిల్పవైభవాన్ని అధ్యయనం చేయడానికి వచ్చిన బ్రిటన్ పరిశోధకుడు. మూడు వారాల నుండి రఘునాథుని గుడి పూజారి వద్ద ఉండి అధ్యయనం చేస్తున్నాడు. పూజారికి ఆంగ్లం వచ్చు. పరదేశీ యాత్రికుల తాకిడి అధికంగా ఉండడంతో పట్టుబట్టి ఇంగ్లీషు భాషను నేర్చుకున్నాడు. రాబర్ట్ వచ్చినప్పటి నుండి హంపి చుట్టుపక్కల ప్రదేశాలన్నీ చుట్టేసి సాయంత్రానికి దేవాలయం చేరుకునేవాడు. బయటే భోజనం చేసొచ్చేవాడు.

రఘునాథుని రాజగోపురం వైపు కదిలిపోతున్న ఆమెను రాబర్ట్ మెల్లగా అనుసరించాడు. ఆలయం ఆవరణలో ఉన్న వరండా నీడలో కూర్చున్నాడు. ఆమె భక్తితో రామునికి చేతులెత్తి దండం పెట్టడం తన సంపాదనలోంచి ఐదు రూపాయలు సమర్పించుకోవడం చూసి తదేకంగా ఆమెనే గమనిస్తున్నాడు. జమ్మి గుడిలోంచి బయటికి వచ్చింది. "నేను

**"వద్దు వద్దు నాకు డబ్బులొద్దు. నువ్వే ఉంచుకో. పర్దేశి లెక్క కనబడుతున్నావు. మందిరంలోకి రా. అక్కడ చల్లని నీడ ఉంది" అంటూ బుట్ట ఎత్తుకోబోయింది. ఆమె అనే మాటలు అతనికి అర్థం కాలేదు. ఆమె మాటల్లోని భావం మాత్రం అర్థమైంది. ఆమెను అలా చూస్తుండి పోయాడు. ఆమె రఘునాథుని ఆలయం వైపు కదిలిపోతుంటే ఆమె కాలి గజ్జెల చప్పుడు అతని గుండె చప్పుడును తాకింది.**



కథ

వెళ్తున్నాను. నీవు ఇక్కడే విశ్రాంతి తీసుకో'' అన్నది. ఏమి అనలేని స్థితిలో ఆమెనే చూస్తూ ఉండిపోయాడు రాబర్ట్. అతని కళ్ళలో ఆమె నిండిపోయింది. వెళ్తూ వెళ్తూ పూజారి ఇచ్చిన దేవుని ప్రసాదం అతని చేతుల్లో పెట్టి తినమని చెప్పి వెళ్ళిపోయింది.

ఆమె అడుగులు దూరమవుతున్నకొద్ది రాబర్ట్ మనసు ఎందుకో దూరమవుతున్నట్టు అనిపించింది. మధ్యాహ్నం మాయమై సాయంత్రంలోకి పొద్దు చేరుకుంది. ఆ రాత్రికి పూజారి అన్న ప్రసాదం పెడుతుంటే "హు ఈజ్ షీ. ఆఫ్టర్ నూన్ గేవ్ దిస్ ట్రైబ్ ఆఫ్ ఫుడ్. యూ ఆల్ సో గివింగ్ లైక్ దట్ ఫుడ్'' అంటూ ఇంగ్లీషులో ఆమెను గురించి వాకబు చేశాడు. పూజారికి బాగా అర్థమవుతుంది ఇంగ్లీషు.

వెంటనే "ఓ జమ్మి. షి ఈస్ లమాని'' అన్నాడు. "లమాని! వాట్స్ దాట్! ఈజ్ ఇట్ అ కమ్యూనిటీ! ఆర్ ఆ లీవింగ్ స్టైల్!'' అన్నాడు. అతని సందేహాన్ని విన్న పూజారి "నో... దే ఆర్ నోమాడిక్ ట్రైబ్ పీపుల్. దే హ్యావ్ దెయిర్ ఓన్ కల్చర్'' అన్నాడు. అతని మాటలు విన్న రాబర్ట్ విస్తుపోయాడు.

మరుసటిరోజు కూడా ఆమె రావడం ప్రసాదం పెట్టడం ఒక చిరునవ్వు నవ్వి వెళ్ళిపోవడం జరిగింది. కొండదిగి వెళ్లిపోతున్న ఆమె వైపే కన్నార్పకుండా చూస్తుండిపోయాడు రాబర్ట్. అతనిలో లమానిల గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస నిద్దురలేచింది. ఆరోజు అలా గడిచిపోయింది. మరుసటిరోజు ఆమె కోసమే ఎదురుచూస్తూ కన్నులు సముద్రమంత చేసుకొని చూస్తున్నాడు. అతనిలోని ఆశ అప్పుడప్పుడు అతన్ని రాజగోపురం దగ్గరి బండరాయిని ఎక్కిస్తున్నది. దానిమీద నుండి నాలుగు దారులను కలియబెట్టిస్తున్నది. అల్లంత దూరం కొండ కిందికి నడిపిస్తూ, మళ్ళీ యథాస్థానానికి చేరుస్తూ ఆమె కోసం ఎదురుచూసేలా చేస్తున్నది.

మిట్ట మధ్యాహ్నం సుమారు ఒంటి గంట అవుతుంది. ఇంతలో జమ్మి రఘునాథుని గుడి ప్రాంగణంలోకి వచ్చింది. ఆమెను చూడగానే పరుగు పరుగున ఆమె దగ్గరకు చేరుకున్నాడు. ఆమె అతన్ని చూసి ఒక చిరునవ్వు నవ్వి గుడిలోకి వెళ్ళింది. దేవుడికి దక్షిణ చెల్లించి తనతో తెచ్చిన ప్రసాదాన్ని అతని చేతిలో పెట్టింది. గుటుక్కున నోట్లో వేసుకుని నములుతూనే.....

"హాయ్ ఐ వాంట్ టు నో యువర్ కల్చర్, యువర్ ట్రెడిషన్ అండ్ హిస్టరీ. కెన్ ఐ కం విత్ యూ టు విజిట్ యువర్ ప్లేస్'' అన్నాడు. ఆమెకు అతని మాటలు అర్థం కాలేదు.

"ఓ పర్దేశి నువ్వు ఏం మాట్లాడుతున్నావో ఏమో అర్థం కావట్లేదు'' అన్నది. పక్కనే ఈ తతంగం చూస్తున్న పూజారి దగ్గరకు వచ్చి...

" మీ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర తెలుసుకుంటాడట. మీ తండాకు వస్తాడట. తీసుకెళ్లు'' అన్నాడు. ఆ మాట వినగానే "యే బా! (ఓరి నాయనో) మావాళ్ళు చంపేస్తారు. అసలు మా తండాలోకి వేరేవాళ్ళని రానివ్వం. పోయినేడాది గిట్లనే ఒక పర్దేశి దొర వచ్చి సానా రోజులు ఉన్నడు. మా తండా ఆడోళ్ళు, మగోళ్ళు, పిల్లలు, గుడిసెల ఫుటువలు తీసుకున్నడు. మా తండాకు ఆళ్ళ దేశం నుండి సాయంకింద పైసల్ ఇప్పిస్తానన్నడు. మాయమాటలు జెప్పి మా తండాలో చెయ్యరాని తప్పు జేసి ఆళ్ల దేశం ఎల్లిపోయిండు. కాదు కాదు... పరార్ అయ్యిండు. ఇప్పటికి పత్తాలేదు. అందుకే మా తండాలోకి పర్దేశిలను రానివ్వట్లే'' అన్నది. ఆమె మాటలు విన్న పూజారి రాబర్ట్‌కి విషయం చెప్పి వెళ్లవద్దన్నాడు. కానీ అతనిలోని జిజ్ఞాస అతన్ని ఆగనివ్వట్లేదు. తాను అలాంటి వాడు కాదని పూజరికి, జమ్మికి పదే పదే చెప్పుకున్నాడు. అతని మాటలు ఆమె చెవిని తాకి పక్కకు తప్పుకుపోతున్నాయి. అతన్ని చూస్తే ఒకరకమైన జాలి కలిగింది. కానీ లోలోపల పెద్దల భయం చంపేస్తుంటే వడివడిగా వెళ్ళిపోయింది.

రోజు ఆమె రావడం, దేవున్ని ఆరాధించడం జరుగుతున్నది. ఆమె వస్త్రధారణ, ఆమె నిష్ఠ, కల్మషం లేని వ్యక్తిత్వం అతన్ని ఆకర్షించాయి. పరిశోధన దృష్టితో పాటు ఆమె అంటే లోలోపలే ఇష్టపడుతున్నాడు రాబర్ట్. ఆమెకు తెలియకుండానే ఆమెను వెంటాడుతూ రాళ్లు రప్పలు, గుట్టలు దాటి తండా పరిసరాల్లోకి వెళ్లి తిరిగి వస్తున్నాడు.

ఒకనాడు తండాలో పెత్తనం చెలాయించడానికి ఎప్పుడూ ప్రయత్నించే మస్రుబాయి, తండా నాయక్ భార్య, తన తోటి మహిళలతో కలిసి సెలయేరు వద్ద బట్టలుతుక్కుంటున్నది. అంతలో ఒక అలజడి. పక్కనే ఉన్న ఒక కొండమీద నుండి ఎవరో తమ వైపు, తమ తండా వైపు చూడడం ఆమె గమనించింది. ఆమె మనసులో భయం మొదలైంది. పూర్వపు జ్ఞాపకాలు వరదల్లా కమ్ముకున్నాయి. ఏదో కీడు మళ్ళీ తండాను చుట్టుకుంటుందన్న ఆందోళన ఆమెలో మొదలైంది. అప్పుడే జమ్మి వారందరిని దాటేసి తండావైపు వెళ్లిపోతున్నది. ఆమెను వాళ్ళు పట్టించుకునే ప్రయత్నం చేయలేదు. ఆమె తండా దరిదాపుల్లోకి చేరుకుంటున్నదనగానే ఒకటే కేకలు వినిపించాయి.

"మళ్ళీ ఇంకో పర్దేశి. మళ్ళీ ఇంకో పర్దేశి వచ్చాడు'' అంటున్న స్వరాలు సన్నగా వీస్తున్న గాలిలో దుమారం రేపుతున్నాయి. అందులో మస్రుబాయి స్వరం బిగ్గరగా వినిపిస్తున్నది.

ఈ కేకలు నసాబ్ ఘర్ దగ్గర కూర్చున్న యువకుల చెవిన పడ్డాయి. అంతే గుడిసెల్లో మూలకు పడి నిద్రపోతున్న కర్రలు, బరిసెలు నిద్రలేచాయి. వాటికి గతం కళ్లెదుట నిలిచింది. స్వరాలు వినిపిస్తున్న వైపు పరుగులు తీశాయి. జమ్మికి అనుమానం కలిగింది. అది రాబర్ట్ కావచ్చు అనుకొని బుట్టను బండరాళ్ల సందుల్లో దాచి పరుగులు తీసింది. ఆమె అడుగుల వేగం తక్కువగా ఉండడం చేత సెలయేరు వద్దకు చేరుకోవడానికి కాస్త ఆలస్యం

అయింది. అంతే రాబర్ట్‌పై కర్రలు విరుచుకుపడ్డాయి. ఆయాసపడుతూ పరుగులు తీస్తున్న జమ్మికి "అయామ్ నాట్ అ థీఫ్. అయామ్ నాట్ అ ఫ్రాడ్" అంటూ అరుస్తున్న రాబర్ట్ కేకలు వినిపిస్తున్నాయి. పరిస్థితి అర్థమైంది. హృదయవేగం సుడిగుండమై కల్లోలం సృష్టిస్తుంటే ఆయాసపడుతు అక్కడికి చేరుకుని దెబ్బలు తింటున్న అతనిపై రక్షణగా వాలిపోయింది. అంతలోనే రెండు మూడు దెబ్బలు ఆమెకు కూడా తగిలాయి. తలనుండి రక్తం ధారాపాతంగా కారిపోతున్న రాబర్ట్‌ని చూసి తట్టుకోలేకపోయింది. తన చీర కొంగు అంచును చించి అతని తలకు కట్టు కట్టింది. ఈ అనూహ్య పరిణామం చూసిన తండా స్త్రీలు,యువకులు నిచ్చేష్టులు అయ్యారు.

జమ్మి కోపంతో ఊగిపోయింది. ఆమెలోని ఆవేశం కట్టలు తెంచుకుంది. కంటిధారలు కారిపోతుంటే "ఎందుకితన్ని కొడుతున్నరు. ఈయన చేసిన పాపం ఏంటి. ఇంతకు ముందు మన తండాల కనబడ్డాడా! ఏం మస్రు అత్తా మీ బట్టలుతుకుతున్న ఆడోళ్లను ఏమన్న అన్నడా! మరి ఎందుకు ఈ పర్దేశీతో గీ అన్యాలం. అందరు పర్దేశీల లెక్క గీన గూడ హంపి జూడనీకి వచ్చిండు. సానా మంచోడు. మన సగం వ్యాపారాలన్ని గీ పర్దేశీలే కొంటరు గదా! గాళ్ల మీద ఏంది గీ దాష్టికం. అందరూ మనం అనుకున్నట్లే ఉంటరా! అంత అనుమానం ఉంటే పట్టుకొని పోయి నాయక్ ముందు నిలబెట్టుర్రి. పాలల్ల పాలు నీళ్ళల్ల నీళ్ళు కలిసి పోతయ్" అన్నది.

ఆమె మాటలు విన్న మస్రుబాయి" ఏమే తల్లి నంగనాచి. మీ ఇద్దరి మధ్య ఏం చక్కర్ నడుస్తుందో నాకు సమజ్ అవుతుందే. నిన్ను ఇట్ల గాదు. అరె బియాలోక్(అన్నాతమ్ముళ్లారా) ఈళ్లను ఇద్దర్ని పట్టుకొని నసాబ్ కాడికి నడువుర్రి. ఆడనే ఈళ్ల సంగతి తెలుస్తది" అన్నది. వెంటనే యువకులు వాళ్ళిద్దరిని నసాబ్ ఘర్ కాడికి తీసుకొచ్చారు.

చాటింపు డప్పు చప్పుళ్లకు తండా మొత్తం గుమికూడింది. ఏం జరిగిందో ఇంకా చాల మందికి తెలియనేలేదు. అంతా ఏ ఆపద వచ్చిందేమోనని పరుగులు తీస్తూ అక్కడికి చేరుకున్నారు. అంతలోనే నాయక్‌తో పాటు నలుగురు పెద్దమనుషులు అక్కడికి వచ్చేశారు. మస్రు తండా నాయక్ చెవిలో తాను చూసింది చెప్పింది. పంచాయతీ మొదలైంది. నాయక్ " ఏం జమ్మి. నీకు తెల్వదా. పోయిన ఏడాది మన తండా జూస్తనని వచ్చి మాయమాటలు జెప్పి పులియాబాయి కూతురు హింగోళిని అన్యాలం జేసీ రాత్రికి రాత్రే పారిపోయిండు బద్మాష్ నా కొడుకు పర్దేశి. గా పిల్ల ఉరి పోసుకొని సచ్చింది. మర్శినావా బిడ్డ. మల్ల గీ పర్దేశీ గాళ్ల మాయల నువ్వు కూడా పడ్డవా. నీ తల్లి రోగిష్టి. దాని గురించి ఏం గుర్తురాలే నీకు" అన్నాడు. గుంజకు కట్టేసిన రాబర్ట్ మొఖాన్ని ఒక్కసారి కోపంగా చూసింది జమ్మి. పంచాయతీ మనిషిని పంపగా అప్పుడే అక్కడికి చేరుకుంది జమ్మి తల్లి. ఆమె వైపు చూడటానికి ధైర్యం చాలట్లేదు. అయినా తానేలాంటి తప్పు చేయలేదు కాబట్టి గుండె వేగాన్ని అదుపుచేసుకొని తల్లి వైపు చూసింది. ఆందోళనతో ఆమె కళ్ళు బెదురుచూపులు చూస్తున్నాయి.

"నా బిడ్డ ఏం తప్పు జేసింది" అని గుండెలు పగిలేలా ఏడుస్తున్న తల్లిని తమ్ముడు సాదేవ్ ఓదార్చుతున్నాడు. ఆమెకు ఇంకా విషయం పూర్తిగా అర్థం కాలేదు. బిడ్డతో పాటు పర్దేశిని చూడగానే ఆమె గుండెల్లో గుండ్రాయి పడేసినంత పని అయింది. ఏదో జరగరానిది జరిగిందని అనిపించింది. నాయక్ విషయం బయటకు తెచ్చే వరకు తన బిడ్డ వల్ల ఏం తప్పు జరిగిందోనని కిందామీద అయ్యింది. విషయం చెవి పుటల్ని తాకగానే గుండెలు బాదుకుంది. దీనితో లబోదిబోమంటున్న ఆమెను పక్కనే ఉన్న ఇంట్లోకి తీసుకెళ్లారు అక్కడి మహిళలు.

"నాయక్ మామా నేనేం తప్పు జెయ్యలే. సచ్చిపోయిన మా బాపు మీద ఒట్టు. గీ పర్దేశీకి నాకు ఏం సంబంధం లేదు" అన్నది జమ్మి. జమ్మి మాట పూర్తికాకముందే కోపంతో ఊగిపోతున్న మస్రుబాయి కలగజేసుకొని "ఏం సంబంధం లేకుంటే గాడిని ఎందుకు కాపాడనీకి జూసినవ్. ఎందుకు గాడి తలకు కట్టు గట్టినవ్. మాకు తెల్వదను కున్నవా" అన్నది. ఆమె కలగజేసు కోవడంతో నాయక్ కోపంతో "నేను అడుగుతున్న కదా! ఉకో మస్రుబాయి" అన్నాడు.

"చెప్పు బేటీ. నిజాయితీగా ఉన్నది ఉన్నట్టు చెప్పు. లేకుంటే నలుగురి వేళ్ళు నిన్నే దోషిని జేసి జూపిస్తయ్. లోకం నోళ్లు నువ్వు మూయించలేవు." అన్నాడు. జమ్మి జరిగిందంతా పూస గుచ్చినట్లు చెప్పింది. కావాలంటే సాక్ష్యం కోసం రఘునాథ స్వామి గుడి పూజారిని అడగమంది. జమ్మి కళ్ళలో నిజాయితీ కనిపించింది నాయక్‌కి. కానీ న్యాయం నెగ్గాలంటే సాక్ష్యం అవసరం కాబట్టి పూజారిని పిలిపించాడు. అతను మరుసటి రోజు మధ్యాహ్నానికి వచ్చాడు. అప్పటిదాకా జమ్మిని ఆమె గుడిసెలోనే నిర్బంధించి, రాబర్ట్‌ను నసాబ్ ఘర్‌లో ఉంచి తాళం వేశారు. ఆ రాత్రి జమ్మి, రాబర్ట్ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు.

పూజారి జమ్మి వ్యక్తిత్వాన్ని, రాబర్ట్ నిజాయితీని, మంచితనాన్ని, తండా సంస్కృతిపై పరిశోధనకు అతనిలోని ఆసక్తిని గురించి ఉన్నది ఉన్నట్టు చెప్పాడు. రాబర్ట్‌ని మంచి స్కాలర్‌గా, ఉన్నత విలువలు ఉన్నవాడిగా అందరికి పరిచయం చేశాడు. ఆ మాటలు విన్న నాయక్ రాబర్ట్‌ని వదిలిపెట్టాలని ఆదేశించాడు. జమ్మి తప్పేం లేదు కాబట్టి ఆమెను ఇంటికి పంపేశాడు. మస్రుబాయి కోపం ఇంకా చల్లారాలేదు. తండాలో పెత్తనం చలాయించే అవకాశం కోల్పోయినందుకు మండిపోయింది. చేతి మెటికలు విరుస్తూ మనసులో గొణుగుతూ తన గుడిసెకు వెళ్ళిపో యింది. పూజారి దెబ్బల రక్తంలో తడిసి

క
థ

ఎండిన రాబర్ట్‌ను తీసుకొని గుడికి వెళ్ళిపోయాడు. తనకు తెలిసిన ఆయుర్వేదం మందులతో కట్టు కట్టాడు. అతని మందుల ప్రభావం కారణంగా త్వరలోనే రాబర్ట్ కోలుకున్నాడు. కానీ అతని మనసు నుండి జమ్మి జ్ఞాపకాలు తొలగిపోవడంలేదు. అవి గూడు కట్టుకుని ఎదలోతుల్ని పిండేస్తూనే ఉన్నాయి. తన వల్ల ఆమెకు కలిగిన కష్టాన్ని తలచుకొని అనుక్షణం బాధపడుతూనే ఉన్నాడు.

వారం గడిచింది.

యథావిధిగానే చుక్కల వర్షంలో తడిసిన రాత్రి మాయమైంది. మెల్లమెల్లగా ప్రభాసుడు తుంగభద్ర తీరం దాటుతూ లోకాన్ని వెలిగిస్తున్నాడు. విరూపాక్షుని గుడి ఆ కిరణాల్లో బంగారువర్ణంలో మెరిసి పోతున్నది. గుడి రాజగోపురాన్ని ఇరుప్రక్కల కొండలతో కలుపుతూ ఉన్న వ్యాపార మండపాలున్నాయి. అందులోని ఒక మండపం రాతిగోడకు ఆనుకొని జమ్మి కోసం ఎదురుచూస్తున్నాడు రాబర్ట్. అల్లంత దూరాన అందమైన నడకతో ఆమె కనిపించింది. సంతోషంతో ఆమెకు ఎదురు వెళ్ళాడు. అతన్ని చూసిన ఆమె మౌనంగా ఉంటూనే అతన్ని తప్పించుకొని ముందుకు నడిచింది. అతను జమ్మి జమ్మి అంటూ ఆమె పేరునే జపం చేస్తూ ఆమె అడుగుల్ని అనుసరిస్తున్నాడు. ఆమెకు కోపం వస్తున్నది కాని మనసులోనే అణుచుకుంటున్నది. కాసేపటికి సన్నని విసుగుతో వెనక్కి తిరిగింది జమ్మి. తనను వెంబడించే ప్రయత్నం చెయ్యొద్దని, మళ్ళీ దెబ్బలు తినాల్సి రావచ్చని, అతని మనస్సును, అతని జిజ్ఞాసను ఇక్కడ ఎవరూ అర్థం చేసుకోరని, దయచేసి వెళ్ళిపొమ్మని నచ్చజెప్పింది. ఆమె కళ్ళలో కోపాన్ని గమనించిన అతడు ఆమెతో ఏం మాట్లడలేక దుఃఖాన్ని దిగమింగుకుంటూ రఘునాథ దేవాలయం వైపుకు వెళ్ళిపోయాడు. అతడి కన్నీటి వానలో విరుపాక్షుని వీధులు తడిసిపోయాయి. రఘునాథ దేవాలయం చేరుకుని దక్షిణ దిక్కు మండపంలో దీనంగా కూర్చు న్నాడు. పూజారి రాబర్ట్‌ని పలకరించి ఏం జరిగింది. ఎందుకలా ఉన్నావు" అని అడిగాడు.

"వారం క్రితం తండాలో జరిగిన విషయంలో జమ్మికి క్షమాపణ చెప్పాల"ని జవాబిచ్చాడు రాబర్ట్. అతన్ని ఓదార్చాడు పూజారి. రాబర్ట్ నిజాయితీ పూజారికి తెలుసు. అతని మనసులో జమ్మి ఉన్నదని కూడా అతనికి తెలుసు. రాబర్ట్ పరిశోధన జిజ్ఞాసను గురించి, తన పట్టుదల గురించి బాగా అర్థం చేసుకున్నవాడు. అయినా అతన్ని వారించే ప్రయత్నమే చేశాడు. రాబర్ట్ విన్నాడు కాదు. అతని హఠం అతనిదే.

ఈ లోగా మధ్యాహ్నం లోకమంతా పరుచుకుంది. ఆమె కాలి గజ్జెల చప్పుడు దూరంగా వినిపిస్తుంది. వడి వడి అడుగులతో పక్కలకు చూడకుండా ఆమె నేరుగా మందిరంలోకి వెళ్ళింది. తన వంతుగా స్వామికి ఇవ్వాల్సిన సొమ్ము హుండీలో వేసింది. పూజారి ప్రసాదం పెట్టగానే మోదుగ ఆకుల్లో ప్రసాదాన్ని చుట్టుకొని బయటికి నడవబోయి వెనక్కి మళ్ళింది. ఇంతలో మందిరం ప్రధాన ద్వారం దగ్గర దారికి అడ్డంగా రెండు చేతులు చాచి, తలను కిందికి దించుకుని మోకాళ్ళ మీద కూర్చుండి క్షమాపణ వేడు కుంటూ కనబడ్డాడు రాబర్ట్. అతన్ని ఆ

> **"వారం క్రితం తండాలో జరిగిన విషయంలో జమ్మికి క్షమాపణ చెప్పాల"ని జవాబిచ్చాడు రాబర్ట్. అతన్ని ఓదార్చాడు పూజారి. రాబర్ట్ నిజాయితీ పూజారికి తెలుసు. అతని మనసులో జమ్మి ఉన్నదని కూడా అతనికి తెలుసు. రాబర్ట్ పరిశోధన జిజ్ఞాసను గురించి, తన పట్టుదల గురించి బాగా అర్థం చేసుకున్నవాడు. అయినా అతన్ని వారించే ప్రయత్నమే చేశాడు. రాబర్ట్ విన్నాడు కాదు. అతని హఠం అతనిదే.**

స్థితిలో చూసిన జమ్మి కళ్ళు నిండు కుండ లయ్యాయి. అతని కళ్ళలోనూ నీళ్ళు ప్రవాహం కట్టాయి. అదే సమయంలో పూజారి వెనక నుండి "నిన్నటి నుండి అతడు భోంచేయ్యలేదమ్మా! ఎప్పుడెప్పుడు నీకు క్షమాపణలు చెప్పుకోవాలి అని ఎదురు చూస్తున్నాడు. అతని హృదయం మంచిది తల్లి. మీ తండావాసుల మీద డాక్యుమెంటరీ... అదేనమ్మా ఒక చిన్న సినిమా లాంటిది తీస్తాడట. నీ సహకారం కోరుతున్నాడు" అన్నాడు. రాబర్ట్ మనసులో ఉన్న భావాన్ని విప్పి చెప్పాడు. ఆమె తొలుత భయపడింది. "నాయక్‌కి తెలిస్తే చంపేస్తాడు" అంది. "నాయక్‌తో నేను మాట్లాడుతాను" అన్నాడు పూజారి. మొత్తానికి ముగ్గురు సాయంత్రానికి ఊరు చేరారు. మళ్ళీ జమ్మితో వీళ్లిద్దరూ రావడం అందరిని ఆశ్చర్యచకితులను, ఒకింత ఆందోళనకు గురిచేసింది. పూజారి నేరుగా వెళ్లి నాయక్‌తో విషయం చెప్పాడు. నాయక్ మండిపడుతున్నాడు. పూజారి ఒప్పించే, నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. దూరంగా వేపచెట్టు నీడలో నిల్చున్న జమ్మి, రాబర్ట్‌లు ఇదంతా గమనిస్తున్నారు. అరగంట దాటింది. పూజారి అతని వెనకాల నాయక్ గుడిసెలోంచి బయటికి వచ్చారు. పూజారి ముఖంలో ఒక చమక్కు కనిపించింది. నాయక్ ముఖంలో గంభీరత, కొద్దిపాటి కోపం దర్శనమిస్తున్నాయి.

"డియర్ రాబర్ట్. హి ఈజ్ అగ్రీ విత్ యువర్ ప్రపోజల్. బట్ బీ కేర్ ఫుల్. హి ఆల్ యూ ఇన్ తండా. బట్ సమ్ కండీషన్స్ ఆర్ దేర్. యూ మస్ట్ ఫాలో దెమ్" అన్నాడు. జమ్మికి కూడా అవి తెలియాలని పూజారి కన్నడంలో చెబుతూ...

(తెలుగు మాటల్లో) "చూడు జమ్మి ఇతను డాక్యుమెంటరీ తీసుకోవచ్చు. నువ్వు సాయం చెయ్యవచ్చు. కానీ సాయంత్రానికి ఇతడు తండా నుండి వెళ్లిపోవాలి. అందరితో మర్యాదగా ఉండాలి. పరాయివాడు కనుక ముఖ్యంగా మీ ఆచారాలు, కట్టుబాట్లు తెలుసుకొని

కథ

మసలుకోవాలి. రెండు నెలలకు మించి ఇతను ఇక్కడ ఉండకూడదు. ఇది నాయక్ ఆదేశం" అన్నాడు. జమ్మి భయపడుతూనే సరేనని తలూపింది. ఈ మాటలన్నీ రాబర్ట్‌కి ఆంగ్లంలో సవివరంగా చెప్పాడు పూజారి. అతనికి బంజారా భాషలోని మాటలను ఆంగ్లంలోకి మార్చి చెప్పడానికి తాను సహకరిస్తా నన్నాడు. రాబర్ట్ పట్టరాని ఆనందంతో ఇంగ్లీష్‌లో సరేనన్నాడు.

మరుసటిరోజు మధ్యాహ్నం జమ్మితో రాబర్ట్, పూజారి తండాకు చేరుకున్నారు. రాబర్ట్ అతనితో ఒక కెమెరా, కొన్ని నోట్స్ తెచ్చుకున్నాడు. అక్కడి పెద్దలను మర్యాదగా పలకరించి బంజారాల పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకుంటున్నాడు. నాయక్ రాబర్ట్ ఎవ్వరిని ఏం అడిగినా వివరాలు ఇవ్వాల్సిందిగా ఆదేశించాడు. ఆయన ఆదేశంతో అందరూ వారికి తెలిసిన వివరాలు అందిస్తున్నారు. నాయక్ కూడా ఎన్నో అమూల్యమైన విషయాలు, వారి చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలను చెప్పాడు. రాబర్ట్ అవన్నీ జాగ్రత్తగా నోట్ చేసుకుంటున్నాడు. పూజారి అతనికి అన్నీ విషయాలు అనువదించి చెబుతున్నాడు. బంజారా పండుగలు, వీరుల గురించి జమ్మి తల్లి చిన్నూబాయి సవివరంగా వివరించింది. అతనికోసం ప్రత్యేకంగా ఒక వారం పాటు బంజారా నృత్య కార్యక్రమం ఏర్పాటుచేసి అన్ని విధాల సహకరించారు. ఇలా నెల రోజులు అధ్యయనంలోనే గడిచిపోయాయి రాబర్ట్‌కి.

రోజు సాయంత్రం వేళ అతన్ని కొండ వరకు సాగనంపేది జమ్మి. అతడు ఆమె కళ్ళలోకి చూసినప్పుడల్లా ఏదో తెలియని ప్రేమ ఆప్యాయతలు జాగృతమవుతూనే ఉన్నాయి. జమ్మి ఈ చూపుల భావాన్ని అర్థం చేసుకునేది. కానీ మౌనమే ఆమె సమాధానం అయ్యేది. చుట్టూ ఉన్న కట్టుబాట్లు ఆమెను కట్టిపడేసేవి. చూపుల్లోనే ఇద్దరి మనసులు కలిసిపోయాయి. లమానీల జీవితాలను అధ్యయనం చేస్తూనే డాక్యుమెంటరీ ఫిల్మ్ తీయడం ప్రారంభం చేశాడు రాబర్ట్. తీజ్, శీత్ల వంటి పండుగలు, నసాబ్, వాయా (పెళ్లి), డావ్లో, నృత్యాలు వంటి అంశాలపై సమగ్రంగా డాక్యుమెంటరీ నిర్మించాడు. ఇంతలోనే ఆఖరి రోజులు సమీపించాయి. విషయ శోధన చేస్తున్నప్పుడు బంజారా పెద్దలను అతడు మర్యాదగా పలకరించిన తీరు, అక్కడి సంప్రదాయాల్ని గౌరవించిన విధానం, ముఖ్యంగా స్త్రీల పట్ల అతడు ప్రదర్శించిన పూజ్యభావం అందరినీ ఆకట్టుకుంది. తండా నాయక్, మన్సుబాయి, అతన్ని కొట్టిన యువకులు, పిల్లలు, వృద్ధులు అందరూ అతన్ని తమలో ఒకడిగా భావిస్తున్నారు ఇప్పుడు. తమ ప్రేమను ఒలకబోస్తున్నారు కూడా. క్రమంగా ఖానాపీనా కూడా తండా వాళ్లే చూస్తున్నారు. అతడు అందరితో కలిసి చేసిన నృత్యాలు, తడబడుతూ పాడిన పాటలు అందరినీ ఆనందానికి గురిచేశాయి.

ఆఖరిరోజు రానే వచ్చింది. అంతకు ముందు రాత్రి అతనికి విందు ఏర్పాటు చేసి నసాబ్ ఘర్ దగ్గర సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశాడు నాయక్. అత్యద్భుతంగా సన్మాన కార్యక్రమం నడిచింది. తాను నిర్మించిన డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను అక్కడ ఓపెన్ ప్లేస్‌లో తెల్లచీరల తెరపై ప్రదర్శించాడు. అది చూసిన అందరి ఎదలు బరువెక్కాయి. ఎంతో హృద్యంగా తెరకెక్కించాడు బంజారాల జీవితాల్ని రాబర్ట్.

ఈ కార్యక్రమంలో ఎక్కడా జమ్మి కనిపించలేదు. రాబర్ట్‌ని వీడిపోతున్నానన్న బాధలో ఆమె తన గుడిసెలోనే ఉండిపోయింది. అతడి కళ్లు ఆమెనే వెతుకుతున్నాయి. కానీ ఆమె ఎక్కడా కనిపించలేదు.

నాయక్ సమక్షంలో అతడు చక్కటి ఇంగ్లీషులో, అక్కడక్కడా బంజారా భాషలో గొప్పగా ప్రసంగించాడు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూజారి అతని మాటల్ని అందరికి కన్నడంలోకి మార్చి చెప్పాడు. జమ్మిని, ఆమె సుగుణాలను, ఆమె అందజేసిన సహకారాన్ని రాబర్ట్ ఎంతగానో పొగిడాడు. ఆమె కోసం అతని కళ్ళు వెతికాయి. ఆమె అనుపస్థితికి కారణం అతనికి అర్థమైంది. ఆమె జీవితానికి తన ప్రేమ అడ్డు కాకూడదు అని మనస్సును నిబ్బరం చేసుకున్నాడు. నాయక్‌తో తన తరఫున జమ్మికి కృతజ్ఞతలు చెప్పాలని చెప్పి పూజారితో కలిసి బయలుదేరాడు. తండాను, తనకు ఎంతో ఇష్టమైన జమ్మిని వీడిపోతుంటే అతని కళ్లు గంగా ప్రవాహమై వర్షించాయి. రాబర్ట్ వెళ్లిపోతుంటే కొండ వరకు బరువైన హృదయాలతో అనుసరించారందరు.

కార్యక్రమం తర్వాత జమ్మి గుడిసె ముందుకు చేరుకున్న కొందరు స్త్రీలు....

"అతడు ఎంత మంచివాడు. ఎంత బాగా మన జీవితాల్ని సూపెట్టిండు. పాపం ఈ పాటికి కొండ దాటిపోయి ఉంటడు" అని తమలో తాము అనుకుంటున్నారు.

రోదిస్తూ తనను తనలోకి వంపేసుకుంటున్న జమ్మికి వినిపించాయి ఈ మాటలు. ఈ మాటలు విన్న జమ్మి దుఃఖాన్ని అదుపుచేసుకోలేకపోయింది. ఆమె కాళ్ళు ఆమె మనసు చేసే అదుపును ధిక్కరించాయి. మెరుపు వేగంతో ఆమె కొండ ప్రాంతాన్ని చేరుకుంది. తండా పెద్దలందరూ రాబర్ట్ చేతుల్లో చేతులు కలుపుతూ వీడ్కోలు చెబుతున్నారు. అల్లంత దూరం నుండే ఈ దృశ్యాన్ని చూసింది జమ్మి. ఇరువురి ప్రేమకు సాక్షిగా నిలిచిన కొండలు రాబర్ట్‌ని అక్కున చేర్చుకుంటూ మౌనంగా రోదిస్తున్నాయి. అప్పుడే మౌనంగా అక్కడున్నవారికి వీడ్కోలు చెప్పి వెనక్కి మళ్లాడు రాబర్ట్. ఒక్కక్షణం అంతటా నిశ్శబ్దం. అందరిని అలుముకున్న నిశ్చేష్టత. అనూహ్యం. అతన్ని వెనకనుండే వాటేసుకుని బోరున ఏడ్చేసింది జమ్మి. అందరూ అలా చూస్తూ ఉండిపోయారు. అతని కళ్ళు ఆమె కోసం సముద్రమయ్యాయి. తండా న్యాయం, భయం ఇద్దరినీ అదుపు చేసింది. కానీ జమ్మి మనసుమాటే విన్నది. ధైర్యం చేసింది. అతన్ని గుండెలకు హత్తుకుంది. అతడు

కథ

ఆమె తెగింపునే అనుసరించాడు.

మళ్లీ వివాదం రాజుకుంది. కొన్ని షరతులు వాళ్ళ ప్రేమకు అంగీకారాన్ని తెలిపాయి. అందులో ఒకటి అతడు బంజారాగా మారాలన్నది కూడా. దానికి అతడు అంగీకరించాడు. మంచిరోజు చూసుకొని పెద్దల సమక్షంలో ధోతి, పగిడి కట్టించారు. సంప్రదాయబద్ధంగా ప్రమాణం చేయించి సాతి భవానీల సాక్షిగా, సేవాలాల్ సాక్షిగా అతన్ని బంజారాగా మార్చారు. అనంతరం ఒక శుభముహూర్తంలో వారిద్దరి వివాహం ఘనంగా రఘునాథుని ఆలయంలో జరిపించాడు పూజారి. సీతారాముల వలె అన్యోన్యంగా ఉండాలని అందరూ ఆ జంటను దీవించారు. అతడు కూడా ఆ శ్రీరాముడిలా ఆమెకే అంకితమైపోవాలని మనసులో నిర్ణయించుకున్నాడు.

అదే సంవత్సరం లండన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తాను తీసిన "బంజారాస్ ద గ్రేట్ నోమాడిక్ ట్రైబ్" అనే తన డాక్యుమెంటరీని ప్రదర్శనచేసి ఉత్తమ డాక్యుమెంటేషన్ అవార్డ్ కూడా గెలుచుకున్నాడు రాబర్ట్.

ఈ ప్రదర్శన కోసం లండన్ వెళ్ళినప్పుడు తన తల్లి జూలియాకి ఆనందంగా తన పెళ్లి విషయం చెప్పాడు. ఇక శాశ్వతంగా ఇండియాలోనే ఉండిపోతానన్నాడు. ఈ మాట విన్న ఆమె అగ్గిమీద గుగ్గిలం అయ్యింది. రాబర్ట్‌కి అతని తల్లికి పెద్దయుద్ధమే జరిగింది. రాబర్ట్ ప్రేమను అర్థం చేసుకోలేక పెద్దగా అరిచేసింది. నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. వినలేదు. తల్లి కొడుకుల మధ్య మాటలు బంద్ అయ్యాయి. మేనమామ ఆడమ్‌కు తల్లి బాధ్యతలను అప్పజెప్పి చివరకు రాబర్ట్ ఇండియా చేరుకున్నాడు. ఇది జరిగి రెండేళ్లు దాటింది. వారికిప్పుడు ఇద్దరు కవలలు రామ్, శ్యామ్.

ఒకడు పూర్తిగా తెలుపు, ఒకడు పూర్తిగా ఎరుపు. తల్లితో ఎంతగా గొడవపడి వచ్చినా ఎప్పటికప్పుడు తన సమాచారాన్ని లండన్‌లో ఉన్న తన తల్లికి ఉత్తరాల ద్వారా చేరవేసేవాడు రాబర్ట్.

**ఈ ప్రదర్శన కోసం లండన్ వెళ్ళినప్పుడు తన తల్లి జూలియాకి ఆనందంగా తన పెళ్లి విషయం చెప్పాడు. ఇక శాశ్వతంగా ఇండియాలోనే ఉండి పోతానన్నాడు. ఈ మాట విన్న ఆమె అగ్గిమీద గుగ్గిలం అయ్యింది. రాబర్ట్‌కి అతని తల్లికి పెద్దయుద్ధమే జరిగింది. రాబర్ట్ ప్రేమను అర్థం చేసుకోలేక పెద్దగా అరిచేసింది.**

కానీ అక్కడి నుండి ఎటువంటి జవాబు వచ్చేది కాదు.

కాలం గిర్రున తిరిగిపోయింది. పది సంవత్సరాలు దాటిపోయాయి. లండన్ నుండి ఒకనాడు "మిస్టర్ రాబర్ట్ యువర్ మదర్ ఈజ్ సీరియస్ స్టార్ట్ ఇమిడియట్‌లీ" అన్న టెలిగ్రామ్ అందింది. అతడి గుండెల్లో అలజడిని రేపింది ఆ సమాచారం. వెంటనే లండన్‌కి బయలుదేరాడు. తండావాళ్ళు కూడా అతన్ని తల్లి సేవకు ఎంతో ప్రేమతో సాగనంపారు. రెండు రోజుల తర్వాత అతడు లండన్ చేరాడు. రాబర్ట్ తల్లి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంది. అతని రాక ఆమెలో కొంత ఆనందాన్ని నింపింది. మోడువారిన చెట్టులో వర్షం ప్రాణం నింపినట్టు రాబర్ట్ వచ్చి ఆమెలో జీవాన్ని నింపాడు. అతని రాక కొన్ని దినాలపాటు మృత్యువుని ఆపే ధైర్యాన్ని ఆమెకు ఇచ్చింది. కొడుకును అమాంతం గుండెలకు హత్తుకొని లేని సత్తువను తెచ్చుకొని అతని తలపై ముద్దుల వర్షం కురిపించింది. పదిహేను రోజులు దాటాయి. డాక్టర్ల వైద్యం కంటే రాబర్ట్ తిరిగిరావడంతో అతడి తల్లి మెల్లమెల్లగా ఆరోగ్యాన్ని సమకూర్చుకుంటూ పూర్తిగా కోలుకుంది. దీనితో అంతటా సంతోషం నిండుకుంది.

ఈ ఆనందసమయంలో తన భార్యా పిల్లలు పదే పదే గుర్తుకువస్తున్నారు రాబర్ట్‌కి. తన తల్లి ఆరోగ్యం కూడా కుదుటపడింది కనుక తన మామయ్య ఆడమ్‌కి తల్లిని అప్పజెప్పి తిరిగి వెళ్దామనుకున్నాడు. ఈ విషయం తెలిసిన జూలియా కదిలిపోయింది. మళ్ళీ తన కొడుకు తనను వదిలిపోతాడని భయపడిపోయింది. "తన కంటే ఇండియాలో ఉన్న ఒక ట్రైబల్ పిల్ల ఎక్కువైందా వీడికి" అని బాధపడింది. ఏదో ఒకటి చేసి అతడిని ఆపాలనుకుంది. శాశ్వతంగా ఇక్కడే ఉండిపోయేలా చేయాలనుకుంది. ఆమెకు ఒక్కటే ఉపాయం సరైనదనిపించింది. అదే మారు మనువు. తన తమ్ముడి కూతురు రోజితో పెళ్లి చేస్తే ఇక్కడే ఉండిపోతాడని అనుకుంది. అంతే తినడం, తాగడం మానేస్తుంది. చచ్చిపోవడానికే సిద్ధం అన్నట్లుగా హఠం పడుతుంది. రాబర్ట్ ఆమెను సముదాయించే యత్నం చేస్తాడు. నాలుగు రోజులుగా మంకుపట్టు పట్టి అనారోగ్యం పాలవుతుంది. ఆమె సహరించకపోతే ఆమె మృత్యువు ఖాయమని, బిపి, షుగర్ కూడా వచ్చేశాయని డాక్టర్లు చెబుతారు. ఆమె మంకుపట్టు ముందు మనసు చంపుకొని రాయిలా మారిపోతాడు రాబర్ట్. తల్లిని చంపిన పాపంలో పోతావా అని బంధువులు కూడా ఆడిపోసుకున్నారు. రాబర్ట్ తల్లి హఠం ఆమెకు ప్రాణాపాయంగా మారింది. ఫలితంగా అతనికి రోజితో పెళ్లవుతుంది. చచ్చిన హృదయంతో ఇటు రోజితో కాపురం చెయ్యలేకపోతున్నాడు. అటు జమ్మిని మోసం చేసిన పాపాన్ని భరించలేకపోతున్నాడు. ఆలోచనలు పట్టాలు తప్పాయి. అతడు అడవిన పడ్డాడు. అదుపు తప్పిన బ్రతుకును గాడిలో పెట్టడమనే విషయంలో ఫెయిలయ్యాడు. పిచ్చివాడై "జమ్మి జమ్మి" అంటూ లండన్ వీధుల్లో చినిగిన దుస్తులతో గమ్యం లేని చక్కర్లు కొడుతున్నాడు. కాల ప్రవాహం గొప్పది. రోజులు నెలలయ్యాయి, రెండు సంవత్సరాలయ్యాయి. రాబర్ట్ రాలేదు. నేటికి కొండల మాటునుండి ఆ పరదేశీ రాకకోసం జమ్మి కళ్ళు కాయలై ఎదురుచూస్తూనే ఉన్నాయి.

సాహితీ శిఖరం

# అణగారిన వర్గాల స్వరం...
# గోపీనాథ్ మొహంతి



1973 జ్ఞానపీఠ పురస్కార గ్రహీత



గోపీనాథ్ మొహంతి 1914 ఏప్రిల్ 20లో కటక్ జిల్లాలో నాగబలి గ్రామంలో జన్మించాడు. వీరిది సనాతన ఆచారాలపట్ల గట్టి నమ్మకమున్న సంపన్న జమీందారీ కుటుంబం. ఈయన 12 సంవత్సరాల బాలుడిగా ఉన్నప్పుడు తండ్రి చనిపోగా పాట్నాలో ఉన్న తన అన్న దగ్గరకు వెళ్లవలసి వచ్చింది. అక్కడ మెట్రిక్ వరకు చదివాడు. ఆ తర్వాత కటక్‌లో రావెన్షా కళాశాలలో ఉన్నతవిద్య పూర్తిచేశాడు. పాట్నా విశ్వవిద్యాలయం నుండి 1936లో ఎం.ఎ. డిగ్రీ పట్టా పొందాడు. ఇతడు 1936 నుండే వ్రాయడం ప్రారంభించాడు. ఇతనిపై ఆ కాలంలో మార్క్స్, రష్యావిప్లవం, ఫ్రాయిడ్ ప్రభావం, గాంధీజీ జాతీయోద్యమ ప్రభావం పడుతూ వచ్చింది. ఇతడు గొప్ప అధ్యయనశీలి. రోమరోలా, గోర్కీ రచనలు చదివి వారికి అభిమానిగా మారాడు. వివిధ సాహిత్య ప్రక్రియల స్వరూపాలలో కొత్తకొత్త ప్రయోగాలు చేస్తూ ప్రచారంలో ఉన్న రొమాంటిక్ అభిరుచులను బాహాటంగా ఖండించేవాడు. ఇతడు చాలా సాహిత్యప్రక్రియలలో రచనలు చేసినా కథాసాహిత్యమే ప్రముఖ రంగంగా నిలిచింది. ఇతని సాహిత్యాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి  ఆదివాసులకు సంబంధించిన రచనలు, నగరవాసులకు సంబంధించిన రచనలు, 'మాటీ మటాల్' నవల. ఇతడు తన రచనలలో నిరుపేదల, అణగారిన వర్గాల, నిరపాయులైన ఆదివాసుల పక్షాన ఎప్పుడూ నిలిచాడు. మాటీ మటాల్ నవల ఇతనికి జ్ఞానపీఠ పురస్కారం తెచ్చి పెట్టింది. ఈ నవల నేపథ్యం ఒరిస్సా గ్రామీణ ప్రాంతం. చదువుకొని, నగరంలో ఉద్యోగం చేయకుండా తన ప్రజలను బాగుచేయాలని సొంత గ్రామానికి వచ్చి తన ఉద్దేశాన్ని నెరవేర్చుకొనేందుకు కృషి చేసిన రవి అనే ఆదర్శయువకుని కథ. ఈ నవలలో ఒరిస్సా గ్రామీణ జీవితపు సమగ్రచిత్రంతో పాటు మానవీయ పరిస్థితుల మనోవైజ్ఞానిక చిత్రణ కూడా కనిపిస్తుంది. ఇతడు 1991, ఆగస్టు 20వ తేదీన తన 77 సంవత్సరాల వయసులో కాలిఫోర్నియాలోని సాన్‌జోస్లో మరణించాడు.

వ్యాసం

# రవ్వలు రాల్చిన రామశేషయ్య

**రామశేషయ్య రచనా సౌరభం...**



డా॥ వెలుదండనిత్యానందరావు
94416 66881

శ్రీ జి. రామశేషయ్య కంఠదఘ్నంగా సాహిత్యాన్ని అధ్యయనం చేసిన పండితులు. హృదయదఘ్నంగా కవితా మాధుర్యాన్ని ఆస్వాదించగలిగిన భావుకులు. అన్నిటినీ మించి సాత్వికతను, మైత్రీ స్వారస్యాన్ని సంపాదించుకున్న సహృదయులు. రచనలను బండ్ల కెత్తకపోవచ్చు. కానీ మూడు దశాబ్దాల్లో వందలాది శిష్యుల్లో సాహిత్యానురక్తిని ఉద్దీపింపచేసిన ఆదర్శ అధ్యాపకులు. అది చాలు ఆయన జీవన సాఫల్యానికి.

రామశేషయ్య డాక్టర్ సి.నారాయణ రెడ్డి విశ్వంభర కావ్యంపై విలువైన, వివేచనాత్మక గ్రంథాన్ని వెలువరించిన విద్వాంసులు. కవితా రంగంలో "అక్షరపతాక" ఎగరేసి మానవీయ మూల్యాలను ప్రబోధించిన శబ్దోపాసకులు. రామశేషయ్య కవితా వ్యాసంగానికి స్థూలంగా వస్తు (Content) విశేషంగా ఆలంబనగా నిలిచినవి "కాలం" (Time), శబ్దం (Space) అయితే అభివ్యక్తి (Form) విషయకంగా ఆలంబనమైన రీతి నిర్వచనాత్మకత, నినాదాత్మకత. ఆరోపాత్మకత.

> **మాట్లాడడం** అంటే భౌతికంగా 'నోటితో' శబ్దాలను చేయడం మాత్రమే కాదు. పువ్వులు, ప్రకృతి, ఉద్యమాలు, ప్రపంచం, గ్రంథాలయాలు ఎన్నెన్నో మరెన్నో వాటి ధర్మాల ద్వారా భావాలను పలుకుతాయి. గతులను నిర్దేశిస్తాయి. గమన ప్రేరకాలవుతాయి. "ప్రతిశబ్దమూ నయనపథాలలో ధ్వనించే ఒక మణి"గా వెలిగిపోతుంది..



కవులకూ కాలానికీ మొదటినుంచి అవినాభావసంబంధముంది. కాలం కవికుమారులకెప్పుడూ తరగని గని. "కాలాయ తస్మై నమః" అని నివాళు లర్పించిన ఆదర్శకవి మొదలుకొని "కాలమూలంబు సర్వంబు" అన్న తిక్కన కవీంద్రుని దాటుకొని వర్తమాన కవులవరకు కాలకౌశలాన్ని బహువిధాలా కీర్తించినవారే

"కాలం నిత్య నవీనం.
నిత్య నవీనత లేకుంటే
కాలానికి అర్థమే లేదు.
ప్రతి ప్రొద్దుపొడుపు
కొత్తకు నూత్నభాష్యం
ప్రతి వసంతం
కాలానికి నూతనమకుటం"

(అక్షర పతాక పుట.4)

"స్తబ్దత లేని కాలానికి
వేగాన్ని సంధిస్తాడు మనిషి
స్థిరత్వం లేని కాలానికి
చరిత్రను ఆపాదిస్తాడు మనిషి"

అంటూ రామశేషయ్య కాలాన్ని హృదయంగమంగా కవిత్వీకరిస్తారు.

"స్థలం వల్ల స్థిరత్వభావన
కాలంతో పరిణామకల్పన
దిశలూ దశలూ ప్రకృతిగా
స్పందనలూ, అనుభవాలూ జీవితంగా
స్థలకాలాలు
ఉనికి నాణెం చెల్లుబాటుకు
బొమ్మబొరుసుల్లాగా....."

ఉంటాయని రామశేషయ్య భౌతికాకృతి దాల్చిన ప్రతివస్తువుకు స్థల (Space), కాలాల (Time) అవిభాజ్యత అనివార్యమని చెప్తున్నారు.

ఇక వస్తు ధర్మాన్ని నియతంగా నిర్దేశించి చెప్పడం స్థూలంగా నిర్వచన రీతి.

"కవిత-
శతాబ్దాల శబ్దారామంలో
నిత్య వసంత మూర్తి.
చైతన్యం ప్రేమించే భాష కవిత."
"మనిషి-
నడిచే దీపం.
ఎదిగే జ్ఞానం.
వివేక శిల్పం".
"శబ్ద జగతిలో నిత్య యాత్ర
ప్రతి కవిత ఒక మజిలీ"

లాంటివి నిర్వచన శిల్పానికి లక్ష్యప్రాయాలుగా నిలుస్తాయి.

"వికాస విన్యాస విలసన వలయం
గ్రంథాలయం"

"సంప్రదాయం మరిచిన ప్రయోగం
నేల విడిచిన సాము"

"ప్రయోగరహిత సంప్రదాయం
లెన్సెస్ లేని ఫ్రేము".

లాంటివి నినాదాత్మక శిల్ప విన్యాసానికి ఎత్తిన అక్షర పతాకలు.

"నేను శబ్దాలను చూస్తాను.
నేను శబ్దాలను వింటాను.
నేను శబ్దాలను స్పృశిస్తాను.
నేను శబ్దాలను ఆఘ్రాణిస్తాను.
నేను శబ్దాలను చప్పరిస్తాను"

ప్రతిశబ్దం నాకొక 'కాంతిబింబం'గా తోస్తుంది. బింబాలను పేరుస్తాను, వివిధాలుగా కూరుస్తాను.

రామశేషయ్య ఆరోపక పరంపరను కూర్చి కవిత్వీకరిస్తున్నారు. వినడం శబ్ద ప్రయోజనం కానీ త్వక్ చక్షు శ్రోత్ర జిహ్వాఘ్రాణేంద్రియాలు లుప్తం చేసి వాటి ధర్మాలను 'శబ్దానికి' ఆరోపించి పాఠకునికి వాచ్యంగా అన్ని తానే చెప్పకుండా ఊహకు, ఆలోచనకు కవాటాలు తెరిచే పనిచేస్తున్నారు ఈ కవి గారు. అంటే శబ్దానికి రంగు రుచి వాసన ఉంటాయి. శబ్దం ఒక నిర్జీవ పదార్థం కాదు. సజీవ సుందర శిల్పం అని ప్రబోధిస్తున్నారు. కవిగానీ, వ్యక్తిగానీ 'శబ్దాన్ని' బాధ్యత నెరిగి ప్రయోగించాలని కర్తవ్యబోధ చేస్తున్నారు.

"కవిత్వంలో శబ్దం పలకడమే కాదు పాడుతుంది. నడవడమే కాదు ఎగురుతుంది. కవిత్వంలో స్మరణ ఎక్కువ కవిత్వంలో శబ్దం కిటికీ వంటిది దానిలో నుంచి వెనకాల ఉన్న దూరలోకాలు గగన ఖండాలు తోపులాటలు కనబడతాయి" అని ఒకసారి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు అన్న మాటలు మదిలో మెదులుతున్నాయి (సాహిత్యంలో శబ్దం కృష్ణశాస్త్రి రేడియో ప్రసంగం. కృష్ణశాస్త్రి వ్యాసావళి - 2. పుట. 5).

"**కవిత్వంలో** శబ్దం పలకడమే కాదు పాడుతుంది. నడవడమే కాదు ఎగురుతుంది. కవిత్వంలో స్మరణ ఎక్కువ కవిత్వంలో శబ్దం కిటికీ వంటిది దానిలో నుంచి వెనకాల ఉన్న దూరలోకాలు గగన ఖండాలు తోపులాటలు కనబడతాయి" అని ఒకసారి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు అన్న మాటలు మదిలో మెదులు తున్నాయి (సాహిత్యంలో శబ్దం కృష్ణశాస్త్రి రేడియో ప్రసంగం.

"చుట్టూరా ఉన్న జీవితం కుములు
తున్నప్పుడు
కవి - శబ్దించే మౌనం.
చుట్టూరా ఉన్న జీవితం కరళ్ళెత్తు
తున్నప్పుడు
కవి కరుగుతున్న ద్వీపం."

"ఘన ధ్వని గర్భిత
మౌన గర్జ పర్జన్యం కవిత
మౌనం ఆంతరంగికమైనది."

శబ్దం బాహిరమైనది. పరావాక్కులోనున్న అఖండ మౌనం వైఖరీదశలో శబ్దఖండాలుగా వ్యక్తమవుతుంది. పదాలై, వాక్యాలై అవతలి వ్యక్తి శ్రవణేంద్రియానికి అందివస్తుంది. 'శబ్దించే మౌనం', 'ధ్వని గర్భిత మౌనం' అని పరస్పర భిన్న వస్తు సంయోజన కల్పనం ద్వారా రామశేషయ్య కవిగా అవతరించారు.

"పూవులు చెప్పే రంగుల భాషలోని
సౌందర్యం.
పరిమళాలు గుప్పె గుసగుసలలోని
ఆంతర్యం
అవ్యక్త మాధుర్యాన్ని
అనుభవనీయంగా
ఉపన్యసించే ప్రకృతి వైపు మనసు
మగ్గితే
పంచభూతాల సమ్యక్ ప్రాణ
సంపుటిలో
యువత పాఠం ప్రారంభమైనట్టు...."

...........

"పువ్వు మాట్లాడదు.
మాట్లాడిస్తుంది.
ప్రేక్షకులు తమలో తాము
మాట్లాడుకునేట్లు చేస్తుంది."

ఇలాంటి కవితల్లో ఉన్నదంతా ఏక భావవ్యక్తీకరణే.

మాట్లాడడం అంటే భౌతికంగా 'నోటితో' శబ్దాలను చేయడం మాత్రమే కాదు. పువ్వులు, ప్రకృతి, ఉద్యమాలు, ప్రపంచం, గ్రంథాలయాలు ఎన్నెన్నో మరెన్నో వాటి ధర్మాల ద్వారా భావాలను పలుకుతాయి. గతులను నిర్దేశిస్తాయి. గమన ప్రేరకాలవుతాయి. "ప్రతిశబ్దమూ నయనపథాలలో ధ్వనించే ఒక మణి"గా వెలిగిపోతుంది.. మిత్రులు రామశేషయ్య గారు భిన్నభిన్న మాధ్యమాల ద్వారా లభిస్తున్న హితబోధను దోసిలి పట్టి వినయంతో స్వీకరించి మనకు ఆప్యాయంగా అందిస్తున్న కవి.



**రామశేషయ్య** డాక్టర్ సి.నారాయణరెడ్డి విశ్వంభర కావ్యంపై విలువైన, వివేచనాత్మక గ్రంథాన్ని వెలువరించిన విద్వాంసులు. కవితా రంగంలో "అక్షరపతాక" నెగరేసి మానవీయ మూల్యాలను ప్రబోధించిన శబ్దోపాసకులు. రామశేషయ్య కవితా వ్యాసంగానికి స్థూలంగా వస్తు (జశీఙవఙ) విశేషంగా ఆలంబనగా నిలిచినవి "కాలం" (Time), శబ్దం (Space) అయితే అభివ్యక్తి (Form) విషయకంగా ఆలంబనమైన రీతి నిర్వచనాత్మకత, నినాదాత్మకత. ఆరోపాత్మకత.

# కవివి కదూ!



డా॥ కె. జ్యోత్స్నప్రభ, 94918 77359



నీకంటూ నిర్మించుకొన్న
ఊహాలోకంలో హాయిగా విహరిస్తావ్
పుప్పొడిరేణువులను
పూల పరిమళాలను
ఒళ్ళంతా అద్దుకుంటావ్
సీతాకోకచిలుకలకున్న
అనేకానేక వర్ణాలు
మనసంతా దిద్దుకుంటావ్
అల్లరి మబ్బుతునకకు
అందమైన ఆకృతినిస్తావ్
అపర సృష్టికర్తవు కదూ
ఊహకు పొడవు, వెడల్పు లోతున్నాయి
ఆ వైశాల్యానికి అడ్డంకులు, అడ్డుగోడలు ఉంటాయా?
కంటి కందనివి, కన్నీళ్ళుగా రాలినవి
అన్నీ పట్టుకొంటావు
ప్రతిమనిషి మానవత్వపు కవితై పోవాలని
కలలు కంటావు
నిరాశా, నిస్పృహ, అవినీతి, ఆకలిమంటలు
అన్నీ బద్దలు కొట్టే
అక్షరకారునివి కదా నువ్వు
అంతా నీవే నిండి, అన్నింటా నువ్వే వ్యాపించి...
అవును కవివి కదూ
నిజజీవన పోరాటంలో అలసినవారికి
కమ్మని కవితా విందులు చేస్తావ్
బ్రతుకులో తీయదనాన్ని పరిచయం చేస్తావ్
కవివి కదూ!

# శ్రామికవర్గ రచయిత....

# హ్యారీ మార్టిన్సన్






హ్యారీ మార్టిన్సన్ 6 మే 1904న జన్మించిన స్వీడిష్ రచయిత, కవి . 1949లో అతను స్వీడిష్ అకాడమీకి ఎన్నికయ్యాడు. అతను 1974లో "మంచు బిందువును పట్టుకుని విశ్వాన్ని ప్రతిబింబించే రచనలకు" తోటి స్వీడన్ ఐవింద్ జాన్సన్‌తో కలిసి సాహిత్యంలో ఉమ్మడి నోబెల్ బహుమతిని అందుకున్నాడు. మార్టిన్సన్ మరియు జాన్సన్ ఇద్దరూ అకాడమీ సభ్యులుగా ఉన్నందున ఈ ఎంపిక వివాదాస్పదమైంది. అతను "20వ శతాబ్దపు స్వీడిష్ కవిత్వం యొక్క గొప్ప సంస్కర్త. మార్టిన్సన్ ఆగ్నేయ స్వీడన్‌లోని బ్లెకింగే కౌంటీలోని జామ్‌షాగ్‌లో జన్మించాడు. చిన్న వయస్సులోనే అతను తన తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయాడు. 1929లో కవిగా రంగప్రవేశం చేశాడు. ఆర్తుర్ లండ్క్విస్ట్, గుస్తావ్ సాండ్‌గ్రెన్, ఎరిక్ అస్క్‌లండ్ మరియు జోసెఫ్ కజెల్‌గ్రెన్‌లతో కలిసి అతను స్వీడిష్ ఆధునికవాదాన్ని పరిచయం చేసిన ఫెమ్ ఉంగా (ఫైవ్ యూత్స్) అనే సంకలనాన్ని రచించాడు. నవలా రచయితగా అతని ప్రజాదరణ పొందిన విజయం 1935లో సెమీఆటోబయోగ్రాఫికల్ వచ్చింది. గ్రామీణ ప్రాంతంలో ఒక యువకుడు ఎదుర్కొన్న కష్టాల గురించి. వ్యాగన్ టు క్లాక్‌రైక్ (ది రోడ్ టు క్లాక్‌రైక్, 1948) అనే నవల ఆయనకు మంచిపేరు తెచ్చింది. 1949లో స్వీడిష్ అకాడమీ సభ్యునిగా ఎన్నికైన మొట్టమొదటి శ్రామిక వర్గ రచయితగా మార్టిన్సన్ నిలిచాడు. అతని అత్యంత ప్రసిద్ధ రచనలలో ఒకటి అనియరా. ఇది అంతరిక్ష నౌక అనియరా యొక్క కథ, ఇది అంతరిక్షంలో ప్రయాణించేటప్పుడు దాని మార్గాన్ని కోల్పోతుంది. తరువాత గమ్యం లేకుండా తేలుతుంది. ఈ పుస్తకం 1956లో ప్రచురించబడింది. హ్యారీ మార్టిన్సన్ 1929లో స్పోక్స్‌కెప్ (ఘోస్ట్ షిప్) కవితల సంకలనంతో అరంగేట్రం చేసాడు, ఇది చాలా వరకు సముద్రం మరియు జీవితం యొక్క మూలాంశాలను నావికుడిగా ఉపయోగించింది. అదే సంవత్సరం అతను ఆధునిక స్వీడిష్ సాహిత్యంలో సంచలనాత్మకమైన మరియు అత్యంత ప్రభావవంతమైన పుస్తకం అయిన ఫెమ్ ఉంగా సంకలనానికి స్త్రీ అందించాడు. మార్టిన్సన్ యొక్క ప్రధాన పురోగతి అతని 1931 కవితా సంకలనం నోమాడ్. అతని రచనలలో ప్రకృతి మరియు భూమి చాలా ముఖ్యమైన మూలాంశాలుగా మారాయి. 1930వ దశకంలో అతను గద్యం మరియు కవిత్వం రెండింటిలోనూ ప్రకృతిని వర్ణించడంలో నైపుణ్యాన్ని పెంచుకున్నాడు. స్వీయచరిత్ర నవలలలో నాస్లోర్నా బ్లోమా (ఫ్లవరింగ్ నెటిల్, 1935) మరియు వేగెన్ ఉట్ (ది వే అవుట్, 1936) లో మార్టిన్సన్ తన బాల్యం గురించి చెప్పాడు. అతని చివరి రచనలో ఆధునిక జీవితం మరియు దాని సాంకేతికతపై అతని 1960 కవితా సంకలనం వాగ్నెన్ (ది వాగన్)లో మరింత బలమైన వ్యక్తీకరణగా వచ్చింది. ఆయన 11 ఫిబ్రవరి 1978న మరణించాడు.

క థ

# ప్రమాణ భంగం

## (ఫ్లాష్ ఫిక్షన్ కథ)

సౌందర్యాన్ని తరచి చూసిన ఒక డాక్టర్....



**ఆడెపు లక్ష్మీపతి**
97012 27207

**ఆంగ్ల మూలం : ఎస్.ఈ. కేసీ**
**తెలుగు అనువాదం : ఆడెపు లక్ష్మీపతి**

"సరే ... మిమ్మల్ని మరింత సంతోషపెట్టడానికి నేనేం చెయ్యాలి?''

డా॥ హరకల్ ప్రతి కన్సల్టేషన్ ఇలాగే ప్రారంభిస్తాడు. ఎదుటి వ్యక్తిలోని లోపం లేదా వైకల్యం ప్రస్తావించకుండా చాలా సంయమనంగా మాట్లాడ్డం మొదలెడతాడు.

కానీ, ఎదురుగా కూర్చున్న మహిళ ఉలుకూ, పలుకూ లేకుండా సూటిగా చూసింది. తన వృత్తిగతమైన చిరునవ్వు ముఖం మీంచి చెరిగిపోకుండా జాగ్రత్త వహించినప్పటికీ అతణ్ణి ఆమె చూపులు కలవరపెట్టాయి. ఆ గదిలో గడ్డ కట్టుకుపోయిన నిశ్శబ్దం ఇక భరించరానిదైపోయింది. స్తబ్దంగా ఉన్న గాలికి చలనం కలిగించేందుకు అతడు గబగబా చర్యలు ఆరంభించాడు. గుర్తింపు ధ్రువపత్రాలు, చికిత్స వివరాల బ్రోచర్లు, ఇన్స్యూరెన్స్ ఎంపికల కరపత్రాలు, బహూకృత షీల్డులు, జ్ఞాపికలు... వగైరాలని విశాలమైన టేబుల్ మీద చప్పుడు వచ్చేలా అటూ ఇటూ జరిపాడు. కాస్మెటిక్ కలల వాణిజ్యంలో దానికి సంబంధించిన అవలక్షణాలూ దానికి ఉంటాయి కదా!

తన వృత్తిగత అనుభవం దృష్టితో ఆమెను పరిశీలనగా చూసి ఆమె బాహ్య లక్షణాలను మదింపు చేశాడు డాక్టర్. నిశ్చయంగా ఆమె మధ్యవయస్కురాలైన ఒక సాధారణ స్త్రీ, ముఖంలో స్వల్పంగా ముడుతలున్నా వర్చస్సు తగ్గలేదు.

తన మస్తిష్కంలో ఆమెను కోయడానికి ఉపక్రమించాడు డాక్టర్. మాంసాన్ని లోతుగా కత్తిరించి సమాన మడతలుగా అమర్చి హెచ్చుతగ్గులు సవరించాడు. అందం, ఆకృతి విషయంలో రాజీ పడకుండా, ఏదీ ఎక్కువ ఏదీ తక్కువ కాకుండా - అత్యంత కచ్చితత్వంతో పని పూర్తిచేశాడు.

ప్రజ్ఞావంతుడైన ఆ శస్త్ర వైద్యునికి, వేలాది ప్లాస్టిక్ సర్జన్ల మధ్య సాటిలేని మేటి వైద్యుడిగా పేరుగాంచిన ఆ కాస్మెటిక్ కళాకారునికి, అందం అనేది సూక్ష్మభేదాల్లో, సౌష్టవంలో, సమతుల్యతలో ఉంటుందని తెలుసు. ముఖం అద్దంలో కనపడే ప్రకాశవంతమైన ప్రతిబింబం. నిజమైన 'సౌందర్యాన్ని' నిర్వచించే నిర్ణీత కొలతలు గానీ, ఆకృతులు గానీ లేవు. 'అందం' అంటే ముఖావయవాలు కుడి నుంచి ఎడమకు, ఎగువ నుంచి దిగువకు చూసినప్పుడు ఏకకాలంలో సమరేఖలోకి ఒదిగినట్టు సర్వాంగీకృత లక్షణ సమన్వితంగా చక్కగా కనిపించడం, ముఖం, ఇతర బాహ్యాంగాల నడుమ ఒక రసస్ఫోరకమైన నిష్పత్తి ప్రస్ఫుటం కావడం... కానీ, అతని శస్త్రచికిత్స పరికరం - స్కాల్పెల్ - రక్తం మరకలు అంటుకోకుండా, శుభ్రంగా బయటికి వచ్చింది. ఆమె బాహ్యాకృతిలో ఎలాంటి వక్రత లేదు. ఆమె 'పర్ఫెక్ట్'గా వుంది. అయితే మామూలు దృష్టికి ఆనని ఏదైనా చిన్న లోపం, సౌష్టవ రాహిత్య చిహ్నం ఉందేమో కనుక్కోవడానికి కంప్యూటర్ అనాలిసిస్ చేయాల్సి వుంటుంది. అతని పరిశీలనా నైశిత్యం ఎంత పదును దేరినదంటే ఎదురుగా వున్నది ఎవరైనా, ఎంత చక్కటి రూపమైనా కానివ్వు, ఆ సూక్ష్మ పరీక్ష ఎప్పుడూ ఏదో ఒక చిన్నలోపాన్ని పసిగట్టేస్తుంది! తన మీద తనకున్న గట్టినమ్మకంతో, డాక్టర్ ఆమెను మళ్ళీ తన మానసిక ఉచ్చులోకి లాగి, వివరాల లోలోతుల్లోకి వెళ్ళి, తన అమ్ములపొదిలోని అనేక పాత కొత్త ఫార్ములాలను అనువర్తింపజేస్తూ శల్య పరీక్ష చేశాడు.

చిత్రం... డాక్టర్ ఏ లోపమూ కనుక్కోలేకపోయాడు. ఆమె శరీరాకృతి సమతుల్యత పూర్తిగా లోపరహితం. ఇందుకు అతడు ఆనందించాలి, దిగ్భ్రాంతి చెందాలి, కానీ అతణ్ణి ఏదో భయం ఆవహించింది.

ఈ అంతిమ నిర్ధారణకి డాక్టర్

క
థ

వచ్చేదాకా ఎదురు చూసినట్టుగా ఆగిన ఆమె అకస్మాత్తుగా ముందుకు వంగింది. డాక్టర్ వెనుకకు తుళ్ళాడు, ఎంత ప్రయత్నించినా తన త్రొటుపాటు దాచుకోలేకపోయాడు.

"డాక్టర్ హరకల్, మీరు చాలా ప్రతిభావంతులని విన్నాను. ఈ రంగంలో మిమ్మ మించిన వాళ్ళు లేరు.. కాదా?"

అత్యుత్తమ కాస్మెటిక్ సర్జన్‌గా పేర్గాంచిన ఆ డాక్టర్‌కి అలాంటి పొగడ్తలు కొత్త కాదు. కానీ ఏ భావమూ వ్యక్తం చేయకుండా సూటిగా, చల్లగా మాట్లాడు తున్న ఆమె తీరుకి అతని వొళ్ళు జలదరించింది. ఆమె మాటలు నిజమేనన్నట్టుగా అతడు మౌనంగా తలాడించాడు. తను కూర్చున్న కుర్చీకి ఎదురుగా వున్న డెస్క్ వాస్తవానికి తనకి పొడిగింపే. దానిపై ప్రతీదీ క్రమపద్ధతిలో వుంది. క్యాపులు బిగించిన పెన్నులు పొందికగా రోజ్ వుడ్ హోల్డర్లో అమర్చివున్నాయి. మరకలు లేని చతురస్రాకారపు డెస్క్ బ్లాటర్ అంచులు సూటిగా డెస్క్ మూలల్ని చూస్తున్నాయి. పేపర్ క్లిప్పులు సైతం కవాతు చేస్తున్న సైనికుల్లా ఏకపంక్తిలో పేర్చివున్నాయి. సూక్ష్మాతిసూక్ష్మ విషయాలపట్ల కూడా అతని శ్రద్ధ నిరుపమానం అని తెలుస్తున్నది.

"డాక్టర్, నేను కోరేదేమిటంటే...."

అతని చూపులతో చూపులు కలుపుతూ ఆమె డెస్క్ అంచుపైకి వొరిగింది. అతని దృష్టిపథమంతా ఆమే ఆక్రమించింది. నేపథ్య దృశ్యం అకస్మాత్తుగా అతని చేపకన్ను దృగావరణంలో వెనక్కి వెళ్లింది. భీతి గొలిపే ఆమె ముఖం అతని ప్రపంచంగా మారింది. అందులోని మందహాసపు ప్రతి రేఖ కుడి ఎడమ వైపులకు సమానంగా విస్తరించింది. చెవులు, కళ్ళు, దవడ ఎముకలు - ద్రవమట్టంతో నిర్ధారించిన సమతలంలాగా పొందికగా సరైన స్థానాల్లో ఉండి అతడి నోట మాటరాకుండా చేశాయి.

"...మీరు నా రూపం సరిచేయాలి..."

కటువు మాటల ఆమె నోరు, అదే అర్థంకానితనంతో, మూలల వద్ద మెలి తిరిగింది. అతని దృష్టి ఇంకా లోతుల్లోకి పోయింది. అద్భుతమైన పొందికతో మెరుస్తున్న పెదవులు, పలువరుస వెనకాల... అనంతమైన సొరంగంలోకి - ఆమె దట్టమైన, ముదురు ఎరుపురంగు అంగుడులోకి అతడు జారిపోయాడు.

"... అలా ...నేను అద్దంలోకి చూసినప్పుడు, వెనక్కి తిరిగి చూసే దుష్ట మొహాన్ని నేను చూడకూడదు."

డాక్టర్ నిర్ఘాంతపోలేదు. ఆమె ఆ మాట అంటుందని అతనికి తెలుసు. తర్వాత చేయాల్సిన పని గురించి అతని మస్తిష్కం అప్పటికే ప్రణాళిక వేస్తోంది - స్కాల్పెల్, కొయ్య సమ్మెట... విరిగి చెదిరిన ఎముకలు, ఊడి, చచ్చుపడి, పరవశత్వంతో వేళ్ళాడే కండరాలు.



క
వి
త

## వినాయక చవితి

కం: పూజలు జేతురు ముందుగ
జాజులు మారేడు గరిక జమ్మియు తులసిన్
జేజేలని విఘ్నపతిని
భూజనులందరు గొలుతురు బొజ్జగణపతిన్

## విజయ దశమి

తే.గీ: పాడి పంటలు వృద్ధిగ పండవలయు
విద్య వాణిజ్య నుద్యోగవిత్తములును
ఆయురారోగ్య మైశ్వర్యమనవరతము
విజయమొసగాలి యన్నింట విజయదశమి

**- డా॥ మహ్మద్ షరీఫ్**

వ్యాసం

# దళిత, మైనార్టీ, స్త్రీవాద సాహిత్యం తులనాత్మక పరిశీలన

**అస్తిత్వ వాదాలకు ఆత్మీయ స్పర్శ....**



డా॥ మహ్మద్ హసేన
99080 59234

తెలుగు సాహిత్యంపై సంస్కృత సాహిత్యం మరియు ఆంగ్ల సాహిత్య ప్రభావం అధికంగా చూపాయనేది అందరికి తెలిసిన విషయమే. పాశ్చాత్యులు వేగంగా నాగరికతను సంతరించుకోవడం, మేథావికాసం త్వరితగతిన సాధించటం అనంతరం వలసల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలపై పడింది. అది సాహిత్యానికి మినహాయింపేమి కాదు. తెలుగు సాహిత్యంపై ప్రభావం చూపిన కాల్పనిక వాదం, భావవాదం, అభ్యుదయవాదం, విప్లవ సాహిత్యవాదం మొదలుకొని తదనంతర కాలంలో వచ్చిన స్త్రీవాద సాహిత్యం, దళితవాద సాహిత్యం, మైనారిటీ వాద సాహిత్యం ఇలా సమాజ పరిణామక్రమంలో మనుషుల మధ్య జరుగుతున్న సంఘర్షణల ఫలితంగా వచ్చినవే ఆయా సాహిత్య ఉద్యమాలు. సనాతనంగా వస్తున్న మూఢాచారాలకు వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమాలు కొన్ని ఐతే, ఆధిపత్య ధోరణిని ప్రశ్నించడానికి వచ్చిన ఉద్యమాలు మరికొన్ని అందుకు ఉదాహరణ స్త్రీవాద సాహిత్యం మరియు దళితవాద సాహిత్య ఉద్యమం.

ఇక మనుషుల మధ్య విభజనరేఖలు గీసి ఓ వర్గం వారిని హింసించటం, చులకనభావంతో చూడటం వల్ల వచ్చిందే మైనార్టీవాద సాహిత్య ఉద్యమం వెరసి సమాజంలోవున్న అనేక రకాల రుగ్మతల నివారణకు లేపనంగా చైతన్యం తీసుకొని వచ్చేవిధంగా ఉపయోగపడినవి కొన్ని సాహిత్య ఉద్యమాలు ఐతే, పర్వతం బద్దలై చల్లారినట్లు, ఉవ్వెత్తున అలలా ఎగిసి చప్పున చల్లారిన సాహిత్య ఉద్యమాలు కొన్నింటిని తెలుగు సాహిత్యంలో చూడవచ్చును. ఉదాహరణకు దిగంబర కవిత్వం, అభ్యుదయ కవిత్వం. ఏది ఏమైనప్పటికిని ఆయా ఉద్యమాలు సమాజంలోని వివిధ వర్గాల, సమూహాలపై కొంతమేర ప్రభావం చూయించటం, మరికొంత మందిలో చైతన్యం కల్గించటం, ఎక్కువ మందిని ఆలోచింపజేయటం జరిగింది. ఇందుకు ఉదాహరణకి చుండూరు దళితుల ఊచకోత కానీ



ముప్పాళ్ళ రంగనాయకమ్మ

గుజరాత్ లోని గోద్రా అల్లర్లు కానీ నేటికీ సమాజంలో స్త్రీలపై జరుగుతున్న "లైంగిక పరమైన హింస" మొదలైన విషయాలపై ఆయా రచయితలు లేదా రచయిత్రులు చేసిన రచనలు ఆలోచింపజేసే విధంగా వున్నాయనటంలో ఎలాంటి సందేహం లేదు. ఉదాహరణకి స్త్రీవాద రచయిత్రి ముప్పాళ్ళ రంగనాయకమ్మ గారు "రామాయణ విషవృక్షం" రాసి సంచలనం సృష్టించారు. అలానే అదేకోవలో ఓల్గా మరియు మందారపు హైమవతి, విమల, కొండేపూడి నిర్మల, పాటిబండ్ల రజని, జయప్రభ మొదలైన వారు ఆలోచింపజేసే రచనలు చేసి స్త్రీవాద సాహిత్య ఉద్యమానికి నీరు పోసి కాపాడే ప్రయత్నం చేసి మహిళల గళం బలంగా వినిపించారు.

కొన్ని స్త్రీవాద కవితల్ని "నీలిమేఘాలు" సంకలనం నుంచి పరిశీలిద్దాం. 1972లోనే ఓల్గా "ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి" అనే స్త్రీవాద కవిత రాయడం గమనార్హం. అప్పటికే ఇంత తీవ్రంగా రాయటం వల్ల బహుశా ఇదే మొదటి స్త్రీవాద కవితగా పేర్కొనవలసి ఉంటుందేమో.

"అందమైన దోపిడీకీ
పవిత్రమైన హింసకూ
న్యాయమైన దాస్యానికి
బలైపోయిన నేను
భారత స్త్రీని !"

అంటూ ప్రారంభమైన ఈ కవిత ఇలా ముగుస్తుంది--

"కానీ రేపు
నేను పతివ్రతామ తల్లిని కాను
ప్రబంధకన్యను గాను
పంచదార చిలకను కాను
ఫ్యాషన్ పరేడ్ బొమ్మను కాను
పసిపాపలను చంపే పాపిని కాను
పంచాది నిర్మల వారసురాలిని!"

అనటంలో విప్లవం, తిరుగుబాటు స్ఫురిస్తుంది. 1984లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో "బందిపోట్లు" అనే కవిత రాసి సంచలనం సృష్టించిన కవయిత్రి సావిత్రి. అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన అన్నట్లుగా రాయబడిన ఈ కవిత గొప్ప స్త్రీవాద రచన.

"పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తా"
నని పంతుల గారన్నప్పుడే భయమేసింది.
"ఆఫీసులో నా మొగుడున్నాడు!
అవసరమొచ్చినా సెలవివ్వడ"ని
అన్నయ్య అన్నప్పుడే అనుమానమేసింది.
"వాడికేం? మగమహారాజ"ని
ఆడామగా వాగినప్పుడే అర్థమైపోయింది
"పెళ్ళంటే" "పెద్దశిక్ష" అని
మొగుడంటే 'స్వేచ్ఛా భక్షకుడ'ని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని"

మొక్కపాటి సుమతి "మిత్రవైరుధ్యమా?" అనే కవితలో వర్గ శత్రువుకంటే లింగశత్రువే మిన్న అని చాటిన కవితలోంచి కొన్ని వాక్యాలు ఇవి.

"వర్గశత్రువు నా శ్రమనే
దోచుకుంటాడు. ఈ దుష్టశత్రువు నా
బ్రతుకే దోచుకుంటాడు
"వాడు నాకు కలనైనా కల్పిస్తాడు
వీడు నా కలలన్నీ చెరిపేస్తాడు
వాడికి నేను మరను తిప్పే మనిషిని
వీడికి నేను మనిషి రూపంలోని మరని
ఎవడూ అన్నది? ఇది మిత్ర
వైరుధ్యమని?"
"పెళ్ళినాడు పురోహితుడు చూపే
అరుంధతీ నక్షత్రంలా
ఆకాశంలో సగాన్ని చూపి
మోసం చేస్తున్నాడు వాడు."

**దళితవాద కవిత్వం విషయానికి వస్తే సనాతన హిందూ సంప్రదాయ వ్యవస్థే దళితవాద ఉద్యమానికి బీజం వేసేలా చేసిందని చెప్పాలి. హిందూ వ్యవస్థలోని చాతుర్వర్ణ్య వ్యవస్థ (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర) శూద్రులతో మొదటి మూడు వర్ణాల వారు నిర్దంద వెట్టిచాకిరి చేయించుకోవటం, ఊరికి దూరంగా ఉంచడం వల్ల వారి నుండి ప్రతిఘటన మొదలైంది.**

మందరపు హైమవతి "సర్పపరిష్వంగం" కవితలో స్త్రీ దుస్థితిని వివరించిన తీరు అద్భుతం. తుర్లపాటి రాజేశ్వరి భర్తను "తాళికట్టిన మృగం" అని కళ్ళెర్రజేస్తే, శ్రీమతి ఎస్.రజియా బేగం ఓ కవితలో అన్ని దశల్లోనూ స్త్రీని అణచివెయ్యటాన్ని మినీకవితలో ఈ విధంగా చెప్పారు.

"నేనొక స్త్రీని
నేనొక నిషిద్ధ జీవిని
మొన్నటి దాకా నా నవ్వు నిషిద్ధం
నిన్న నా చదువు నిషిద్ధం
నేడు నా బ్రతుకు కూడా నిషిద్ధమే"

అంటుంది. ఆడపిల్లలు పుట్టకుండా, పుట్టినా బతకనీయకుండా చేసే వ్యవస్థపై ప్రశ్నలవర్షం కురిపిస్తుంది ఈ కవితలో. విమల అనే కవయిత్రి "వంటిల్లు" కవితలో వంట చెయ్యడము స్త్రీ శక్తిని దోపిడీ చెయ్యటంగానూ, పురుషాధిక్య ప్రభావంగానూ చిత్రీకరిస్తూ మంచి కవిత రాశారు.

ఇక మైనారిటీవాద సాహిత్య విషయానికొస్తే "బాబ్రీ మసీదు విధ్వంసం" అనంతరం మరియు గుజరాత్‌లోని "గోద్రా మతఘర్షణల" అనంతరం దేశంలోని అల్పసంఖ్యాక వర్గం యొక్క రక్షణ ప్రమాదంలో పడినట్లైంది. ఆత్మరక్షణ లోంచి వచ్చిన అస్తిత్వవాద సాహిత్య ఉద్యమమే "మైనారిటీవాద సాహిత్య ఉద్యమం".

నేటి ఆధునిక ముస్లింవాద కవిత్వానికి ఆద్యుడు ఖాదర్ మొహియుద్దీన్. వీరి కవితా సంపుటి పేరు 'పుట్టుమచ్చ' సాహితీ లోకంలో ఎప్పటికీ చెరిగిపోకుండా ముస్లింల పరిస్థితిని చూపెట్టేది "పుట్టుమచ్చ". ముస్లింగా పుట్టినందుకు, తన అస్తిత్వాన్ని చూపించుకోవాల్సి వచ్చినందుకు బాధపడుతూ, సమాజంలో ముస్లింల పరిస్థితి ఎలా ఉందో ఎత్తిచూపుతూ రాసిన కవిత "పుట్టుమచ్చ".

'నేను పుట్టక ముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదైవుంది నాపేరు'....

ముస్లింలను దేశద్రోహులుగా చిత్రించడాన్ని, ముస్లింగా తాను జన్మించక ముందే "దేశద్రోహి"గా ముద్ర వేయడాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు ఖాదర్ మొహియుద్దీన్. తమ బతుకుల్ని ప్రశాంతంగా బతకనీయడంలేదని ప్రతిక్షణం భయంతో గడపాల్సి వస్తుందని కింది వాక్యాల్లో వాపోతాడు.

'నా అస్తిత్వం చుట్టూ
అనుమానాల వలయాన్ని విస్తరిస్తుంది
వర్తమానం
నా నెత్తి మీద సదా
నిఘా నీడల్ని విసిరేస్తుంది వర్తమానం'
"హిందీ-హిందూ-హిందూస్థాన్
ముస్లింజావో పాకిస్థాన్" (పుట్టుమచ్చ)

అంటూ ప్రతిక్షణం భారతీయ ముస్లింలని పాకిస్థాన్ వెళ్ళగొట్టాలనే కుట్రని, ఆ కుట్ర నినాదాల రూపంలోకి మారిన వైనాన్ని రాశాడు. గతంలో



ఖాదర్ మొహియుద్దీన్

ముస్లింలు ఏ పరిస్థితులలో ఉన్నారో ప్రస్తుతం కూడా అలాగే వున్నారు. పుట్టుమచ్చలోని ప్రతివాక్యం ఇప్పటి పరిస్థితికి అద్దంపట్టినట్లుగా ఉంటుంది. ఓట్ల గురించి మాత్రం ముస్లింలు ఎలా పనికొస్తారో ఈ వాక్యాల్లో ధ్వనింపజేస్తాడు ఖాదర్ మొహియుద్దీన్.

'పార్లమెంట్ భవనంలో వాలేందుకు
నా నెత్తురు పాద లేపనమవుతుంది'

(పుట్టుమచ్చ)

గుజరాత్‌లోని గోద్రా ఘటనానంతరం జరిగిన ముస్లింల నరమేధం తర్వాత అధికారం చేపట్టడానికి ముస్లిం వ్యతిరేక ఓటు బ్యాంకు ఒక సాంప్రదాయంగా మారుతున్న దుర్మార్గమైన రాజకీయ పరిణామాన్ని ఒక ముస్లింగా ఖాదర్ మొహియుద్దీన్ పుట్టుమచ్చ కవిత ద్వార తెలియజేస్తాడు.

దళిత బహుజన కవిత్వం 'బహువచనం' పేరుతో వచ్చింది. ఆ సంకలనంలో ముస్లింలలో ఛాందసత్వాన్ని ఖండించే కవితలే (రెహాల్, హిజాబ్, సాంచా-స్కైబాబ గారివి) ఎక్కువగా ఉన్నాయి. ఒక తాహెర్ రాసిన 'బైల్ కే దిమాక్ వాలే', సయ్యద్ గఫార్ రాసిన 'జనన వాంగ్మూలం' అనే కవితలు తప్ప 'బైల్ కే దిమాక్ వాలే' అనే కవితలో "తాహెర్" ఈ విధంగా అంటాడు.

'మీ మసీదుల్ని సమాధి చేస్తాం
మీ అడాళ్ళను బహిరంగంగా చెరుస్తాం
అప్పటికీ తిరుగుముఖం పట్టలేదా
మేమే మీలోకి పరకాయ ప్రవేశం చేసి
పాకిస్తాన్ లో వదిలివస్తాం' (బహువచనం)

ఒక మతమౌఢ్యుడైన హిందువు ముస్లింలను ఏ విధంగా చూస్తాడో ప్రస్తుత పరిస్థితులు కళ్ళకుకట్టే విధంగా రాశాడు పై కవితలో "తాహెర్".

"పుట్టుమచ్చ" "జిహాద్", "జల్ జలా" అనే మూడు కవితా సంకనాలు మైనారిటీవాద సాహిత్య ఉద్యమానికి బీజాలు వేసినప్పటికి నేటికి కొంతమంది రచనలు చేస్తూనే వున్నారు. వారిలో స్కైబాబా, షాజహానా, సలీం, నస్రిన్ ఖాన్, గఫార్, సలీమా, ఖాదర్ మొహియొద్దిన్ మొదలైనవారు మైనారిటీవాద సాహిత్యానికి సంబంధించిన రచనలు చేస్తూ మైనార్టీల అణిచివేత మతతత్వం, వివక్షపై తమ గళాన్ని బలంగా వినిపిస్తూనే ఉన్నారు.

ఇక దళితవాద కవిత్వం విషయానికి వస్తే సనాతన హిందూ సంప్రదాయ వ్యవస్థే దళితవాద ఉద్యమానికి బీజం వేసేలా చేసిందని చెప్పాలి. హిందూ వ్యవస్థలోని చాతుర్వర్ణ వ్యవస్థ (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర) శూద్రులతో మొదటి మూడువర్గాల వారు నిర్బంధ వెట్టిచాకిరి చేయించుకోవటం, ఊరికి దూరంగా ఉంచడం వల్ల వారి నుండి ప్రతిఘటన మొదలైంది. అనంతరం వీరిలో చైతన్యం కల్గటంతో హిందూ సనాతన సాంప్రదాయ వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించటం మొదలుపెట్టారు. ఈ కోవకు చెందిన వారిలో మొదటి వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును ప్రస్తావించాలి. అనంతరం అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని క్రమంగా వారి భావజాలాన్ని రచనల రూపంలోను ఇతర రూపాలలలో ప్రశ్నించటం నినదించటం మొదలు పెట్టారు. వీరికితోడు జాతీయోద్యమ కాలంలో మహాత్మాగాంధీ కూడా దళితులకు దేవాలయాలలో ప్రవేశం కల్పించటం వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేయడం వంటివి కూడా దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయి. అలానే దళితకవులు కానీవారు కూడా దళితులపట్ల జరుతున్న అన్యాయాలను ప్రశ్నించటం మొదలుపెట్టారు. వారిలో త్రిపురనేని రామస్వామి చౌదరి (సూత పురాణం) సతీష్ చందర్ (పంచమవేదం) తల్లాప్రగడ సూర్య నారాయణ (హేళావతి) (1913) వేంకటపార్వతీశ్వర కవులు (మాతృ మందిరం) (1919) ఉన్నవ లక్ష్మినారాయణమాలపల్లి (1922) మొదలైనవారు దళితుల సమస్యలు ఇతివృత్తాలుగా తీసుకొని రచనలు చేసి తమవంతుగా దళితులకు సంఘీభావం ప్రకటంచారు.

ఇంకా కొద్దిమంది చైతన్యం పొందిన



బోయి భీమన్న

మేధావి వర్గానికి చెందిన దళిత కవులు తమకు తమ వర్గం వారికి జరుగుతున్న అన్యాయాలను, దురాగతాలను, వివక్షను ప్రశ్నించడం మొదలుపెట్టారు. వీరిలో గుర్రం జాషువా ముందు వరసలో ఉంటారు. సమాజంలోని అసమానతలపై అస్త్రంగా "గబ్బిలం" అనే సందేశ కావ్యం జాషువా రచనలలో అత్యంత హేతుబద్ధమైన మరియు తార్కికమైన రచనగా చెప్పాలి. "వానిరెక్కల కష్టంబు లేనినాడు" అని దళితుల శ్రమ గూర్చి వివరిస్తాడు ఇందులో. సమాజంలోని అంటారనితనం పేరుతో ఊరికి దూరంగా విసిరివేసినట్లుగా వీరి గృహాలను వేరు చేయటం, అత్యంత అమానవీయంగా వీరిపట్ల ప్రవర్తించటం స్వయంగా చూసి చలించి వేదనను, ఆవేదనను అక్షరాలను ఆయుధాలుగా చేసి నాటి కులవ్యవస్థను "నాలుగు పడగల హైందవ రాజు" అంటూ నిరసన వ్యక్తం చేస్తాడు.

"కులమతాలు గీచుకొన్న గీతలజొచ్చి పంజరాన కట్టుపడను నేను నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తరుగు లేదు విశ్వనరుడ నేను" అని స్వయంగా ప్రకటించుకున్నాడు. అలానే ఎండ్లూరి సుధాకర్ కవితను చదివితే పంచమ కులస్థుల దీనస్థితి ఎలా ఉందో ఈ కవిత ద్వార అర్థం చేసుకోవచ్చును.

"నేనింకా నిషిద్ధమానవున్నే
నాది బహిష్కృత శ్వాస
నామొలకు తాటాకు చుట్టి
నా నోటికి ఉమ్మిముంతకట్టి
నన్ను నలుగురిలో
అసహ్యమానవ జంతువుని చేసిన
"మనువు"
నా నల్లని నుదుటి మీద బలవంతంగా
నిషిద్ధముద్రవేసి నప్పుడే నా జాతంతా
క్రమక్రమంగా హత్య చేయబడింది"

అంటూ చారిత్రక సత్యాన్ని వాస్తవిక రూపాన్ని విశదీకరించి 'నెత్తుటి ప్రశ్న' వేస్తాడు సుధాకర్ పై కవితలో. నేటికి కూడా దళితులపట్ల అమానవీయంగా ప్రవర్తించడం నిత్యం మనం చూస్తూనే ఉన్నాం. ఆ మధ్య కాలంలో ఉత్తర ప్రదేశ్‌లో దళితుడైన పెళ్ళికొడుకు గుర్రంపై ఊరేగుతుండగా అగ్రవర్ణాలకు చెందిన కొంతమంది ఆ పెళ్ళి కుమారుడిని గుర్రంపై నుండి దింపి అత్యంత దారుణంగా అవమానించిన సంఘటన ఇంకా కళ్ళముందు మెదులుతూ ఉండడం బాధకల్గించే విషయం కాకపోతే ఏమిటి? మనుషులుగా మనం ఓ ప్రశ్న వేసుకోవాలి ఇక్కడ.

"నిలువుటద్దం ముందు
నిల్చుంటాన్నేను
అవయవాల దొంతరకాదు
అవమానాల పరంపర కనిపిస్తుంది
ఒత్తయిన ఉంగరాల జుత్తు
చూసుకున్నప్పుడు
కత్తులూ, కత్తెర్లూ నిరాకరించిన
మా ముత్తాత శిరోజాలు
ముడులు ముడులుగా గుర్తొచ్చి
కరుకు దువ్వెనతో కర్కశంగా
సాపుచేస్తాను"

అంటూ సతీష్ చందర్ "పంచమ వేదంలో" దళితుల అవమానాల పరంపర వివరిస్తాడు మనకు. అదేకోవలో బోయి భీమన్న "గుడిసెలు కాలిపోతున్నాయ్", "పాలేరు" నాటకాలు, బోయ జంగయ్య, కుసుమ ధర్మన్న, కొలకలూరి ఇనాక్, గద్దర్, వంగపండు, వేముల ఎల్లయ్య, గోరేటి వెంకన్న, కాలువ మల్లయ్య



గుర్రం జాషువా

మొదలైనవారు దళితవాద సాహిత్యం గూర్చి విస్తృతంగా రచనలు చేసి తమవంతు దళితులలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేసి మిగతా వర్గాల వారిని కూడా (దళితులు కానివారు) ఆలోచింపజేసేవిధంగా ప్రామాణికమైన రచనలు చేశారు.

తెలుగు సాహిత్యంలో వచ్చిన స్త్రీవాద సాహిత్యమైనా, దళితవాద సాహిత్యమైనా, మైనారిటీవాద సాహిత్యమైన అస్తిత్వపరంగా వచ్చినవే ఐనప్పటికీ సమాజంలో నేటికి స్త్రీల పట్ల, దళితుల పట్ల, మైనారిటీల పట్ల అత్యంత అమానవీయంగా ప్రవర్తించటం, వివక్షకు పాల్పడటం, స్త్రీలపై అత్యాచారాలు, గృహ హింస, లైంగికపరమైన హింస నేటికీ జరుతూనే ఉంది. డెబ్బై ఐదు సంవత్సరాల స్వాతంత్ర్య దేశంలో నేటికి "స్త్రీ స్వేచ్ఛ" అందని ద్రాక్షగానే ఉంది. మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ మాత్రం గడప దాటడం లేదు. చట్టసభలలో 33% మహిళా రిజర్వేషన్ బిల్లు ఇంకా పార్లమెంటులో చట్టబద్ధత పొందని పెండింగ్ బిల్లుగా ఉండడం ఆలోచించాల్సిన విషయం. అక్షరాస్యత మరియు నాగరికతతో సమాజం రోజురోజుకు ఆధునికత సంతరించు కుంటున్నప్పటికి, శాస్త్ర సమాచార సాంకేతికరంగం వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో ఈ మూడు వర్గాలపై (స్త్రీలు, దళితులు, మైనార్టీలు) హింస లేదా వివక్ష నేటికి కొనసాగటం సిగ్గుపడాల్సిన విషయం. సమాజంలో సగభాగమైన స్త్రీలు మరో సగభాగమైన పురుషుల ద్వార బాధింపబడటం లేదా హింసింపబడడం అంటే స్త్రీలకున్న స్వేచ్ఛను స్వాతంత్ర్యాన్ని హరించివేస్తున్నట్లే ఇది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం, ఎన్ని చట్టాలు వచ్చిన అవి కాగితం పులుల మాదిరిగా గాండ్రిస్తున్నాయి తప్ప స్త్రీలపై జరుగుతున్న హింసను నియంత్రించ లేకపోవడం బాధకల్గించే అంశం. ఇక అల్ప సంఖ్యాకులుగా (మైనారిటీలు) పిలువబడుతున్న వారు మెజార్టీ వర్గం వారిచే అవమానింపబడడం అనేది ఆలోచించాల్సిన విషయం.

రాజ్యాంగంలోని మౌళికసూత్రమైన "లౌకిక" భావనను మెజార్టీవర్గం వారు అర్థం చేసుకోలేకపోవడం దురదృష్టకరం. రాజ్యాంగంలోని 14వ నిబంధన సమానత్వపు హక్కును కల్పించింది దాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తే మంచిదనేది నా అభిప్రాయం లేదా రాజ్యాంగంలో ఉన్న "భిన్నత్వంలో ఏకత్వం" భావనను గూర్చి అందరికి అవగాహన కల్పించి భవిష్యత్తులో ఎలాంటి వివక్షలేని సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత పాలకులకు అలాగే అందరిని గౌరవిం చాల్సిన బాధ్యత గల పౌరులుగా మనం కూడా ఉండాలి అనే విషయాన్ని మర్చిపోకూడదు. ఇక సాటి మనిషిలో కులాన్ని, మతాన్ని చూస్తూ మానవత్వాన్ని మరిచి మృగంలా ప్రవర్తించటం ఆదిమ సమాజాలకు, మధ్యయుగాలకు ఉదా హరణగానే చెప్పాలి. మహాకవి గురజాడ అప్పారావు "మతములన్నియు మాసిపోవును మమత ఒక్కటే గెలిచి నిలుచును" అన్నట్లుగా సాటి మనిషిపట్ల సంకుచితంగా ప్రవర్తించకుండా విశాల హృదయంతో ప్రవర్తించడమే అసలైన "మానవతావాదం". అలాంటి వర్గరహిత, కులరహిత, మతరహిత, స్త్రీ, పురుష వివక్షలేని సమసమాజం త్వరలోనే రావాలని ఆకాంక్షిస్తూ.

దృశ్య సాహిత్యం

# Spider-Man: No Way Home

స్పైడర్‌మాన్ - నో వే హోమ్ అమెరికాలో 2021లో నిర్మించబడ్డ చిత్రం. 2017లో వచ్చిన Spider-Man: No Way Home మరియు 2019లో వచ్చిన Spider Man Far From Homeకి కొనసాగింపు. ఇది మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ 27వ చిత్రం. ఈ సినిమా దర్శకుడు జాన్ వాట్స్ (Jon Watts), రచయిత Chris McKenna మరియు ఎరిక్ సామెర్స్ (Erik Sommers) స్పైడర్‌మాన్‌గా పీటర్ పార్కర్ నటించాడు.

పీటర్ మిస్టియోని చంపినందుకు పీటర్ చెడ్డవాడని భావించి అందరూ అతన్ని తిడతారు. పీటర్ గర్ల్‌ఫ్రెండ్ ఎమ్‌జి ని అందరూ ప్రశ్నలు వేసి వేధిస్తారు. పీటర్ ఆమెను వాళ్ళనుండి రక్షించి తన అపార్ట్‌మెంట్‌కి తీసుకెడతాడు. పోలీసులు వచ్చి మిస్టియోని చంపినందుకు పీటర్‌ని అరెస్ట్ చేస్తారు. పీటర్ లాయర్ వెళ్ళి అతన్ని బెయిల్ మీద విడిపిస్తాడు. పీటర్ ఇవన్నీ మరిచిపోయి ఎమ్.జి. నెట్‌లో కలిసి చదువుకుందామని చెబుతాడు. అతన్ని ఇద్దరు ఫ్రెండ్స్ అతను కలిసి ఎమ్.ఐ.టి.లో సీటు కొరకు అప్లయ్ చేస్తారు. ఎమ్.ఐ.టి.లో స్పైడర్‌మేన్‌కి సీటు ఇస్తే ఎమ్.ఐ.టి. చెడిపోతుందని ఎమ్.ఐ.టి. పీటర్ మరియు అతని ఇద్దరు మిత్రులకు సీటు ఇవ్వడానికి నిరాకరిస్తారు. తనవల్ల ఇతరులకు కూడా కష్టం కలిగినందుకు పీటర్ ఎంతో బాధపడి మిత్రుడు డాక్టర్ స్ట్రేంజ్ దగ్గరికి వెళ్ళి తాను స్పైడర్‌మాన్ అని తెలిసినందువల్ల చాలామందికి నష్టం కలుగుతుందని టైమర్ మిషన్ని వెనక్కి తిప్పి తాను స్పైడర్‌మాన్‌ని అని అందరికీ తెలియకుండా చేయమని అడుగతాడు. నా దగ్గర ఇప్పుడు టైమ్ స్టోర్ లేదు. కాని నీకు తెలిసినవాళ్ళందరినీ తెలియకుండా చేయగలనని చెబుతాడు. డాక్టర్ స్రేంజ్‌తో పీటర్ ఒకె చెబుతాడు. పీటర్ తన స్నేహితురాలి దగ్గరికి ఎమ్.ఐ.టి.కి వెడతాడు. ఆమె ఎయిర్‌పోర్ట్‌లో ఉందని తెలిసి పీటర్ అక్కడికి వెళతాడు. అక్కడికి డాగ్ హాక్ వచ్చి డాగ్ హాక్ పీటర్‌ని స్పైడర్‌మాన్‌గా భావించి దాడి చేస్తే పీటర్ ప్రతిఘటిస్తాడు. పీటర్ తన సూట్‌లో ఉన్న నానో పార్టికల్స్‌ని డాగ్ హాక్‌లోకి ప్రవేశపెడతాడు. ఆ గొడవలో అనుకోకుండా చిక్కిన స్నేహితురాలిని కూడా పీటర్ కాపాడుతాడు. దానితో ఆమె పీటర్‌కు అతని ఎం.ఐ.టి. అడ్మిషన్ పీటర్‌తో పాటు ఫ్రెండ్‌కి కూడా ఇస్తానని చెబుతుంది. గ్రీన్ గాబ్రిల్ డాక్టర్ స్ట్రేంజ్ తరువాత డాగ్ హాక్‌ని పీటర్‌ని స్ట్రేంజ్ తీసుకెళతాడు. తరువాత డాక్టర్ స్ట్రేంజ్ డాగ్ హాక్‌ని బంధించడంతో మల్టీ యూనివర్స్‌లోని వాళ్ళంతా వచ్చేస్తారు. స్ట్రేంజ్ పీటర్‌తో "వాళ్ళంతా వస్తున్నారు. ఇంటర్నెట్‌లో వాళ్ళందరినీ సెర్చ్ చేసి నాశనం చేయాలని" చెబుతారు. రక్షణ కోసం పీటర్‌కి ఆ విలన్స్‌ని బంధించడానికి కావల్సిన టైమ్ ట్రావెల్ ఎక్విప్‌మెంట్‌ని కూడా ఇస్తాడు. పీటర్ ట్రావెల్ ఎక్విప్‌మెంట్ ద్వారా వెతుకుతుంటే ఒక సూపర్ విలన్ కనబడతాడు. పీటర్ అక్కడికి వెళ్ళి ఎలక్ట్రోను ఎదిరిస్తాడు. అక్కడికి సాడ్‌మాన్ వచ్చి పీటర్‌ని ఎలక్ట్రా నుండి కాపాడుతాడు. చివరికి పీటర్ సాడ్‌మాన్‌ని, ఎలక్ట్రాని బంధించి తనతో తీసుకెడతాడు. ఆ వరకే డాక్టర్ స్ట్రేంజ్ పీటర్‌ని కూడా బంధించి ఉంటాడు.

ఆర్డినే ఫోన్ చేసి నీతో మాట్లాడడానికి ఒక సూపర్ విలన్ వచ్చాడని చెబుతుంది. పీటర్ కంగారుతో అక్కడికి వచ్చేసరికి నార్మల్ ఆర్డీనీతో మాట్లాడుతుంటాడు. నార్మన్ మంచివాడుగా చెడ్డవాడుగా రెండు లక్షణాలు కలిగి ఉంటాడు. పీటర్ నార్మన్‌ను బంధిస్తాడు. డా॥ స్ట్రేంజ్ ఒక పెట్టె తీసుకువచ్చి బంధితులందరిని వాళ్ళ యూనివర్స్‌కి పంపిద్దామని ప్రయత్నిస్తాడు. బంధితులందరు మమ్మల్ని యూనివర్స్‌కి పంపిస్తే మేం స్పైడర్‌మాన్ చేతిలో చనిపోతామని భయపడతారు. పీటర్ వాళ్ళను సంస్కరించడం కోసం స్ట్రేంజ్ దగ్గర బాక్స్ తీసుకుంటాడు. స్ట్రేంజ్‌కి కోపం వచ్చి పీటర్‌ని బంధించడానికి ఒక మిర్రర్ డైమన్షన్ సృష్టిస్తాడు. పీటర్ తెలివిగా బాక్స్‌ని రింగ్‌ని చిక్కించుకొని మిర్రర్ డైమన్షన్ నుంచి బయటకు వస్తాడు. స్ట్రేంజ్ మిర్రర్‌లో చిక్కుకు పోతాడు. పీటర్ బంధితులను మీరు మంచిగా మార్చుకుంటే ఉంటారా? లేక మీ యూనివర్స్‌కి వెళ్ళి స్పైడర్‌మాన్ చేతిలో చనిపోతారా అని అడుగుతాడు. వాళ్ళు ఇక్కడే ఉంటామనడంతో తన ఇంటికి తీసుకెళ్ళి మిర్రర్ నుండి మాట్లాడడానికి ప్రయత్నిస్తాడు. మొదట ఢాకాని ఒక ఎక్విప్‌మెంట్ ద్వారా పీటర్ మంచిగా మారుస్తాడు. ఎలక్ట్రో గ్రీన్ గ్రాబిల్‌కి కూడా ఎక్విప్‌మెంట్స్‌ని కనిపెడతాడు. కానీ గ్రీన్ గ్రాబిల్ చెడ్డగా మారిపోయి పీటర్‌ని ఎదిరిస్తాడు. మిగతావాళ్ళను కూడా విలన్స్‌గా మారుస్తాడు. అందరూ వెళ్ళిపోతూ గ్రాబిల్ ఒక బాంబ్ వేస్తాడు. దానివల్ల ఆంట్రీమేరీ చనిపోతుంది. ఇదంతా పీటర్ ఫ్రెండ్స్ ఎం.జి.నెట్.టి. ఎలా చూసి పీటర్‌ని కాపాడాలనుకుంటారు. నెట్ తన దగ్గర టైమ్ ఎక్విప్‌మెంట్‌ని ఓపెన్ చేస్తాడు. మళ్ళీ ఓపెన్ చేస్తే మరో స్పైడర్‌మాన్ వస్తాడు. చివరికి దాన్ని ఓపెన్ చేయడం ఆపి నెట్ పీటర్ కోసం వెతికితే ఆంట్రీమేరీ కోసం దుఃఖిస్తున్న పీటర్ కనబడతాడు. నెట్ అతన్ని ఓదార్చి ఈ స్పైడర్‌మాన్‌లు నాకు సహకరించడానికి వచ్చారని తెలుపుతాడు. చివరికి విలన్స్‌ని మార్చేస్తాడు. కాని గాబ్రే మాత్రం తన దాడి కొనసాగిస్తాడు. అతను పైన స్ట్రేంజ్ ఒక బాక్స్ తెరుస్తాడు. గాబ్రిల్ ఆ బాక్స్ పైన బాంబ్ వేయడంతో మల్టీయూనిర్స్ గేట్లు తెరుచుకుంటాయి. మల్టీయూనివర్స్‌నుంచి ఎందరో విలన్లు బయటికి వస్తారు. ఆంట్రిమెన్ చనిపోవడానికి కారణమైన గాబ్రీపైన పీటర్ దాడిచేస్తాడు. పీటర్ దగ్గరి ఎక్విప్‌మెంట్స్ వలన గాబ్రీ కూడా మంచిగా మారుతాడు. పీటర్ తరువాత ఈ యుద్ధాలకు విముఖుడై స్ట్రేంజ్ దగ్గరకు వెళ్ళి మనం మొదట అనుకున్నట్టు నన్ను ఎవరూ గుర్తుపట్టకుండా చెయ్యమని అడుగుతాడు. స్ట్రేంజ్ చివరికి అట్లాగే చేస్తాడు. ఇద్దరు స్పైడర్‌మాన్‌లను గర్ల్‌ఫ్రెండ్‌కి కూడా పీటర్ బై చెప్పి మారిపో తాడు. అతడు చివరికి ఎమ్.జి.నెట్ దగ్గరికి వెళ్ళినా వాళ్ళు అతన్ని గుర్తుపట్టరు. చివరికి పీటర్ కథ అలాగే నిలిచిపోతుంది. ఇది కేవలం వినోద భరితమైన చిత్రంగా నిలిచింది. కథ కంటే కథనం, గ్రాఫిక్స్ ఎక్కువగా ప్రభావితం చేశాయి.

కవిత

# నది - నాయకుడు



ఘనపురం దేవేందర్, 90300 33331

నాగరికత
నదుల తీరాల్లో పుడితే
అభివృద్ధి
నదీ లక్షణమున్న
నాయకుల పాలనలో పుడుతుంది
నది పుట్టినప్పుడు
బిందువులెక్కనే కనబడ్తది
రాళ్ళు రప్పలు... పిచ్చి మొక్కలు
అడ్డుకుంటామని విర్రవీగుతాయి
నది నడక మొదలుపెట్టిందా
దట్టమైన వనాలు
ఎత్తైన పర్వతాలు
చెలికత్తెలై స్వాగతం పలుకుతాయి
రాళ్ల రప్పలు పిచ్చి మొక్కలు
తమ బతుకు మీద విరక్తి చెంది
జీవచ్ఛవాలవుతాయి
వెక్కిరించిన నాలుకలు
కుక్కిన పేనులవుతాయి
విర్రవీగి నది నుంచి
బయటపడ్డ చేపలు
విలవిలలాడడం తప్పా ఏం చేస్తాయి!
భూమిని పచ్చగా మారుస్తూ
సకల జీవాల బువ్వకు ప్రాణం పోస్తూ
నది తృప్తిగా నిరహంకారంగా
రాజసంతో ప్రవహిస్తూనే ఉంటది
నది లెక్కనే నాయకునికి
కులమతాల పట్టింపు ఉండదు
నదీ పాపాలను తొలగిస్తే
నాయకుడు ప్రజల శాపాలను తీసేస్తాడు
నదికి, నాయకునికి రైతే తొలి మిత్రుడు
రైతుమెచ్చుకున్నదే జీవనది
రైతు మెచ్చుకున్న నాయకుడే మహారథి
ఎన్ని రత్నాలున్నా
సముద్రుడు నది కాలేడు
ఎంత విశాలమైన ఛాతి ఉన్నా
వ్యాపార మనస్వి
ఎన్నడు నాయకుడు కాలేడు
ఉప్పు సముద్రం లెక్కనే
తియ్యని నదుల్ని మింగుతూ ఉంటాడు
దేశానికి ఇప్పుడు
నదిలాంటి నాయకుడు కావాలి
నదులకు జన్మనిచ్చిన గంగోత్రి లాగా...
నాసిక్ త్రయంబకం లాగా...
నా తెలంగాణ
నాయక జననిగా
కీర్తిని పొందాలి



కథ

# ఆత్మ అగ్ని.. అది నిన్ను దహిస్తుంది

నాటి భారతదేశ విభజన గురించి మానవాత్మ ఆలాపన...



రామా చంద్రమౌళి
93901 09993

తొంభై సంవత్సరాలనుండి పిడికెడు గుండెలో ఒక అగ్నిపర్వతమై, నిరంతరం దహించబడ్తున్న మహారణ్యమై, అనంతమైన రక్తకెరటాలతో గర్జిస్తున్న సముద్రమై జీవితం లోలోపల దహిస్తూనే ఉంది అతన్ని తన దీర్ఘ జీవితంలో ఎప్పుడు కళ్ళు మూసుకున్నా అతనికి నిద్ర రాలేదు. ప్రతిగా మరచిపోలేని చిన్ననాటి పుంఖానుపుంఖాల బీభత్స జ్ఞాపకాలు, రక్తసిక్త స్వానుభవ దృశ్యాలు, మృత్యువుతో పోరాడుతూ ఆక్రందిస్తున్న వందలమంది క్షతగాత్రుల ఆక్రందనలు, చావుతో తలపడ్తూ నిస్సహాయంగా చేసే ఆర్తనాదాలు.. ఇవే.

ఎంత మరచిపోదామన్నా అస్సలే స్మృతిపథంలో నుండి క్షణకాలమైనా మరుగునపడకుండా భగభగా మండుతూ జ్వలించే 3323 కిలోమీటర్ల పొడవైన పచ్చి రక్తాన్ని చిమ్ముతున్న రక్తరేఖ. సర్ సిరిల్ జాన్ రాడ్క్లిఫ్ 'విభజన రేఖ' అది. మానవ చరిత్రలో ఇక ఎన్నడూ మానని గాయమై రెండు దేశాలనూ, వందల ఏండ్ల అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించిన 88 కోట్ల మంది 'భారతీయులు' అని పిలువబడ్డ ఒక జాతి వేర్పడి శత్రువులుగా మారి ఒకరినొకరు అమానుషంగా చంపుకుంటూ, గ్రామాలకు గ్రామాలను కాలబెడ్తూ, కోట్ల రూపాయల ఆస్తులను తగులబెట్టుకుంటూ, హననం.. ఊచకోతలు, మారణకాండ. విచక్షణను మరిచి ఎక్కడినుండి చిమ్మిందో సముద్రాలపర్యంత ద్వేషంతో, పగతో.. మతపిచ్చితో, మానవత్వాన్ని మంటగల్పుతూ సాగించిన హత్యాకాండ.

ఏది నీ మతం.. ఏది నీ దేశం.. ఏది నీ మాతృభూమి.. ఏది నీ గాలి.. ఏది నీ నీరు.. ఎవరివి ఈ అడవులు.. ఎవరివి ఈ నదులు.. ఈ పచ్చటి పొలాలు.. ఇన్నాళ్ళూ మనతో కలిసి జీవించిన మన పశువులు.. మన పక్షులు.. మన ప్రకృతి.. మన చెట్లూ.. గుట్టలూ..పర్వతాలూ.. మన హిమాలయాలు.. మన లాహోర్.. మన బెలూచిస్తాన్.. మన కరాచి.. మన కలకత్తా.. మన అమృత్సర్.. మన గురుదాస్పూర్.. మన చిట్టగాంగ్ కొండలు.. మన ఢాకా.. మన రావి.. సట్లెజ్.. మన బియాస్.. మన బ్రహ్మపుత్ర.. ప్రాణజలాలు. వీటన్నిటిపై మన భారతీయుల కవోష్ణ రక్తాన్ని చల్లుతూ.. గీయబడ్డ 'సిరిల్ జాన్ రాడ్క్లిఫ్' రక్తరేఖ. కాగితంపై పెన్నుతో ఒక గీతను గీసినట్టు విభజన రేఖను గీసి.. ఇక తన్నుకు చావండి అని ఎవరో నాయకులు ఎక్కడో కూర్చుని లక్షలమంది జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తూ గీసే సరిహద్దురేఖలను గీసి పడేస్తే.. దానికి మానవీయ కోణంలో ఇవ్వవల్సిన పరమార్థం ఏముంటుంది. ఎవరి ప్రయోజనాలను కాపాడేందుకు ఈ విభజన సరిహద్దు రేఖలు గీయబడ్తున్నాయి అనాది మానవ చరిత్రలో యుగయుగాలనుండి.

ఎందుకో అతనికి ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగక గుండెల్లో నుండి చిమ్ముకొచ్చింది కళ్ళనిండా అశ్రువులై. చిన్న పిల్లాడిలా వెక్కిక్కిపడి ఏడ్చాడు కుమిలి కుమిలి.. పొగిలి పొగిలి.

అప్పుడతన్ని అక్కున చేర్చుకుని రవ్వంత అనునయింపుతో.. చిటికెడు ఓదార్పుతో.. ఒక రేణువంత స్పర్శతో సహగమించేవాళ్ళెవరూ లేరు. మనిషికి మనిషి ఆసరా.. మనిషికి మనిషి ఒక అండ.. మనిషికి మనిషి ఒక తోడు నీడ.. భరోసా.. అని చెప్పుకోతగ్గ ఎవరూ లేని సుదీర్ఘ ఏకాంతంలో.,

అతను.. విశ్వనాథ్.. 90 ఏళ్ల విశ్వనాథ్. జీవితమంతా పిడికెడు గుండెలో ఇంకా ప్రేలని అగ్నిపర్వతాలను మోస్తున్న మూడు భారతీయ తరాల విభజన దుఃఖాన్ని భరిస్తున్న మౌన ఋషి.. అతను.. విశ్వనాథ్.. పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతమైన గురుదాస్పూర్లో ఒక ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి అమలిన పసి విద్యార్థులకు మానవీయమైన విద్యనూ.. జ్ఞానాన్నీ ఉర్దూ భాషలో అందిస్తున్న ఏకాంతవాసి.

కొన్ని జీవితాలు 'ఇట్లా తనవలె చేయని నేరానికి జీవితకాల క్షోభను అనుభవిస్తూ

కథ

వాడిన పువ్వులా రాలిపోవలసిందేనా' అని తనలోతానే సంఘర్షించుకుంటూ.,

వెలసిపోవడం.. శిథిలమైపోవడం.. మాసిపోయి.. చివికి చివికి అంతరించి పోవడం.,

అనివార్యమా. అనివార్యమేనా ఈ పరిణామం. .

2

మనిషి తనను తాను తెలుసుకోవాలంటే.. తన చుట్టూ ఉన్న సమాజం గురించి తెలుసుకోవాలె. ఆ సమాజ లక్షణాల గురించీ.. ఆ సమాజాన్ని నడిపిస్తూ, నాయకత్వం వహిస్తూ వాళ్ళను తనవెంట ఏ దిశలో ఏ గమ్యాలకు చేరుస్తున్నారో వాళ్ళ తత్వం గురించీ.. అంతిమంగా ఆ నాయకత్వ లక్ష్యం ఎంతవరకు మానవ ఉన్నతిగురించే.. సకలజన కళ్యాణంగురించే ఉద్దేశించే నిర్వహించబడ్తోందా అన్న స్వచ్ఛతగురించీ తెలుసుకోవాల్సి ఉంటుంది. పురాతన కాలంలో రాజే సర్వాధికారి అని నిర్వచించబడ్డప్పుడు.. ఆ రాజు ఒక కుటుంబానికి తండ్రిలా వ్యవహరిస్తూ తన ప్రజల సర్వబాధ్యతలనూ స్వీకరిస్తూ.. ప్రజల జీవితాల ఉన్నతీకరణకూ.. నైతిక ధర్మాధర్మ మానవీయ ప్రవర్తనలకు బాధ్యునిగా వ్యవహరిస్తూ కొన్ని నీతి సూత్రాలకు అనుగుణంగా పరిపాలననూ, మార్గదర్శనక్రియనూ కొనసాగించేవాడు. అప్పుడున్న ప్రాథమిక భావన 'వసుధైక కుటుంబం' అని. మనిషి ఎవరైనా విశ్వనరుడై వర్ధిల్లాలని కూడా.

కాని కాలం గడుస్తున్నకొద్దీ విలువలూ, ధర్మాధర్మ నిర్వచనాలూ, నైతిక ప్రవర్తనల స్వరూపస్వభావాలూ అన్నీ పునః పునః నిర్వచించబడ్తూ, పతనమై పతనమై, మనిషి దిగజారీ దిగజారీ పాతాళానికి కుంగిపోతూ ప్రపంచమంతా యుద్ధాలు యుద్ధాలుగా, ఆక్రమణలూ అణచివేతలుగా, ఉల్లంఘనలూ ఊచకోతలుగా, బలవంతుడు బలహీనున్ని, బీదవాడిని ధనవంతుడు వ్యూహాత్మకంగా తెలివిగలవాడు అమాయకులూ అవసరార్థమై తలవంచిన నిస్సహాయులుగా మిగిలిన వాళ్ళపై దౌర్జన్యాలు చేస్తూ 'పాలించువాడు పాలించబడేవాడుగా' మిగిలి చివరికి మనుషులు 'హేవ్స్ హేవ్ నాట్స్'గా మాత్రమే మారి.. ఐతే స్థూలంగా ఏ యుద్ధమైనా అధికారం కోసమో, స్త్రీ కోసమో జరిగిన మానవ దుశ్చర్యలుగా మాత్రమే అర్థమౌతూ.

శతాబ్దాల మహానాగరిక సమాజంగా ఖ్యాతిగాంచిన పుణ్య భరతభూమి కూడా శతాబ్దాల పర్యంతం అనేకానేక జాతుల, మతాల దండయాత్రలకు గురై, ప్రుగ్గి ప్రుగ్గి 1858 నుండి 1947 దాకా దాదాపు తొంభై ఏండ్ల బ్రిటిష్ పాలకుల ఆక్రమణలో బందీయై జాతీయోద్యమం పేర ఎందరో ఎందరో మహనీయుల బానిస సంకెళ్ళను తెంచుకునేందుకు జరిపిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా.. కాలంతోపాటు పక్వత చెందిన ప్రగతికాముక తరం ప్రచండమైన స్థితిలో ఘటనలు కాలాన్ని కలుపుకుని ప్రవహిస్తూ రెండే రెండు ప్రధాన ప్రవాహాలై, పాయలై ఒకటి భారత జాతీయ కాంగ్రెస్, ఇంకొకటి ముస్లిం లీగ్. ప్రధానమైన మతాలుగా తెరపైకి వచ్చి ఉనికిని పొంది మతవ్యవస్థే ఈ దేశాన్ని ఇక శాసిస్తుందని బుజువుపర్చిన నేపథ్యంలో.,

జిన్నా నాయకత్వంలో 'మాకు ముస్లిం మత పరిగణనతో భారతదేశాన్ని రెండు ముక్కలుగా విడగొట్టి పాకిస్తాన్ అని పిలువబడే జనాభా ప్రాతిపదికన ఒక ప్రత్యేక ఇస్లాందేశం కావాలి' అని ముస్లిం లీగ్, జవాహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో 'మాకు మతసంబంధం లేని హిందూ మరియు సిక్కు మతస్థుల జనాభా ప్రాతిపదికన ఒక లౌకిక దేశం కావాలె' అని భారత జాతీయ కాంగ్రెస్ ఇట్లా రాటుదేలి రెండు వర్గాలూ యుద్ధంలో ఇరు వైరిపక్ష సైన్యాలవలె మోహరించిన సందర్భంలో, కాలం ఎప్పుడూ బలీయమై మనిషిని శాసిస్తూ తను చెప్పినట్టు వినమని నిర్బంధిస్తూ.. వెంటబడి తరుముతున్న సంధికాలంలో పాడిపిస్తూ 'రైడ్ ద హార్స్' సిద్ధాంతాన్ని అమలు చేస్తూ..' బ్రిటిష్ ఇండియా ఆర్మీ'గా తమ ప్రపంచ కాలనీలన్నింటిలో బానిస సైన్యంగా భారతీయులను వాడుకుంటున్నప్పుడు 1939లో మొదలై ఆరేళ్ళపాటు కొనసాగి 1945లో ముగిసిన రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత 'ఓటమికన్న పరమ అవమానకర

**రాడ్‌క్లిఫ్** తన భారతదేశ విభజన రేఖను (అవార్డ్) లార్డ్ మౌంట్ బాట్టన్‌కు ఇచ్చి సరిగా 15 ఆగస్ట్ 1947న లండన్‌కు పయనమై వెళ్ళిపోయాడు. ఇక తర్వాత అతను ఎప్పుడూ తన జీవితకాలంలో మళ్ళీ ఇండియాను సందర్శించలేదు. కాగా ఒక దేశ విభజన కమీషనర్‌గా తను న్యాయం చేయలేకపోవడం వల్ల దాదాపు 15 మిలియన్ల పేద ప్రజలు దేశ సరిహద్దులను దాటి వలసపోవడానికి పడ్డ నరకయాతన దాదాపు రెండు మిలియన్ల మంది ఊచకోతకు బలై మృత్యువుపాలై మరణించడంకు తనే బాధ్యుడనే అపరాధ భావన అతణ్ణి కలచివేయడం వల్ల అతను తనకు బ్రిటిష్ ప్రభుత్వం ఇవ్వజూపిన మూడు వేల పౌండ్ల పారితోషికాన్ని నిరాకరించి తన తప్పుకు నిష్కృతిగా ఇక ఎప్పుడూ ఇండియాకు వెళ్ళలేదు.



గెలుపును' చేజిక్కించుకున్న బ్రిటిష్.. అప్పటికి తనవద్ద ఉన్న 2.5 మిలియన్ల భారతీయ సైన్యాన్ని పోషించలేక రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పాలనను కొనసాగించలేని ఆర్థిక సంక్షోభంలో అనివార్యమై కొన్ని స్వరక్షణ చర్యలను ప్రకటించి తన చర్మాన్నీ తను రక్షించుకుంది. వాటిలో ప్రధాన నిర్ణయాలు అప్పుడు బ్రిటన్‌లో లేబర్ పార్టీ నాయకత్వంలో క్లెమెంట్ రిచర్డ్ అట్లీ ప్రధానిగా ఎర్నెస్ట్ బెవిన్ విదేశాంగ మంత్రిగా ఉన్నారు అధికారంలో.

అప్పటికి వివిధ అంతర్జాతీయ యుద్ధాల్లో పాల్గొన్న 'బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ' 87000 మందిని మృతులుగా, 34354 మంది క్షతగాత్రులుగా, 67340 మంది 'ప్రిజనర్స్ ఆఫ్ వార్'గా కోల్పోయి.. పెద్ద సంక్షోభంలో ఉంది. కాబట్టి ప్రధాని తీసుకున్న కీలక నిర్ణయాలు.,

1) అప్పటికి భారతదేశంలో ఉన్న 'ఇండియన్ ఆర్మీ కమాండర్ ఇన్ చీఫ్ క్లాడె అచిన్లెక్'కు బ్రిటిష్ ఇండియా సైన్యాన్ని ప్రతిపాదిత భారతదేశ పాకిస్థాన్ దేశాల ఆవిర్భావం తదనంతరం భారతదేశ, పాకిస్తాన్ జనాభా ప్రకారం వేర్వేరు చేసి వాళ్ళకు పాకిస్థాన్, భారత సైన్యాలుగా నామకరణం చేసి వాళ్ళ వాళ్ళ దేశాలకు అప్పగించి 15 ఆగస్ట్ 1947 నాటికి చేతులు దులుపుకుని వచ్చేయాలె లండన్‌కు.

2) భారత ఉపఖండానికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించి అప్పటికే బ్యాంకరప్టయి, అంతర్జాతీయంగా ఇజ్జత్ పోగొట్టుకున్న బ్రిటిష్ నష్టనివారణ చర్యల కింద కర్మకాండను ముగించేందుకు సమర్థుడైన చివరి వైస్రాయ్‌గా లార్డ్ మౌంట్ బ్యాటెన్‌ను 4 మార్చ్ 1947న భారతదేశానికి పంపి విధుల్లో చేర్పించారు కొన్ని ముందస్తు కార్యాలు చేపట్టడానికి. అప్పుడు ప్రధాని అతనికి అప్పగించిన పనులు ఈ విధంగా ఉన్నయ్. వీలుంటే, నీకు చేతనైతే భారతదేశాన్ని యునైటెడ్ ఇండియాగా సంఘటితంగా కొనసాగించు. అట్లా వీలుకాని పక్షంలో ఆ శిథిలాలనుండి ఏదైనా కొంత మిగిల్చి పట్టుకురా ఐతే ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే ఇక ఈ భారతదేశ భారాన్ని వదిలించుకుని రా లండన్‌కు.

3) 18 జూలై 1947న 'యునైటెడ్ కింగ్‌డం పార్లమెంట్', 'ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్ట్ 1947'ను పాస్ చేసి తర్వాత ఒక నెల వరకు అంటే 15 ఆగస్ట్ 1947 నాటి వరకు తప్పనిసరిగా అమలు చేయమని ఆదేశించింది. బ్రిటిష్ ఇండియాను రెండు కొత్త సార్వభౌమాధికారాలు గల భారతదేశం మరియు పాకిస్థాన్ అను దేశాలుగా ఏర్పాటు చేయమని చెప్పింది. ఆ రోజుతో ఇక భారతదేశంలో బ్రిటిష్ పాలన ముగియాలె.

4) కొన్నిసార్లు మనకు కావలసిన కొన్ని పనులను సాధించడానికి దాన్ని సాధ్యమైనంతగా చెడగొట్టి, చిందరవందర చేసి అంతిమ లక్ష్యాన్ని చేజిక్కించుకోవచ్చు. బ్రిటిష్ పార్లమెంట్ 'ఇండియన్ ఇండిపెండెంట్ యాక్ట్- 1947'ను ఆమోదించిన తర్వాత అతి తొందరలో విభజన కర్మకాండను ముగించగల అసంబద్ధ వ్యక్తిగురించి వెదికి జయప్రదంగా ఎంచుకున్నారు. అప్పుడు 'విభజన' అనే దుష్కార్యాన్ని అతి నిర్లక్ష్యంగా చేయడానికి సర్ సిరిల్ జాన్ రాడ్‌క్లిఫ్ అనే తెలివైన ప్రసిద్ధ లాయరే కాని దేశాలను విభజించి పటాలనూ రూపొందించగల 'కార్టోగ్రాఫీ' పరిజ్ఞానం అస్సలే లేని వ్యక్తిని పిలిచి వైస్రాయ్ ఇట్లా ఆదేశించాడు. 'మీరు మన పార్లమెంట్ ఆదేశం మేరకు వెంటనే భారతదేశాన్ని సందర్శించి మీకిస్తున్న అనుజ్ఞపత్రంలో చెప్పినట్టు కేవలం 5 వారాలలో.. అంటే 15 ఆగస్ట్ 1947 నాటికి భారతదేశాన్ని మత ప్రాతిపదికపై పాకిస్తాన్ అనే ఒక ముస్లిం దేశంగా, ఇండియా అనబడే లౌకిక.. అంటే సెక్యులర్ దేశంగా వాళ్ళ జనాభా శాతంపై, వనరులు.. అంటే నదులు, అడవులు, ఖనిజ వనరులు, సారవంతమైన భూములు వంటి ప్రకృతి సహజ అంశాలపై ఆధారపడి విభజించాలి కేవలం 5 వారాల్లో. ఈ విషయాన్ని చెప్పినపుడు

**శతాబ్దాల మహానాగరిక సమాజంగా ఖ్యాతిగాంచిన పుణ్య భరతభూమి కూడా శతాబ్దాల పర్యంతం అనేకానేక జాతుల, మతాల దండయాత్రలకు గురై, మ్రగ్గి మ్రగ్గి 1858 నుండి 1947 దాకా దాదాపు తొంబై ఏండ్లు బ్రిటిష్ పాలకుల ఆక్రమణలో బందీయై జాతీయోద్యమం పేర ఎందరో ఎందరో మహనీయుల బానిస సంకెళ్ళను తెంచుకునేందుకు జరిపిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా.. కాలంతోపాటు పక్వత చెందిన ప్రగతికాముక తరం ప్రచండమైన స్థితిలో ఘటనలు కాలాన్ని కలుపుకుని ప్రవహిస్తూ రెండే రెండు ప్రధాన ప్రవాహాలై, పాయలై ఒకటి భారత జాతీయ కాంగ్రెస్, ఇంకొకటి ముస్లిం లీగ్.**

రాడ్‌క్లిఫ్ బిత్తరబోయి.. ఆ అసైన్‌మెంట్‌ను నిర్ద్వంద్వంగా నిరాకరించాడు. అతనన్నాడు 'సర్.. నేను ఇంతవరకు ఎప్పుడూ భారతదేశాన్ని సందర్శించలేదు. అక్కడి భౌగోళిక పరిస్థితులు పూర్తిగా నాకు కొత్త. నేను కార్టోగ్రాఫర్‌ను కాదు. 5 వారాల సమయం చాలా తక్కువ. నేను అక్కడి ప్రజలకు న్యాయం చేయలేను. సారీ' అని.

'కానీ.. ఇది మన పవిత్ర దేశం తన సర్వోన్నత శాసనసభ పార్లమెంట్ ద్వారా అప్పజెప్పిన బాధ్యతాయుతమైన కార్యం. మీ దేశాన్ని మీరు ప్రేమించరా' అని సెంటిమెంటల్‌గా ఒప్పించాడు. రాడ్‌క్లిఫ్ విధిలేని స్థితిలో 'విభజన' కార్యానికి అంగీకరిస్తే అతన్ని 'సరిహద్దు కమీషన్ చైర్మన్'గా నియమించి అతనికి సహాయకునిగా భారతదేశ భౌగోళిక ప్రాంతాలతో బాగా పరిచయమున్న క్రిస్టోఫర్ బ్యూమాంట్‌ను ప్రైవేట్ సెక్రెటరీగా నియమించారు. ఆ రకంగా అతి అయిష్టంగా అంగీకరించిన రాడ్‌క్లిఫ్ 8 జూలై 1947 న మొదటిసారి

కథ

భారతదేశానికి వచ్చి తన విధుల్లో చేరాడు.

ముస్లిం జనాబా అధికంగా ఉన్న పశ్చిమ పంజాబ్, బెలూచిస్తాన్, సింధ్, ముజఫ్ఫరాబాద్ ప్రాంతాల్లో ముస్లిం జనాభాపై సర్వే చేయడానికి 1) పంజాబ్ సరిహద్దు కమీషన్‌లో ఇద్దరు హిందూ, ఇద్దరు ముస్లిం వ్యక్తులతో ఒక కమిటీగా.. సి సి బిశ్వాస్, బి.కె.ముఖర్జీ, అబు సలేహ్, మొహమ్మద్ అక్రం మరియు సారాహ్మాన్ ఉన్నారు. 2) అదే విధంగా ఒక బెంగాల్ సరిహద్దు కమీషన్‌ను మెహర్ చంద్ మహాజన్, తేజాసింగ్, దిన్ మొహమ్మద్, మొహమ్మద్ మునీర్‌లతో నియమించారు.

రాడ్‌క్లిఫ్ స్వయంగా ఒకసారి ముస్లిం జనాభా అధికంగా ఉన్న లాహోర్‌ను, ఒకసారి బెంగాల్‌లోని కలకత్తాను సందర్శించాడు. మిగతా రోజుల్లో ఎక్కువగా సిమ్లాలో తనకు భారీ రక్షణతో ఏర్పాటు చేసిన వైస్రాయ్ లాడ్జ్‌లోనే అనేక తప్పులతో కూడిన అధికారిక భౌగోళిక పటాలు, జనాభా వివరాల్తో.. ముస్లిం, హిందూ జనాభా గణనకు సంబంధించిన అశాస్త్రీయ వివరాలతో.. విభజన కార్యాన్ని అతి తొందరగా పూర్తిచేయించి ఎప్పుడెప్పుడు అధికారాన్ని హస్తగతం చేసుకుందామా అని తహతహలాడుతున్న పాకిస్థాన్ ఆశావహుడు జిన్నాతో, ఇటు జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, గాంధీలతో.. మధ్య గోప్యంగా కార్యాన్ని చక్కదిద్దుతూ సంధానకర్తగా వ్యవహరిస్తున్న లార్డ్ మౌంట్ బ్యాట్టన్‌తో కలువడం, సంప్రదింపులు జరుపడం.. వీటితోనే కాలం గడిచిపోయింది. విభజన పని జరుగకపోవడం, ఇచ్చిన తేదీ 15 ఆగస్ట్ 1947 దగ్గర పడ్తూండడం.. రాడ్‌క్లిఫ్ పై ఒత్తిడిని పెంచి.. తనకు తోచిన బెంగాల్ ప్రావిన్స్‌లో 'కలకత్తా'ను భారతదేశానికి.. ఇటు పశ్చిమాన లాహోర్‌ను కూడా భారతదేశానికే ఇచ్చినట్టు.. ఒక లీక్ బయటికి పొక్కి.. గురుదాస్‌పూర్, అమృత్‌సర్, లాహోర్ జిల్లాల్లోని ముస్లిం, హిందూ, సిక్కు ప్రజల్లో తాము తమ మతం మెజారిటీగా ఉన్న ప్రాంతాలకు వలస పోవాలని.. తహతహ.. ఒకచోట స్థిరంగా ఇన్నేళ్ళు ఉన్న తాము అకస్మాత్తుగా కొత్త ప్రాంతాలకు విభజనానంతరం పోవలసిన వలసలను ఊహించుకుంటూ.. రెక్కలు తెగిన పక్షులై అందరి కళ్ళలో.. ధ్వంసమౌతున్న భవిష్యత్ ఛాయలు.. ఆందోళన. రంధి.

పాకిస్థాన్‌లోని లాహోర్‌లో 64.5% ముస్లింలు ఉన్నారు. కానీ 80% వ్యాపార, వ్యవహార లావాదేవీలన్నీ హిందూ సిక్కు కుటుంబాల చేతుల్లో ఉన్నయ్. దీన్ని సరి దిద్దాలి.. అనుకున్నాడు రాడ్‌క్లిఫ్. అట్లాగే బెంగాల్ విభజనలో చిట్టగాంగ్ కొండల్లో 97% ముస్లిమేతర బౌద్ధుల, హిందువుల జనాభా ఉంది. అట్లాగే ఢాకాలో మెజారిటీ ముస్లింలు ఉన్నారు. 70% ముస్లిం మెజారిటీ ఉన్న ముర్షిదాబాద్‌ను భారతదేశానికి, 51% హిందువులున్న ఖుల్నా జిల్లాను పాకిస్థాన్‌కు ఇవ్వడం., తప్పు.

కాలం గడుస్తున్నకొద్దీ మత ప్రాతిపదికపై జరిగిన ప్రాంతాల విభజన చాలా తప్పుల తడకగా తయారైందని అర్థమైంది రాడ్‌క్లిఫ్‌కు. అతని హృదయం క్షోభపడ్తూ, మనిషి కుంచించుకుపోవడం మొదలైంది.

> **ముస్లిం జనాబా అధికంగా ఉన్న పశ్చిమ పంజాబ్, బెలూచిస్తాన్, సింధ్, ముజఫ్ఫరాబాద్ ప్రాంతాల్లో ముస్లిం జనాభాపై సర్వే చేయడానికి 1) పంజాబ్ సరిహద్దు కమీషన్‌లో ఇద్దరు హిందూ, ఇద్దరు ముస్లిం వ్యక్తులతో ఒక కమిటీగా.. సి సి బిశ్వాస్, బి.కె.ముఖర్జీ, అబు సలేహ్, మొహమ్మద్ అక్రం మరియు సారాహ్మాన్ ఉన్నారు. 2) అదే విధంగా ఒక బెంగాల్ సరిహద్దు కమీషన్‌ను మెహర్ చంద్ మహాజన్, తేజాసింగ్, దిన్ మొహమ్మద్, మొహమ్మద్ మునీర్‌లతో నియమించారు.**

ఈ స్థితికి తోడుగా ఆగస్ట్ 9వ తేదీన నెహ్రూ, మౌంట్‌బాట్టన్ రాడ్‌క్లిఫ్‌ను ఒత్తిడి చేసి గురుదాస్‌పూర్‌ను భారతదేశానికి ఇచ్చి కాశ్మీరుకు వెళ్ళే ఒక ప్రధాన దారిని సుగమం చేయడం వంటి సర్దుబాట్లు జరిగినట్టు విన్నారు ప్రజలు. తూర్పు పంజాబ్ గురించి విపరీతమైన కలయికలు, ఉపసంహరణలు జరిగి జరిగి చివరికి రాడ్‌క్లిఫ్ తన స్వంత ఆలోచనతో లాహోర్‌ను పాకిస్తాన్‌కు ఇచ్చి ఫైనల్‌గా తన అశాస్త్రీయ విభజనను పూర్తి చేసి భరించరాని దుఃఖంతో తన తుది విభజన పటాలను 9 - 12 తేదీల మధ్య సిద్ధం చేస్తే ఆ అతిగోప్యత అతని స్థానిక ప్రైవేట్ సెక్రెటరీతో బయటికి పొక్కి.. హింసాత్మక సరిహద్దు కలహాలు, తగాదాలు, హింసాత్మక దాడులు అడవిలో మంటల్లా చెలరేగుతూండడం రాడ్‌క్లిఫ్‌ను చాలా కలవరపెట్టింది.

ముఖ్యంగా గురుదాస్‌పూర్ జిల్లా, ఫిరోజ్‌పూర్, లాహోర్.. బెంగాల్‌లో మాల్డా, ఖుల్నా, కరీంగంజ్ వంటి ప్రాంతాలు తుకతుకా ఉడుకుతున్నై.. ఏదో జరిగిపోతోంది సరిహద్దు జిల్లాల్లోని ప్రజలు తాము ఏ ప్రాంతానికి పంపబడ్తారో, ఎక్కడ భావి జీవితమంతా ఎట్లా గడపాలో తెలియక.. కళ్ళనిండా నీళ్ళతో అంతా బీభత్స విషాదం.

సరిగ్గా అవే రోజుల్లో బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ యొక్క విభజన.. పాకిస్థాన్‌కు, భారతదేశానికి విధుల బట్వాడా వేల సంఖ్యలో.

ఈ స్థితిలో సరిహద్దువెంట చెలరేగుతున్న కలహాల హింసాకాండను అదుపు చేయడానికి అలాట్ చేసిన సైన్యం కేవలం 50,000 మంది అంటే చదరపు కిలోమీటర్‌కు ఒక్క పోలీస్.

అటు సైన్యం పంపకాలు, ఇటు రాజకీయ నాయకుల్లో ఎప్పుడెప్పుడు సింహాసనాలపై కూర్చుందామా అన్న తహతహ. ఎక్కడ తమ అవకాశాలను ఎవరు తన్నుకుపోతారోనని టెన్షన్.

మరోవైపు తమ జీవితాలేమైపోయి.. తమ గతి ఏమౌతుందోనన్న భీతితో,

క
థ

నిస్సహాయతతో, సాధారణ పేద సరిహద్దు ప్రాంతాల ప్రజలు.

దాదాపు పిచ్చోడైన రాడ్‌క్లిఫ్ ఆ రాత్రి తన ఆఫీస్‌లో అప్పటికే కుప్పలు కుప్పలుగా గదినిండా పేరుకుపోయిన డ్రాఫ్ట్ మ్యాప్‌లను, కాగితాలను, డాక్యుమెంట్‌లను ఒక్కసారిగా కుప్పబోసి.. అగ్గిపుల్ల గీసి అంటిపెట్టి కసి. భగభగా మంటలు.. మంటలు.. ఎర్రగా.. ఆవరిస్తున్న అగ్ని నాలుకల్లా వ్యాపిస్తూ వ్యాపిస్తూ మంటల్లో కాలిపోతున్నదెవరు.

ఈ దేశం.. ఈ ప్రజలు.. ఇక్కడి మతమౌఢ్యం.. ఇక్కడి గుప్త రాక్షసత్వం.. ఇక్కడి రాజకీయ కుట్రలు.. ఇక్కడి ఇగోలు.

ఇక్కడి ప్రజల కన్నీళ్ళు.

3

18 ఆగస్ట్ 1947

రాత్రి 8 గంటలు.

లాహోర్ నుండి అమృత్‌సర్‌కు ప్రయాణం.

ఎడ్లబండి.

ఇంటిలోని సామాన్లు దాదాపు పది బండ్లు.

కానీ, ఇప్పుడు అంతా కలిపి, ఒకటే బండి.

చీకటి.. ఏదీ కనబడదు. కళ్ళనిండా నీళ్ళు. ఎక్కడా రవ్వంత వెలుగు లేదు. విశ్వనాథ్ వయసు పదిహేనేండ్లు. ఎత్తుగా సామాన్లను కుదించి కట్టిన అమ్మ కుట్టిన పాతబట్టల బొంతమీద వెల్లగిలా పడుకుని ఆకాశంలోకి చూస్తున్నాడు. పైన మిణుకుమిణుకుమని చుక్కలు.

"నాన్నా .. లాహోర్ నుండి అమృత్‌సర్ ఎంత దూరం"

"ముప్పై ఐదు మైళ్ళు"

"ఇంకా ఎంతసేపో ఈ పోవుడు"

"తెల్లార్తది" నాన్న బండి ప్రక్క నడుస్తున్నాడు. అమ్మ విశ్వనాథ్ ప్రక్కనే పడుకుంది. ఎందుకో ఏడుపు. పొద్దటినుండి ఏడుస్తూనే ఉంది అమ్మ.

నాన్న మొన్ననే వచ్చిండు బర్మా నుండి. "మమ్ముల్ని కూడ పాకిస్తాన్‌కు, ఇండియాకు బట్వాడ చేస్తరట. అందుకే వచ్చిన".

"మనుషుల బతుకులు గొడ్ల బతుకులకంటె అధ్వాన్నమైపోతాన్నై." అంది అమ్మ. ఆమె గొంతులోగాఢమైన దుఃఖం. ఇక మాటల్లేవు. నిశ్శబ్దం.

తమది లాహోర్. జాకీర్ మొహల్లా. మంచిగుంటది. తను అక్కడే పుట్టి.. అక్కడే పెరుగుతూ, తను హిందూ.. అట. జాకీర్ గాడు ముస్లిం. ఐతేంది. ఇప్పుడు తాము అమృత్‌సర్‌కు ఎందుకు పోవాలె.

నాన్నను నడుగుతే అన్నడు.. ఈ దేశాన్ని విభజిస్తాండ్లు. హిందువులు సిక్కులు ఒక్కదిక్కు.. ఇండియాల.

## రాత్రింబవళ్ళు

**పోలీసులతో ఒంటరి భవనంలో మూసుకుని ఉండండి హంతకులను దూరంగా ఉంచేందుకు గార్డెన్‌లో పెట్రోలింగ్ విధిని తేల్చే పనిలో పడ్డాడు. మిలియన్ల, అతనివద్ద ఉన్న మ్యాప్‌లు పాతవి మరియు సెన్సెస్ రిటర్న్స్ దాదాపు ఖచ్చితంగా తప్పు కాని వాటిని తనిఖీ చేయడానికి సమయం లేదు పోటీ ప్రాంతాలు, వాతావరణం భయంకరంగా, వేడిగా ఉంది. మరియు విరేచనాలు అతనిని నిరంతరం ట్రోట్‌లో ఉంచాయి. కానీ ఏడు వారాల్లో అది పూర్తయింది, సరిహద్దులు నిర్ణయించాయి.**

ముస్లింలంతా ఒక్కదిక్కు.. పాకిస్తాన్‌ల.

"ఎందుకిప్పుడు.. నేను పుట్టినప్పటి నుండి ఇక్కడ లాహోర్‌ల ఉన్నం.. అందరం కలిసిమెలిసి. ఇప్పుడు వేర్వేరెందుకు కావాలె" అని అరిచిండు తను.

ఎవరూ మాట్లాడలేదు. నడుస్తూనే ఉన్నరు. ఆ ప్రక్కన ఒక ఎడ్లబండివాడు.. "అరే.. చినాల్.. ఎందుకురా ఈ కొట్టుకునుడు.. తెరి......." అంటూ వాడు "ఓ ఓ ఓ ఓ " అని బిగ్గరగా అరిచి.. ఏడ్చి.. ఎవన్నో కొట్టిండు. ఇంతలో ఐదారుగురు వచ్చి ఒకనిపై ఒకడు ఎగబడి.. కర్రలతో కొట్టుకునుడు. నాన్న తన తుపాకీని సర్దుకున్నడు చంకలో.

కొద్దిసేపటి తర్వాత.. "మనం ఈ బార్డర్ ఊర్లల్ల పుట్టినం కాబట్టి ఈ యాతన.. కదా" అంది అమ్మ.

"అంతా మన ఖర్మ"

అమ్మ సిక్కు.. అమృతా కౌర్.

నాన్న హిందూ. కేశవరావ్ సింధియా.

ఐతే ఏమైంది. బాగనే ఉంది గదా.

"నాన్నా.. ఇప్పుడు మనం అమృత్ సర్‌కు పోతె ఎక్కడుంటమే"

"తెల్వది"

తెల్లారగట్ల తెలివొచ్చి కళ్ళు తెరిచేసరికి ఎవరో ఒక పెద్ద గుంపు.. చేతుల్లో కర్రలతో.. వచ్చి ప్రక్కనే నడుస్తున్న ఎడ్లబండ్లను తగులబెట్టిండ్లు. ఒకడొచ్చి విశ్వనాథ్ వాళ్ళ బండిమీద గ్యాస్ నూనె పోసి అగ్గిపుల్ల గీసేసిండు.

భగ్గున మంట.. భగభగ.

నాన్న తన గన్‌తో కాల్చిండు వాన్ని కోపంగా.

తర్వాత విశ్వనాథ్‌కు ఏమీ తెల్వదు. మెలకువొచ్చేసరికి.. అమ్మ శరీరం కాలి మసై.. ప్రక్కనే ఉంది. నాన్న.?

నాన్న.. వ్వ్.. ఏమో.

తర్వాత ఎవరో ఒక ఫకీర్.. చేతిలో ఒక నల్లని చిప్ప ఉంది. "ఆవ్ బేటా మేరేసాత్" అంటే వచ్చిండు. వేరే మార్గం లేదు. రమ్మనటానికి ఎవరూ లేరు. అతను తన వెంట మూడు రోజులు నడిపించుకుని గురుదాస్‌పూర్ తీస్క పోయిండు. ఆయనెవరు. ఆయన ఒంటరి.. ఫకీర్. సూఫీ. పేరు దస్తగిర్. మనిషి ఎప్పుడైనా ఒంటరేనా ఎందుకు..?

4

విశ్వనాథ్ కళ్ళు మూసుకున్నాడు. ఆ రోజు అతను చాలా అన్యమనస్కంగా ఉండీ ఉండీ.. ఏదో వ్యాకులత.

అతని వయసు తొంభై.

పదిహేను ప్లస్ డెబ్బై ఐదు.

భారతదేశం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' జరుపుకుంటోంది.

నిజానికి ఈ దేశానికి స్వతంత్రం వచ్చిందా.

దేశాన్ని మతం ప్రాతిపదికపై విభజించి

మనను మనం లౌకిక ప్రజాస్వామ్య వాదులుగా ఆత్మవంచన చేసుకుంటూ

అన్ని రంగాల్లో పతనమై పతనమై ఒక మాయామేయ సూడో ప్రపంచాన్ని మనచుట్టూ విస్తరింపజేసుకుని 'ఏ సోల్ ఇన్ ద షెల్'.

విశ్వనాథ్ పొద్దటినుండి దాదాపు పదిసార్లు చూచిన తొమ్మిది నిముషాల నిడివిగల వీడియో ఫిల్మ్ 'దిస్ బ్లడీ లైన్'ను ఎదురుగా ఉన్న టివీలో కాస్ట్ చేసి శ్రద్ధగా చూడ్డం మొదలెట్టాడు.

'ఇండియా టుడే' వాళ్ళు ఈక్వినాక్స్ బేనర్‌పై రాం మధ్వాని రూపొందించగా తీసిన అపూర్వమైన లఘు చిత్రమది.

విశ్వనాథ ట్రాన్స్‌లోకి వెళ్ళిపోయాడు.

"ట్రన్.. ట్రన్.. ట్రన్." పాత టెలిఫోన్ పదే పదే మ్రోగుతూంటే ఆ ముసలాయన రిసీవర్‌ను ఎత్తి "హలో.. ఎవరూ" అన్నాడు వణుకుతున్న స్వరంతో.

'నేను డబ్ల్యు హెచ్ ఆడెన్. ఒక పాత్రికేయుణ్ణి మాట్లాడుతున్న సర్. మీ గురించి నేను రాసిన కవిత ఒకటి ఈ రోజు పత్రికలో ఉంది వినిపిస్తా వింటారా".

"ఓ. ఇంత రాత్రా. మీరు దయచేసి రెండు గంటల తర్వాత మళ్ళీ ఫోన్ చేస్తరా" అని ఫోన్ పెట్టేసి.,

ఆ కవితను వినాలని ఆదుర్దాగా ఉన్న ఆ పెద్ద మనిషి రాడ్‌క్లిఫ్.. తెల్లారగానే భార్య ఆంటోనియాతో " ఆ కవితను చదువవా.. నాకు కళ్ళు సరిగా కనబడ్డం లేదు" అని అర్థిస్తే.. ఆమె చదువుతోంది. "ఇదేమీ మీకు సంతోషాన్ని కలుగజేసే విషయం కాదు" అంటూ.

రాడ్‌క్లిఫ్ తన భారతదేశ విభజన రేఖను (అవార్డ్) లార్డ్ మౌంట్ బాట్టన్‌కు ఇచ్చి సరిగా 15 ఆగస్ట్ 1947న లండన్‌కు పయనమై వెళ్ళిపోయాడు. ఇక తర్వాత అతను ఎప్పుడూ తన జీవితకాలంలో మళ్ళీ ఇండియాను సందర్శించలేదు. కాగా ఒక దేశ విభజన కమీషనర్‌గా తను న్యాయం చేయలేకపోవడం వల్ల దాదాపు 15 మిలియన్ల పేద ప్రజలు దేశ సరిహద్దులను దాటి వలసపోవడానికి పడ్డ నరకయాతన దాదాపు రెండు మిలియన్ల మంది ఊచకోతకు బలై మృత్యువుపాలై మరణించడంకు తనే బాధ్యుడనే అపరాధ భావన అతణ్ణి కలచివేయడం వల్ల అతను తనకు బ్రిటిష్ ప్రభుత్వం ఇవ్వజూపిన మూడు వేల పౌండ్ల పారితోషికాన్ని నిరాకరించి తన తప్పుకు నిష్కృతిగా ఇక ఎప్పుడూ ఇండియాకు వెళ్ళలేదు. మౌన క్షోభ అతన్ని ప్రక్షాళన చేసింది.

భార్య ఆంటోనియా ఆడెన్ కవితను చదువుతోంది. విభజన అతను తన మిషన్‌కు వచ్చినపుడు కనీసం నిష్పక్ష పాతంగా ఉన్నాడు. ఏనాడూ భూమిపై దృష్టి పెట్టని ఆయనకు విభజనకు పిలుపునిచ్చారు. మతోన్మాదంతో విభేదిస్తున్న ఇద్దరు వ్యక్తుల మధ్య వారి విభిన్న ఆహార్యాలు మరియు అననుకూల దేవుళ్ళతో 'సమయం' వారు లండన్‌లో అతనికి క్లుప్తంగా చెప్పారు 'చిన్నది, చాలా అలస్యమైంది'. పరస్పర సయోధ్య లేదా హేతుబద్ధమైన చర్చకోసం ఇప్పుడు విడిపోవడమే పరిష్కారం. వైస్రాయ్ ఆలోచిస్తాడు, మీరు అతని లేఖనుండి చూస్తారు.

మీరు అతని సహవాసంలో ఎంత తక్కువగా కనిపిస్తే అంత మంచిది. కాబట్టి మేము మీకు ఇతర వసతిని అందించడానికి ఏర్పాటు చేశాము. మేము మీకు నలుగురు న్యాయమూర్తులను ఇద్దరు ముస్లింలను మరియు ఇద్దరు హిందువులను అందిస్తాము. సంప్రదింపులు జరపడానికి, కాని తుది నిర్ణయం మీపైనే ఆధారపడి ఉండాలి.

రాత్రింబవళ్ళు పోలీసులతో ఒంటరి భవనంలో మూసుకుని ఉండండి హంతకులను దూరంగా ఉంచేందుకు గార్డెన్‌లో పెట్రోలింగ్ విధిని తేల్చే పనిలో పడ్డాడు. మిలియన్ల, అతనివద్ద ఉన్న మ్యాప్‌లు పాతవి మరియు సెన్సెస్ రిటర్న్లు దాదాపు ఖచ్చితంగా తప్పు కాని వాటిని తనిఖీ చేయడానికి సమయం లేదు పోటీ ప్రాంతాలు, వాతావరణం భయంకరంగా, వేడిగా ఉంది. మరియు విరేచనాలు అతనిని నిరంతరం ట్రోట్‌లో ఉంచాయి. కానీ ఏడు వారాల్లో అది పూర్తయింది, సరిహద్దులు నిర్ణయించాయి. మంచి లేదా అధ్వాన్నంగా విభజించబడిన ఖండం.

మరుసటిరోజు అతను ఇంగ్లాండ్‌కు ప్రయాణించాడు. అక్కడ అతను త్వరగా మరచిపోగలడు. ఒక మంచి న్యాయ వాదిగా కేసు, తప్పక అతను తిరిగి వెళ్ళడు.అతను తన క్లబ్‌కి చెప్పినట్టు, అతను కాల్చివేయబడ్తాడేమోనని భయపడ్డాడు.

కవిత విన్న రాడ్‌క్లిఫ్ చాలా ఆవేశానికీ, ఆగ్రహానికీ గురై అరిచాడు.

'వీడికేమి తెలుసు.. నేను ఈ పనిని చేయనన్నాను.. నేను అసలెప్పుడూ భారతదేశానికి వెళ్ళలేదనీ.. అక్కడి భౌగోళిక వాతావరణం నాకు తెలియదనీ.. ఐదు వారాల గడువు సరిపోదనీ వాదించాను. కాని 'ఒక మన దేశభక్తునిగా దేశంకోసం ఈ పనిని చేయలేవా .. అని నన్ను సెంటిమెంట్లో బందీని చేశారు'.

'తప్పు జరిగింది నావల్ల .. అందుకే నా మూడువేల పౌండ్ల పారితోషికాన్ని నిరాకరించాను. మిలియన్స్ మందికి చేసిన అన్యాయాన్ని గుర్తించి మానసిక క్షోభతో ఇక ఎప్పుడూ ఆ దేశానికి వెళ్ళలేదు. తప్పే.. తెలియని ప్రాంతాల మధ్య ఒక్క పెన్నుగీతతో ఒక సరిహద్దు రేఖను గీసి మనుషులను విడదీయడం మహాపాపం. ఇదిగో.. ఇక్కడ.. ఈ మన డ్రాయింగ్ రూంలో ఒక గీతను గీస్తే.. ఏమౌతుంది.. భార్యాభర్తలమైన మనం విడిపోతాం.. ఆ.. విడిపోతాం.'

రాడ్‌క్లిఫ్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

కాని ఒట్టి పశ్చాత్తాపం మనిషి చేసిన అకృత్యాన్ని ప్రక్షాళించగలదా.

ఆత్మ గాయపడ్డ మచ్చ రక్తకన్నీరై జీవితాంతం దహిస్తూనే ఉంటుంది మనిషిని.

***(భారతదేశం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవా'లను ఘనంగా జరుపుకుంటున్న సందర్భంగా.. 75 ఏండ్ల క్రితం భారతదేశ విభజన ఎంత విషాద ఘటనగా జరిగిందో తెలియని ఇప్పటి తరం కోసం ఈ కథ )***

వ్యాసం

# నడిచే పుస్తకం...
# నిజాం వెంకటేశం

నిజాం వెంకటేశం స్మృతిలో...



బి.నర్సన్
94401 28169

సుమారు అర్ధశతాబ్దం పాటు మూడుతరాల రచయితలకు వారధిగా నిలిచిన నిజాం వెంకటేశం 18-09-2022 ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మరణం తెలుగు సాహితీ ప్రపంచాన్ని దిగ్భ్రమ పరిచింది. ఈ కాలంలో ఆయనంతటి పుస్తక ప్రేమికుడు కానరాడు. తాను చదివాక ఈ పుస్తకాన్ని ఫలానా ఆయన చదవాలని ఆశించి దానిని వారికి అందించేదాకా విశ్రమించడు. అవసరమైతే హైదరాబాద్ ఏ మూలకైనా వెళ్తాడు. ఆయన రాకతో ఎవరింటికైనా సాహితీ కళ వస్తుంది. ఇలా ఎంతో సంతృప్తిగా సాగే వెంకటేశం జీవనయానం అర్ధాంతరంగా ఆగిపోయింది. ఎవరెవరివో పుస్తకాలను ప్రస్తావిస్తూ గలగలా సెలయేరులా సాగే ఆయన సాహితీ కబుర్లను ఆసక్తిగా వినేవారు ఒక మార్గదర్శిని కోల్పోయారు. 76 ఏళ్ల వయసులో కూడా ఆయన అలుపెరుగకుండా, ఎంతో ఉత్సాహంగా సాహిత్య సభలు, సమావేశాలకు హాజరై కొత్త కవులు, రచయితలకు ప్రోత్సాహాన్ని అందిస్తూ తానూ తృప్తినొందేవాడు. సాహిత్యాన్ని, పుస్తకాన్ని, రచయితని, మంచితనాన్ని సమానంగా ఏకకాలంలో ప్రేమించిన అరుదైన వ్యక్తిగా గుర్తింపు పొందిన వెంకటేశంకున్న పరిచయాలన్ని గాఢమైనవే. వయో తారతమ్యం లేకుండా



కలుపుగోలుగా, నిగర్విగా మెదిలే మనిషిగా అందరి మన్ననలను పొందాడు.

సాహితీవేత్తగా తెలుగు, ఆంగ్ల, హిందీ రచనలపై లోతైన పరిజ్ఞానం గల ఆయన రచయితలకు ఎన్నో విలువైన సూచనలు చేసేవారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన అన్నితరాల రచయితలు ఆయనను సాహితీగురువుగా భావిస్తారు. తమకు ఎన్నో గొప్ప పుస్తకాలను పరిచయం చేసి తమ రచనలకు మార్గదర్శకుడిగా ఉన్నారని కవి జూకంటి జగన్నాథం, రచయిత పత్తిపాక మోహన్ తదితరులు ప్రకటించిన సందర్భాలున్నాయి. ఒక టీ.వి. ఛానల్ ఇంటర్వ్యూ కోసం కథారచయిత పెద్దింటి అశోక్ కుమార్ తనకు తోడుగా తన పరిచయకర్తగా కోరి మరీ వెంకటేశంను స్టూడియోకి తీసుకెళ్లాడు. పెద్దింటి కథలు, నవలలపై ఆయన విశ్లేషణ కార్యక్రమానికి వన్నె తెచ్చింది. తనను ఆహ్వానించిన సభల్లో వక్తగా ఎన్నో కొత్త విషయాలు సభికులకు వివరించేవాడు. ఆయన మాటలు, ప్రసంగాలు రికార్డు చేసి ప్రచురిస్తే అవి ఎంతో విలువైన సాహిత్య వ్యాసాలయ్యేవి. గంటల తరబడి చదవడం పట్ల ఉన్న ఆసక్తి ఆయన రాయడంపై చూపలేదు. కూచుంటే ఏకబిగిన పుస్తకాన్ని పూర్తిచేసే పఠనవేగం ఆయనది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ ఏ భాష పుస్తకమైనా ఆయనకు ఒక్కటే. అలిశెట్టి ప్రభాకర్‌తో వెంకటేశం అనుబంధం విశేషమైనది. పెద్దన్నలా ఆయనను కాపాడేందుకు ఎంతో ప్రయత్నించాడు. 1988లో ప్రభాకర్‌ను జగిత్యాలకు రప్పించి ఆయన ఆరోగ్య, కుటుంబ బాధ్యతలను తనపై వేసుకున్నాడు. అయితే 'సిటీలైఫ్' ఆగిపోతుందని ఓ కాగితం ముక్క రాసిపెట్టి అలిశెట్టి తిరిగి హైదరాబాద్‌కు వచ్చేశాడు. జేబు ఖాళీగా ఉన్నా అలిశెట్టి ప్రభాకర్ ఒకరి సొమ్ము ఆశించేవాడు కాదు. తన భావజాలానికి విరుద్ధంగా ఉన్నవారిని పూర్తిగా దూరంపెట్టేవాడు. అయితే వెంకటేశం చేసే ఆర్థికసాయానికి మాత్రం ప్రభాకర్ అడ్డుచెప్పేవాడు కాదు. దానిని ప్రస్తావిస్తూ అలిశెట్టి ఓ కవితలో-

ఘల్లున గచ్చుమీద రూపాయి
బిళ్ళ మోగినట్లు

వ్యాసం

నిజాం వెంకటేశం వస్తాడు
నన్నూ రోగాన్ని మందుల్నీ కవిత్వాన్నీ
కవుల్నీ తిట్టిన తిట్టు తిట్టకుండా
కసితీరా తిట్టి
మధ్యలో రూటు మార్చి
మహాశ్వేతాదేవిని మెచ్చుకొని
తరచుగా సాహిత్య సభల్లో పాల్గొన
లేనందుకు నొచ్చుకొని
నాకో వందిచ్చుకొని మరి
నిష్క్రమిస్తాడు' అని రాసుకున్నాడు.

2013లో అలిశెట్టి ప్రభాకర్ కవితాసంపుటి రావడంలోను వెంకటేశం ప్రధానపాత్ర పోషించాడు.

కల్లోలకాలంలో ఆయన ఆనాటి కరీంనగర్ జిల్లా యువతకు సాహితీ, సాంస్కృతిక, సామాజిక ఉద్యమాలను పరిచయం చేసి ముందుండి వారిని నడిపించారు. ఆ గురుస్థానం ఇంకా అందరి గుండెల్లో చిరస్థాయిగా ఉంది. కవిత్వం పట్ల అత్యంత ప్రేమతో 1980 దశకంలో దిక్సూచి అనే కవితా సంచికలు వెలువరించారు. అలిశెట్టి దీర్ఘకవిత 'నిజరూపం' అందులోనే వచ్చింది. కరీంనగర్ బుక్ ట్రస్ట్ ఆరంభించి అల్లం రాజయ్య 'భూమి' కథలు, బి.ఎస్. రాములు 'బతుకుపోరు' నవలను ప్రచురించారు. ఆదిలాబాద్‌కు చెందిన న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి దేశంలో ఆర్థికరంగ మార్పులను సూచిస్తూ రాసిన మూడు ఇంగ్లీష్ పుస్తకాలను వెంకటేశం తెలుగులోకి అనువదించారు. సేంద్రియ వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానాలపైన రాసిన ఆంగ్ల పుస్తకాన్ని కూడా తెనిగించారు. 1950 దశకంలో తెలంగాణ మాండలికంలో వచ్చిన గూడూరి సీతారాం కథలు కొత్తతరానికి పరిచయమయ్యేలా పుస్తకరూపంలో రావడానికి తోడ్పడ్డారు. వితరణశీలత వెంకటేశం మరో సుగుణం. తన పింఛనులో చాలా భాగం లేనివారిని ఆదుకోవడానికి వినియోగించేవాడు. ఇలా ఆయన లక్షల రూపాయలు వెచ్చించారని చెప్పవచ్చు. ఎందరో కవులు, రచయితలకు పుస్తక ప్రచురణ కోసం ఆర్థిక సహాయం అందించారు. సాహిత్యంలో ఏ ప్రక్రియలో అయినా రాసే సత్తా ఉన్న ఆయన రాయడం కన్నా రచయితలను ప్రోత్సహించడమే తన పనిగా పెట్టుకొన్నాడు.

1948లో సిరిసిల్లలో జన్మించిన వెంకటేశం నిజామాబాద్‌లో పాలిటెక్నిక్ చేసి విద్యుత్ శాఖలో చేరారు. చెన్నైలో ఏ.ఎం.ఐ.ఈ. చేసి ఇంజనీర్‌గా పదవోన్నతి పొంది విధులను నిర్వహించారు. 1970 దశకంలో అప్పటి కరీంనగర్ జిల్లాలో విద్యుత్తు సదుపాయాల విస్తరణ పెద్ద ఎత్తున జరిగింది. ఆ సమయంలో ఇంజనీర్‌గా ఆయన పల్లె పల్లె తిరుగుతూ ఊర్లలో వీధిదీపాలు, బావులకు మోటార్ల కోసం కరెంటును అందించారు.

ఇప్పటికి అక్కడి గ్రామాల ప్రజలు ఆయన సేవల్ని కొనియాడుతుంటారు. 31-8-2022 రోజున నిజాం వెంకటేశం తల్లి సత్యమ్మ చనిపోయారు. ఆయనను ఓదార్చడంలో ఉన్న సన్నిహితులకు వెంకటేశం మరణం అశనిపాతమైంది. పెద్దదిక్కును కోల్పోయిన పక్షం రోజులకే వెంకటేశం చనిపోవడం అత్యంత విషాదకరం. ఇది వారి కుటుంబానికి కోలుకోని దెబ్బనే. ఆయన నిష్క్రమణతో తెలుగు పుస్తకం ఒక చేయూతను కోల్పోయింది. అలవోకగా అందరి కవితలు చదివే స్వరపేటిక మూగపోయింది. నడిచే గ్రంథాలయం కూలిపోయింది. తనను ఎప్పుడూ చంకన ఎత్తుకొని తిరిగే తండ్రి వెళ్లిపోయాడని పుస్తకమే రోదిస్తోంది.

కవిత

# ఈత



**ఏనుగు నరసింహారెడ్డి, 89788 69183**

నేనెక్కడ ఉన్నానని
పూలు నామీద కూడా రాలాయి కొన్ని
గుచ్ఛం స్వీకరించడానికో
మాల ధరించడానికో
అర్హుడినేనా అని
ఆలోచనల సంద్రంలో మునిగిపోయాను
అప్పుడు ఒంటినిండా పులుముకున్న
సువాసనల భాషలో
'అర్హతానర్హతాలోచనల విచికిత్సే నీ అర్హత'
అంది పువ్వు
అప్పటి నుండి నేనూ
సరియైన అర్హత సాధించేపనిలో
నిరంతరం సముద్రాన్ని ఈదుతూనే ఉన్నా

ముఖాముఖి

# కవి కావాలంటే ముందు అధ్యాపకుడు కావాలి....

- అనుమాండ్ల భూమయ్య

**ఒక సాహితీవేత్తగా రూపొందడానికి దారి తీసిన మీ కుటుంబ నేపథ్యం, మీరు జన్మించిన గ్రామనేపథ్యాన్ని గురించి చెబుతారా?**

నా సాహిత్యాభిరుచి మీద మా కుటుంబ ప్రభావంగాని, గ్రామ ప్రభావం గాని లేదు. కరీంనగర్ నాటి జిల్లాలో వెదురుగట్ట మా గ్రామం. మా కుటుంబంలో నా తల్లిదండ్రులుగాని ఇద్దరు అన్నలు గాని ఎవరికీ విద్యాగంధం లేదు. మా ఊళ్ళో నాకంటే చదువుకున్నవాళ్ళు ఎవరూ లేరు. కాబట్టి సాహిత్యాభిరుచికి ఊరుకాని, కుటుంబం కాని కాదని చెప్పగలను.

**మీ విద్యార్థి దశ ఎలా గడిచింది? అది ఒక సాహితీవేత్తగా యూనివర్సిటీ అధ్యాపకుడిగా మిమ్మల్ని తీర్చిదిద్దడానికి అది ఏవిధంగా దోహదపడింది?**

మా వెదురుగట్ట దగ్గర చొప్పదండిలో హైస్కూలు ఉండేది. నేను అక్కడ చదివాను. హైస్కూల్‌లో పలుగుల భూమారెడ్డి అని ఒక తెలుగు టీచర్ ఉండేవాడు. ఆయన పద్యం చదివే విధానం నన్నాకర్షించింది. ఆయనవలె పద్యం చదవడం మొదలుపెట్టాను. నాకు ఉన్నత పాఠశాలలో పద్యాల భూమయ్య అని పేరు వచ్చింది. అక్కడ సంస్కృతం చదువుకున్నాను. ఆ నేపథ్యం కూడా అప్రయత్నంగా ఉండి ఉంటుంది. రఘువంశంలో ఒక సర్గ రామాచారిగారు చెబితే విన్నాను. ఇది ఉన్నత పాఠశాలలో సాహిత్య వాతావరణం. కరీంనగర్ దగ్గర ఉన్న జగిత్యాలలో నేను బి.ఎస్సీలో ఒక ప్రైవేట్ కళాశాలలో చేరాను. 1969లో వచ్చిన తెలంగాణ ఉద్యమం వల్ల క్లాసులు జరుగలేదు. బి.ఎస్సీ., 3వ సంవత్సరం వరకు వచ్చాను. క్లాసులు జరగనప్పుడు మాకు తెలుగు టీచర్‌గా ఉన్న కోవెల సంపత్‌కుమారాచార్య దగ్గరికి వెళ్లేవాళ్ళం. ఆయన వల్ల నాలో సాహిత్య పఠనాసక్తి



కలిగింది. వేయిపడగలు, ఆముక్తమాల్యద, శృంగార నైషదము లాంటి రచనలన్నీ అక్కడే చదివాను. ఏవో పిచ్చిగీతలు రాయడం అక్కడ మొదలైంది. కళాశాల ప్రిన్సిపాల్ వెలిచాల కొండలరావుగారు ఆయన మంచి సాహితీవేత్త. ఆయన అనేకమంది సాహితీవేత్తలతో అదనంగా ఉపన్యాసాలు ఏర్పాటుచేసేవారు. ఆయనకు విశ్వనాథ సత్యనారాయణ చాలా ఇష్టమైన అభిమాని. అలాగే విశ్వనాథ భ్రష్టయోగి కావ్యాన్ని జువ్వాడి గౌతమ రావ్‌కి అంకితం చేశారు. ఆ అంకిత సభలో విశ్వనాథవారి పద్యగానం చేయడానికి సంపత్కుమారాచార్య నాకు అవకాశం ఇచ్చారు. భ్రష్టయోగి కావ్యంలో నేను చదివిన పద్యాన్ని విశ్వనాథవారు విని కోకిల కంఠం అని నన్ను మెచ్చుకోవడం ఒక గొప్ప జ్ఞాపకం. అప్పుడే ఎం.ఏ.తెలుగు చదవాలనిపించింది. ఉస్మానియాలో ఎం.ఏ. తెలుగులో చేరినాను. దివాకర్ల వారు శాఖాధిపతి. సినారె అధ్యాపకులు. పాటిబండ్లవారు పదవీ విరమణ పొంది సంస్కృతం బోధించేవారు. నాయని కృష్ణకుమారిగారు, చలమచర్ల రంగాచార్యులుగారు మొదలైనవాళ్ళు ఉండేవారు. కాని ముగ్గురు నన్ను బాగా ఆకర్షించారు. దివాకర్ల, సినారె, పాటిబండ్ల రెండు గంటలు క్లాసు తీసుకు నేవారు. దివాకర్ల శ్రావ్యమైన గొంతుతో పద్యం

ముఖాముఖి

చదివేవారు. ఆయన క్లాసు వింటే తెలుగు టీచర్ కావాలి అనే ఆసక్తి కలిగేది. సినారె క్లాసికల్ పోయెట్రీ, మోడరన్ పోయెట్రీ రెండూ చెప్పేవారు. పాటిబండ్ల వారి ఇల్లు చిక్కడపల్లిలో ఉండేది. ఆయన వాళ్ళ ఇంటికి మమ్మల్ని పిలిచి కాఫీ ఇస్తూ అనేక సాహిత్యాంశాలు చర్చించేవారు. దానివల్ల సాహిత్యంలో లోతుగా తెలుసుకునే అవకాశం వచ్చింది. పాఠ్యాంశాల పరిధిని మించి చర్చ జరిగేది. ఇది పి.జి. స్థాయిలో జరిగిన విషయం. భూమారెడ్డి రాగం పోయి అవధాని వారిలాగా చదవడం అలవాటయింది.

**మీరు కవిత్వంలో సాంప్రదాయ మార్గంలో ఉంటూనే కొత్తపుంతలు తొక్కారు. దీనికి కారణం ఏమిటి?**

సంప్రదాయ గురువుల దగ్గర చదువుకున్నాను. జూనియర్ లెక్చరర్‌గా చేరాక అన్ని సబ్జెక్టులు నేనే చెప్పాను. ఆవిధంగా ఆధునిక సంప్రదాయ కవిత్వం అంతా బోధించాను. నన్నయ నుండి ఇప్పటివరకు అందరినీ చదివాను. అయితే నా మొగ్గు ప్రాచీనతవైపే.

**మీ కవిత్వంలో పౌరాణిక పాత్రలు జ్వలిత కౌసల్యలాగా కొత్తచూపులు సంతరించుకుంటాయి. ఏ క్షణాలు ఈ రచనకు మిమ్మల్ని ప్రేరేపించాయి.**

పాత్రలకు లౌకిక దృక్పథం కలగడానికి కారణం లోకానుభవమే. నేను ఏ సామ్యవాద సంస్థలో సభ్యున్ని కాదు. జ్వలిత కౌసల్య కావ్యం తీసుకుంటే రాముడు ఏకపత్నీవ్రతుడు అని లోకంలో

**నా సాహిత్యాభిరుచి మీద మా కుటుంబ ప్రభావంగాని, గ్రామ ప్రభావం గాని లేదు. కరీంనగర్ నాటి జిల్లాలో వెదురుగట్ట మా గ్రామం. మా కుటుం బంలో నా తల్లిదండ్రులుగాని ఇద్దరు అన్నలు గాని ఎవరికీ విద్యాగంధం లేదు. మా ఊళ్ళో నాకంటే చదువుకున్నవాళ్ళు ఎవరూ లేరు. కాబట్టి సాహిత్యా భిరుచికి ఊరుకాని, కుటుంబం కాని కాదని చెప్పగలను.**

ఉన్నమాట. రాముడు వాల్మీకి రామాయణంలో గాని, ఏ ఇతర తెలుగు రామాయణాలలో గాని ఏకపత్నీవ్రతునిగా ఉంటానని ప్రతిజ్ఞ చేసిన సంగతి లేదు. పుల్లెల రామచంద్రుడు వ్యాఖ్యానంతో ఉన్న వాల్మీకి రామయణం చదివాను. అందులో రాముడు కౌసల్య దగ్గరికి వచ్చి వనవాసం వెడుతున్నాను. ఇది నాన్నగారి ఆజ్ఞ అంటాడు. కౌసల్య దుఃఖిస్తుంది. మీ నాన్న నన్ను నిగ్రహించి ఏమి సుఖపడ నివ్వలేదు. నేను ఒక శుభకార్యం చూసింది లేదు. సంతోషంగా ఉన్నది లేదు. బహుభార్యల వల్ల సపత్నులతో నేను ఇబ్బంది పడుతున్నాను. నువ్వు అడవికి పోతుంటే నాకెంతో దుఃఖంగా ఉంది. నేనూ నీ వెంట వస్తాను అన్నది. ఇది వాల్మీకి రామాయ ణంలో ఉన్న అంశం. రాముడు ధర్మ సంబంధ విషయాలు చెపుతూ ఆమెను రాకుండా ఆపుతాడు.

ఈ ఘట్టం చదువుతుంటే నాకు ఓ స్ఫురణ కలిగింది. నాకు ఇక్కడ ఆలోచన వచ్చింది. బహుభార్యలు తండ్రికి ఉండడం వల్ల తల్లి బాధపడుతుంది. తండ్రి బహుభార్యత్వానికి తాను ఇప్పుడు చేయగలిగింది ఏమిటి? తను చేయగలిగింది ఒక్కటే. తన భార్యకైనా సవతి కష్టం లేకుండా ఉండాలి. కాబట్టి తాను ఏక భార్యతోనే ఉంటానని రాముడు ప్రతిజ్ఞ చేసిన సందర్భం ఇదేనేమో అని నాకు స్ఫురణ కలిగింది. ఈ స్ఫురణ కలిగినాక వాల్మీకి రామాయణం చదవడం ఆపేసి 10 రోజులలో వంద పద్యాలు రాశాను. అవే జ్వలిత కౌసల్య కావ్యం. ఇది స్ఫురణే తప్ప వేరు కాదు. ఇంకా సాంప్రదాయ కుటుంబాలలో ఇంకో లక్షణం ఉంటుంది. తండ్రి ఏదైనా అవలక్షణానికి లోనైతే పిల్లలు తాము అలాంటి లక్షణాలు కలిగి ఉండకూడదని కోరుకుంటారు. తండ్రి ఒక పెద్ద తాగుబోతు అనుకోండి. అతని వల్ల తల్లి బాధపడుతుంటే చూసిన పిల్లలు తామె ఎట్టిపరిస్థితిలోనూ తాగుబోతులం కాకూడదు అనే గట్టి నిర్ణయం తీసుకునే అనేక సన్నివేశాలుంటాయి. ఈ నేపథ్యం కూడా పనిచేసిందేమో. బహుశా రాముని ఈ ప్రతిజ్ఞకు తండ్రి బహుభార్యత్వం వల్ల తల్లికి కలిగిన మనోవేదన కావచ్చు. ఒక చిన్న పద్యం వినండి.

"గడచినట్టి కాల మ్మెదొ గడచి పోయె,
తండ్రి తప్పొప్పులివియని తలపలేను,
ఏ పరిస్థితు లెట్లు రానిమ్ము నాకు



పద్మవిభూషణ్ కాళోజీ, ఆచార్య పేర్వారం, డా॥ కె.జయశంకర్‌లతో



అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం (2005) స్వీకరిస్తూ...




డా॥ సి. నారాయణ రెడ్డి చేతుల మీదుగా సన్మానం పొందుతూ...



శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీతో...

ఒక్క సీతయే ఈ జన్మ కున్న భార్య"
అని ప్రతిజ్ఞ చేసెను రాముడు అంటూ రాశాను. ఈ రాముని ప్రతిజ్ఞ విన్న తరువాత కౌసల్య దు:ఖం పోయినట్టు సంతోషంగా ఆశీస్సులు పలికినట్టు నేను కావ్యం ముగించాను. ఇది స్ఫురణ. ఈ ధోరణిలో ఆరు కావ్యాలు రాశాను.

1) జ్వలిత కౌసల్య 2) త్రిజట 3) ప్రవర నిర్వేదము 4) మకర హృదయము 5) పారిజాత అవతరణము.

తిమ్మన రాసింది పారిజాత అపహరణము. నేను రాసింది పారిజాత అవతరణము. శ్రీకృష్ణుడు సత్యభామతో ఇంద్రనగరి వెళ్ళి పారిజాతం సంగ్రహించినపుడు ఇంద్రుడు అడ్డుపడితే యుద్ధం జరుగుతుంది. చివరికి కృష్ణుడు ఆ పారిజాతాన్ని కవి కృష్ణునికి ఇస్తాడు. కృష్ణుడు చేసింది అపహరణం ఎట్లా అవుతుంది. అపహరించడానికి ప్రయత్నం చేసినాడు. కాని చివరికి యుద్ధంలో గెలిచాడు. ఇంద్రుడే స్వయంగా ఇచ్చాడు. శ్రీకృష్ణునంతటివాడు అపహరించడం ఏమిటి? ఈ భావమే నాతో పారిజాత అవతరణం రాయించింది. ఈ కావ్యంలో పారిజాత వృక్షం భూమికి చేరగానే జర-రుజ-లాంటి దు:ఖాలు తొలగిపోయాయని మూడు పద్యాలున్నాయి. వీటిని మనసులో పెట్టుకొని నేను కొన్ని కల్పనలు చేశాను. సత్యభామకు చెలికత్తె రాజ్యంలోని ఈతిబాధలు చెబుతుంది. అవి తొలగిపోవాలంటే పారిజాత వృక్షం భూలోకానికి రావాలని సత్యభామ అనుకొంటుంది. మూలంలో వలె నా కావ్యంలో సత్యభామ అలకపానుపు ఎక్కడు. కృష్ణుడు తన మందిరానికి వస్తే స్వాగతం చెబుతుంది. లోకకళ్యాణం కోసం పారిజాత వృక్షం కావాలని అడుగుతుంది. ద్వారకా నగరవాసుల క్షేమ కోసమే ఆమె పారిజాతాన్ని అడుగుతుంది. ఇది పారిజాతావరణం.

**మకరి కథలో కూడా మీ కావ్యంలో మకరి ఆవేదన ప్రశ్నలు కొత్తచూపును సంతరించుకున్నాయి. ఈ విధంగా పౌరాణిక గతంలో నేటి సామాజికత ప్రతిబింబించడంలో మీ ఆంతర్యం ఏమిటి? ఆధ్యాత్మికవాదంతోపాటు సామ్యవాద ప్రభావం కూడా మీ మీద ఉందా?**

మకరి హృదయం పుట్టడానికి కారణం మీరే. మరొకసారి తంగేడు కోసం సామాజిక దృక్పథంతో పద్యాలు రాయండి అన్నారు. నేను స్పిరిట్యువల్‌గా ఆలోచించేవాడిని. ఎలారాయాలి? రాత్రంతా ఆలోచిస్తే ఇది స్ఫురించింది. గజేంద్రమోక్షంలోమొసలి విష్ణువు చేత అన్యాయంగా చంపబడింది అనేది మనసులోకి వచ్చింది. గజేంద్రున్ని రక్షించుగాక... కాని మొసలిని చంపాల్సిన అవసరం ఏమిటి? నా బలం తగ్గించినా సరిపోతుంది. ఏనుగు బలం పెంచినా సరిపోతుంది. ఈ మాత్రం దానికి వైకుంఠం నుంచి పరుగెత్తుకొచ్చి నన్ను చంపాలా? నేనేం తప్పు చేశాను? అతడు నన్ను భంగపరిస్తే కదా అడ్డుకున్నాను. ఈ కొలనులోని జీవరాశులన్నీ చచ్చినాయి. నన్నింతగా కల్లోలపరిస్తే కాళ్ళు కరిచాను. అందుకు చంపుతావా అని ప్రశ్నించిన మకరి హృదయంలో చొచ్చి రాశానని అంటున్నారందరూ. అదిగో అలా వచ్చింది ఆ కావ్యం. ఇదే స్ఫురణ. ఇదిగో ఇదే ప్రేరణతోనే ఈ కావ్యాలు.

**మీ విమర్శ కూడా కొత్తపుంతలు తొక్కింది? దాన్ని వివరించండి.**

నేను నాయని సుబ్బారావు స్కూల్‌కు చెందినవాన్ని. కొలవి గోపరాజు సింహాసన ద్వాంత్రింశిక మీద ఎం.ఫిల్. చేశాను. నాయని సుబ్బారావు కృతుల మీద పి.హెచ్.డి. చేశాను. ఇది మూడవ పోయెట్రీ. అనగా నాకు ప్రాచీన, ఆధునిక కవిత్వాల మీద సమతుల్య అభిప్రాయం ఉంది. కొన్ని వ్యాసాలతో వ్యాసభారతి వేశాను. వేయిపడగలు పైన రాశాను. మాలపల్లి పైన రాశాను. 2000లలో నాయని సుబ్బారావు శతజయంతి సందర్భం వచ్చినప్పుడు వ్యాసం రాద్దామనుకున్నా. కాని కొత్త పాయింట్ లేకుండా రాయ గూడదనేది నాలో నిగూఢంగా ఉన్న అంశం. అన్ని పుస్తకాలు చదివితే కొత్తదనం వస్తుంది కావచ్చు. అంత సమయం లేదు. కాబట్టి నాయనితో కాసేపు శీర్షికతో విద్యార్థి ప్రశ్న వేస్తే అధ్యాపకుడు జవాబు చెప్పే పద్ధతితో ప్రారంభించాను. విద్యార్థిని నేనే. అధ్యాపకున్ని నేనే. కావ్యమర్మాలు, అందచందాలు దీనిలో చర్చకు వచ్చేట్టు చేశాను. అట్లా వందపేజీలు రాసి పుస్తకం వేశాను. చేరా ఇది చూసి ఆశ్చర్యపోయాడు. భౌమమార్గ విమర్శ అని ఆయన పేరు పెట్టాడు. భౌమమార్గము అనగా డౌన్ టూ ఎర్త్

అన్నమాట. సాధారణంగా విశ్వ విద్యాలయాలలో జరిగే పరిశోధనలో ఆధారగ్రంథాల ఉటం కింపులు తరువాత నిర్ణయమూ ఉంటుంది. ఇందులో అదేం ఉండదు పుస్తకం. దానిలోని విషయమే విద్యార్థికి లేక, పాఠకుడికి అర్థం చేయించడం, భౌమమార్గము అంటే భూమయ్య మార్గం అని కూడా అర్థం. ఇట్లా కొనసాగింది. కవిత్వం రాయడానికి ముందు, రాసిన తర్వాత ఈయన రాసిన విమర్శకు శైలిలో చాలా తేడా ఉంది ఉన్నాడు. ఓ పెద్దాయన ఇది ఉపనిషత్తులో ఉన్న మార్గమే అన్నాడు. ఈ మార్గంలో 5 పుస్తకాలు వచ్చినాయి. సంస్కృతంలోని శివానందలహరి, సౌందర్యలహరి ఇట్లాగే వచ్చాయి.

**వర్తమాన తెలుగు కవిత్వాన్ని విమర్శను గురించి వ్యాఖ్యానించండి.**

సమకాలీన సమాజంలో వస్తున్న మార్పులను కవులు చిత్రిస్తున్నారు. కావ్యాలలో ఏది ప్రతిబింబిస్తుందో అది విమర్శలో కూడా వస్తుంది. ప్రాచీన కావ్య విమర్శ కంటే ఆధునిక కాలంలో కావ్యాలను గురించిన విమర్శ గమనించ దగింది. కవిత్వంతో పాటే విమర్శ ప్రాచీన సాహిత్యాన్ని విమర్శించడానికి అలంకా రికులు కొన్ని సూత్రాలు చేశారు. ఆధునిక కాలంలో ఇలాంటి సూత్రాలు లేకపోయినా వచ్చిన కవిత్వాన్ని చదివి అందుకనుగుణంగా విమర్శిస్తున్నారు. రచయిత తాత్విక నేపథ్యాన్ని బట్టి విమర్శ కొనసాగించాల్సి ఉంటుంది.

**మీరు ప్రక్రియలలో తేటగీతి పద్యాన్ని ఎక్కువగా ఎన్నుకున్నారు. దీనికి కారణం ఏమిటి?**

> **నాకు** విమర్శ లోకంలో పేరు వచ్చింది. కవిత్వం రాశాకే వెలుగులోకి వచ్చాను. నా పద్యకవిత్వానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కావ్య పురస్కారం ఇచ్చింది. గరికపాటి వారు కాకినాడలో పోటీలో నాంతలమానికం అని నిర్ణయించారు.



కందుకూరి శివానందమూర్తి చేతుల మీదుగా సన్మానం పొందుతూ...

భావమే పద్యాన్ని లేక ప్రక్రియను ఎన్నుకొంటుంది. గహనమైన తాత్విక విషయాలను అతి సరళంగా రాయడం అలవరచుకొన్నా తేటగీతి భావమే ఎన్నుకున్న ఛందస్సు.

**సాహిత్య జీవితంలో మీరు మరిచి పోలేని సంఘటన ఏదైనా వివరించగలరా?**

సాహిత్య సంబంధమైన సంఘటనలు చెప్పడానికేవీ లేవు. అన్నీ గొప్ప జ్ఞాపకాలే. పుస్తకం రాస్తున్నపుడు ఒక గొప్ప ప్రేరణ కలగడమే ఒక సంఘటన.

**మీ అభిమాన సాహితీవేత్తలు ఎవరు? వాళ్ళు మిమ్మల్ని ఏవిధంగా ప్రభావితం చేశారు?**

ప్రాచీన కవుల్లో నన్నయ్య, తిక్కన, ఎర్రన అందరూ గొప్పవాళ్ళే. నాచన సోమనాథునికి నవీన గుణ సనాథుడు అని బిరుదులు. కాని ఎప్పటికప్పుడు నవ్యంగా రాయకపోతే నిలబడదు. నిలబడినవన్నీ నవ్యత సంతరించుకున్నవే. కాబట్టి కవులంతా నా అభిమానులే. నాయని సుబ్బారావు నాకు ఇష్టమైన కవి. ఋషి యోగిలాగా ఉండే వారు. భావకవులు చాలామంది తేట గీతిలో రాశారు. విశ్వనాథ గిరికుమారుని ప్రేమగీతాలు తేటగీతులే. నాయని సుబ్బారావు తేటగీతులు విరివిగా రాశాడు. నాయని తన జీవితమే కవిత్వ సౌబద్రుని ప్రేమయాత్ర తన ప్రేమకథే. తల్లి చనిపోతే మాతృగీతాలు. కొడుకు చనిపోతే విషాదయోగ్యము. మరొకటి ఆయనకు ఊరుమీద చాలా ప్రేమ. ప్రకాశం జిల్లాలోని పొదిలి అనే తన ఊరు మీద కూడా కవిత్వం రాయడానికి ప్రయత్నం చేశాడు. తనకు ప్రేరణ కలిగితేనే కవిత్వం రాసిన కవి. రేడియోలో ఉద్యోగం చేస్తున్నపుడు తన ఊరిమీద జన్మభూమి అనే కావ్యం రాశాడు. తన బాల్యాన్ని గురించి బాలకాండ రాశాడు. ఈ విధంగా అనుభవం నుంచి రాసిన కవి కాబట్టి నాకు ఇష్టుడు.

**ఈనాటి వర్ధమానుల కోసం మీ సాహిత్య విజయాలు అవార్డుల గురించి చెప్తారా?**

నాకు విమర్శలోకంలో పేరు వచ్చింది. కవిత్వం రాశాకే వెలుగులోకి వచ్చాను. నా పద్యకవిత్వానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కావ్య పురస్కారం ఇచ్చింది. గరికపాటి వారు కాకినాడలో పోటీలో తలమానికం అని నిర్ణయించారు. ఈవిధంగా నేను రాసిన ఐదు కావ్యాల వల్ల విశిష్టకవిగా స్థిరపడ్డాక పద్యకావ్యాల్లో ఉపనిషత్ భావజాలం ఉందని విమర్శకులు అంటున్నారు. రాబోతున్న ప్రత్యేక రచనలు ఏమీ లేవు. ప్రేరణ కలగడం, రాయడం అంతే. అముద్రితాలు ఉండవు.

**కొత్తగా రాస్తున్న యువతకు మీ సందేశం ఏమిటి?**

కొత్తగా సాహిత్యంలోకి వచ్చేవాళ్ళు ప్రాచీన కవిత్వం చదవాలి. సంస్కృతం చదవాలి. ఆధునిక కవిత్వం చదవాలి. ఆంగ్ల కవిత్వం చదవాలి. సమాజాన్ని ప్రభావితం చేసే ఉద్యమాలు, ఉద్యమ కవిత్వాలు అన్నీ గమనించాలి. కాలంతో నడవాలి.

- కాంచనపల్లి

వ్యాసం

# భాషా నిఘంటువులు

నిఘంటువులు నిత్యావసరాలు..



డా॥ నలిమెల భాస్కర్
97043 74081

నిఘంటువులు అనే గ్రంథాలు ప్రధానంగా పదాలకు అర్థాలను చెబుతాయి. పైగా ఆ పదాలు ఏ భాషా భాగానికి చెందినవో సంకేతాక్షరాలతో సూచిస్తాయి. పదస్వరూపాన్ని ప్రదర్శిస్తాయి. వీలైతే పదబంధాలను సైతం పేర్కొంటాయి. ఒక పదానికి వున్న సామాన్యార్థంతో సహా విశేషార్థ వివరణం కావిస్తాయి. ఆ పదానికి పర్యాయంగా వచ్చే మాటల్నీ, వివిధార్థాల్లో వచ్చే పలుకుల్నీ కుప్పబోస్తాయి. ఇంకా కొన్ని నిఘంటువులు ఆరోపంగా యిచ్చిన పదాన్ని కల్గివున్న సామెతల్ని ప్రయోగాలుగా చూపుతాయి. పూర్వ




కవులూ, రచయితల పుస్తకాల్లోంచి ఆరోపాలకు ఎదురుగా ఉదాహరణలుగా పద్యపాదమో, వాక్యమో అందిస్తాయి. కొన్ని నిఘంటువులు వాడుకభాషలోని మాటల్ని సైతం అర్థాదులతో వివరిస్తాయి. ఒక మాటకు ఉన్న పలు అర్థఛాయల్నీ, అర్థస్ఫురణల్నీ చూపుతాయి.

నిఘంటువుల్ని ఇంగ్లీషులో డిక్షనరీ అంటున్నారు. డిక్షన్‌కు అర్థం పదసరళి అని. ఆధునిక నిఘంటువులు దాదాపుగా ఆల్ఫబెటికల్‌గానే ఉంటాయి. అంటే అకారం ఆదిగా అని. నిఘంటువు అంటే... పదానికి అర్థాన్ని గొప్పగా చెప్పేది అనే !!

మరి... ఈ నిఘంటువులు ఎప్పటి నుండి వున్నాయి? ఇది చాలా ఆసక్తికరమైన ముచ్చట. ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన నిఘంటువు యాస్కుని నిరుక్తం అంటున్నారు. ఇది సంస్కృత భాషా నిఘంటువు. పైగా వైదిక నిఘంటువు. ఈయనది క్రీ.పూ. 4వ శతాబ్ది అని నమ్మకం. ఐతే సుమేరియన్ భాషలోని మాటలకు సెమిటిక్, అస్సీరియన్ భాషల్లో అర్థాలిచ్చిన బిళ్ళలే మొదటి నిఘంటువులని మరి కొందరి ఊహ. ఈ మట్టి బిళ్ళల కాలం క్రీ.పూ. 5. ఇక.. ఆ తర్వాత చైనీస్, 'షువావెన్' (మాటల ప్రస్తావన) క్రీ.శ. 1 నాటిది. సంస్కృతంలో వాడే, వరరుచి మొదలైనవాళ్ళు లౌకిక నిఘంటువులు నిర్మించారు. ఆ భాషలోనే క్రీ.శ. 4 నాటి అమరసింహుని అమరకోశం చాలా ప్రశస్తమైన నిఘంటువు. అన్నట్లు... క్రీ.శ. 8వ శతాబ్దంలో అరబిక్‌లో ఓ పెద్ద నిఘంటువు తయారైంది. క్రీ.శ. 13లో పురుషోత్తమదేవు 'త్రికాండ శేషము' గొప్ప సంస్కృత నిఘంటువు. ప్రాకృతంలో హేమచంద్రుడు 'దేశినామమాల', 'రత్నావళి' నిర్మించాడు. సంస్కృతంలో సుమారు 192 నిఘంటువులు నిర్మించబడినా, గ్రంథ రూపంలో అందుబాటులో ఉన్నవి కేవలం 30. ఇంకో అంశం... సంస్కృత నిఘంటువులు అకారాదిగా కాకుండా (కొన్ని అపవాదాలతో) దాదాపుగా శ్లోక రూపంలో ఉన్నాయి.

పోతే... ఆధునిక కాలంలోని నిఘంటువుల సంగతి. నా దృష్టిలో ఆధునిక కాలం అంటే ఇంగ్లండులో 1476లో ముద్రణ ప్రారంభం ఐన నాటి నుండే! గుటెన్‌బర్గో, కాక్స్టనో ఎవరైతేనేం ముద్రణాయంత్ర ఆవిష్కర్తలకు విశ్వమానవాళి మొత్తం ఋణపడి వుండాల్సిందే!! 1440-1479 ప్రాంతాల్లో ఇంగ్లీషు పదాలకు లాటిన్‌లో అర్థాలిచ్చే నిఘంటు ప్రయత్నం ఒకటి జరిగింది. ఇంగ్లండులో ఆంగ్లం కన్న ముందు ఫ్రెంచ్, ఇంకా మునుపు లాటిన్ భాషలదే పెత్తనం. పైగా ఆంగ్లం మాట్లాడితే




చిన్నచూపు. ఛాసర్ తదితరులొచ్చాక పరిస్థితి మారింది. ఇంగ్లండ్ - ఫ్రాన్సు యుద్ధ ఫలితంగా ఆంగ్ల భాషాభిమానం వెల్లువికింది. క్రీ.శ. 1640 కల్లా ఇంగ్లీషులో సుమారు 20,000 పుస్తకాలు అచ్చయ్యాయట. 1582లోనే ముల్‌కాస్టర్ అనే పెద్దమనిషి "ప్రపంచంలో అత్యంత ప్రయోజనకరమైన పని నిఘంటు నిర్మాణం" అని నొక్కి చెప్పాడు. 1635లో "ఫ్రెంచి అకాడమీ" ఏర్పడి 59 ఏండ్లు శ్రమించి ఫ్రెంచి నిఘంటువు తెచ్చుకున్నారు. ఆంగ్లేయులకు అప్పుడు సోయి వచ్చిన కారణంగా 1604లో కాడ్రే ఓ నిఘంటువు తెచ్చాడు. 1658లో ఫిలిప్స్, 1721లో నథానియల్‌లు డిక్షనరీలు వేసారు. ఐనా... అవి సమగ్రం కావు. ఒరోజు 1745 సం॥లో డోడ్‌స్లే అనే పుస్తకాల వ్యాపారి సామ్యూల్ జాన్సన్ నిఘంటు రచన చేయమన్నాడు. జాన్సన్ నిఘంటు నిర్మాణానికి మూడేళ్ళు అవసరం అంటే ఆ వ్యాపారి అంత తొందరగా ఎలా యివ్వగలడని వదిలేసాడు. కానీ జాన్సన్ ఎనిమిదేళ్ళలో నిఘంటువు పూర్తి చేసాడు. ఆ కాలంలోనే భార్యను పోగొట్టుకున్నాడు. అనేకమైన ఆర్థిక యిబ్బందులతో సతమతమై పోయాడు. తయారైన నిఘంటువును ప్రచురించడానికి అర్ల్ మొదలైన పండితుల్ని ఆశ్రయించాడు. ఏ ఒక్కరూ సహకరించకున్నా జాన్సన్ నిఘంటువు క్రీ.శ. 1755లో ప్రకటితమైంది. దానికి గొప్ప స్పందన లభించింది. నిజానికి ఆంగ్లంలో చెప్పుకోదగిన మొట్టమొదటి లెక్సికోగ్రాఫర్ ఈయనే! ఆ తర్వాత ఈ నిఘంటువే 1828లో వెబర్ డిక్షనరీకి, 1926లో ఆక్స్‌ఫర్డు నిఘంటువుకీ గొప్ప స్ఫూర్తి. ఈ ఆధునిక కాల నిఘంటువులు అన్నీ అకారాదిగా వుండటం విశేషం.

ఐతే... ఒకింత ఆక్స్‌ఫర్డు గురించి మళ్ళా చెప్పుకోకతప్పదు. ఆ నిఘంటు నిర్మాణ ప్రారంభ సంవత్సరం 1857, పూర్తయింది 1928లో. అంటే ఆ డిక్షనరీకి 71 సం.లు పట్టింది. నిజానికి పదేళ్ళలోనే పూర్తి చేయాలనేది సంకల్పం. అది 4,14,800 పదాలతో, 18,61,200 సూక్తులతో తయారై వచ్చింది. మొదటి సంపాదకుడు కోలరిడ్జ్. ఆయన ఏడాదికే చనిపోగా ఫెర్నివాల్ వచ్చాడు. అనారోగ్యంతో అతనూ పనిచేయలేక పోయాడు. ఆ తర్వాతి వ్యక్తి ముర్రే. అతనికి నిఘంటు నిర్మాణమే ప్రపంచంగా మారింది. తన 11 మంది పిల్లలూ భాగస్వాములే! ఆ తర్వాత బ్రాడ్లీ, క్రెయిజీలు వచ్చారు. కానీ సగం పని ముర్రేదే! 1928 నుండి ఇప్పటికి ఎన్ని ముద్రణలు పొందిందో! ఎన్ని కొంగొత్త పదాల చేర్పు జరిగిందో!! 2003 నాటికి ఆక్స్ఫర్డు వచ్చి 75 సం.లు పూర్తయిన కారణంగా... ఇందాకా వచ్చిన 20 సంపుటాలను సంస్కరించడానికి పూనుకున్నారు. నిజానికి ఆ పని 1993లోనే ప్రారంభమైంది. జాన్ సింప్సన్ సంపాదకత్వంలో 80 మంది భాషా శాస్త్రవేత్తలు, పరిశోధకులతో పాటు రమారమి 200 మంది నిపుణులు పాల్గొంటున్నారు. ఈ పనికి ఐదున్నర కోట్ల డాలర్లు కేటాయించారు.

**జాన్సన్ నిఘంటు నిర్మాణానికి మూడేళ్ళు అవసరం అంటే ఆ వ్యాపారి అంత తొందరగా ఎలా యివ్వగలడని వదిలేసాడు. కానీ జాన్సన్ ఎనిమిదేళ్ళలో నిఘంటువు పూర్తి చేసాడు. ఆ కాలంలోనే భార్యను పోగొట్టుకున్నాడు. అనేకమైన ఆర్థిక యిబ్బందులతో సతమతమై పోయాడు. తయారైన నిఘంటువును ప్రచురించడానికి అర్ల్ మొదలైన పండితుల్ని ఆశ్రయించాడు.**

ఇక... ఇప్పుడు మన మాతృభాష విషయానికొద్దాం. శ్లోకరూప సంస్కృత నిఘంటువుల స్ఫూర్తితోనే తెలుగులో నిఘంటువులు వచ్చాయి. ఐతే... ఇక్కడ పద్యరూపంలో వచ్చాయి. అకారాదిగా రాలేదు. మొట్టమొదట 1619-37 మధ్య "చౌడప్ప సీసములు", 1674లో గణపవరపు వేంకటకవి "వేంకటేశాంధ్రము", 1680లో పైడిపాటి లక్ష్మణకవి "ఆంధ్రనామసంగ్రహము", 1740లో కస్తూరి రంగకవి "సాంబనిఘంటువు", 1750లో అడిదము సూరకవి "ఆంధ్రనామశేషము", 1769-89 నడుమ నుదురిపాటి వేంకటకవి "ఆంధ్ర భాషార్ణవము" మొదలైన నిఘంటువులు వచ్చాయి. ఇంకా పద్యరూపంలో అనేక నిఘంటువుల ప్రకటితమైనా తూము రామదాసకవి "ఆంధ్ర పద నిధానము", సన్యాసి కవి "సర్వాంధ్ర సార సంగ్రహము" చాలా గొప్ప అభిదానాలు. ఇందాకే చెప్పుకున్నట్లు... ఇవి ఏవీ అకారాది క్రమంలో లేవు.

పాశ్చాత్య సంపర్కం చేత... ముఖ్యంగా ఆంగ్లేయుల కారణంగా



వ్యాసం

తెలుగులోనే కాకుండా మనదేశ భాషల్లోనూ అకారాది నిఘంటు నిర్మాణం ఆరంభమైంది. క్రీ.శ.1786-1833ల మధ్య ఎథీనియల్ డెమెట్రియస్ గలోనోస్ అనే విద్వాంసుని ప్రోత్సాహంతో ఓ కాశీ పండితుడు అకారాదిగా సంస్కృత నిఘంటువు సమకూర్చాడట! అది 1828-1857ల మధ్య అచ్చయిందని అంటున్నారు. అది మన దేశంలో ఆల్ఫ బెటికల్ మొదటి డిక్షనరీ. ఐతే.. అంతకన్నా ముందే తెలుగువాడూ, మచిలీపట్నం నివాసీ ఐన మామిడి వెంకయ్య చేత "ఆంధ్రదీపిక" అనే అకారాది నిఘంటువు 1806లోనే రచించబడిందట! 1807లో విలియం బ్రౌన్ డిక్షనరీ వచ్చింది. ఇట్లా చూసినపుడు మామిడి వెంకయ్య "ఆంధ్రదీపిక" మన దేశంలో అకారాదిగా వచ్చిన తొలి నిఘంటువు మరి!

ఇప్పుడు తెలుగుభాషలో వచ్చిన తొలి అకారాది నిఘంటువు ఏది అన్న ప్రశ్న ఎదురవుతుంది. సహజంగానే! క్రీ.శ. 1806లో రచించబడినట్లుగా భావిస్తున్న మామిడి వెంకయ్య "ఆంధ్రదీపిక" గురించిన అంశం ఇప్పటికీ ఇదమిత్థంగా తేలలేదు. కనుక తొలి నిఘంటువు విలియం బ్రౌన్ 1807లో తెచ్చిన తెలుగు ఇంగ్లీషు డిక్షనరీ. ఐతే అది తెలుగు-తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు. ఆ పిదప చిన్నయసూరి నిఘంటు రచనలో నిమగ్నమై ఓ నిఘంటువును నిర్మించాడట! 1885లో బహుజనపల్లి సీతారామాచార్యుల "శబ్దరత్నాకరము" చక్కటి నిఘంటువు. దీనికి ఆయనకు 25 సం.ల సమయం అవసరమైంది. తర్వాత 1893లో మహాకాళి సుబ్బారాయుడి "శబ్దార్థ చంద్రిక", 1907లో "లక్ష్మీనారాయణీయం", 1888లోనే "ఆంధ్రపద పారిజాతం", 1932లో వావిళ్ళ నిఘంటువు, 1938లో కొట్రశ్యామల కామశాస్త్రి "ఆంధ్ర వాచస్పత్యం", 1911 నుండి 1972 వరకు నిరంతరంగా సాగి 7 సంపుటాలుగా (7వ సంపుటానికి అదనంగా అనుబంధమూ వుంది) "సూర్యరాయాంధ్ర భాషా నిఘంటువు", 1967లో "తెలుగు నిఘంటువు" (మొదట తెలుగు అకాడమీ వేసింది), 2004లో ఆచార్య రవ్వా శ్రీహరి "శ్రీహరి నిఘంటువు" ముఖ్యమైన నిఘంటువులు. 2018లో శ్రీహరి నిఘంటువును తెలుగు అకాడమీ మరోమారు ప్రచురించింది. ఇందులో 35000 కొత్త ఆరోపాలున్నాయి. తెలుగులో బహుళ ప్రచార నిఘంటువు "శబ్దరత్నాకరమే"! బృహన్నిఘంటువు మాత్రం "సూర్యరాయ"లదే!! ఇవి కాక అకారాదిగా అనేక నిఘంటువులు శబ్దార్థ చంద్రిక, శబ్దార్థ రత్నాకరాల్లాంటివి చాలా ఉన్నాయి. శబ్దరత్నాకరంలో 33,572 మాటలున్నాయి. సూర్యరాయ నిఘంటువుకు ఎక్కని పదాలతో సిద్ధమైందే శ్రీహరి డిక్షనరీ !

ఇక.. తెలంగాణ నిఘంటువుల విషయం ప్రస్తావించుకోవాలి. 1986లోనే ఆచార్య రవ్వా శ్రీహరి "నల్లగొండ జిల్లా మాండలిక పదకోశము" వేసారు. ఈ వ్యాసకర్త నలిమెల భాస్కర్ 2003లో "తెలంగాణ పదకోశం" తెచ్చాడు. అది ఆరువేల పదాలతో తయారైంది. కేవలం ఆరునెలల్లో సిద్ధమైంది. తెలంగాణ మలిదశ ఉద్యమ అవసరాల నిమిత్తం వచ్చిన కోశం అది. పనిలో పనిగా పదబంధాలూ, సామెతలూ అందులో తోచినవి ఇవ్వడమైనది. ఈ నిఘంటువులో ఇల్లు, తల్లి మొదలైన మామూలు మాటలు కాకుండా విశేష పదాలనే కూర్చడం జరిగింది. ఇది సంప్రదాయ

**తెలంగాణ నిఘంటువుల విషయం ప్రస్తావించుకోవాలి. 1986లోనే ఆచార్య రవ్వా శ్రీహరి "నల్లగొండ జిల్లా మాండలిక పదకోశము" వేసారు. ఈ వ్యాసకర్త నలిమెల భాస్కర్ 2003లో "తెలంగాణ పదకోశం" తెచ్చాడు. అది ఆరువేల పదాలతో తయారైంది. కేవలం ఆరునెలల్లో సిద్ధమైంది. తెలంగాణ మలిదశ ఉద్యమ అవసరాల నిమిత్తం వచ్చిన కోశం అది. పనిలో పనిగా పదబంధాలూ, సామెతలూ అందులో తోచినవి ఇవ్వడమైనది.**









వ్యాసం

నిఘంటువులకు భిన్నమైంది. 2010లో మరో మూడువేల చేరికతో ప్రస్తుత తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ ద్వితీయ ముద్రణ తెచ్చాడు. మొదటి ముద్రణ నయనం ప్రచురణం, సిరిసిల్లాది. రెండవది తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర శాఖది. ఈ కోశమే 2016లో దాదాపు మరో వెయ్యి పదాలు కలుపుకుని 2016లో తృతీయ ముద్రణ పొందింది. ఇప్పటికి ఆరు ముద్రణలతో బహుళ జనాదరణ పొందింది. రాష్ట్ర సాధన అనంతరం తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ద్వారా 3,00,000 రూపాయల విలువగల తెలంగాణ పదకోశాలు కొన్నది. ఆ తర్వాత భూతం ముత్యాలు "మాండలీకం", కాలువ మల్లయ్య "గుమ్మి", కపిలవాయి లింగమూర్తి "పామర సంస్కృతం", ముదిగంటి సుజాతారెడ్డి "తెలంగాణ వ్యవహార పదకోశం" (2018), తెలుగు విశ్వవిద్యాలయం వారి "తెలంగాణ పదకోశము" (2019), మడిపల్లి భద్రయ్య "మన భాష - మన యాస" (ఆదిలాబాదు జిల్లా), లక్ష్మణ్ రావు పతంగే "తెలంగాణ వాడుక భాషా నిఘంటువు".. వచ్చాయి. ఇందులో పెద్ద నిఘంటువు తెలుగు విశ్వవిద్యాలయ "తెలంగాణ పదకోశమే!" పైగా ఇతర తెలంగాణ కోశాల కన్నా ఏ కోశాన చూసినా మేలిమి నిఘంటువు. ఐతే... ఇది సంస్థ తరఫున జరిగిన పని

**నిఘంటు నిర్మాణానికి నిధులూ అవసరం. డబ్బులుంటే చాలదు.. పదనిధులు తెలిసిన పండితులూ ఆవశ్యకమే! సేకర్తలూ కావాలి. పదస్వరూపం తేల్చాలి. మూలాలు చెప్పాలి. అర్థనిర్ణయం జరగాలి. సమయం చాలా తీసుకోవాలి. ఒక పదం తాలూకు అర్థఛాయలు అన్నీ తేలాలంటే చర్చలు జరగాలి. ముఖ్యంగా ఒక ప్రజాస్వామిక దృక్పథం ఉండాలి. పదుగురు ఆడినదే అసలైన మాటగా తేలాలి.**

కనుక ఇంకాస్త బాగా కోశనిర్మాణం జరిగితే బాగుండేదేమో! అంతకుముందు వచ్చిన తెలంగాణ పదకోశాల్లోని పదాలను అన్నింటినీ ఈ కూర్పులో తీసుకొని ఉంటే బావుండేది! ఏది ఏమైనా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీళ్ళు, నిధులు, నియామకాల్లో తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయంతో పాటు భాషా వివక్ష కూడా ఓ ప్రధాన కారణం కదా! అందుకని, రాష్ట్ర అవతరణ జరిగాక ఓ చక్కటి మేలైన బృహత్తెలంగాణ నిఘంటు నిర్మాణం జరగాల్సి వుండె! తెలంగాణ సాహిత్య అకాడమీ మళ్ళీ తెలంగాణ నిఘంటు నిర్మాణం గురించి ఓ సమావేశం ఏర్పాటు చేసింది. ఇది శుభపరిణామం. తెలంగాణ భాషతోపాటు అనేక భాషల్లో ప్రావీణ్యం కల్గిన గౌ॥ కే.చంద్రశేఖర్రావు గారు తెలంగాణ ముఖ్యమంత్రిగా వుండటం ఓ సానుకూలమైన అంశం. రెండు మూడు కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపు ఓ ఏడాది కేటాయించే దాదాపు రెండు లక్షల కోట్ల భారీ బడ్జెట్టులో పెద్ద విషయమేమీ కాదు.

ఇదిలా ఉండగానే... తెలంగాణ భాషాభిమానం నిజంగానే బలంగా కల్గిన భాషావేత్తలు, భాషాశాస్త్రవేత్తలు, భాషా పండితులు, భాషోపన్యాసకులు, భాషాచార్యులు, జర్నలిస్టులు, సంపాదకులు, అనువాదకులు, రచయితలు, ఇతర నిపుణులు కలిసి నిఘంటు నిర్మాణ కృషిలో భాగస్వాములు కావచ్చును. తెలంగాణ నిఘంటు నిర్మాణ విషయంలో ఆచార్య రవ్వా శ్రీహరి తన నిఘంటువు పీఠికలో చెప్పినట్లు మౌఖిక సాహిత్యంలోని పదాలను గ్రహించాలి. తెలుగులో ఇప్పుడు లభ్యమవుతున్న నిఘంటువులు దాదాపు లిఖిత సారస్వత సంబంధితమే. శ్రీహరి నిఘంటు నిర్మాణంలో ఆచార్యులు పద సాహిత్యాన్నీ, ద్విపద వాఙ్మయాన్నీ, జానపద సాహిత్యాన్నీ, కాల్పనిక సాహిత్యాన్నీ, చారిత్రక గ్రంథాల్నీ సాధ్యమైనంత వరకు వడబోసి కొత్త మాటలకు ఆరోపాలు ఇచ్చారు. చాలా గొప్ప పని శ్రీహరి గారిది. ఎనిమిదేళ్ళ నిరంతర పరిశోధనా ఫలం అది. నిఘంటు నిర్మాణానికి నిధులూ అవసరం. డబ్బులుంటే చాలదు.. పదనిధులు తెలిసిన పండితులూ ఆవశ్యకమే! సేకర్తలూ కావాలి. పదస్వరూపం తేల్చాలి. మూలాలు చెప్పాలి. అర్థనిర్ణయం జరగాలి. సమయం చాలా తీసుకోవాలి. ఒక పదం తాలూకు అర్థఛాయలు అన్నీ తేలాలంటే చర్చలు జరగాలి. ముఖ్యంగా ఒక ప్రజాస్వామిక దృక్పథం ఉండాలి. పదుగురు ఆడినదే అసలైన మాటగా తేలాలి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల వారిని కలుపుకుని సామూహికంగా నిర్మాణం జరగాలి. ప్రధానంగా... ఇంతకుముందు వచ్చిన తెలుగులోని నిఘంటువులు అన్నీ పరిశీలించాలి. అట్లాగే తెలంగాణ కోశాలన్నీ గాలించాలి. అల్లం రాజయ్య నుండి పెద్దింటి అశోక్ కుమార్ వరకూ ఆ తర్వాతి తరం కాల్పనిక రచయితల దాకా వచ్చిన సాహిత్యమంతా తిరగేయాలి. ముఖ్యంగా బహుభాషా శాస్త్రవేత్తల సాయం కావాలి. తెలంగాణ భాష బాగా తెలిసినవాళ్ళు ఎక్కువగా తోడ్పడుతారు నిఘంటు నిర్మాణానికి! అన్నట్లు... ప్రాచీన భాష బాగా తెలిసిన వాళ్ళూ అవసరమే! పదమూలం తెలియాలంటే కావ్య భాషా పరిజ్ఞానం అవసరం. "సాన్పు" చానపి నుండి వచ్చిందనీ, "సర్వ" చరువు నించి మారిందనీ, "మోరుదోపు"కు మూలం "మోరత్రోపు" అనీ, "నాతి" (మేన కానిది) కి మాతృక "లాతి" అనీ చెప్పగలిగిన వాళ్ళు లేనిది నిఘంటు రచనకు ప్రామాణికత రాదు.

వ్యాస పరిమితి దృష్ట్యా ఇందులో తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులు (విలియం బ్రౌను తప్ప), తెలుగు- ఇతర భాషల నిఘంటువులు, తెలుగులోని పద ప్రయోగ సూచికలు, పారిభాషిక పద కోశాలు, వృత్తి పదకోశాలు, మాండలిక కోశాలు, వ్యుత్పత్తి కోశాలు మొదలైన ఇతర నిఘంటువులు ప్రస్తావన తీసుకురావడం లేదు.

# యానీ ఎర్నాక్స్

**2022 నోబుల్ బహుమతి విజేత...**

శ్రామిక కుటుంబానికి చెందిన పిల్ల బడికి పోతే.. అందరిలో ఏరేసినట్టుగా ఉంటది.

మధ్యతరగతి పిల్లలు చెప్పే ఇంటి ముచ్చట్లు అనుభవాలు వింటూ ఉండాల్సిందే. ఈమె జీవితం అసలు జీవితమే కాదు. ఈమె ముచ్చట్లు అంతగా చెప్పుకోదగినవీ కాదు. సాహిత్యంలో, బడిలో, పాఠాల్లో వీరి జీవితాలకు స్థానం లేదు. వీరు అడుగు పెట్టే ప్రపంచమే... బెరుకు బెరుకుగా ఉంటది. వారిలో ఒకరిగా మారాలంటే మనం మనం గాకుండా పోవాలె. వారి మాటలు నేర్చుకోవాలె... ఎటు చేసే ఆమోదతనీ పొందాలె.

వయసు తెచ్చిన ఉద్వేగాలు... తెలువని సమాజంలో జీవిత ప్రయాణం.. వెనక్కి తిరిగి చూసుకుంటే- జీవితం పొడుగునా - ఒక్కో యాది... ఒక్కో వయ్యి.

దొంతరలుగా పరుచుకున్న తన



జ్ఞాపకాలనే రచనలుగా మలిచి ప్రపంచం ముందు పెట్టారు - ఫ్రెంచి రచయిత్రి అనీ ఎర్నాక్స్. అరవై ఏండ్ల జీవిత కాలాన్ని తీసుకొని- ఒక్కో ఘట్టంలోని అనుభవాలను ఒక్కో రచనగా పరిచి పెట్టారు. ఉద్వేగాలను పదిలంగా పరిచినా, కథనంలో ఉద్వేగాన్ని ప్రదర్శించలేదు. ఒకవైపు పాత్రలో లీనమైతూనే పక్కన ఉండి చెప్పినట్టుగా నడిపిస్తారు. బిడియం లేకుండా సాగే కథనంలో ఒక్కో చోట పచ్చిగా ఉన్నా... ఎబ్బెట్టుగా అనిపించదు.

ఒక్కో పుస్తకం చదివే కొద్దీ ఆమె ఒక బాలిక లేదా మహిళగా కాకుండా బడుగు వర్గానికి, నాటి ఫ్రెంచి తరానికి ప్రతినిధిగా కనిపిస్తారామె. ప్రతి పుస్తకంలోనూ చిన్న నాటి తనలోకి తొంగి చూస్తూ వస్తుంటారు.

క్లీన్డ్ ఔట్ (Cleaned Out) అనీ ఎర్నాక్స్ మొదటి నవల. రచనా కాలం 1974. మిగతా వాటిలాగే చిన్నగానే ఉంటుంది. యుక్తవయసు.. యూనివర్సిటీ విద్యార్థిగా.. అబార్షన్.. పడిన కష్టాన్ని మొదటే ఉటంకిస్తారు. (అప్పటికి అబార్షన్ ఫ్రాన్స్‌లో చట్టబద్ధం కాలేదు)

తండ్రి నడిపే చిన్న దుకాణం చుట్టూ తిరిగే ఆనందకరమైన బాల్యం. కానీ స్కూల్‌లో అడుగు పెట్టిన తరువాత మిగతా కుటుంబాలకు, తమకు ఉన్న తేడా తెలిసివస్తుంది. తెలివితేటల మూలంగా వారిలో ఒకరిగా మారగలుగుతుంది. కానీ పూర్తిగా ఇమడలేదు, తన మూలాలను వదులుకోలేదు. రెండు ప్రపంచాల మధ్య తండ్లాడుతది.

క్లీన్డ్ ఔట్ (Cleaned Out), డూ వాట్ దే సే ఆర్ ఎల్స్ (Do What They Say or Else), ఎ ఫ్రోజెన్ ఉమన్ (A Frozen Woman) - ఒక ట్రయాలజీ. ఒక శ్రామికవర్గానికి చెందిన యువతి మధ్యతరగతి చదువు, వివాహం మొదలైన అనుభవాలను వివరిస్తాయి. ఫ్రోజెన్ ఉమన్ (1981) అంటూ పుస్తకం పేరు వింటేనే కథ ఊహకు అంది ఒళ్ళు జలదరిస్తుంది. యువతి వివాహ జీవితంలో అడుగు పెట్టి, ఒక బిడ్డకు తల్లియై... ఆశలు అడుగంటి, రొడ్డకొట్టుడు జీవితంతో, జీవితం ఘనీభవిస్తుంది!!

చిన్ననాటి జీవితం, తల్లి పెట్టుకున్న ఆశలు వెంటాడుతుంటాయి. కట్టుబాటుతో పెరిగిన జీవితం నుంచి ఒక్కసారిగా మగపిల్లలను చూసి ఆసక్తి పడటం ఒక వింత అనుభూతి. చదువుకుంటేనే ఈ ఇరుకు ప్రపంచం నుంచి బయటపడతామనే దృఢమైన నిశ్చయం. టీచర్‌గా మారుతుంది కానీ, తోటి పిల్లలు చదువు ముగించి సంసార జీవితంలో పడిపోతే, మనసు అటువైపూ గుంజుతనే ఉంటది. తెలువనితనం, ఉత్సుకత, వయసు తెచ్చే మార్పులు,

కోరికలు.. ఏ తరం పిల్లలైనా పాత్రతో తాదాత్మ్యం చెందుతారు.

విశ్వవిద్యాలయ జీవితం... పెళ్ళయి, శిశువుకు జన్మనిస్తుంది. క్రమంగా జీవితం ఘనీభవించి పోతుంది. బోనులో చిక్కుకోవడం ఇంత సులభమా! అంత తొందరగా ఘనీభవించి పోవడమా!!

ఒక బిడ్డగా తన తల్లి పాత్రను ఎ ఉమన్నెస్ స్టోరీలో పట్టి చూపింది. ఎ మాన్నెష్ ప్లేస్‌లో తండ్రిని తన కండ్లతో చూపింది. బిడ్డను ఉన్నతంగా చేయడమే తల్లిదండ్రుల ఆరాటం. బిడ్డ ఉపాధ్యాయురాలిగా మారి చదువుకున్న ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. ఏ తల్లిదండ్రులయినా కోరుకునేది కూడా అదే. కానీ అదే తల్లిదండ్రులకు బిడ్డకు మధ్య అగాధాన్ని పెంచుతది. అది ఆమెలో అసంతృప్తికి దారి తీస్తుంది. కానీ ఆ అగాధం ఎప్పటికీ పూడిపోయేది కాదు. ఇది కేవలం తరాల మధ్య అంతరం కాదు. కానీ అంతకు మించిన దూరం!

ఐ రిమేన్ ఇన్ డార్క్‌నెస్ (1997) లోనూ తల్లి పరిస్థితినే వివరించారు. 1980 దశకం మొదట్లో కారు గుద్ది గాయపడిన తల్లి శారీరకంగా, మానసికంగా తీవ్ర అనారోగ్యానికి గురవుతది. పూర్తిగా కోలుకోవడమనేది జరుగదు. 1983 నుంచి 86లో తల్లి మరణించే వరకు రచయిత్రి రాసుకున్న నోట్స్ ఈ రచనకు ముడిసరుకు. తన తల్లి రాసిన చివరి వాక్యమే పుస్తకానికి టైటిల్‌గా మారింది. వృద్ధాప్యంలో తల్లి పరిస్థితి... శారీరకంగా అశక్తురాలు, మానసిక అనారోగ్యం (అల్జీమర్స్ వ్యాధి). మొదట తన తల్లికి ఇంటిలోనే సేవలు అందిస్తుంది. కానీ పరిస్థితి మరింత దిగజారుతుంది. నర్సింగ్ హోంలో చేరుస్తుంది. అందులో సౌకర్యాలు, ఇబ్బందులు ఉండనే ఉంటాయి. క్రమంగా తల్లిని వృద్ధాప్యం మరింత కమ్మేస్తూ ఉంటుంది. ఇదొక బాధామయ గాథే. కానీ శారీరకంగా, మానసికంగా కృషించిపోయే తల్లిని ఆ విధంగా చూడటం ఏ బిడ్డకైనా ఎంత బాధగా ఉంటుంది. ఆ బాధను చాలా మంది బిడ్డలు అనుభవించే ఉంటారు. ఎంతో మంది అవ్యక్త బాధను ఆ పుస్తకం ద్వారా పంచుకుంటారు. పుస్తకానికి ఇంతకు మించిన కథావస్తువు ఏముంటుంది!

సింపుల్ పాషన్ రచన కూడా బలమైన వ్యక్తీకరణలతో ఏ మాత్రం బిడియం లేకుండా సాగుతుంది. వివాహితుడైన విదేశీయుడిపై మనసు పడుతుంది. ఆ వ్యక్తిపై ఉండే పాషన్ ఆమెను నడిపిస్తుంది. కథను నడిపిస్తుంది. అతడితో కలిసి కేబుల్ టీవీలో శృంగార చిత్రాలను చూసి దిగ్భ్రాంతి చెందడం. లైంగికత గురించి మాట్లడటమే తప్పనే భావన బలంగా ఉన్న యువతికిది అదిరిపోయే అనుభవమే. ఒకప్పుడు అబ్బాయిలతో దూరంగా పెరిగిన చిన్నతనం నుంచి ఇప్పుడామె వివాహితుడిపై విపరీతమైన మోహం పెంచుకునే స్థితికి చేరుకుంటది. అతడు తప్ప మరే ధ్యాస ఉండదు. వివాహితుడైనందున తరచు కలువలేదు, మాట్లాడలేదు. అయినా అతడిని విడిచిపోలేదు. రెండేండ్లపాటు అతడే ప్రపంచం అనుకుంటుంది. కానీ ఆ తరువాత అతడు ఫ్రాన్స్ విడిచి వెళతాడు. ఆ తరువాత వస్తాడు, కానీ ఇప్పుడామెకు పూర్వపు ఉద్వేగం లేదు. పుస్తకమంతా అతడి పట్ల గాఢానురక్తిని ప్రదర్శిస్తుంది. కానీ చివరికి రచయిత్రి కథకు కొత్త ముగింపునిస్తారు. గెటింగ్ లాస్ట్ నవలలో కూడా ఇదే ఇతివృత్తం ఉంటుంది. ది పొసెసన్ అనే నవలలో ఏడేండ్లపాటు కలిసి ఉన్న వ్యక్తితో తెగతెంపుల గురించి ఉంటుంది. విడిపోయినా కలుసుకుంటూ ఉంటారు. అయితే విడిపోవడానికి కారణం- అతడి జీవితంలోకి మరో మహిళ ప్రవేశించడం. ఆ మరోవ్యక్తి



గురించి అతడు గోప్యతను పాటించే కొద్దీ ఆమెకు ఆసక్తి పెరుగుతుంది. అదొక హేతువిరుద్ధమైన ఆలోచన అని కూడా అనిపిస్తుంది. కానీ ఆమె ఆలోచనలు అటే తిరుగడాన్ని ఆమె నిస్సంకోచంగా వివరించారు.

మొదటి పుస్తకం క్లీన్డ్ ఔట్‌లో ప్రస్తావించిన అబార్షన్ నే ప్రధానాంశంగా చేసుకొని రచించిందే హాపెనింగ్ నవల. వర్తమానం నుంచి మరొకసారి పాత జ్ఞాపకాలలోకి తీసుకుపోతారు రచయిత్రి. లైంగిక కృత్యంలో పాల్గొన్న అనంతరం ఎయిడ్స్ సోకుతుందేమో అని భయపడి పోయి వైద్యులను ఆశ్రయించడాన్ని మొదట ప్రస్తావిస్తారు. అక్కడి నుంచి తొలినాళ్ళ అబార్షన్ ఉదంతాన్ని వివరిస్తారు. అప్పటి సంఘటనలతో పాటు వాటి చుట్టూరా ఆవరించుకున్న భావోద్వేగాలను పట్టు చెదరకుండా వివరిస్తారు.

1960 దశకం నాటి మాట. గర్భం దాల్చినట్టు తెలిసిన తరువాత యువతిలో సాగే ఘర్షణకు అక్షర రూపమిది. తన కడుపులో ఇంకా ఆకారం కూడా ఏర్పడని బిడ్డను తొలగించుకోక తప్పదనే నిశ్చయానికి వస్తుంది. కానీ ఎట్లా అనేదే పెద్ద సమస్య. అబార్షన్ చేయించుకోవడం చట్టవిరుద్ధం. ఎక్కడో గుట్టుగా చేయించు కోవాలి. తల్లిదండ్రులకు తెలువకూడదు. తన గర్భానికి కారణమైనవాడి నుంచి ఏ సహాయం అందదు. ఎవరిని అడిగినా ఫలితం ఉండదు. కానీ తప్పదు, అబార్షన్ చేయించుకోవలసిందే. చివరకు అబార్షన్ చేయించుకుంటుంది. కానీ దానికి ముందు మానసిక ఒత్తిడి, నిస్సహాయ స్థితిలో పడిన కష్టం, ఆ తరువాత అనుభవించి బాధ- ఈ పరిస్థితులను వివరించడానికి భాష సరిపోదని రచయిత్రి అంటారు. అవాంఛిత గర్భం వల్ల పడే మానసిక వేదన ఎంత దుర్భరమైందో స్వీయానుభవం ఆధారంగా వివరిస్తారు. తాను ఈ బాధను వెల్లడించక పోతే, ఎందరో బాధామయ మహిళల జీవితాల ను కప్పేసినట్టవుతుందనీ, మగ ఆధిపత్య

**యానీ ఎర్నాక్స్ రచనలను స్వీయ చరిత్ర అనీ మాత్రమే అనలేము. అలాగని జ్ఞాపకాల దొంతరను యథాలాపంగా పరిచిపెట్టడమూ కాదు. తన జీవితాన్ని, అనుభవాలను వస్తువులుగా చేసుకుంటూనే తన రచనల ద్వారా నాటి సమాజపు పొరల్లోని సామాన్యుల పరిస్థితికి అద్దం పట్టారు. పురుషాధిపత్యం సమాజంలో సామాన్య బాలిక దైన్యాన్ని చూపించారు.**

ప్రపంచాన్ని ఆమోదించినట్టు అవుతుందని ఆమె అన్నారు. కానీ ఆ హాపెనింగ్‌ను మళ్ళా గుర్తుకు తెచ్చుకోవడం, ఆ దానికి ఒక రచనారూపం ఇవ్వడం కూడా మళ్ళా అటువంటి బాధను అనుభవించినంత అయిందని ఆమె వివరించారు. ఒకసారి అక్షరరూపం ఇచ్చి ప్రపంచంపైకి వదిలిన తరువాత మన చేతిలో ఏమీ ఉండదు. రచన చేపట్టిన సందర్భంగా కూడా ఆమె ఎంతో ఒత్తిడికి గురయ్యారని ఆమె మాటల వల్ల తెలుస్తుంది. ఇటువంటి రచనను చేపట్టడమే పెద్ద సవాలు. సామాజిక దృక్పథంతో తన బాధ్యతగా భావించడం వల్లనే ఇంత పట్టుతో ఆ పరిస్థితికి అక్షర రూపం ఇవ్వగలిగారు.

థింగ్స్ సీన్‌లో రచయిత్రి 1993 నుంచి 99 వరకు తన చుట్టూరా సమాజా న్ని తన కళ్ళతో, తన హృదయంతో చూసిన తీరును చిత్రించారు. నాటి ఘటనల పట్ల తీవ్రమైన నిరాశ, నిస్సహాయత వ్యక్తమవుతూ ఉంటుంది. యుగోస్లావియా ఘర్షణలు మొదలుకొని అనేక ఘటనలు ఆమె డైరీలో కనిపిస్తాయి. కానీ వర్తమాన సమాజాన్ని చూపించడమైనా, వ్యాఖ్యానించడమైనా ది ఇయర్స్ రచనలో ఉన్నత స్థాయిలో కనిపిస్తాయి. ఆమె రచనల్లో ది ఇయర్స్ శిఖరప్రాయమైనదని అంటారు విమర్శకులు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత నాటి నుంచి ఇప్పటి వరకు సమాజంలో వచ్చిన మార్పులను ఈ రచనలో చక్కగా తనదైన దృక్కోణంతో ఆవిష్కరించారు. మనుషుల అలవాట్లు, అభిరుచులు, దృక్పథాలు, సాంకేతిక రంగం మొదలైన భిన్నరంగాల్లో వచ్చిన మార్పులను చూపించారు. లాండ్ లైన్ ఫోన్లు పోయి మొబైల్స్ రావడం, కంప్యూటర్లు మొదలైనవన్నీ కనిపిస్తాయి. అయితే పెరుగుతున్న వినియోగవాదాన్ని, వస్తువ్యామోహాన్ని కూడా వివరించారు. తన చిన్నప్పుడు మగ ఆడ దూరం పెట్టేవారు. కానీ ఇప్పుడు అంతా కలిసి పోయి తిరుగుతున్నారు. గర్భనిరోధక పిల్ రావడాన్ని గొప్పగా చెప్పారు. లైంగికాంశాలలో సంకోచాలు లేవు. వివాహం, మాతృత్వం పట్ల వైఖరి మారిపోయింది. ఎయిడ్స్ పరేషాన్ అంతగా లేదు, సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నం, సెప్టెంబర్ 11 దాడులు మొదలై నవన్నీ ఈ ప్రవాహంలో కనిపిస్తాయి. ఇదొక సామాజిక ఆర్థిక రంగాల సమిష్టి చరిత్ర రచనగా చెప్పుకోవచ్చు.

యానీ ఎర్నాక్స్ రచనలను స్వీయ చరిత్ర అనీ మాత్రమే అనలేము. అలాగని జ్ఞాపకాల దొంతరను యథాలాపంగా పరిచిపెట్టడమూ కాదు. తన జీవితాన్ని, అనుభవాలను వస్తువులుగా చేసుకుం టూనే తన రచనల ద్వారా నాటి సమాజపు పొరల్లోని సామాన్యుల పరిస్థితికి అద్దం పట్టారు. పురుషాధిపత్యం సమాజంలో సామాన్య బాలిక దైన్యాన్ని చూపించారు. వర్గవివక్ష గల సమాజం సృష్టించిన అంతఃఘర్షణ కనిపిస్తుంది. తన కథను చెబుతూనే సామాజిక పరిస్థితుల పట్ల ఆక్షేపణ వ్యక్తమవుతుంది. ఫ్రెంచి సమాజంలోని తన తరానికి ఆమె ప్రతినిధి. ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఆమె బాధను, భావోద్వేగాలను తమవిగా భావించుకుంటారు. ఆమె రచనలతో తాదాత్మ్యం చెందుతారు. యాన్నీ ఎర్నాక్స్ 2022 సంవత్సరానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందడను ప్రపంచం హర్షించక మానదనే చెప్పాలి.



# ఆకాశం వేదికగా కలుద్దాం...!



జి.మాణిక్యం, 94921 64107

జీవిత పుస్తకం తెరిచి చూస్తే
నీ అడుగుజాడలు కనిపిస్తాయి...
నీ మౌనం మాటలుగా వినిపిస్తాయి...
నీ నెమలీకల జ్ఞాపకాలు పుస్తకంలో దాగివుంటాయి..
నా హృదయం నీ సాలీడు ప్రేమవలలో
చిక్కుకుని కొట్టుకుంటుంది...

మనం కన్న కలలు సీతాకోకచిలుకలా
మదిపై వాలుతున్నది...
నీ రూపం కార్బన్ పేపరుపై గీసిన
బొమ్మలా నా ఎదపై అంటుకున్నది...
నువ్వు యాదికొచ్చినప్పుడళ్ళా కళ్ళు
కారుమేఘమైతున్నవి...

ధరణి మండపంలో...
ఆకాశం వేదికగా...
నక్షత్రాల అలంకరణతో...
వెన్నెల వెలుగులో...
భానుడి అగ్నిహెూమం సాక్షిగా...
నిన్ను పరిణయమాడాలని పరితపించాను... కానీ,

ఈ నిచ్చెనమెట్ల సమాజంలో...
నువ్వు కోయిలలా అందనంత ఎత్తులో ఉన్నావు...
నేను కాకిలా అందుకోలేనంత అధమంగా ఉన్నాను...
ఎన్ని మెట్లెక్కినా నిన్ను అందుకోలేక
నా ఆత్మ పిట్ట అలసిపోతున్నది....

వర్ణ వైషమ్యాల వన సమాజంలో విడిపోయినా...
ఆకాశం వేదికగా స్వర్గంలో మళ్లీ కలుద్దాం...
అందులోనూ వివక్షతో విడదీస్తే నరకంలో కలిసి నిలుద్దాం...
అక్కడ నా ప్రాణాన్ని ప్రేమతో పలకరిస్తావో...
పశ్చాత్తాపపడుతావో... నీ ఇష్టం.

ఆ అంధకారపు రోజు గుర్తుకొచ్చినప్పుడల్లా
నేను ఆగిపోతున్నాను ....
కానీ, నీ జ్ఞాపకాలు జీవంతో
జీవనదిలా నన్ను సాగిపోమంటున్నాయి...
అటు ఆగిపోక... ఇటు సాగిపోక...
సతమతపడుతున్నది నా శ్వాస...
విహారయాత్రలో నువ్వు... విరహవేదనలో నేను...

వ్యాసం

# తెలంగాణ నవల విస్తృతిని సంకుచితపరచొద్దు...

అక్టోబర్ 1 - 15 తంగేడులో డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ గారి వ్యాసం తెలంగాణ నవలా సాహిత్యం వ్యాసం చదివాను. అనాదిగా పరపాలకుల ఏలుబడిలో తెలంగాణ సాహిత్యం చిన్న చూపుకు గురైంది. అస్తిత్వ ఉద్యమాల ఫలితంగా, నూతనంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ ఫలితంగా తెలంగాణ సాహిత్యంలోని లోతులను తెలుసు కోవడానికి విశేషమైన కృషి జరుగు తున్నది. తెలంగాణ అనేక ప్రక్రియలకు తొలిపాదుగా నిలిచింది. శతకము, ఉదాహరణ, రగడ, దండకము, ఆధునిక ప్రక్రియల్లో కథ మొదలైన ప్రక్రియలన్నీ తెలంగాణ నేల మీదనే ఆవిర్భవించాయి అనేది కాదనలేని సత్యం. నవల విషయం లోనూ ఇటువంటి కృషి జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ సంపాదకత్వంలో బరారు శ్రీనివాస శర్మ రాసిన ఆశాదోషము నవల వెలుగులోకి రావడం హర్షణీయం. ఇందుకు శ్రీకాంత్ అభినందనీయులు. కానీ ఇదే తొలి నవల అని వాదించడం ఆమోదయోగ్యం కాదు. తడకమళ్ల కృష్ణారావు వ్రాసిన 'కంబు కంధరచరిత్ర, ఆశా దోషము' కంటే నలభై ఐదు సంవత్సరాలకు పూర్వమే వచ్చిన విషయాన్ని తన వ్యాసంలో ఉటంకించారు. ఇది వచనప్రబంధంగా పేర్కొన్నట్లు కూడా తన వ్యాసంలో తెలిపారు. ఇందులో పద్యాలు ఉన్నవి కాబట్టి నవల కాదు అని తీర్మానించారు. పద్యాలు ఉన్నంత మాత్రాన నవల కాదు అనడం సమంజసం కాదు.

"నవలలో కవిత్వం ఉండకూడదు అన్న నియమం ఎక్కడా లేదు. కానీ ఆ కవిత్వం జీవితానికి ఆలంబనగా కలిగి ఉండాలి. కథా వస్తువులో కవిత్వాన్ని చూపిన నవలా రచయితలు ఉన్నారు. కవితామయమైన వచనాన్ని రాసిన వారు ఉన్నారు. అలాంటి వారిలో విశ్వనాథ బుచ్చిబాబు, రావిశాస్త్రి ముఖ్యులు" (చూ. వల్లంపాటి వెంకటసుబ్బయ్య - నవలా శిల్పం పుట 15). ఆంధ్రులు వచన ప్రబంధమైన రాజశేఖర చరిత్రను తమ తొలినవలగా చెప్పుకుంటున్నప్పుడు మన తెలంగాణ వ్యక్తి రాసిన వచన ప్రబంధంను మనమే నవలగా అంగీకరించకపోవడం హాస్యాస్పదం. తొలి తెలంగాణ నవల ఆశా దోషము అని బల్లగుద్ది చెప్తున్న శ్రీకాంత్ గారు తొలి ఆంధ్రనవల ఏదో చెప్పగలరా? ఒకవేళ రాజశేఖరచరిత్ర కూడా నవల కాకపోతే 'ఆశాదోషము' ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదటి నవల అని నిరూపించగలరా? మద్రాసు గ్రంథాలయం కూడా తడకమళ్ల వేంకట కృష్ణారావు నవలను అంగీకరించిన దాఖలాలు కనిపిస్తున్నాయి. "ఇది కళాపూర్ణోదయం వలె కవి కల్పిత కథనము హెచ్చుగా గల వచన రచన. దీనిని వచన ప్రబంధమని అనవచ్చును" (చూ. తెలంగాణ సాహిత్య చరిత్ర - డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్ పుట సంఖ్య 145). డాక్టర్ రంగాచార్య నల్లగొండ కవులు పండితులు గ్రంథంలో సూచనప్రాయంగా తడకమళ్ల వేంకట కృష్ణారావును గురించి ప్రస్తావించారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి ముంగిలిలో ఈ విషయంపై క్షుణ్ణంగా పరిశోధించి తొలి నవలాకారుడుగా నిర్ధారించారు. ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్రలో తొలి నవల కంబుకంధర చరిత్ర అని తేల్చి చెప్పారు. తెలంగాణ సాహిత్య చరిత్రను వాస్తవంగా దర్శించాలే గాని తన పుస్తకానికో తన ప్రాంతానికో పేరు రావాలన్న ధోరణి పరిశోధకులకు ఉండదగినది కాదు. మన చరిత్రను మనమే సంకుచిత పరుచుకోవడం దురదృష్టకర పరిణామం. సాహిత్య చరిత్ర గతిశీలమైంది. పరిశోధనలు జరుగుతున్న కొద్దీ మార్పులకు లోనవుతుంది. దీనిని ఆహ్వానించగలిగే విశాల హృదయం పరిశోధకులకు అవసరం.

**- సాగర్ల సత్తయ్య, 7989117415**

కవిత

# నీకు సమర్పిస్తా...



**ఎర్ర శ్రీదేవి, 99591 94224**

నీవు నా జీవానివి
నా దైవానివి
నా హృదయంలో
నెలకొన్న పూజామూర్తివి
అందుకే నీ స్నేహం
నా కందించిన
గగన తారలకుసుమాల్ని
నీ చెలిమి నాకు కూర్చిన
తూరుపు వర్ణపు
పాపిట సింధూరాన్ని
నీ మైత్రి నా కొసగిన
అరుణారుణ వర్ణపు
కుంకుమ తిలకాన్ని
నీ సావాసం నాకిచ్చిన
పసుపు గంధములను
నీ పూజాద్రవ్యాలుగా
తిరిగి నీకే అర్పిస్తున్నాను
గాజులగలగలలే
నీ స్తోత్రాలుగా
నీకు సమర్పిస్తా...




## ఘనంగా "జీవన మొగ్గలు" పుస్తకావిష్కరణ

పాలమూరు సాహితి ఆధ్వర్యంలో యువకవి తెలుగు తిరుమలేష్ రచించిన "జీవన మొగ్గలు" పుస్తకాన్ని జిల్లా పరిషత్ ఛైర్మన్ స్వర్ణసుధాకర్ రెడ్డి ఆవిష్కరించారు. అక్టోబర్ 4న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో గల వాగ్దేవి జూనియర్ కళాశాలలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో "మొగ్గలు" అనే నూతన కవితా ప్రక్రియ పురుడు పోసుకోవడం, దానిని సృష్టించిన డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ సర్వదా అభినందనీయుడన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగులో అనేక నూతన కవితా ప్రక్రియలు వచ్చినా "మొగ్గలు" తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ "మొగ్గలు" కవిత ప్రక్రియ మన జిల్లాలోనే ఆవిర్భవించడం జిల్లాకే గర్వకారణమన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్ధన్ మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యపరిచే విధంగా కవులు రచనలు చేయాలన్నారు. ఆత్మీయ అతిథి, మొగ్గల ప్రక్రియ సృష్టికర్త డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ మొగ్గల కవితా ప్రక్రియలో ఇప్పటికి 40 పుస్తకాలకు పైగా కవితాసంపుటాలు వెలువడ్డాయన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో యువకవి లోల యాదయ్య, గాదె పల్లి వెంకటయ్య, వల్లభాపురం జనార్ధన్, ఖాజా మొయినుద్దీన్ తదితర సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.



## తెలుగును సులభంగా నేర్చుకునేందుకు పరిశోధనలు జరగాలి...

మాతృభాష సంరక్షణలో భాగంగా తెలుగు భాషను సులభతరంగా నేర్చుకునేందుకు విస్తృతంగా పరిశోధనలు చేయవలసి వుందని తెలంగాణ సాహిత్య అకాడమి ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ఉపాధ్యాయుడు సిహెచ్ వెంకటేశ్వర్లు రాసిన 'తేట తెలుగు' పుస్తకాన్ని బుధవారం సాహిత్య అకాడమి కార్యాలయంలో జూలూరి గౌరీశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు 56 అక్షరాలు ఉన్నప్పటికిని వాటిని 36 అక్షరాలకు కుదించి భాషను నేర్చుకునేందుకు సులభమార్గాన్ని 'తేట తెలుగు' పుస్తకం ద్వారా రచయిత తెలియజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దయానంద్, రాష్ట్ర గ్రంథాలయ శాఖ కార్యదర్శి శ్రీనివాసచారి కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, కెపి అశోక్ కుమార్, డాక్టర్ కాంచనపల్లి పాల్గొన్నారు. **- తెలంగాణ సాహిత్య అకాడమి**

## అవిరామం కవితా సంకలనం ఆవిష్కరణ



రవీంద్ర భారతి మినీహాల్ తేదీ 9 అక్టోబర్ 2022 నక్క హరికృష్ణ రచించిన కవితాసంకలనం ఆవిష్కరణ జరిగింది. ఈ సభకు పూర్వ తెలంగాణ సాహితి అకాడమీ ఛైర్మన్ నందిని సిదారెడ్డి ముఖ్యఅతిథిగా వచ్చి పుస్తకావిష్కరణ చేశారు. సభలో సాహితీ ప్రముఖులు ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ, ఎన్. రజని, నాళేశ్వరం శంకరం, బెల్లంకొండ సంపత్ కుమార్ పాల్గొన్నారు. సభకు ప్రముఖకవి కందుకూరి శ్రీరాములు అధ్యక్షత వహించారు. పుస్తక రచయిత నక్క హరికృష్ణ తన స్పందనలో అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## వనపట్ల సుబ్బయ్యకు పరిషత్తు పురస్కారం ప్రదానం



ప్రముఖకవి వనపట్ల సుబ్బయ్యకు తెలంగాణ సారస్వత పరిషత్తు 12 అక్టోబర్ 2022న పరిషత్తులోని డా॥ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన ఉత్సవంలో ఆధునిక తెలంగాణ తొలితరం రచయిత, కవి బూర్గుల రంగనాథరావు పురస్కారాన్ని ప్రదానం చేసింది. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభకు అధ్యక్షత వహించి సుబ్బయ్యను 5 వేల రూపాయల నగదు, జ్ఞాపిక శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల కాలంలో 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం తదితర అంశాలపై బృహత్ గ్రంథాలను వెలువరిస్తున్నదన్నారు. బూర్గుల రంగనాథరావు రేడియో ప్రసంగాల సంపుటిని ఈ సందర్భంగా ఎల్లూరి శివారెడ్డి ఆవిష్కరించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా॥ జె. చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ వనపట్లను ప్రశంసించారు. బూర్గుల రంగనాథరావు రేడియో ప్రసంగాల సంపుటి సంపాదకుడు ఆచార్య ఎస్వీ రామారావు, పరిషత్తు కోశాధికారి మంత్రి రామారావు పాల్గొన్నారు.




## తెలంగాణ మహిళ

సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వెల : రూ.200/-

డా॥ భీంపల్లి శ్రీకాంత్
9032844017




## ఒకప్పుడు

రాజేందర్ జింబో
94404 83001

నవోదయ బుక్ హౌస్
హైదరాబాద్
వెల : రూ. 100/-




## చైత్ర (నవల)

స్ఫూర్తి కందివనం
హైదరాబాద్
సెల్ : 96527 45117

వెల : రూ.220/-




## తెలుగు, కన్నడ ప్రహసనాలు

బిక్కి కృష్ణ
హైదరాబాద్
సెల్ : 83744 39053

వెల : రూ. 150/-



## ఒక దీపం - వేయి వెలుగులు

ఎ.కె. ప్రభాకర్
మనోజ నంబూరి

ఆలంబన ప్రచురణలు
సెల్ : 99854 27122




## సంచీలో దీపం

హిమజ

నవోదయ బుక్ హౌస్
ఫోన్ : 040-24652387
వెల : రూ. 60/-




## మల్లెసాల (శతాధిక చేతివృత్తి కథలు)

జ్వలిత

జె.డి. పబ్లికేషన్స్
సెల్ : 79958 20736
వెల : రూ. 1200/-




## కాళిదాస విరచిత ఋతుసంహారః

డా॥ టి. లక్ష్మీనారాయణ
సెల్ : 92900 93933

నవచేతన
వెల : రూ.125/-




## కైవల్య

అనుమాండ్ల భూమయ్య

నవోదయ బుక్ హౌస్
వెల : రూ. 80/-




## పారిజాతావతరణము

అనుమాండ్ల భూమయ్య

మనస్విని దేవి
హైదరాబాద్
వెల : రూ. 100/-

